సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 246

గురువారం 27-11-2025

'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'

పరాజయం పరిపూర్ణం

దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో 408 పరుగులతో ఓడిన భారత్ -12లో

మార్కెట్.. రాకెట్

1,023 పాయింట్ల హైజంప్.. బ్యాంకింగ్, ఆటో ఇండెక్సుల రికార్డ్ -13లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఆధార్ ఐడీల తొలగింపు

ఆధార్ వ్యవస్థలో పారదర్శకతకు కేంద్రం రంగంలోకి దిగింది. 2 కోట్లకుపైగా ఆధార్ ఐడీలను డీయాక్టివేట్ చేసింది.

వివరాలు 6లో ▸

ఇమ్రాన్ హత్య?

అడియాలా జైల్లో ఉన్న పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను గుట్టుగా మట్టుబెట్టినట్టు వచ్చిన వార్తలు పెను దుమారాన్ని రేపాయి.

వివరాలు 6లో ▸



అగ్నికీలల్లో ఆకాశహర్మ్యం

హాంకాంగ్‌లోని వాంగ్ ఫుక్ కోర్ట్ ఆకాశహర్మ్యం అగ్నికీలల్లో చిక్కుకుంది. 36 మంది సజీవ దహనం అయ్యారు.

వివరాలు 6లో ▸

జాతీయ న్యాయ విధానం తేవాలి

తీర్పుల్లో భిన్నత్వాన్ని తగ్గించడానికి ఏకీకృత జాతీయ న్యాయ విధానం తీసుకురావాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

వివరాలు 6లో ▸

వైఎస్సార్ కడప జిల్లా బ్రాహ్మణపల్లిలో అరటి రైతుల సమస్యలు వింటున్న వైఎస్ జగన్

"ప్రజలకు, రైతులకు నష్టం జరుగుతోందంటే డ్రామాలు, డైవర్షన్ పాలిటిక్స్ చేయడం చంద్రబాబుకు అలవాటే. వెంటనే ఏకంగా 10 వేల మంది రైతులతో ఫోన్‌లో మాట్లాడానంటాడు. అన్నీ చేసేస్తాం అంటాడు. కానీ, ఏదీ చేయడు. క్వింటా ఉల్లి రూ.1,200కు కొంటామన్నారు. ఆ తర్వాత ఉల్లి రైతులకు హెక్టార్‌కు రూ.50 వేలు ఇస్తామన్నారు. అదీ లేదు. ఇదీ లేదు.. ఏదీ లేదు. వాటన్నింటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు టాపిక్ డైవర్షన్. ఏదో ఒక అంశం తెరపైకి తెస్తారు. దాన్ని ఎల్లో మీడియాలో ఊదరగొడతారు. అలా వాటి నుంచి అందరి దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తారు. మొత్తానికి రైతుల పరిస్థితి బస్టాండ్ అన్నట్లు తయారైంది." - వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రైతుల పరిస్థితి అగమ్యగోచరం

దళారులతో కుమ్మక్కై అన్నదాతల నోట్లో మట్టికొడుతున్నారు

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

మా హయాంలో టన్ను అరటి రూ.25 వేల నుంచి రూ.32 వేల వరకు అమ్ముకోగలిగారు

అప్పట్లో ప్రత్యేక రైళ్ల ద్వారా ఎగుమతి చేశాం

2లో

ఇప్పుడు రూ.2 వేలకు కూడా కొనేవారు కరువయ్యారు

పెట్టుబడి సాయం రెండేళ్లలో రూ.40 వేలకుగాను రూ.10 వేలు ఇచ్చి.. రూ.30 వేలు ఎగ్గొట్టారు

- ఉచిత పంటల బీమా హుష్ కాకి.. ఇన్‌పుట్ సబ్సిడీ రూ. 1,100 కోట్లు ఎగ్గొట్టారు.. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు
- ఉల్లి క్వింటా రూ.1,200తో కొంటామన్నారు.. ఎక్కడ కొన్నారు?
- హెక్టారుకు రూ.50 వేలు సాయం చేస్తామన్నారు.. చేశారా?
- చంద్రబాబు వచ్చాక ఎరువులు సైతం బ్లాక్‌లో కొనాల్సిన దుస్థితి
- ఫీజు బకాయిలు అందక చదువుకునే పిల్లలకు తీవ్ర ఇబ్బందులు
- బాబూ.. ఇప్పటికైనా డ్రామాలు ఆపి సమస్యలు పరిష్కరించండి
- లేదంటే వీళ్లందరి తరఫున తీవ్రమైన ఉద్యమాలు ఖాయం

చంద్రబాబు తీరుతోనే మెడికల్ సీటు కోల్పోయా

వైఎస్ జగన్ ఎదుట ఓ విద్యార్థిని ఆవేదన

3లో

దేశ గుర్తింపునకు రాజ్యాంగమే

మూలస్తంభం

రాజ్యాంగ పీఠిక చదువుతున్న రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని మోదీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

దేశాన్ని ముందుకు నడిపించే మార్గదర్శక పత్రం

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వమే రాజ్యాంగ ఆశయాలు: రాష్ట్రపతి ముర్ము

6లో

పాత పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ దినోత్సవం.. రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం

9 ప్రాంతీయ భాషల్లో రాజ్యాంగం డిజిటల్ వెర్షన్

రాజ్యాంగ విధులతో బలమైన ప్రజాస్వామ్యం

- దేశ పౌరులంతా రాజ్యాంగ విధులు నిర్వర్తించాలి
- ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడం మనందరి బాధ్యత
- ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి
- దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా లేఖ

6లో

పతనమైన ధరలు.. పంటలపై తీవ్ర ప్రభావం

'సాగ'ని రబీ

ఇప్పటికే సీజన్ ఆరంభమై 55 రోజులైనా 12 శాతమే!



కర్నూలు జిల్లా కోడుమూరులో పంటల సాగు ఇంకా మొదలవ్వకపోవడంతో ఖాళీ ఉన్న పొలం

రాష్ట్రంలో రబీ లక్ష్యం 57.78 లక్షల ఎకరాలు

ఈ పాటికే సాగవ్వాల్సిన విస్తీర్ణం 13.62 లక్షల ఎకరాలు

కానీ సాగైంది... కేవలం 8.86 లక్షల ఎకరాలే

20 లక్షల ఎకరాలకు గాను 1.42 లక్షల ఎకరాల్లోనే వరి.. శనగ 11 లక్షల ఎకరాలు.. సాగైంది 3.75 లక్షల ఎకరాలు

మినుము లక్ష్యం 9 లక్షల ఎకరాలు.. సాగైంది 72 వేల ఎకరాలు.. కృష్ణా, పెన్నా డెల్టాలో రెండో పంటకు నీరివ్వని ప్రభుత్వం

ధరల పతనంతో రబీ సాగుకు ముందుకురాని అన్నదాతలు.. ఫలితంగా లక్ష్యానికి దూరంగా రబీ సాగు

10లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	108 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	196 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	135 కిలో	స్కిన్ లెస్	223 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

పొద్దుటి నుంచి అది పట్టుకొని మన ఆఫీసు చుట్టే తిరుగుతున్నారు!

కస్టడీలో ఉంచి ఏం సాధిస్తారు?

మద్యం అక్రమ కేసులో చంద్రబాబు సర్కార్‌కు సుప్రీంకోర్టు సూటి ప్రశ్న

ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు లొంగుబాటు నుంచి మినహాయింపు

- ట్రయల్ కోర్టు షరతులకు లోబడి వారు బెయిల్‌పై కొనసాగుతారని వెల్లడి
- 26వ తేదీలోపు లొంగిపోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే
- 200 మంది సాక్షులుంటే... విచారణకు ఎంత సమయం పడుతుందో..
- అంతకాలం వీరిని జైల్లో ఉంచడం సరికాదు.. సిట్ ఆందోళనకు అరెస్ట్ పరిష్కారం కాదు

- కౌంటర్ దాఖలుకు రాష్ట్ర ప్రభుత్వం, సిట్‌కు సుప్రీం నోటీసులు
- తదుపరి విచారణ డిసెంబర్ 15కు వాయిదా

10లో

రైతుల పరిస్థితి అగమ్యగోచరం

దళారులతో కుమ్మక్కై అన్నదాతల నోట్లో మట్టికొడుతున్నారు

సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర రాకపోయినా, ఎల్లో మీడియా రాయదు. వారంతా ఒక దొంగల ముఠా. అంతా కలిసి రాష్ట్రాన్ని లూటీ చేస్తూ దోచుకుంటున్నారు. వారికి దీనికే సమయం సరిపోవడం లేదు.. రైతుల గురించి ఇంకేం ఆలోచిస్తారు? అందుకే చంద్రబాబు ఏ మేలు చేయకపోయినా, అన్నీ చేసినట్లు.. అంతా బాగున్నట్లు ఢంకా బజాయించి ప్రచారం చేస్తున్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారు. చంద్రబాబును గద్దె దింపే రోజు త్వరలోనే వస్తుంది.

– వైఎస్ జగన్

బ్రాహ్మణపల్లి వద్ద అరటి తోటలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి కడప: రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకం వల్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని, అరటి రైతుల పరిస్థితి దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి రైతులన్నా, వ్యవసాయ రంగం అన్నా ప్రేమ లేదని.. ఈ 18 నెలల్లో 16 విపత్తులు వచ్చినా కనీస సాయం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజు బుధవారం ఆయన పులివెందుల సమీపంలోని బ్రాహ్మణపల్లి వద్ద అరటి తోటలను పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి జరిగిన నష్టాన్ని ఆరా తీశారు. కిలో అరటికి చివరకు 50 పైసలు కూడా రాకపోవడంతో, తోటల్లో అలాగే వదిలేస్తున్నామని, పశువులకు వేస్తున్నామని రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇంత జరుగుతున్నా, ప్రభుత్వం ఏ మాత్రం ఆదుకోవడం లేదని వాపోయారు. రైతుల బాధలు ఓపికగా విన్న వైఎస్ జగన్.. ఆ తర్వాత అక్కడే మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం, రైతుల సమస్యల పట్ల చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇకనైనా సీఎం చంద్రబాబు మారకపోతే, రాబోయే రోజుల్లో అందరితో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

కరెంటు ఖర్చవుతుందని వినియోగంలోకి తీసుకు రారా?

- ఈ ప్రాంతంలో 600 టన్నుల ఇంటిగ్రేటెడ్ బనానా కోల్డ్ స్టోరేజ్‌ను 2024 మార్చిలో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించాను. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి ఇప్పటికి 18 నెలలైంది. కరెంటు ఖర్చులు ఎక్కువ అవుతాయని స్టోరేజ్‌ను నడపడం లేదు. ఇలా అయితే రైతులు ఎలా బతుకుతారు? చంద్రబాబు రైతులను ఏ విధంగా పట్టించుకుంటున్నాడో చెప్పేందుకు ఈ కోల్డ్ స్టోరేజీయే నిదర్శనం.
- చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రైతులు, వ్యవసాయ రంగం పరిస్థితి తిరోగమనమే. ఈ 18 నెలల కాలంలో దాదాపు 16 సార్లు ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టితో రైతులు చాలా నష్టపోయారు. వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సిన అవసరం ఉన్నా, వారికి చంద్రబాబు ఇచ్చింది గుండు సున్నా.
- మొన్నటి మోంథా తుపాను నష్టాన్ని కూడా తక్కువ చేసి చూపుతున్నారు. దాదాపు రూ.1,100 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంది. అది కూడా ఎగరగొట్టిన పరిస్థితి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా కూడా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా ఎగ్గొడుతూ, రైతుల హక్కు అయిన, ఉచిత పంటల బీమా ఇవ్వకుండా, వారి హక్కులు కాలరాశారు. ఈ-క్రాప్ కూడా చేయడం లేదు.
- రైతు ఏ పరిస్థితుల్లోనూ కష్టపడకూడదు.. వారికి అగచాట్లు రాకూడదని తపన పడిన ప్రభుత్వం మాది. మా ప్రభుత్వ హయాంలో ఈ క్రాప్ చేసి 84 లక్షల మంది రైతులకు ఉచిత పంటల బీమా సదుపాయం కల్పించాం. ఆ విధంగా దాదాపు రూ.7,400 కోట్లు అందించాం. ఈ రోజు రాష్ట్రంలో 84 లక్షల మంది రైతులు ఉంటే, కేవలం 18 లక్షల మంది రైతులకు పంటల బీమా సదుపాయం ఉంది. మరి మిగిలిన వారి పరిస్థితి ఏమిటి? విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకునే నాథుడే లేడు. ఇన్‌పుట్ సబ్సిడీ లేదు. హక్కు అయిన ఉచిత పంటల బీమా లేదు. చంద్రబాబు వచ్చాక, ఎరువులు సైతం బ్లాక్‌లో కొనాల్సిన పరిస్థితి ఉంది.
- మరోవైపు పెట్టుబడి ఖర్చులు దారుణంగా పెరిగాయి. వారికి పెట్టుబడి సాయం కూడా అందడం లేదు. నాడు మా ప్రభుత్వ హయాంలో రైతులకు ఏటా రూ.13,500 క్రమం తప్పకుండా ఇచ్చాం. ఏ ఏడాది కూడా ఎగ్గొట్టలేదు. ఈ పెద్దమనిషి చంద్రబాబు రైతు భరోసా ఎగ్గొట్టి, అన్నదాతా సుఖీభవ అన్నాడు. పీఎం కిసాన్ కాకుండా రూ.20 వేలు ఇస్తానని చెప్పి, తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టాడు. రెండేళ్లకు మొత్తం రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.10 వేలు ఇచ్చి, మిగిలింది ఎగ్గొట్టాడు.

పిల్లలకూ తప్పని కష్టాలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పిల్లలతో కలిసి పోరాడుతున్నాం. డిసెంబర్ వస్తే 8 త్రైమాసికాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుంటాయి. ఒక్కో క్వార్టర్‌కు దాదాపు రూ.700 కోట్లు. అంటే ఏకంగా రూ.5,600 కోట్లు బకాయిలు. ఇచ్చింది కేవలం రూ.700 కోట్లు. అంటే దాదాపు రూ.4,900 కోట్లు బకాయిలు. మరో రూ.2,200 కోట్లు వసతి దీవెన బకాయిలు. ఏటా ఏప్రిల్‌లో రూ.1,100 కోట్ల చొప్పున ఇవ్వాలి. అదీ ఇవ్వడం లేదు. దీంతో రెండూ కలిపి రూ.6 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. చదువుకునే పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు

- దళారీలతో చంద్రబాబు కుమ్మక్కై, రైతుల బతుకులు అగమ్య గోచరంగా మార్చాడు. అందుకే ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లేదు. గత ఏడాది ధాన్యం, కందులు, మినుములు, పెసలు, సజ్జలు, మిర్చి, పొగాకు, ఉల్లి, టమాటా, కోకో, చీనీ, మామిడి.. ఇలా ఏ పంట తీసుకున్నా దేనికీ గిట్టుబాటు ధర రాలేదు. ఈ ఏడాది కూడా ధాన్యంతో సహా ఏ పంటకూ గిట్టుబాటు ధర రావడం లేదు.
- గతంలో ఈ పరిస్థితి ఎప్పుడూ లేదు. ప్రతి ఎకరాకు ఈ-క్రాప్ చేసేవాళ్లం. ఆర్బీకేల్లో ఆ వివరాలు ప్రదర్శించే వాళ్లం. సీఎం-యాప్ ఉండేది. ఎక్కడైనా ధరలు తగ్గితే, వెంటనే జేసీ అప్రమత్తమై, జోక్యం చేసుకుని పంటలు కొనుగోలు చేసేవారు. అలా రూ.7,746 కోట్లతో పంటలు కొనుగోలు చేశాం. కోవిడ్ సమయంలో కూడా రైతులను ఆదుకున్నాం. అందుకే ఈ రోజు పరిస్థితిని గమనించమని కోరుతున్నాను.

హామీలన్నీ గాలికి.. అంతటా దోపిడీ

- సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ గాలికెగిరిపోయాయి. అక్కచెల్లెమ్మలకు నెలకు రూ.1500 ఇస్తానన్నాడు. అలా ఏటా రూ.18 వేలు. అలా వారికి రూ.36 వేలు బాకీ. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తానన్నాడు. అలా రెండేళ్లకు రూ.72 వేలు బాకీ. అమ్మ ఒడి రూ.15 వేలు అన్నాడు. రూ.2 వేలు కట్ చేశారు. రూ.13 వేలు కూడా ఇవ్వకుండా రూ.8 వేలు, రూ.9 వేలు మాత్రమే ఇచ్చారు. అందులోనూ 30 లక్షల మందికి కోత పెట్టారు. పెన్షన్లు కొత్తవి ఇవ్వకపోగా, ఐదు లక్షలు కట్ చేశారు. మా ప్రభుత్వ హయాంలో ఎన్నికల నాటికి 66 లక్షలకు పైగా పెన్షన్లు ఇస్తే, ఈ రోజు 61 లక్షల మందికే ఇస్తున్నారు. ఈ ప్రభుత్వంలో ఎవ్వరూ సంతోషంగా లేరనేందుకు ఈ లెక్కలే నిదర్శనం.
- ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టారు. కొత్త మెడికల్ కాలేజీలను శనక్కాయలు, బెల్లానికి అమ్మేస్తున్నారు. ఇసుక, సిలికా, క్వార్ట్జ్.. దేన్నీ వదలకుండా అన్ని వనరులు, గనులను దోచేస్తున్నారు. అమరావతిలో చదరపు అడుగుకు రూ.10 వేలకు పైగా ఖర్చు చేస్తూ అక్కడా యథేచ్ఛగా దోచుకుంటున్నారు.

ప్రజలతో కలిసి మరింతగా ఉద్యమిస్తాం

చంద్రబాబూ ఇప్పటికైనా మారండి. ఇలాగే ఉంటూ రైతులను పట్టించుకోకపోతే.. విద్యార్థులు, ప్రజలను ఇలాగే కష్టాలపాలు చేస్తామంటే వారితో కలిసి మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం. రాబోయే రోజుల్లో వీళ్లందరి తరఫున తీవ్రమైన ఉద్యమాలు ఖాయం. చంద్రబాబును గద్దె దింపే కాలం త్వరలోనే వస్తుంది. దేవుడు కూడా మొట్టికాయలు వేస్తాడు' అని వైఎస్ జగన్ హెచ్చరించారు. అనంతరం ఒక రైతు మాట్లాడుతూ 'అయ్యా.. చంద్రబాబు గారూ.. మీరు వ్యవసాయం దండగ అంటున్నారు కదా.. మీరు ఏం తిని బతుకుతున్నారు? ఇనుప ముక్కలు తిని బతుకుతున్నారా? రైతులు ఒక్కసారి పంటలు వేయకపోతే.. ప్రజలు ఏం తింటారు? వారికి తిండి ఎక్కడి నుంచి వస్తుంది?' అని సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి, పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు రూ.32 వేలు.. నేడు రూ.2 వేలు

- మా ప్రభుత్వ హయాంలో అరటి టన్ను సగటు ధర రూ.25 వేలు కాగా, గరిష్టంగా రూ.32 వేల వరకు పోయింది. అదే ఈ రోజు కనీసం రూ.2 వేలకు కూడా కొనడం లేదు. దీంతో పంట మొత్తం చెట్ల మీదే కుళ్లిపోతోంది. అంత దారుణంగా ఉంది పరిస్థితి. మా ప్రభుత్వ హయాంలో అరటి ఎగుమతి కోసం అనంతపురం నుంచి ఢిల్లీకి రైళ్లు నడిపాం. అరటితో పాటు, ఉద్యాన పంటలు కూడా వాటిలో ఎగుమతి చేశాం. చివరకు బనగానపల్లి నుంచి గువాహటి వరకు రైళ్లు నడిచాయి.
- మా ప్రభుత్వం రాక ముందు అరటి ఎగుమతి 25 వేల టన్నులు మాత్రమే ఉంటే, మా ప్రభుత్వ హయాంలో 3 లక్షల టన్నుల వరకు ఎగుమతి చేశాం. కేంద్రం నుంచి అరటి సాగు, ఎగుమతికి సంబంధించి అవార్డులు పొందాం. ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్), నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ బనానా, అసోసియేషన్ ఆఫ్ బనానా ఎక్స్‌పోర్టర్స్ అవార్డులు కూడా పొందాం. అవన్నీ నాడు ప్రభుత్వాన్ని గొప్పగా చూశాయి. కానీ, ఇప్పుడు ఇలాంటి దారుణ పరిస్థితి చూడాల్సి వస్తుందని అనుకోలేదు. అంతా ఒట్టి మాటలు.. డైవర్షన్ పాలిటిక్స్.

పెట్టుబడి కూడా రాలేదు

నాకున్న ఆరు ఎకరాల భూమిలో దాదాపు రూ.12 లక్షలు పెట్టుబడి పెట్టి అరటి పంటను సాగు చేశాను. ఎరువులు, మందులు వాడటంతో పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వచ్చింది. కాయ కూడా నాణ్యంగా ఉంది. అయితే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో వ్యాపారులు తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేయడం లేదు. దీంతో తోటలోనే పండ్లు మాగి కింద పడిపోతున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోయాను. పెట్టుబడి కూడా రాలేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అరటి రైతులను ఆదుకోవాలి.

– శ్రీనివాసరెడ్డి, బ్రాహ్మణపల్లె, పులివెందుల

అరటి పంటను అడిగే నాథుడే లేడు

ఎంతో కష్టపడి వేలకు వేలు పెట్టుబడి పెట్టి అరటి పంట సాగు చేసి మంచి దిగుబడి వచ్చిందన్న సమయంలో కొనుగోలు చేసే నాథుడే లేడు. అరటి చెట్లకే పండ్లు మాగి కిందపడిపోతున్నాయి. గతంలో రూ.20 వేల నుంచి రూ.32 వేల వరకు టన్ను అరటి కాయల ధర పలికింది. ప్రస్తుతం టన్ను రూ.2 వేలకు అమ్ముదామన్నా కొనే వారు లేరు. ప్రభుత్వం రైతులను పట్టించుకొని అరటి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తుందనుకుంటే రైతుల వైపు కన్నెత్తి కూడా చూడక పోవడం దారుణం.

– రామతులశమ్మ, బ్రాహ్మణపల్లె, పులివెందుల

పంటను దున్నేయాల్సిన దుస్థితి

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రైతులు విలవిలలాడుతున్నారు. గతంలో అరటి పంటకు మంచి ధరలు ఉన్నాయని ఆశించి ఈ ఏడాది భారీగా పెట్టుబడులు పెట్టి సాగు చేశాం. తీరా పంట దిగుబడి వచ్చి మార్కెట్‌లో అమ్ముదామనుకున్న సమయంలో వ్యాపారులు, ప్రభుత్వం కూడబలుక్కున్నట్లు స్పందించడం లేదు. దీంతో అరటి కాయలు చెట్లకే మాగిపోతున్నాయి. అరటి పంటను ట్రాక్టర్లతో దున్నుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటికైనా అరటి రైతుల సమస్యలను గుర్తించి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– రామచంద్రారెడ్డి, బ్రాహ్మణపల్లె, పులివెందుల

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు

ఆరుగాలం కష్టపడి పంటలను సాగు చేస్తే, తీరా పంట దిగుబడి వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేక తల్లడిల్లిపోతున్నాం. నేను, నా స్నేహితుడు ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని అరటి, టమాట పంటలను సాగు చేశాం. దాదాపు రూ.5 లక్షలు పెట్టుబడులు పెట్టాం. కనీసం ఒక్కరూపాయి కూడా మాకు డబ్బు రాలేదు. టమాట పంటను అమ్మడానికి మార్కెట్‌కు పోతే కొనేనాథుడు లేక మార్కెట్ వద్ద పారబోశాను. ఆటో బాడుగ కూడా చేతి నుంచి పడింది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

– బాబురెడ్డి, ఇనగలూరు, తొండూరు మండలం

వేల్పుల- పులివెందుల మధ్య ఓ వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ జగన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో వృద్ధులు, మహిళలు, విద్యార్థినులు

పులివెందుల క్యాంప్ కార్యాలయం వద్ద ప్రజలకు నమస్కరిస్తున్న వైఎస్ జగన్

వెల్లువెత్తిన జనాభిమానం

చిన్నారితో వైఎస్ జగన్ సెల్ఫీ

సాక్షి కడప : కనుచూపు మేర కటౌట్లు.. బాణా సంచా వెలుగు జిలుగులు.. అడుగడుగునా పూల వర్షం.. బైకులకు పార్టీ జెండాలు.. జై జగన్ నినాదాలు.. వెరసి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి, కోలుకున్న వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి (రాము)ని పరామర్శించడానికి బుధవారం వైఎస్ జగన్ వేల్పుల వెళుతుండగా అభిమానులు, ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కాన్వాయ్ వెంట భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్ జగన్ వాహనం పైనుంచి.. నలువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేస్తుండగా, వేల్పులలో అభిమానులు మిద్దెలపై నుంచి పూల వర్షం కురిపించారు. రోడ్డంతా పూలు పరిచి స్వాగతం పలికారు. మహిళలు కరచాలనం చేస్తూ వైఎస్ జగన్‌ను ఆహ్వానించారు. అనంతరం రామలింగారెడ్డి ఇంట్లోకి వెళ్లిన వైఎస్ జగన్.. ఆయనతో చర్చించారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికల ముందు జరిగిన గొడవ గురించి మాట్లాడారు. రామలింగారెడ్డి తల్లి పార్వతమ్మ.. ఆయన సతీమణి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లింగాల ఉషారాణిలతో కూడా మాట్లాడారు. ఆ తర్వాత తిరిగి పులివెందులకు వచ్చే క్రమంలో కూడా అభిమానులు పెద్ద ఎత్తున రోడ్డుకు ఇరువైపులా చేరుకుని అభివాదం చేశారు. పలు చోట్ల అభిమానుల తాకిడికి కాన్వాయ్ ఆపి.. వారితో కరచాలనం చేస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో పది కిలోమీటర్ల దూరంలోని పులివెందులకు రావడానికి పది నిమిషాలకు బదులు ఒకటిన్నర గంటల సమయం పట్టింది. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ.. సెల్ఫీలు దిగుతూ మమేకమయ్యారు.

బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వైఎస్ జగన్‌ను కలిశారు.

వేల్పులలో భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌ను చూసి స్కూలు బస్సు నుంచే కేరింతలు కొడుతున్న చిన్నారులు

విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో విద్యార్థులు

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

ప్రకృతి విపత్తుల భారత్!

క్లైమేట్ రిస్క్ ఇండెక్స్ నివేదికలో 9వ స్థానం

- 1995-2024 మధ్య 430 వాతావరణ విపత్తులు
- 80వేల మంది మృత్యువాత.. రూ.14 లక్షల కోట్ల నష్టం
- తుపానులు, వరదలు, ఉష్ణోగ్రతలే ప్రధాన కారణం
- ఆంధ్ర తీర ప్రాంతాల్లో ఎక్కువ నష్టం

సాక్షి, అమరావతి: వాతావరణ మార్పుల వల్ల ఎక్కువగా నష్టపోతున్న టాప్ 10 దేశాల్లో భారత్ 9వ స్థానంలో ఉంది. జర్మన్ వాచ్ అనే అంతర్జాతీయ సంస్థ విడుదల చేసిన క్లైమేట్ రిస్క్ ఇండెక్స్–2026 నివేదికలో ఈ విషయం వెల్లడైంది. 1995 నుంచి 2024 వరకు మన దేశం సుమారు 430 విపత్తుల బారిన పడినట్లు ఈ నివేదిక పేర్కొంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వరదలు, తుఫాన్లు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు లక్షల మందిపై ప్రభావం చూపడంతో సుమారు 80 వేల మందికిపైగా మృత్యువాతపడ్డారు. అంతేగాక, ఆర్థికంగా దేశానికి రూ.14 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. ఉత్తర, మధ్య భారతదేశ రాష్ట్రాల్లో వేసవిలో తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అనేక చోట్ల 50 డిగ్రీల వరకు నమోదవుతుండడంతో వడ దెబ్బ తగిలి వందలాది మంది చనిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు తదితర తీర ప్రాంతాలను తుపానులు తీవ్రంగా దెబ్బతీశాయి. గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వేడి గాలులు తీవ్రంగా ఉంటున్నాయి. రుతుపవనాల సీజన్‌లో వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల వరదల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. పంటలు, ఇళ్లు, రోడ్లు భారీగా దెబ్బతింటున్నాయి. వాతావరణ హెచ్చరికలు, అరకొర రక్షణ చర్యల వల్ల నష్ట తీవ్రత మరింత పెరుగుతోంది.

ప్రపంచవ్యాప్తంగా 9,700 విపత్తులు

అంతర్జాతీయంగానూ వాతావరణ మార్పులపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాది విడుదలైన సీఓపీ30 నివేదికలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రధానంగా భారత్ వంటి దేశాలు వాతావరణ మార్పుల వల్ల తీవ్రమైన నష్టాలు ఎదుర్కొంటున్నాయని హెచ్చరించింది. 1995 నుంచి 2024 మధ్య ప్రపంచ వ్యాప్తంగా 9,700పైగా అత్యంత ప్రభావం చూపిన వాతావరణ విపత్తులు వచ్చాయి. అమెరికాలో కత్రీనా, ఫిలిప్పీన్స్‌లో హైయాన్, ఇండియాలో ఆంఫన్ తుపాను తీవ్ర ప్రభావం చూపాయి. చైనా, పాకిస్తాన్, ఇండియా, జర్మనీ తదితర దేశాల్లో భారీ వరదలు వచ్చాయి. యూరప్, ఇండియా, కెనడా, ఆస్ట్రేలియాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జపాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లో తీవ్ర ప్రాణ నష్టం జరిగింది. హిమాలయ ప్రాంతాలు, దక్షిణ అమెరికాలో కొండలు కూలిపోతున్న ఘటనలు ఎక్కువయ్యాయి. ఆఫ్రికా, దక్షిణ ఆసియా దేశాల్లో నీటి కొరత, పంటల నష్టం, ఆస్ట్రేలియా, అమెరికా దేశాల అడవుల్లో తీవ్ర అగ్ని ప్రమాదాలు సంభవించాయి.



భారత్‌లో తీవ్ర విపత్తులు

మన దేశంలో 1999లో ఒడిశాలో సంభవించిన సూపర్ సైక్లోన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 2014లో హుద్‌హుద్ తుపాను ఉత్తరాంధ్ర ప్రాంతంలో తీవ్ర నష్టాన్ని మిగల్చగా.. 2013–2021 మధ్య ఫాలిన్, గజా, తిత్లీ, ఆంఫన్, యాస్ తుపానులు పెను నష్టాన్ని కలిగించాయి. 2005లో ముంబైలో వచ్చిన వరదలు, 2013 ఉత్తరాఖండ్ వరదలు, 2018లో కేరళలో వరదలు ఆ రాష్ట్రాల్లో ఊహించని నష్టాన్ని కలిగించాయి. ఏటా గంగ, గోదావరి, కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో వరదలు వస్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు తరచూ కరువు బారిన పడడంతో వ్యవసాయానికి తీరని నష్టం మిగులుతోంది. హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో కొండ చరియలు విరిగిపడడం, కూలిపోవడం (ల్యాండ్ స్లైడ్స్) వల్ల అపార నష్టం వాటిల్లుతోంది. వాతావరణ మార్పుల వల్ల రుతుపవనాల్లో అస్థిరత, సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడంతో వరదలు రావడం, ఉష్ణోగ్రతలు పెరగడం జరుగుతోంది. తీర ప్రాంతాల్లో అధిక జనాభా, ప్రణాళిక లోపాలతో తీవ్ర నష్టం జరుగుతోంది. అడవుల ధ్వంసం, డ్రైనేజీ వ్యవస్థలు లేకపోవడం వల్ల నష్టం ఎక్కువ అవుతున్నట్లు నివేదిక వెల్లడించింది.

హక్కులతో పాటు విధులూ గుర్తించాలి

- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- రాజ్‌భవన్‌లో ఘనంగా 76వ రాజ్యాంగ దినోత్సవం

సాక్షి, అమరావతి: ప్రజలు హక్కులతో పాటు విధులు కూడా ఉంటాయని గుర్తించాలని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సూచించారు. 76వ రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా రాజ్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాజ్యాంగ ముసాయిదా కమిటీ సభ్యుల చిత్రపటాల వద్ద గవర్నర్ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరుల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛను పరిరక్షించడంతో పాటు సమసమాజ నిర్మాణానికి రాజ్యాంగం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రథమ మహిళ సమీరా నజీర్, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాము తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

భారత రాజ్యాంగ అమలు దినోత్సవం సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పులివెందుల భాకరాపురంలోని తన నివాసంలో బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

సాక్షి, అమరావతి: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నివాళులర్పించారు. '76 ఏళ్ల క్రితం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనకు స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన రాజ్యాంగాన్ని ఇచ్చారు. ఆ విలువలను కాపాడుకోవడమే ఈరోజు ఆయనకు ఇవ్వగలిగే ఉత్తమ నివాళి. మన ప్రజాస్వామ్యం ఎవరికీ భయపడని విధంగా.. అత్యంత పారదర్శకంగా ఉండేలా సంరక్షించుకుందాం' అంటూ వైఎస్ జగన్ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

చంద్రబాబు తీరుతోనే మెడికల్ సీటు కోల్పోయా

వైఎస్ జగన్ ఎదుట ఓ విద్యార్థిని ఆవేదన

సాక్షి కడప: చంద్రబాబు తీరు వల్లే తాను మెడికల్ సీటు కోల్పోయానని విద్యార్థిని పూజిత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. బుధవారం పులివెందులకు చెందిన నాగసుందరరెడ్డి, ఆయన కుమార్తె పూజితలు వెలమవారిపల్లె క్రాస్ వద్ద వైఎస్ జగన్‌ను కలిశారు. నీట్‌లో తన కుమార్తెకు 467 మార్కులు వచ్చాయని, రెండు మూడు మార్కుల తేడాతో తన కుమార్తె మెడికల్ సీట్ కోల్పోయిందని ఆమె తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తెలాగా అనేక మంది వైద్య విద్య కోసం కష్టపడి చదివినా, బాబు తీరు వల్ల ఫలితం పొందలేకపోయారన్నారు. చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పులివెందుల మెడికల్ కాలేజీకి 50 సీట్లు, పాడేరు వైద్య కళాశాలకు రావాల్సిన 50 సీట్లు కోల్పోయామని ఈ సందర్భంగా వైఎస్ జగన్ అన్నారు. ఈ రెండు మెడికల్ కాలేజీలకు మంజూరైన సీట్లు వచ్చి ఉంటే పూజిత లాంటి విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించి మంచి డాక్టర్లయ్యేవారన్నారు. తమ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసి వైద్య విద్యను అందించే ప్రయత్నాన్ని ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు.

భారత రాజ్యాంగమే అత్యంత గొప్పది

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్

ఏఎన్‌యూ (పెదకాకాని) : ప్రపంచ దేశాలన్నింటిలోకి భారత రాజ్యాంగమే అత్యంత గొప్పదని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం 76 వసంతాల రాజ్యాంగంపై నిర్వహించిన కార్యక్రమానికి జస్టిస్ రామకృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రాజ్యాంగం అంటే ఒక గ్రంథం మాత్రమే కాదని, అందులో యావత్ భారతానికి సంబంధించిన యేయే శాఖలు యేయే అధికారాలు కలిగి ఉంటాయో అలాగే ఏమేం చెయ్యొచ్చో, ఏం చేయకూడదో సవివరంగా పొందుపర్చి ఉందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సందర్భంలో, అలాగే మూడు రాజధానుల వంటి చారిత్రాత్మక కేసులు నడిచినప్పుడు తాము న్యాయమూర్తిగా ఉంటూ రాజ్యాంగాన్ని పరిరక్షించే క్రమంలో ఎంతో నేర్చుకున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- అంబేడ్కర్ స్ఫూర్తితో సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్ కుటుంబానిదే
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున

పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద వైఎస్సార్‌సీపీ నేతల నివాళి

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అంబేడ్కర్ అలోచనా విధానాన్ని అమలు చేసి పేదల స్థితిగతులను పెంచారని చెప్పారు. కులమతాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అందరినీ వృద్ధిలోకి తెచ్చేలా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ చేసిన రచనలతో అందరికీ సమానమైన న్యాయం దక్కాలని.. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం ఉండాలని, రిజర్వేషన్ల ప్రక్రియ ఉండాలని, అణగారిన వర్గాలకు ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యం ఉండాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం దురదృష్టవశాత్తు అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ.. కులం, మతం, ప్రాంతం, దళారులతో సంబంధం లేకుండా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌దేనని స్పష్టం చేశారు.

భారతీయులకు ఏకైక ప్రామాణిక గ్రంథం రాజ్యాంగమే

మాజీ ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అంబేడ్కర్ స్మృతివనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. తాగి పడేసిన మంచినీళ్ల సీసాలు, చెత్తాచెదారంతో నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌ను అవమానించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఎవరెన్ని అవమానాలు చేసినా అంబేడ్కర్ గౌరవం ఏమీ తగ్గదన్నారు. రాజ్యాంగానికి కట్టుబడి ఐదేళ్ల పాలన చేసిన ఏకైక వ్యక్తి వైఎస్ జగన్ అని, అలాంటి సంక్షేమ పాలన కొనసాగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. హిందువులకు భగవద్గీత, క్రైస్తవులకు బైబిల్, ముస్లింలకు ఖురాన్ పవిత్ర గ్రంథాలైతే.. భారతీయులందరికీ ఉన్న ఏకైక ప్రామాణిక గ్రంథం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమేనన్నారు. చంద్రబాబు ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని కాదని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందన్నారు.

త్వరలో పుట్టపర్తికి జేపీ నడ్డా

బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: భగవాన్ శ్రీ సత్యసాయి ఆశీస్సులు పొందేందుకు వీలైనంత త్వరలో పుట్టపర్తికి వస్తానని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పినట్లు ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఆయన నడ్డాను మర్యాదపూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా.. గతంలో శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించిన సందర్భాన్ని నడ్డా గుర్తు చేసుకున్నట్లు తెలిపారు. తన శాఖకు సంబంధించిన ముఖ్యమైన అధికారిక కార్యక్రమాల వల్ల సత్యసాయి 100వ జన్మదిన వేడుకలకు హాజరు కాలేకపోయానని చెప్పినట్లు వెల్లడించారు. ఈ భేటీలో రాష్ట్రంలో పార్టీ, సంస్థాగత కార్యకలాపాల వివరాలు నడ్డా అడిగి తెలుసుకున్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి వివరించారు.

బడ్జెట్ బయట మరో రూ.5,000 కోట్ల అప్పు

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో బడ్జెట్ బయట అప్పులు చేయడమే పెద్ద తప్పుగా చిత్రీకరించిన చంద్రబాబు సర్కారు.. ఇప్పుడు బడ్జెట్ బయట ప్రభుత్వ గ్యారెంటీతో ఎడాపెడా అప్పులు చేస్తోంది. మార్క్‌ఫెడ్ ద్వారా బడ్జెట్ బయట మరో రూ.5000 కోట్ల అప్పు చేసేందుకు ప్రభుత్వ గ్యారెంటీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే మార్క్‌ఫెడ్ ద్వారా బడ్జెట్ బయట రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీతో రూ.13,700 కోట్ల అప్పు చేసింది. ఇప్పుడు చేసే మరో అప్పుతో మార్క్‌ఫెడ్ ద్వారా చేసిన అప్పు మొత్తం రూ.18,700 కోట్లకు చేరుతుంది.

లులు మీదున్న శ్రద్ధ అంబేడ్కర్ స్మృతివనంపై లేదు

విజయవాడలో ర్యాలీ అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- రాజ్యాంగం అమలుపై చిత్తశుద్ధి ఉంటే స్మృతివనం ఇలా ఉండేదా?
- చంద్రబాబు సర్కారుపై వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చంద్రబాబు సర్కారుకు లులు మీదున్న శ్రద్ధ అంబేడ్కర్ స్మృతి వనంపై లేదని, రాజ్యాంగం అమలుపై చిత్తశుద్ధి ఉంటే స్మృతివనం ఇలా ఉండేదా అంటూ వైఎస్సార్ సీపీ నేతలు ధ్వజమెత్తారు. బుధవారం విజయవాడలోని అంబేడ్కర్ స్మృతి వనం ప్రాంగణంలో పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. తొలుత నాయకులు, కార్యకర్తలు, అంబేడ్కరిస్టులు ర్యాలీగా స్మృతివనానికి చేరుకున్నారు. మహిళలు పాల బిందెలతో ప్రదర్శన చేశారు. సామాజిక న్యాయ మహా శిల్పం ఎదుట అంబేడ్కర్ చిత్రపటానికి పూలు, పాలతో అభిషేకం చేశారు. చీపుర్లతో ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. వైఎస్ జగన్‌పై కోపంతోనే చంద్రబాబు ప్రభుత్వం అంబేడ్కర్ స్మృతివనం నిర్వహణను గాలికి వదిలేసిందని విమర్శించారు.

స్మృతివనంపై ప్రభుత్వ వివక్ష

అనంతరం మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్‌మోహన్‌రావు, నల్లగట్ల స్వామిదాసు, మల్లాది విష్ణు, మాజీ ఎంపీ నందిగం సురేష్, దేవినేని అవినాష్, మొండితోక అరుణ్ కుమార్, టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ గొప్ప దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగానికి టీడీపీ సర్కారు తూట్లు పొడుస్తోందని ధ్వజమెత్తారు. జగన్ ఐదేళ్ల పాలనలో అన్నివర్గాలకు న్యాయం జరిగిందని వివరించారు. జగన్ విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని సగర్వంగా నిలబెట్టారని గుర్తుచేశారు. అంబేడ్కర్ వాదులంతా వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అంబేడ్కర్ స్మృతివనాన్ని పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. అంబేడ్కర్ ఆశయాలు సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వైఎస్ జగన్ విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల భారీ విగ్రహాన్ని ప్రతిష్టించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కనకరావు, రాయన భాగ్యలక్ష్మి, నూరి ఫాతిమా, ఉప్పాల రాము, పానుగంటి చైతన్య, రవిచంద్ర పాల్గొన్నారు.

పిల్లల అసెంబ్లీలోనూ రాజకీయాలే

- విజ్ఞాన యాత్రగా ఉండాల్సిన మాక్ అసెంబ్లీలో విద్వేషాలు నింపేలా ప్రసంగాలు
- పిల్లలను కనడంపై విద్యార్థులకు సీఎం పాఠాలు



సాక్షి, అమరావతి: రాజ్యాంగం విలువలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం నిర్వహించిన విద్యార్థుల మాక్ అసెంబ్లీని సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్న, మంత్రి లోకేశ్ రాజకీయ ప్రసంగాలతో విద్యార్థుల్లో విద్వేషాలు నింపేలా మాట్లాడారు. విద్యార్థులకు విజ్ఞాన యాత్రగా ఉండాల్సిన కార్యక్రమాన్ని సొంత అజెండా అమలు వేదికగా చేశారు. మొత్తం కార్యక్రమం నాలుగు గంటల పాటు జరిగితే.. అందులో మాక్ అసెంబ్లీ గంటన్నర పాటు జరిగింది. మిగిలిన రెండున్నర గంటలు పూర్తిగా రాజకీయ ప్రసంగాలకు కేంద్రమైంది. సీఎం చంద్రబాబు ప్రసంగం ఒక్కటే గంటా నలభై నిమిషాల పాటు సాగింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో లైవ్ టెలీకాస్ట్ చేసిన ఈ కార్యక్రమంలో సీఎం, స్పీకర్‌ల రాజకీయ ప్రసంగాలే ప్రధానంగా సాగాయి. పోలీసులకు రాజ్యాంగం అంటే ఏమిటో తెలియదని.. తన పాదయాత్రలో ఇది గమనించానని లోకేశ్ వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యే అసెంబ్లీకి రాకపోతే ఏం చేయాలి? : స్పీకర్ అయ్యన్న

స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ప్రతిపక్షంపై విమర్శలు చేశారు. రాష్ట్రం ఏమైపోయినా, గ్రామాలు, కుటుంబాలు ఏమైనా పర్లేదన్నట్లుగా ప్రతిపక్షం ఉందంటూ విద్యార్థుల్లో విద్వేషాలు రగిలేలా మాట్లాడారు. ఒక ఎమ్మెల్యే అసెంబ్లీకి రాకపోతే ఏం చేయాలి? ప్రజలు వారిని ఏం చేయాలి? ఎమ్మెల్యే అసెంబ్లీకి రాకపోతే జీతం ఎందుకు తీసుకోవాలి? ఇక పెద్దలు నిర్ణయించాలి'.. అంటూ చంద్రబాబు వైపు చేతులు చూపుతూ అయ్యన్న మాట్లాడారు.

రాజకీయాలు, స్వోత్కర్షతో సీఎం ప్రసంగం

ఈ మాక్ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రసంగం యావత్తూ రాజకీయాలు, వ్యక్తిగత గొప్పలే ప్రధానంగా సాగింది. ప్రతిపక్షంపై విద్యార్థుల్లో విషం నింపడమే లక్ష్యంగా మాట్లాడారు. ఎమ్మెల్యే కావాలంటే పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావాలని చెప్పడంతో అంతా విస్మయం వ్యక్తంచేశారు. ఏపీలో దొరికిన కోహినూర్ వజ్రాన్ని నిజాంకి ఇస్తే నిజాం ఆ వజ్రాన్ని బ్రిటిష్ వారికి ఇచ్చేశాడని కొత్త భాష్యం చెప్పారు. ఇక తాను తన చిన్నతనంలో లాంతరు వెలుగులో చదువుకున్నానని, దాంతో 1999లో విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చానని.. ఇప్పుడు ఏకంగా ఇంటిపైనే కరెంటు ఉత్పత్తి చేసుకునే స్థాయికి వచ్చామని అన్నారు. ఇలా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చంద్రబాబు తన కీర్తిని తానే కీర్తించుకున్నారు. ఎప్పటిలాగే.. సెల్‌ఫోన్ తానే తెచ్చానని, టెక్నాలజీకి తానే ఆద్యుడినని, ఇప్పుడు టీచర్ స్థానంలో ఏఐ పనిచేస్తోందంటే దానికి తానే కారణమని గప్పాలు కొట్టుకున్నారు.

విద్యలేనిదే వివేకం లేదు. వివేకం లేనిదే విలువల్లేవు. విలువల్లేనిదే వికాసం లేదు. విద్య అంటే చీకటి నుండి వెలుగుకు ప్రయాణం.

– మహాత్మా జ్యోతిబా పూలే

సాక్షి

గురువారం, 27 నవంబర్ 2025

దడ పుట్టిస్తున్న 'సర్'

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట బిహార్‌లో ప్రకంపనలు సృష్టించిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ డజను రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ నెల 4న మొదలైంది. వచ్చే నెల 4తో ముగిసే ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారి(బీఎల్‌ఓ) పాత్ర కీలకమైనది. ఓటర్ల ఇళ్లకు పోయి ఓటర్ నమోదు పత్రాలు అందించటం, వెనక్కి తీసుకోవటం, అవసరమైన పత్రాలు జతచేశారో లేదో చూడటం వారి బాధ్యత. ఫలానా వ్యక్తి అర్హుడైన ఓటరో కాదో ప్రాథమికంగా తేల్చేది వీరే. అదే వారి చావుకొస్తోంది. బిహార్‌కు భిన్నంగా ఈ ప్రక్రియ చాలా రాష్ట్రాల్లో మరణ మృదంగం మోగిస్తోంది. మరణాలు, బలవన్మరణాలు, అస్వస్థులు కావటం, భయాందోళనలతో అప్పగించిన పని వదిలి అదృశ్యం కావటం వంటి ఉదంతాలు చోటుచేసుకుంటున్నాయి. బిహార్‌లో బీఎల్‌ఓలకు ఈ స్థాయిలో సమస్యలున్న దాఖలా లేదు. నిజానికి అక్కడ బీఎల్‌ఓలతోనే ఓటర్లకు సమస్యలెదురైన ఉదంతాలున్నాయి. బీఎల్‌ఓలకు వెరిఫికేషన్‌లో సహకరించేందుకు పార్టీలు తమ కార్యకర్తలను బూత్ లెవెల్ ఏజెంట్లు(బీఎల్‌ఏ)గా నియమించుకునేందుకు ఎన్నికల కమిషన్(ఈసీ) అవకాశమిచ్చింది. సహజంగానే వారు పరిష్కారంలో కాక సమస్యలో భాగమవుతున్నారు. ఓటర్ల ఎదుటే బీఎల్‌ఓలతో వాదులాటలకు దిగటం, బెదిరించటం చాలాచోట్ల కనబడే దృశ్యాలు.

పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, రాజస్థాన్, గుజరాత్ తదితర చోట్ల బీఎల్‌ఓలు 'సర్' ప్రక్రియలో తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో చేతికి ఎముక లేకుండా భారీ వాగ్దానాలు చేయటం, అధికారం వచ్చాక ఎగనామం పెట్టడం మన దేశంలో దశాబ్దాలుగా సాగిపోతున్న ఒక దుస్సంప్రదాయం. ఈ విషయంలో న్యాయస్థానాలకెళ్లినా ఫలితం ఉండదు. కడుపు మండి నిలదీస్తే జైలుపాలు చేయటం, కార్యకర్తలను పంపించి దౌర్జన్యం చేయించటం ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు చాలాచోట్ల కనబడుతోంది. ఇంత జరుగుతున్నా, ఈవీఎంలు ఏమార్చి ఓట్లు కొల్లగొడుతున్నారన్న ఆరోపణలు మిన్నంటుతున్నా, ఎన్నికల సంఘం పట్టనట్టు వ్యవహరిస్తోంది. అయినా ఎన్నికల వ్యవస్థపై ఉండే అచంచల విశ్వాసమే ప్రజాస్వామ్యాన్ని ఈమాత్రంగానైనా బతికిస్తోంది. ఓటు పోతే జీవచ్ఛవంతో సమానమన్న అభిప్రాయం జనంలో ప్రబలంగా ఉంది. ప్రజాస్వామ్యంలో అసమ్మతి తెలపాలన్నా, ఆగ్రహావేశాలు వ్యక్తంచేయాలన్నా సామాన్యులకు ఓటును మించిన ఆయుధం మరేదీ లేకపోవటం ఇందుకు కారణం కావచ్చు.

బీఎల్‌ఓలు ఒత్తిడికి లోనవటం వెనక ఇతరేతర సమస్యలు కూడా ఉన్నాయి. గతంలో ఓటేసే రోజునే తమ ఓటు గల్లంతైందని తెలిసేది. కానీ ఇప్పుడలా కాదు. ఓటరు తన వివరాలతోపాటు అవసరమైన పత్రాలన్నీ అందజేసిన క్షణానే అది చూచాయగా తెలిసిపోతుంది. నెల రోజుల తర్వాత పేరుందో లేదో రూఢి అవుతుంది. లేకపోవటానికి గల కారణమేమిటో అందులో ప్రస్తావిస్తారు. ఆ చిరునామాలో ఓటరు లేడనో, మరణించాడనో, తగిన పత్రాలు అందించలేదనో వెల్లడిస్తారు. దానిపై మళ్లీ పంచాయతీ. నమోదు సమయంలో బీఎల్‌ఏల నుంచి వచ్చే ఒత్తిళ్లు ఒకపక్క, వాటిని తట్టుకోలేక ఏదైనా చేస్తే ప్రభుత్వం నుంచి చర్యలు మరోపక్క వారిని బాధిస్తున్నాయి. బీఎల్‌ఓల్లో 90 శాతం టీచర్లే. గుజరాత్ వంటిచోట్ల సాయంత్రం వరకూ విద్యాబోధనలోనూ, అటుతర్వాత రాత్రి 9వరకూ ఫీల్డ్‌లోనూ తలమునకలు కావాలి. మళ్లీ ఇంటికొచ్చి సేకరించిన పత్రాలన్నీ డిజిటల్ ఫామ్‌లోకి మార్చి పంపాలి. ఇవన్నీ ఎప్పటికప్పుడు కాకపోతే పై అధికారుల హెచ్చరికలు. సారాంశంలో ఓటర్ మొదలుకొని అందరికందరూ పెత్తనం చలాయించేవారే. ఈసీకి ఇవి పట్టవు. 'సబ్ ఠీక్ హై' అంటోంది.

గౌరవ ప్రదమైన జీవితం వెళ్లదీయదల్చుకున్నవారు ఉద్యోగాలు చేస్తారు. అందుకు జీతంతోపాటు గౌరవ మర్యాదలూ ఆశిస్తారు. కానీ అదనపు భారాలు మోపి, వెట్టి కార్మికుల కన్నా హీనంగా చూస్తూ, బెదిరింపులకు దిగటం వల్ల వారు సమాజంలో ఆత్మగౌరవంతో బతకగలుగుతారా? పిల్లలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దగలుగుతారా? గర్భిణులనూ, 45 ఏళ్లు దాటినవారినీ, అంగవైకల్యం ఉన్నవారినీ ఈ బాధ్యతల నుంచి తప్పించాలని గుజరాత్‌లో ఒక ఉపాధ్యాయ సంఘం కోరినా ఫలితం లేకపోయిందట! ఈ ధోరణి సరికాదు. దీన్ని వెంటనే చక్కదిద్దటం ఈసీ, కేంద్రం బాధ్యత.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.సప్తమి రా.7.14 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.10.27 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** తె.5.39 నుండి 7.15 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.38 వరకు, తదుపరి ప.2.21 నుండి 3.06 వరకు, **అమృత ఘడియలు:** ప.11.46 నుండి 1.23 వరకు.

సూర్యోదయం : 6.15
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

సరిపోవు!

కష్టపడి పని చేస్తే అది ఎప్పటికీ వృథా కాదు. చదువులో అయినా, క్రీడల్లో అయినా ఏదో ఒక దశలో ఆ కష్టం విలువను మీరు గుర్తిస్తారు. మంచి ఉద్దేశాలు, మంచి లక్ష్యాలు ఉన్నంత మాత్రానే మీరు జీవితంలో ముందుకు వెళ్లలేరు. వాటిని ఆచరణలో పెట్టేందుకు కష్టపడాలి.

– సురేశ్ రైనా, క్రికెటర్

నకిలీ

పెరియార్ ఒకసారి అన్నారు: "నేను చెప్పినా నమ్మాలనేం లేదు. మీ హేతుబద్ధమైన ఆలోచనా విధానానికి, మీ వివేకానికి ఆమోదయోగ్యమైతేనే దానిని నమ్మండి" అని. ఇప్పుడు మన వివేకాన్ని సైతం మభ్యపెట్టగల నకిలీ వార్తలు ప్రచారం అవుతున్నాయి. జాగ్రత్తగా ఉండండి.

– ఉదయనిధి స్టాలిన్, తమిళనాడు మంత్రి-నటుడు

వేడుక

వరుస విజయాలు ఎన్ని సాధిస్తున్నా కూడా చివరికి వచ్చేసరికి జీవితంలో గానీ, కెరీర్‌లో గానీ అతి పెద్ద విజయం... సంతృప్తి. మీ ప్రతి చిన్న సంతృప్తినీ పెద్ద విజయంగా సెలబ్రేట్ చేసుకోండి. స్నేహితులను ఆహ్వానించండి. అనుభవాలను కలబోసుకోండి.

– అనిల్ ధావన్, నటుడు

బాల యోధులు



పర్యావరణ శాస్త్రాన్ని మనం అదనపు పాఠ్యాంశంగా కాకుండా, కీలకమైన పాఠ్యాంశంగా పిల్లల పుస్తకాలలో ప్రవేశపెట్టాలి. ప్రతి పాఠం కూడా విద్యార్థులను భూగోళ సంరక్షకులుగా మార్చేంతగా ప్రేరణ కలిగించేదై ఉండాలి. వారిని పర్యావరణ యోధులుగా మార్చాలి.

– కార్తికేయ విక్రమ్ సారాభాయ్, పర్యావరణవేత్త

వైవిధ్యం

సమాజం ఒకేలా ఉండటం కంటే, భిన్నంగా ఉండటం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. పురోగతికి అవసరమైన ఆలోచనలను, వస్తూత్పత్తులను ఏ ఒక్క సమూహమో అభివృద్ధి చేయలేదు. సుసంపన్నమైన జీవితాన్ని సాధించటం కోసం వైవిధ్యం తప్పనిసరి.

– రాజీవ్ భార్గవ, రాజకీయ విశ్లేషకుడు

పంచభూతాలు



గుర్తుంచుకోండి. మీ సామర్థ్యం ఏమిటో చూపించటానికి ఎప్పుడూ భయపడకండి. ఆత్మవిశ్వాసం, పరిణతి అన్నవి డ్యాన్సర్‌కు గాలి, నీరు వంటివి. మీ ఆత్మను అగ్నితో నింపుకొని, భూమిపై పాదాలను నిలుపుకోండి. పంచభూతాలు సైతం మీ నృత్యాన్ని ఆగి చూస్తాయి.

– నవ్రుతా రాయ్, కొరియోగ్రాఫర్

పరిష్కారం దారులు తెరవాలి!

అభిప్రాయం

దిలీప్ రెడ్డి

ఏది సమస్య? ఏది పరిష్కారం? మధ్య భారతంలో ముఖ్యంగా అటవీ, ఆదివాసీ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సాగుతున్న వామపక్ష ఉద్యమాలు–తీవ్రవాదం, హింస–ప్రతిహింస విషయంలో ఇటీవలి పరిణామాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. హింస ఆగటం లేదు, శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు. మౌలిక సమస్యను పరిష్కరించకుండా జరిపే ప్రక్రియ అర్థం లేని గమ్యం వైపు సాగుతోందన్నది ఈ ఆందోళనకు కారణం. ముఖ్యంగా మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరైన 'హిడ్మా' మరణానంతరం చర్చ తీవ్రస్థాయికి చేరింది.

వచ్చే (2026) మార్చి మాసాంతానికి నక్సలైట్లను సమూలంగా నిర్మూలిస్తామని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ప్రకటించారు. హింస ఏదైనా హింసే! చావులు ఎటువైపున జరిగినా క్షోభ తప్పదనేది జనాభిప్రాయం! కూంబింగ్ ఆపితే ఆయుధాలు వీడుతామనే కొత్త మాట మావోయిస్టు కేంద్ర కమిటీ నుంచి తాజాగా మొదలైంది. మధ్య భారతంలోని మూడు (ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర) రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఈ మేరకు లేఖలు రాసినట్టు వార్తలొస్తున్నాయి. ఇదే అదనుగా, ఆయుధాల అంశం బెట్టు చేయకుండా కేంద్రం చొరవ తీసుకోవాలి. చర్చలతో శాంతి సాధనకు యత్నిస్తూనే, నక్సలైట్ల ఎజెండా అంశాల్ని పరిష్కరించాలి. నక్సలైట్లు లేవనెత్తే సమస్యల్ని 'సామాజికార్థికాంశం'గా చూడకుండా, 'నక్సలైట్ల'నే శాంతిభద్రతల సమస్యగా ప్రభుత్వాలు పరిగణించడం వల్ల పరిస్థితి ఇక్కడి దాకా వచ్చింది.

'హిడ్మా' ఎందుకు హీరో అయ్యాడు?

వరుస ప్రభుత్వాల వైఫల్యం దృష్ట్యా సమస్యల పరిష్కారానికి ఆయన నిలబడ్డాడు. ఈ క్రమంలోనే పోలీసులను, సాయుధ బలగాలను, రాజ్యాన్ని ఎదిరించాడు. ఉద్యమం వల్ల లభించిన పుష్కల అవకాశాలతో ఇంటికో, తల్లికో, తనకో, తన వారికో ఏదీ చేసుకోకుండా ఆదివాసీల కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ఆయన త్యాగానికి మరణానంతరమూ విశేష ఆదరణ లభించింది. ఇపుడు హిడ్మాను హతమార్చారు. రేపు మిగతా నక్సలైట్లను లొంగదీసుకోవడమో, చంపడమో చేస్తారు. అది, కొంత మేరకే సమాధానం. మౌలికమైన ప్రజల సమస్యకు పరిష్కారం కాదు. నక్షత్రాల స్థానాలు–కదలికల ఆధారంగా రూపొందించే పంచాంగాలను బట్టి ముహూర్తాలు, శకునాలు చెబుతారు. ఆవేశంతో ఎవరో పంచాంగాలు చింపేయడమో, కాల్చేయడమో చేసినంత మాత్రాన అంతా అయిపోతుందా? నక్షత్రాలుంటాయి కదా. అవి కదా మూలం!

ఉద్యమకారుల్ని చంపేయడం, ఉద్యమాల్ని అణచివేయడం కాకుండా, ఉద్యమాలు తలెత్తడానికి కారణమవుతున్న మౌలికాంశాల్ని సరిదిద్దడం ద్వారా ఉద్రిక్తతల్ని, అశాంతిని నిర్మూలించాలి. ఇదే విషయాన్ని అత్యున్నత నిపుణుల కమిటీ 2008లోనే చెప్పింది.

◆ ఉద్యమకారుల్ని చంపేయడం, ఉద్యమాల్ని అణచివేయడం కాకుండా, ఉద్యమాలు తలెత్తడానికి కారణమవుతున్న మౌలికాంశాల్ని సరిదిద్దడం ద్వారా ఉద్రిక్తతల్ని, అశాంతిని తొలగించాలి. ఇదే విషయాన్ని అత్యున్నత నిపుణుల కమిటీ 2008లోనే చెప్పింది.

అజిత్ దోవల్ సభ్యుడే!

మధ్య భారతంలోని ఛత్తీస్‌గఢ్, అవిభక్త ఆంధ్రప్రదేశ్, ఒడిషా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలు కలిసిన అటవీ, ఆదివాసీ ప్రాంతాల్లో వామపక్ష హింసను రూపుమాపి, అభివృద్ధికి దోహదపడాలంటే ఏం చేయాలనే విషయంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర అధ్యయనం జరిపించింది. అశాంతి స్థానే శాంతి వెల్లివిరియాలంటే కేంద్రం, రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలనీ, నక్సలైట్ల నిర్మూలన మాత్రమే ఇందుకు పరిష్కారం కాదనీ ఈ నిపుణుల కమిటీ 2008లోనే నివేదించింది. నక్సలైట్ల హింసకు విరుగుడుగా స్థానిక ఆదివాసీ యువకులతో 'ఎదురుదాడుల' కోసం ప్రభుత్వ బలగాలు ఏర్పాటు చేసిన సాయుధ 'సాల్వాజుడుం'ను 2011లో సుప్రీంకోర్టు నిషేధించడానికి మూడేళ్లు ముందరే, 'ఆ వ్యూహం, అటువంటి ఆచరణ తప్పు' అని ఈ కమిటీ నిర్ద్వంద్వంగా చెప్పింది.

నివేదికను రూపొందించిన డ్రాఫ్టింగ్ సబ్ కమిటీలో తెలుగు వాడైన దివంగత హక్కుల కార్యకర్త, న్యాయవాది కె. బాలగోపాల్ కీలకపాత్ర పోషించారు. కేంద్ర ప్రణాళికా సంఘం 2006లో, డి. బంధోపాధ్యాయ (కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్మెంట్) అధ్యక్షతన 16 మంది సభ్యులతో ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, 'అసంతృప్తి, అశాంతి, తీవ్రవాదం– అభివృద్ధికి అవరోధం' అంశంపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా కోరింది. 'నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధికి సవాళ్లు' పేరిట ఇచ్చిన సుమారు 90 పేజీల నివేదిక ఇది. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల ప్రతిపాదనలతో, 20 పేజీల మేర ఇందులో 'నిర్దిష్ట సిఫారసులు'న్నాయి. కేంద్రంలోని ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ 'జాతీయ భద్రతా సలహాదారు' అజిత్ దోవల్ (మాజీ కేంద్ర నిఘా సంస్థ) ఈ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయనతో పాటు ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ (పౌర స్పందన వేదిక కన్వీనర్), ఐపీఎస్‌లు సహా పలు ఇతర రంగాల వారు సభ్యులుగా ఉన్నారు.

ఉద్యమాలకు తావీయొద్దు!

అటవీ, అదివాసీ ప్రాంతాల్లో, బడుగు–బలహీనవర్గాల్లో ప్రజా సమస్యల్ని ప్రభుత్వమే పరిష్కరిస్తూ, జన బాహుళ్యంలోకి నక్సలైట్లు చొరబడే, వారి మద్దతు కూడగట్టే ఆస్కారం లేకుండా చేయాలని నిపుణుల కమిటీ కేంద్రానికి సూచించింది. దేశంలో వామపక్ష తీవ్రవాదం ఒక దశలో, 'ముఖాముఖి యుద్ధ' పరిస్థితికి వెళ్లింది. యుద్ధంలో వలెనే, ఎవరికి వారు వ్యూహ–ప్రతివ్యూహాలతో ఎదుటివారి బలహీనతల్ని సొమ్ముచేసుకునే ఎత్తుగడలూ పన్నారు. పాలనా వైఫల్యాలు, సంక్షేమాభివృద్ధి లేమి, హక్కుల హననం, సహజ వనరుల దోపిడీ వంటి పరిస్థితుల్ని సానుకూలంగా మలచుకొని నక్సలైట్లు ప్రజల మద్దతు కూడగట్టారు. కొన్నిచోట్ల ప్రభుత్వ సాయుధ బలగాలను మించి బలోపేతమయ్యారు. నక్సలైట్లలో గ్రూపులు, అనైక్యత, సిద్ధాంత క్షీణత, స్వార్థ–లంపెన్ శక్తుల ప్రవేశం... వంటి పరిస్థితుల్ని పోలీసు, మిలిటరీ, ప్యారా మిలిటరీ బలగాలు తమకు అనుకూలంగా మలచుకొని ఆధిపత్యం సాధించాయి. ఈ ఆధిపత్య పోరులో హింస పెరిగి, అశాంతి తీవ్రంగా ప్రబలింది.

దీనిపై అధ్యయనం తర్వాత నిపుణుల కమిటీ అయిదు ఛాప్టర్లుగా నివేదిక ఇచ్చింది. 'పెసా', భూగరిష్ఠ పరిమితి వంటి ప్రస్తుత చట్టాల పకడ్బందీ అమలు, జీవనోపాధుల కల్పన, సాంఘిక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల లోపరహిత అమలు, 'సాల్వా జుడుం' వంటి రాజ్యాంగేతర సాయుధ దళాలు కాకుండా రాజ్యం తన బాధ్యతను రాజ్యాంగ పరిధిలో నిర్వహించడం, మానవ హక్కుల ఉల్లంఘన ఫిర్యాదుల్ని సత్వరం పరిష్కరించడం, పాలనను మానవీకరించి ఆదివాసీల సమస్యలు, ఫిర్యాదుల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించడం వంటి చర్యల్ని చేపట్టాలని కమిటీ సిఫారసు చేసింది. ప్రజలకు దన్నుగా నక్సల్స్ చేస్తున్న పనుల్ని ప్రభుత్వమే ముందు చేసి వారికి జనహృదయాల్లో తావు లేకుండా చేయాలని కమిటీ సూచించింది. ఇవన్నీ చిత్తశుద్ధితో చేపడితే, అసమానతలు కొంతైనా తొలగి ఉద్యమాలకు తావులేని వాతావరణం ఉంటుందని ప్రభుత్వాలు గ్రహించాలి.

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్

లేబర్ కోడ్‌ల పరమార్థం ఏమిటి?

భారత్ కొత్త కార్మిక శకంలోకి ప్రవేశించిందనీ, ఇకపైన కార్మిక నిబంధనలు మారటంతో పాటు వారి సంక్షేమం మెరుగుపడుతుందనీ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దశాబ్దాలుగా అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను క్రమబద్ధీకరించి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ప్రారంభించారు. 'వికసిత భారత్' లక్ష్యాలకు అనుగుణంగా శ్రామిక వ్యవస్థను సిద్ధం చేయటమే ఈ సంస్కరణ లక్ష్యంగా పేర్కొన్నారు.

వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రత కోడ్ (2020), వృత్తిపరమైన భద్రత, హెల్త్, పని ప్రదేశంలో పరిస్థితుల కోడ్ (2020) అనే ఈ నాలుగు ఇప్పటికే అమలులోకి వచ్చాయి. కార్మికుల ఉపాధికి, సామాజిక భద్రతకు వీటి ద్వారా పెద్దపీట వేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

పీవీ నరసింహారావు నుంచి అధికారంలోకి వచ్చిన ప్రతి నాయకుడూ పాత కార్మిక చట్టాలు అభివృద్ధికి అవరోధం అంటున్నారు. అయితే సంస్కరణల విషయంలో ముందడుగు వేయలేకపోయారు.

1999లో కార్మిక చట్టాల సవరణకు ఉద్దేశించిన రెండో నేషనల్ కమిషన్... వివిధ చట్టాలలో ఉన్న అసమతౌల్యాన్ని గుర్తించింది. ఒకే అంశానికి సంబంధించిన నిర్వచనాలు ఒక చట్టంలో ఒక రకంగా, ఇంకో చట్టంలో మరో రకంగా ఉండటాన్ని ప్రస్తావించింది. చివరకు పరిస్థితి ఎలా తయారైంది అంటే... 'కనీసం 20 శాతం నిబంధనలను విస్మరించకపోతే 100 శాతం కార్మిక చట్టాలను అమలు చేయటం కష్టం' అన్న అభిప్రాయం ప్రచారంలోకి వచ్చింది. దానికి తోడు మన కార్మిక విధానాల్లో సంక్లిష్టత; చైనా, వియత్నాం, బంగ్లాదేశ్‌లతో పోలిస్తే ఉండే తేడాలపైన చాలా కాలంగా చర్చ సాగుతోంది.

కోవిడ్ సమయంలో తగినంత ఉద్యోగ భద్రత లేక ఉపాధి కోల్పోయి వీధిన పడిన కుటుంబాలు కొత్త కార్మిక చట్టాలను స్వాగతిస్తున్నాయి. కార్మికులకు తప్పనిసరిగా అప్పాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వటం. అందరికీ సోషల్ సెక్యూరిటీ కవరేజ్ అంటే... పీఎఫ్, ఈఎస్‌ఐసీ, బీమా వంటి సౌకర్యాలు కల్పిస్తారనే అంశాన్ని ప్రశంసిస్తున్నాయి. 40 ఏళ్లకు పైనున్న వారికి ఏడాదికి ఒకసారి హెల్త్ చెకప్ చేయించాలనీ, యాజమాన్యాలు తమ వార్షిక ఆదాయంలో 1 నుంచి 2 శాతాన్ని సామాజిక భద్రత కవరేజ్‌కి వెచ్చించాలనీ ప్రభుత్వం నిబంధన విధించింది. అలాగే కార్మికులకు ఆధార్‌తో జత చేసిన యూనివర్సల్ అకౌంట్ నంబర్ ఇస్తారు. ఏ రాష్ట్రంలో ఉన్నా ... వారు ఒకే రకమైన ప్రయోజనాలను పొందగలుగుతారు. ఏడాది పాటు పనిచేసినా గ్రాట్యుటీ వంటి సౌకర్యాలను అందుకోగలుగుతారు. మహిళలు నైట్ షిఫ్ట్ ఉద్యోగాలు చేసే అవకాశం కల్పించారు. అందుకు అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

'సోషల్ సెక్యూరిటీ కోడ్'ను ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించింది. దాంతో కేంద్ర కార్మిక శాఖ 'ఈ–శ్రమ్' పోర్టల్‌లో 15 లక్షల మంది నమోదయ్యారు. మొత్తంగా 40 కోట్ల మంది దీని ద్వారా ప్రయోజనం పొందుతారని ప్రభుత్వం లెక్కలు చెబుతోంది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున చేపట్టిన సంస్కరణ మరేదీ లేదని ప్రధాని మోదీ చెప్పుకొచ్చారు. ఇది కార్మికుల్లో సాధికారతను పెంచటమే కాదు, నిబంధనలను సరళతరం చేసి 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను ప్రమోట్ చేస్తుందని అంటున్నారు. అయితే, దీని వెనక పెద్ద కుట్ర ఉందనీ, కార్మికుల చేత వారానికి 12 గంటలు పని చేయించాలనే ప్రణాళిక ఉందనీ ట్రేడ్ యూనియన్లు ఆరోపిస్తున్నాయి. ఈ సందర్భంగా ఇప్పటికే వారానికి 70 గంటలు పనిచేస్తే తప్ప ప్రపంచ దేశాలతో పోటీపడలేమని మేధావి వర్గం చెబుతూ వస్తున్న మాటలను ఉటంకిస్తున్నాయి.

– డా॥ పార్థసారథి చిరువోలు ၊ సీనియర్ జర్నలిస్ట్

డిఫెన్స్ సైన్స్‌లో దిట్ట

వైజ్ఞానిక వేగుచుక్కలు-32

తొలితరం మహిళా శాస్త్రవేత్తల్లో ఒకరు, తొలి ఇంజినీరింగ్ కాలేజీ లెక్చరర్, రాడార్ టెక్నాలజీ; డిఫెన్స్ సైన్స్; మైక్రోవేవ్ ఇంజినీరింగుల్లో నిష్ణాతురాలు డా॥ రాజేశ్వరీ ఛటర్జీ. ఆమె చదువుకోవడానికి పెద్దగా పోరాటం చేయవలసిన అవసరం రాలేదు. ఈ విషయాన్నే చెబుతూ 'నోట్లో బంగారు చెంచాతో పుట్టలేదు, కానీ చేతిలో పుస్తకంతో పుట్టాన'ని రాసుకున్నారు.

1922 ఫిబ్రవరి 24న మైసూర్‌లో జన్మించిన రాజేశ్వరి 1943లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్‌తో ఎమ్మెస్సీ పట్టాను మైసూర్ యూనివర్సిటీ నుంచి పొందారు. తర్వాత బెంగళూరులోని టాటా ఇనిస్టిట్యూట్ (నేటి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్) ఎలక్ట్రికల్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఎస్.పి. చక్రవర్తి దగ్గర రిసెర్చ్ స్టూడెంట్‌గా చేరారు. 1946లో యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్‌కు వెళ్లారు. నిజానికి ఆ కాలంలో అవివాహిత అయిన యువతి విదేశాలకు వెళ్లాలనుకోవడం, వెళ్లడం చిన్న విషయాలు కాదు. మొదట ఇంజినీరింగ్‌లో 1949లో మాస్టర్స్ డిగ్రీ పొంది, ఆ తర్వాత అమెరికాలోని ప్రొఫెసర్ విలియమ్స్ జి. డౌ వద్ద పీహెచ్‌డీ పూర్తి చేశారు.

డా॥ రాజేశ్వరీ ఛటర్జీ

1953లో భారతదేశం తిరిగి వచ్చిన తర్వాత ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చేరి మరింత ముమ్మరంగా పరిశోధనలు ప్రారంభించారు. అదే ఏడాది తన విభాగంలో పనిచేస్తున్న శిశిర్ కుమార్ ఛటర్జీని కుటుంబ ఆమోదంతో వివాహం చేసుకున్నారు. ఈ భార్యాభర్తలిద్దరూ ఎంతో అన్యోన్యంగా మైక్రోవేవ్ ప్రయోగశాలను వృద్ధి చేయడమే కాకుండా, ఎక్కువ కాలం లైబ్రరీలోనో, ల్యాబ్‌లోనో గడుపుతూ ఉండేవారు. కనుకనే వారిద్దరూ ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ థియరీ, ఎలక్ట్రాన్ ట్యూబ్ సర్క్యూట్స్, మైక్రోవేవ్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్, రేడియో ఇంజినీరింగ్‌కు సంబంధించి కోర్సులు ప్రారంభించారు. మరెన్నో పుస్తకాలు ప్రచురించారు. రాజేశ్వరీ ఛటర్జీ ఎయిర్ క్రాఫ్ట్స్, స్పేస్ క్రాఫ్ట్స్‌కు సంబంధించిన యాంటెన్నాల పరిశోధనకు పేరుగాంచారు. తన భర్త 1994లో కాలం చేసినా... రాజేశ్వరి పరిశోధనలను కొనసాగిస్తూ, పుస్తకాలు రచిస్తూ సాగిపోయారు. నేటికీ రాడార్ టెక్నాలజీలో, ఇంకా రక్షణ సంబంధమైన అనువర్తనాలలో రాజేశ్వరి కృషి వినియోగించబడుతోంది.

ఐఐఎస్సీ నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత స్త్రీలకు భరోసాను, చేయూతను కలిగించే సామాజిక కార్యక్రమాల్లో 'ఇండియన్ అసోసియేషన్ ఫర్ ఉమెన్స్ స్టడీస్' అనే సంస్థ ద్వారా పాల్గొనేవారు. 'ఎ థౌజెండ్ స్ట్రీమ్స్: ఎ పర్సనల్ హిస్టరీ' అనే స్వీయ చరిత్ర రాసుకున్న ఆమె 2010 సెప్టెంబర్ 3న కన్నుమూశారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ ၊ ఆకాశవాణి విశ్రాంత ఉన్నతాధికారి

మనవాళ్లే 'స్టెమ్స్'

డేటా సాయింట్

అమెరికాలో 2024-25లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) కోర్సులు చదువుతున్న వారిలో అత్యధిక విదేశీయులు భారతీయులే.

	దేశాల వారీగా మొత్తం విద్యార్థుల సంఖ్య	స్టెమ్ విద్యార్థుల శాతం
భారత్	3,63,019	74.3%
చైనా	2,65,919	53.4%
దక్షిణ కొరియా	42,293	44.5%
కెనడా	29,903	38.6%
వియత్నాం	25,584	47.5%

ఆధారం: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్

మంచివాడి నైజం

దత్తబోధ

శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

తన భార్య సువర్చల ఆశ్రమంలో లేని సమయంలో దేవతలు శక్తిమంతమైన ఆయుధాలు తయారుచేసుకోవడానికి తన ఎముకలను ఇవ్వడానికి ప్రాణత్యాగం చేశాడు దధీచి మహర్షి. ఆశ్రమానికి తిరిగివచ్చిన సువర్చల భర్త అవశేషాలు చూసి దుఃఖంతో సహగమనం చేయడానికి సిద్ధమవుతుంది. ఇంతలో ఆకాశవాణి 'సువర్చలా! ప్రాణత్యాగానికి ఒడిగట్టవద్దు. నీవు వట్టిదానవు కూడా కాదు. నీ గర్భంలో పెరిగే పిల్లవాడిని తల్లిగా నీవు రక్షించుకోవాలి' అంటుంది. అందువల్ల సువర్చల యోగశక్తితో తన గర్భస్థ పిండాన్ని బయటకు రప్పించింది. అక్కడ ఉన్న పిప్పల వృక్షాలకు (రావిచెట్ల) దాన్ని అప్పగించి రక్షించవలసిందిగా ప్రార్థించింది. వెనువెంటనే సంకల్పసిద్ధితో ప్రాణాలు వదిలి దివ్యలోకం చేరి తన భర్త దధీచిని చేరుకొన్నది.

సువర్చల ఇచ్చిన పిండాన్ని పిప్పల వృక్షాలు మిక్కిలి జాగ్రత్తగా కాపాడినాయి. అందువల్ల ఆ బిడ్డకు 'పిప్పలాదుడు' అనే పేరు సార్థకమైంది. ఒకరోజు ఇంద్రుడు పిల్లవానికి జరిగిన కథంతా చెప్పాడు. దీంతో తన తల్లిదండ్రుల మరణానికి కారకులైన దేవతలను తుదముట్టించే శక్తి కోసం శివుణ్ణి మెప్పించే విధంగా తపస్సు చేశాడు బాలుడు. ప్రత్యక్షమైన శివుడు బాలుడైన పిప్పలాదుని కోరిక విని మృదు మధుర వాక్కులతో బుజ్జగిస్తూ శాంతపరిచాడు. బాలకుడైన పిప్పలాదునికి తోడుగా ఉండటానికై ఒక భూతాన్ని ఇచ్చాడు. సత్ప్రవర్తనతో మెలగుతూ లోకానికెప్పుడూ మేలు చేయటం మంచి మనిషి ధర్మమని శివుడా బాలునికి బోధించాడు. బాలుని కోరికను మన్నించి అతని తల్లిదండ్రులయిన సువర్చలా దధీచులను చూపించాడు. తల్లిదండ్రుల దర్శన భాగ్యం కలిగినందుకు పొంగిపోయాడు పిప్పలాదుడు. శివుని ఆదేశం మేరకు భూతాన్ని పడవలా మార్చి సముద్రం పైకి వెళ్లమని ఆదేశించాడు పిప్పలాదుడు. పిప్పలాదుని అనుమతితో దేవతలు పడవ రూపంలో ఉన్న ఆ భూతాన్ని ద్రవరూపంలోకి మార్చి ప్రపంచంలోని అన్ని నదుల్లోను, సముద్రాల్లోను కొంచెం కొంచెం కలిపేశారు. 'ద్రవరూపంలో ఉన్న ఈ భూతం సముద్రంలోనూ, నదుల్లోనూ స్నానం చేసేవారి పాపాలను తినుగాక' అని అనుగ్రహపూర్వకంగా శివుడు ఆశీర్వదించాడు.

ఆశలు కకావికలం

బాబు పాలనలో దివ్యాంగులకు పెన్షన్ టెన్షన్

- పింఛన్లకు కోత పెట్టేందుకు రీ-వెరిఫికేషన్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వైకల్య ధ్రువీకరణ పత్రాల జారీకి చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వం
- మొక్కుబడిగా సదరం స్క్రీనింగ్ క్యాంప్‌లు
- స్లాట్ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల డిమాండ్
- బాబు సర్కారు నిర్వాకంతో దివ్యాంగుల దోపిడీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వానికి దివ్యాంగులపై కనీస కనికరం కూడా లేదు. వారి పింఛన్లకు కోత పెట్టి వారి బతుకులను కకావికలం చేయడానికి రీ వెరిఫికేషన్ పేరుతో నానా అగచాట్లకు గురిచేస్తోంది. అరకొర సదరం శిబిరాలతో ముప్పుతిప్పలు పెడుతోంది. ఫలితంగా వైకల్య ధ్రువీకరణ కోసం సదరం స్లాట్ పొందేందుకు దివ్యాంగులు, వివిధ జబ్బులతో బాధపడుతున్న వారు అవస్థలు పడుతున్నారు. సామాజిక భద్రతా పింఛన్లలో కోత పెట్టేందుకు బాబు సర్కారు రీ-వెరిఫికేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో గతేడాది నుంచి వైద్య శాఖ సదరం రీ-వెరిఫికేషన్‌ నిర్వహిస్తోంది. కొత్తగా వైకల్య ధ్రువీకరణ కోసం వారంలో ఒకరోజు మాత్రమే సదరం క్యాంపులను మొక్కుబడిగా నిర్వహిస్తుండటంతో సదరం స్లాట్‌లకు భారీ డిమాండ్ ఉంటోంది. ఇటీవల నవంబర్, డిసెంబర్ నెలలకు కలిపి 30 వేల స్లాట్‌లను ఈ నెల 14న వైద్య శాఖ విడుదల చేసింది. స్లాట్‌లన్నీ రెండు రోజుల్లోనే బుక్ అయిపోయాయి. మరో 13 వేల మంది వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. స్లాట్‌లకు ఉన్న డిమాండ్‌ను ఆసరా చేసుకుని కొందరు మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు, దళారులు దివ్యాంగులను దోపిడీ చేస్తున్నారు.

సదరంపై నీలినీడలు

2019కి ముందు వరకు చంద్రబాబు పాలనలో కేవలం 56 ఆస్పత్రుల్లోనే సదరం స్క్రీనింగ్స్ నిర్వహించేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సదరం సర్టిఫికెట్లు పొందడానికి దివ్యాంగులు పడుతున్న అవస్థలను దృష్టిలో పెట్టుకుని అదనంగా మరో 117 ఆస్పత్రులను కలిపి 173 చోట్ల సదరం క్యాంపులు ప్రారంభించారు. రాష్ట్రంలో ఏ ఆస్పత్రిలోనైనా స్లాట్ బుక్ చేసుకుని అసెస్‌మెంట్‌కు హాజరయ్యే అవకాశం కల్పించారు. దీంతో అంతకుముందు టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే వైకల్య ధ్రువీకరణ ప్రక్రియ ఎంతో సులభతరం అయింది. గత ఏడాది చంద్రబాబు మరోసారి అధికారంలోకి రావడంతో దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నాయి. గతేడాది జూన్‌లో ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే పింఛన్ల ఏరివేతే లక్ష్యంగా రీ-వెరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి కొత్త సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. దివ్యాంగుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో మొక్కుబడిగా స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభించారు. వారంలో ఒకరోజు (ఏపీవీవీపీ/ బోధనాసుపత్రుల్లో ఒక్కో రోజు) మాత్రమే సదరం క్యాంపులను నిర్వహిస్తున్నారు. గతంలో నిర్వహించిన ఆస్పత్రుల్లో సైతం 173 నుంచి 118కి కుదించారు. అటు స్లాట్‌లు, ఇటు ఆస్పత్రుల సంఖ్య కూడా తగ్గడంతో ఒక్కసారిగా డిమాండ్ ఎక్కువైంది.

రూ.10 వేలు ఇవ్వాల్సిందే

ప్రభుత్వం విడుదల చేస్తున్న కొద్దిపాటి స్లాట్‌లను కొందరు మీ-సేవ నిర్వాహకులు గంటల్లోనే బ్లాక్ చేసేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పక్క జిల్లాల్లో స్లాట్లు బుక్ చేసి, అనంతరం దివ్యాంగుల సొంత జిల్లాలకు స్లాట్ ట్రాన్స్‌ఫర్ రూపంలో పెద్దఎత్తున దందా నడుస్తోంది. ఇలా దివ్యాంగుల నుంచి మీ-సేవ నిర్వాహకులు, దళారులు రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. అనంతపురం, కర్నూలు, తిరుపతి, గుంటూరు, కృష్ణా ఇలా రాష్ట్రంలో ప్రతిచోటా దళారుల దోపిడీ కొనసాగుతోంది. దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దంటూ ప్రభుత్వం ప్రకటనలతోనే సరిపెడుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులు, క్యాంపులు పెంచితేనే దోపిడీకి అడ్డుకట్టపడుతుందని దివ్యాంగులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబర్‌లో తిరుమలలో విశేష పర్వదినాలు

తిరుమల: శ్రీవారికి డిసెంబర్‌లో నిర్వహించే విశేష పర్వదినాల వివరాలను టీటీడీ ప్రజా సంబంధాల విభాగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 2న చక్రతీర్థ ముక్కోటి, 4న శ్రీవారి ఆలయంలో కార్తీక పర్వ దీపోత్సవం, తిరుమంగైయాళ్వార్ శాత్తుమొర, 5న తిరుప్పాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 16న ధనుర్మాసారంభం, 19న తొండరడిప్పొడియాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, అధ్యయనోత్సవాలు ప్రారంభం, 29న శ్రీవారి ఆలయంలో చిన్న శాత్తుమొర, 30న వైకుంఠ ఏకాదశి, వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం, శ్రీవారి స్వర్ణ రథోత్సవం, 31న వైకుంఠ ద్వాదశి, శ్రీవారి చక్రస్నానం నిర్వహించనున్నారు.

టీటీడీకి రూ.9 కోట్ల విరాళం

తిరుమల: అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు మంతెన రామలింగరాజు తన కుమార్తె, అల్లుడు పేరు మీద తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాల ఆధునీకీకరణ కోసం టీటీడీకి బుధవారం రూ.9 కోట్లు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అభినందించారు.

సీఐడీ కోర్టులో సాక్ష్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యేలు

మాజీ ఎమ్మెల్యేలు రామ్‌భూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, అంబటి రాంబాబు

గుంటూరు లీగల్: వైఎస్సార్‌సీపీ ప్రతిష్టను దిగజార్చే విధంగా సోషల్ మీడియాలో 2021 జనవరి 29న పోస్టులు పెట్టిన వారిపై మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యం చెప్పేందుకు అప్పటి బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అప్పటి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రామ్‌భూపాల్‌రెడ్డి బుధవారం గుంటూరు జిల్లా సీఐడీ కోర్టుకు హాజరయ్యారు.

23 మందికి అస్వస్థత

పొన్నూరు: ఓ శుభ కార్యానికి వెళ్లి కలుషిత ఆహారం తిన్న 23 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు లోనయ్యారు. పాండ్రుపాడు వైద్యాధికారి శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం 26 వార్డుకు చెందిన కొందరు మంగళవారం స్థానికంగా జరిగిన ఓ శుభ కార్యానికి వెళ్లి అక్కడ వడ్డించిన ప్రసాదం తీసుకున్నారు. వారిలో 23 మంది వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురయ్యారు. కొంతమందిలో డయేరియా లక్షణాలు కనిపించాయి. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. కొంతమందికి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కళత్తూరుని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
ముంపు బాధితులకు సొంత నిధులతో 650 ఫ్యాన్లు పంపిణీ

కళత్తూరులో పర్యటిస్తున్న పెద్దిరెడ్డి, ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తదితరులు

వరదయ్యపాళెం: తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలంలో ముంపునకు గురైన కళత్తూరు దళితవాడ, పాతపాళెం గ్రామాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. మండలంలోని రాయల చెరువుకు ఇటీవల కట్ట తెగిపోవడంతో ఒక్కసారిగా పోటెత్తిన నీటి ప్రవాహానికి కళత్తూరు దళితవాడ, పాతపాళెం గ్రామాలు ముంపునకు గురై తీవ్ర నష్టం జరిగింది. దీనిపై స్పందించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలిసి కళత్తూరు, దళితవాడను సందర్శించారు. తన సొంత నిధులతో కళత్తూరు దళితవాడ, పాతపాళెం గ్రామస్తులకు 650 సీలింగ్ ఫ్యాన్లను ప్రతి కుటుంబానికి ఒక్కొక్కటి చొప్పున పంపిణీ చేశారు. అనంతరం పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. రెండు గ్రామాలకు జరిగిన నష్టంపై చంద్రబాబు ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో తెలియని పరిస్థితి అన్నారు. గ్రామస్తులెవరూ అధైర్యపడొద్దని, మరో మూడేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు కళత్తూరుని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. కాలనీకి సంబంధించి వివాదంలో ఉన్న అటవీ భూముల సమస్యను సైతం పరిష్కరిస్తామన్నారు. 1,000 ఇళ్లతో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా చేపడతామని చెప్పారు.

బాబు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం..

ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ విపత్తు జరిగిన గంటల వ్యవధిలోనే వైఎస్సార్‌సీపీ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొన్నాయని, వారి స్ఫూర్తితో తాను సైతం తక్షణ సహాయంగా ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. పూర్తిస్థాయి నష్ట నివారణకు మరో రూ.కోటి ఎంపీ నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. నీటి ప్రవాహానికి మృతి చెందిన పశువులకు, దెబ్బ తిన్న పంట పొలాలకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించే విధంగా చంద్రబాబు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ తదితరులు ఉన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అనంతరం జస్టిస్ గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని కూడా దర్శించుకున్నారు.

– తిరుమల/కాణిపాకం

బచావత్ ట్రిబ్యునల్

కేటాయింపులు కొనసాగించాలి

వందేళ్లుగా ఏపీ వాడుకుంటున్న జలాలను తెలంగాణ తమవిగా ఎలా చెబుతుంది?
బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఏపీ ప్రభుత్వ న్యాయవాది జైదీప్ గుప్తా వాదన
నేడూ తుది వాదనలు కొనసాగించనున్న ఏపీ

సాక్షి, అమరావతి: కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు ప్రాజెక్టుల వారీగా బచావత్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–1) నిర్దిష్టంగా కేటాయించిందని.. ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులకు అప్పట్లోనే కేటాయింపులు చేసిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా నివేదించారు. ఆ కేటాయింపుల ఆధారంగానే రెండు రాష్ట్రాలు కృష్ణా జలాలను వినియోగించుకుంటున్నాయని గుర్తు చేశారు. వందేళ్లుగా ఆంధ్రప్రదేశ్ వినియోగిస్తున్న కృష్ణా జలాలను.. తెలంగాణ ఇప్పుడు తమ జలాలుగా ఎలా చెబుతుందని ప్రశ్నించారు. హైదరాబాద్ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ నుంచి పెట్టిన పెట్టుబడులన్నీ తెలంగాణకు వెళ్లాయన్నారు. దేశంలో రెండు అతి పెద్ద నదులు తెలంగాణ రాష్ట్రం మీదుగా ప్రవహిస్తున్నాయని.. అతి పెద్ద వృద్ధి కేంద్రాలలో ఒకటి తెలంగాణలోనే ఉందని, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రమని వివరించారు. బేసిన్ వెలుపల ఉన్న ప్రాజెక్టులకు కేటాయించినకృష్ణా జలాలను రద్దు చేయాలంటూ ఇప్పుడు తెలంగాణ సంకుచితంగా వాదిస్తోందని.. ఇది ఆంధ్రప్రదేశ్‌ను తీవ్రంగా దెబ్బతీయడమేనన్నారు. తడి నుంచి ఆరు తడి పంటలకు మార్చాలని సూచించడం.. బేసిన్ వెలుపలకు తరలిస్తున్న నీటిని తమకే కేటాయించాలని తెలంగాణ వాదిస్తోందని.. తద్వారా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలనుకుంటోందని పేర్కొన్నారు. ఈమేరకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా బుధవారం వాదనలు కొనసాగించారు. ప్రాజెక్టులను ఆధునీకరించడం ద్వారా మిగిలిన నీటిని ఇప్పటికే తెలంగాణలోని బీమా లాంటి ప్రాజెక్టులకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేటాయించిందని గుర్తు చేశారు.

మిగులు జలాలపై ఏపీకే హక్కులు...!

కృష్ణా జలాల పంపిణీకి విభజన చట్టం సెక్షన్–89లో నిర్దేశించిన విధి విధానాలు.. కేంద్రం జారీ చేసిన అదనపు విధి విధానాల మధ్య వ్యత్యాసాన్ని జైదీప్ గుప్తా ట్రిబ్యునల్‌కు నివేదించారు. విభజన చట్టాన్ని పార్లమెంటు ఆమోదించిందని.. ఆ చట్టంలోని సెక్షన్–89 ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా కేటాయించిన జలాలను యథాతథంగా కొనసాగించాలని.. నీటి కేటాయింపులు లేని ప్రాజెక్టులకు కేటాయింపులు చేయడంపై తొలుత విచారణ చేయాలన్నారు. ఆ తర్వాత విభజన చట్టం సెక్షన్–89కు అనుగుణంగా కేంద్రం జారీ చేసిన అదనపు విధి విధానాల ప్రకారం నీటి కేటాయింపులు చేయాలని వాదించారు. ప్రాజెక్టులలో ఏదైనా మిగులు జలాలు ఉన్నట్లుగా ట్రిబ్యునల్ గుర్తిస్తే.. వాటిని రెండు రాష్ట్రాల్లో నిర్మాణంలో ఉన్న, కొత్త ప్రాజెక్టులకు కేటాయించవచ్చని సూచించారు. విభజన చట్టం 11వ షెడ్యూలులో ఉన్న ప్రాజెక్టులకు నీటిని ముందుగా కేటాయించాలని.. ఆ తర్వాత నీటి లభ్యత ఉందని తేలితే కొత్త ప్రాజెక్టులకు పంపిణీ చేయాలని కోరారు. కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి 2015 జూన్ 18–19న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అంగీకరించిన విధానానికే కట్టుబడాలని.. ఆ మేరకే కేటాయింపులు చేయాలని జైదీప్ గుప్తా వాదించారు. కేడబ్ల్యూడీటీ–2 తుది నివేదికను అమలు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశాకే ఆ ట్రిబ్యునల్ కేటాయింపులు అమల్లోకి వస్తాయన్నారు. ప్రస్తుతం బచావత్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లో ఉన్న నేపథ్యంలో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు మిగులు జలాలను వినియోగించుకునే స్వేచ్ఛను ఇవ్వాలని కోరారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో గురువారం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా తుది వాదనలు కొనసాగించనున్నారు.

చిన్న తిరుపతిలో మరో గోవు మృతి

సెప్టిక్ ట్యాంక్‌లో పడి మృత్యువాత • దేవస్థానం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం
రెండు గోవుల మృతి మరువక ముందే మరో ఘటన • ఆందోళన చెందుతున్న భక్తులు

సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందిన గోవు

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చినవెంకన్న కొండపై బుధవారం ఉదయం దేవస్థానానికి చెందిన గిర్ జాతి గోవు సెప్టిక్ ట్యాంకులో పడి మృత్యువాత పడింది. సప్తగోకులం వద్ద ఇటీవల రెండు గోవులు ప్రమాదవశాత్తూ మృతిగా, ఇప్పుడు మరో గోవు చనిపోవడం భక్తులను తీవ్రంగా కలచివేస్తోంది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే గోవుల వరుస మరణాలకు కారణమని.. అయినా ఎలాంటి చర్యల్లేవని భక్తులు మండిపడుతున్నారు. వివరాలివీ.. శ్రీవారి గోసంరక్షణ శాలలోని సుమారు 25 ఆవులను మేత, ఆరోగ్యం నిమిత్తం ప్రతీరోజూ వాకింగ్ ట్రాక్‌లో వదులుతారు. రోజులానే బుధవారం ఉ.11.30 గంటల సమయంలో ట్రాక్‌లో ఆవులను విడిచిపెట్టారు. అందులో గిర్ జాతికి చెందిన ఒక ఆవు ట్రాక్ చివరన ఉన్న సెప్టిక్ ట్యాంక్ మూతపై కాలేయడంతో, బరువుకి ట్యాంకు మూతతో పాటు, ఆవు కూడా ట్యాంకులో పడింది. ఊపిరాడక కొట్టుమిట్టాడుతున్న ఆవును చూసిన భక్తుల పిల్లలు గోశాల సిబ్బందికి విషయాన్ని తెలియజేశారు. అయితే, వారు వచ్చి ఆవును బయటకు తీసేసరికే అది మృతిచెందింది. దీంతో సిబ్బంది ట్రాక్టర్‌లో తీసుకెళ్లి దానిని ఖననం చేశారు.

శిథిలమైనా నిర్లక్ష్యమే..

ఆవు మృతిచెందడానికి కారణమైన మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకు శిథిలమైనట్లు స్పష్టంగా కనిపిస్తోంది. గోవు పడిన ట్యాంకు పక్కనే ఉన్న మరో ట్యాంకు మూత కూడా ధ్వంసమై, ప్రమాదకరంగా ఉంది. వీటిని చూస్తే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సెప్టిక్ ట్యాంకులపై కాంక్రీటు మూతలు వేయడం, వాటి చుట్టూ ఫెన్సింగ్ వంటివి ఏర్పాటుచేసి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని భక్తులు అంటున్నారు. ఇది ముమ్మాటికీ మానవ తప్పిదమేనని మండిపడుతున్నారు. మరోవైపు.. గతనెల 30న సప్తగోకులం వెనుక అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన రెండు ఆవులు విద్యుత్ షాక్‌వల్ల మృతిచెంది ఉండొచ్చని పశు వైద్యాధికారులు తమ పోస్టుమార్టం నివేదికలో పేర్కొన్నారు. గోమాతలు ఇలా వరుసగా మృతిచెందుతున్నందున శాంతిపూజలు నిర్వహిస్తే మంచిదని పండితులు సూచిస్తున్నారు.

కార్పొరేట్ అనుకూల చట్టాలు రద్దు చేయాలి

రైతు నేత, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా చట్టాలు రూపొందించిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై రైతు, కార్మిక సంఘాలు ధ్వజమెత్తాయి. దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా విజయవాడ ధర్నా చౌక్‌లో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన జరిగింది. తొలుత కార్మిక సంఘాలు, రైతు సంఘాల నేతలు విజయవాడలోని ఏలూరు లాకుల సెంటర్ నుంచి ధర్నా చౌక్ వరకు ప్రదర్శన చేశారు. అనంతరం ధర్నా చౌక్‌లో జరిగిన సభలో ఏపీ ఎస్‌కేఎం కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోని చట్టాలను అమలు చేయబోమని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, వాటిని దొడ్డిన దారిన అమలు చేస్తోందన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతుల పోరాటం జరిగి నేటికి ఐదేళ్లు పూర్తయిందని గుర్తు చేశారు. రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను, చట్టాలను కాపాడాలని ఈ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. ఏడాది పాటు జరిగిన రైతాంగ పోరాటం ఫలితంగా నాలుగు నల్ల చట్టాలను రద్దు చేశారని గుర్తు చేశారు. ఒక పార్లమెంటులో ఆమోదించిన బిల్లును, తిరిగి రద్దు చేయించిన చారిత్రాత్మక పోరాటం ఒక్క రైతు ఉద్యమానికే దక్కిందని పేర్కొన్నారు. ఏడాదికి ఐదు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలే కారణమని విమర్శించారు. జమీందార్లకు వ్యతిరేకంగా రైతాంగం చేసిన పోరాటం ఫలితంగా భూమి పంపిణీ జరిగితే, నేటి ప్రభుత్వాలు రైతుల భూమి, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నాయని చంద్రబాబు సర్కారు, కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ నూతన విత్తన చట్టం ముసాయిదాన్ని ప్రవేశపెట్టిందని, నూతన మార్కెట్ విధానం కూడా అమలు చేస్తుందని, ఈ విధానాలు రైతుల పాలిట ఉరితాళ్లుగా ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ నేత దారుణ హత్య

గొంతుకోసి హత్య చేసిన దుండగులు
సొంత పార్టీ నేతలతో భూవివాదాల నేపథ్యంలో హత్య?

జలదంకి (కలిగిరి): శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాళెంలో టీడీపీ నేత గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు (55) బుధవారం తన కోళ్ల ఫారంలోనే దారుణ హత్యకు గురయ్యారు. సొంత పార్టీ నేతలతో ఉన్న భూ వివాదం నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు అనుమానిస్తున్నారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. ప్రసాద్‌నాయుడు కుటుంబం చెన్నైలో ఉంటోంది. ఆయన స్థానికంగా నాటు కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకుని ఇక్కడే ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో కలిసి ఉండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి ఐదు కేజీల నాటు కోళ్లు కావాలని అడిగి మళ్లీ వస్తామని వెళ్లిపోయారు. ఆయన తన వద్ద ఉన్న ఇద్దరిని కోళ్లకు మేత తీసుకురమ్మని బయటకు పంపాడు. వాళ్లు మేత, వరి పొట్టు తీసుకుని ఉదయం 11.30 గంటలకు ఫారం వద్దకు వచ్చే సరికి కోళ్ల ఫారంలో ప్రసాద్‌నాయుడి గొంతు కోసి హత్య చేసి గోతం పట్టాలు కప్పి ఉండటం గమనించి గ్రామస్తులు, బంధువులకు సమాచారమిచ్చారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్సై లతీఫున్నీసా, కావలి డీఎస్పీ శ్రీధర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గ్రామస్తులు, బంధువులను విచారించారు. డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ హత్యలో ఎటువంటి రాజకీయ కోణం లేదన్నారు. మృతుడికి ఆర్థిక సమస్యలు, లావాదేవీల సమస్యలూ లేవని తెలిపారు. కాగా, ప్రసాద్‌నాయుడుకు గతంలో ఉన్న వివాదాల నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉండవచ్చునని మృతుడి బంధువులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల బెదిరింపులు కూడా వచ్చాయని కుటుంబసభ్యులు చెబుతున్నారు.

అప్పుల బాధ తాళలేక ఇద్దరు రైతుల ఆత్మహత్య

నారాయణస్వామి, రమణయ్య(ఫైల్)

ఉరవకొండ/ఉరవకొండ రూరల్/త్రిపురాంతకం: అప్పుల బాధ తాళలేక రెండు వేర్వేరు జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం పెద్దముస్టూరులో అప్పుల బాధ తాళలేక కౌలు రైతు తలారి నారాయణస్వామి (40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... తలారి నారాయణస్వామి అదే గ్రామంలో ఓ వ్యక్తికి చెందిన ఆరు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని రెండేళ్లుగా మిర్చి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాడు. దీంతో పాటు పొలం యజమానికి ఎకరాకు రూ.40 వేల చొప్పున కౌలు చెల్లించాడు. ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్లో మిర్చికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో పెట్టుబడులు కూడారాలేదు. పంట కోసం బయటి వ్యక్తులతో పాటు బంగారం కుదువపెట్టి రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి..దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య వన్నమ్మతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రకాశంలో జిల్లాలో: అప్పుల బాధతో మరో అన్నదాత నేలకొరిగాడు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో ప్రకాశం జిల్లాలోని త్రిపురాంతకం మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఓబులురెడ్డి రమణయ్య (50) బుధవారం తన పంట పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు ఓబులురెడ్డి రమణయ్య తనకున్న నాలుగు ఎకరాల పొలంతో పాటు, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వివిధ రకాల పంటలు సాగుచేశాడు. రెండెకరాల్లో మిర్చి, మరో రెండు ఎకరాల్లో బొప్పాయి, మిగిలిన మూడు ఎకరాల్లో వరి సాగుచేస్తున్నాడు. సుమారు రూ.20 లక్షల వరకూ రైతులు, ఎరువుల దుకాణాల వద్ద అప్పులు చేశాడు. అలాగే బ్యాంకు, సొసైటీ బ్యాంకులో మరో రూ.4 లక్షల వరకు అప్పు తెచ్చినట్టు రమణయ్య బంధువులు తెలిపారు. పంటలు దెబ్బతినడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు వాపోయారు. గత ఏడాది మిర్చి ధరలు పూర్తిగా పడిపోవడంతో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు పూర్తిగా నష్టపోయారు. రమణయ్యకు భార్య తిరుపతమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఘటన స్థలాన్ని ఎస్‌ఐ శివ బసవరాజు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన కుమార్తె పెళ్లి.. తండ్రి ఆత్మహత్య

శ్రీనివాస్

పీఎం పాలెం: కుమార్తె వివాహం ఆగిపోయిందన్న వేదనతో గుండె పగిలిన ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. విశాఖకు చెందిన ర్యాలి శ్రీనివాసరావు (57) వ్యాపారవేత్త. హైదరాబాద్‌లో ఉంటున్నాడు. తరచూ నగరానికి రాకపోకలు సాగిస్తుంటాడు. అతనికి భార్య, కూతురు లక్ష్మీప్రఫుల్ల, కొడుకు అనదీప్ ఉన్నారు. ఎంబీబీఎస్ చదువుతున్న కుమార్తెకు నగరానికి చెందిన బి.శ్రీనివాసరావుతో నిశ్చితార్థం జరిగింది. మంగళవారం వివాహం జరగాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల పెళ్లి ఆగిపోయింది. దీంతో శ్రీనివాసరావు తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. మంగళవారం పీఎం పాలెం బస్టాప్ ఏరియాలో ఉంటున్న తన తల్లి సత్యవతిని చూసేందుకు కారులో వెళ్లాడు. బుధవారం క్రికెట్ స్టేడియం గ్రౌండ్ వద్ద కారు పక్కకు నిలిపి తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం. 107 నుండి 114/2025-26 తేది : 21.11.2025
పల్నాడు జిల్లా పరిధిలోని 15 ఆర్థిక సంఘం టైడ్ గ్రాంట్ నందు మంజూరు కాబడిన 8 పనులకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు పిలువటమైనది. అంచనా విలువ : రూ. 115.00 లక్షలు. టెండర్లు ది. 01.12.2025 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ నందు చూడగలరు. ఇతర వివరాలను www.eprocurement.gov.in లో చూడగలరు.
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, గ్రా.నీ.స. మరియు పారిశుద్ధ్య విభాగము, నరసరావుపేట
DIPR RO No. 18163/CL/Advt/1/1/2021-22, Dt : 26.11.2025

తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి
మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
తి.తి.దేవస్థానములు, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌కు ఇ-టెండర్ల ద్వారా (1) దేశవ్యాప్త డెయిరీల నుండి 10,00,000కి.గ్రా. ఆవు నెయ్యి, (2) యాలకులు (ఇలాచీ) 8MM 90,000 కి.గ్రా.లు సరఫరా కొరకు ఇ-టెండర్లు కోరబడుతున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కొరకు వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in కు లాగాన్ అవ్వండి. తదుపరి వివరాల కొరకు సంప్రదించు ఫోన్ నంబర్లు : 0877-2264079, 2264555, ఫ్యాక్స్ నం. 0877-2264554.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.302), Dt: 26.11.2025 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED
54-15-1, Vijayawada, NTR Dist, Andhra Pradesh-520008.
Email: ccdmc.amaravati@gmail.com
Website: https://adcl.in/ CIN Number: U93000AP2015SGC105535
E-procurement -Short Tender Notice No. 07/CE/ADC/Engg/2025-26, Dated. 26.11.2025
1. Shifting and erection of 11 KV and LT 3-Phase overhead lines and distribution transformers along E3 Phase-2 and N5 Roads including dismantling of existing lines and poles obstructing road development works in Amaravati Capital City - Estimate Cost- Rs.63.00 lakhs
2. Shifting and erection of 11 KV and LT 3-Phase overhead lines and distribution transformers along E10,E11 and E15 extension Roads including dismantling of existing lines and poles obstructing road development works in Amaravati Capital City - Estimated Cost-66.00 Lakhs
3. Shifting and erection of 33 KV, 11 KV and LT 3-Phase overhead lines and distribution transformers along N3B,N4 and N9 Roads including dismantling of existing lines and poles obstructing road development works in Amaravati Capital City - Estimate Cost- Rs.52.00 lakhs
The bids can be downloaded on "ap-eprocurement" portal @ tender.apeprocurement.gov.in from 28.11.2025 to 05.12.2025 and due date for submission of Bids on 05.12.2025 bid opening on 05.12.2025. For any further clarifications, contact Sri. V.Padmakara Prasad, Executive Engineer, ADCL, Vijayawada, Ph.No: 8977758384
Sd/- Chairperson and Managing Director, ADCL, Vijayawada

మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్నికీలల్లో ఆకాశహర్మ్యాలు

బుగ్గిపాలైన బతుకులు
- 36 మంది దుర్మరణం
- పలువురికి గాయాలు
- 280 మంది జాడ గల్లంతు!
- హాంకాంగ్‌ను కుదిపేసిన అగ్నిప్రమాదం

హాంకాంగ్: వందల జనావాసాలు, చిన్నారుల ఆటపాటలతో ఎప్పుడూ కిటకిటలాడే హాంకాంగ్‌లోని 'వాంగ్ ఫుక్ కోర్ట్' ఆకాశహర్మ్యాలు బుధవారం ఒక్కసారిగా జనం హాహాకారాలతో మృత్యుభవనాలుగా మారాయి. అగ్నికీలలు బహుళ అంతస్తుల భవన సముదాయాలను చుట్టుముట్టడంతో జనం ప్రాణభయంతో పరుగులుతీశారు. అప్పటికే వ్యాపించిన మంటలకు 36 మంది సజీవదహనమయ్యారు. మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించిన 37 ఏళ్ల ఒక అగ్నిమాపకదళ సభ్యుడు హోవాయ్‌హోహీ సైతం కాలినగాయాలతో ప్రాణాలు కోల్పోయారు. 280 మంది జాడ గల్లంతైంది. పెద్ద సంఖ్యలో జనం ఇంకా ఆ భారీ భవనాల్లో చిక్కుకుపోయారన్న వార్త ఇప్పుడు వాళ్ల బంధువుల్లో భయాందోళనల్ని పెంచుతోంది. కేవలం 30 మంది గాయపడ్డారని ప్రభుత్వం చెబుతున్నా పెద్దసంఖ్యలో జనం కాలినగాయాలతో స్థానిక ఆస్పత్రుల్లో చేరారని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ హౌసింగ్ కాంప్లెక్స్‌లో దాదాపు ఆనుకుని మొత్తం 8 ఎత్తయిన భవనాలున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం వీటిల్లో 2,000 అపార్ట్‌మెంట్లలో దాదాపు 4,800 మంది నివసిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని ఫ్లాట్లు నిర్మాణదశలో ఉన్నాయి. మంటలు అంతటా వ్యాపించేలోపే 1,000 మందిని తరలించారు. మంటల్ని ఆర్పేందుకు వచ్చిన వందలాది మంది అగ్నిమాపక సిబ్బంది, తమవారు ఏమయ్యారో తెలీక ఆందోళనతో వచ్చిన వందలాది మంది స్థానికులతో ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది.

ఆర్పేందుకు అవిశ్రాంతంగా పోరాటం

బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో భవనాల చుట్టూ ఉన్న ఆకుపచ్చని వస్త్రానికి తొలుత నిప్పు అంటుకుని, తర్వాత అది వెదురు సపోర్ట్ నిర్మాణాలను అంటుకుని అంతటా వ్యాపించిందని భావిస్తున్నారు. అగ్నిప్రమాదం వార్త తెల్సి వందలాది మంది అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, పారామెడికల్ సిబ్బంది, వలంటీర్లు వెంటనే రంగంలోకి దిగారు. అత్యంత ఎత్తయిన వాటర్ కేనన్లతో మంటల్ని అదుపులోకి తెచ్చేందుకు విశ్వప్రయత్నంచేస్తున్నారు. అంతెత్తున ఎగసిపడుతూ చుట్టూతా వ్యాపించిన అగ్నికీలలు, దట్టంగా కమ్ముకున్న పొగ దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఫైర్‌ఇంజిన్ల నిచ్చెనలు చేరుకోలేని ఎత్తులకు మంటలు వ్యాపించడంతో వాటిని అదుపులోకి తీసుకురావడం కష్టంగా మారింది. ఫ్లాట్లలో చిక్కుకున్న వారిలో వృద్ధులే అధికంగా ఉన్నారని తైపో జిల్లా మండలి సభ్యుడు లో హీయూపుంగ్ చెప్పారు. భవనంలో నా ఫ్లాట్ ఉందో బుగ్గిపాలైందో అంటూ వూ అనే వ్యక్తి కన్నీరుమున్నీరయ్యారు. ''అంత ఎత్తున మంటలు ఉండటంతో భవనాల లోపలికి వెళ్లడం సాధ్యపడట్లేదు. లోపల ఏం జరుగుతోందో ఊహించలేకపోతున్నాం'' అని ఫైర్‌సర్వీసెస్ విభాగ డైరెక్టర్ ఆండీ యే యుంగ్ అశక్తత వ్యక్తంచేశారు.

వెదురే కారణమా?

హాంకాంగ్‌లో నిర్మాణరంగంలో వెదురు కర్రలను విరివిగా ఉపయోగిస్తారు. తాత్కాలిక మెట్లుగా, ఆవలివైపు గోడ నిర్మాణాల కోసం తాత్కాలిక సపోర్ట్ గోడగా వెదురు కర్రలను ఉపయోగిస్తారు. బుధవారం బుగ్గిపాలైన ఆకాశహర్మ్యం చుట్టూతా, నిట్టనిలువునా ఈ వెదురుకర్రలే దర్శనమిచ్చాయి. మంటలకు త్వరగా కాలిపోయే గుణమున్న ఈ కర్రల వాడకానికి తిలోదకాలు ఇవ్వాలని గతంలోనే ప్రభుత్వం చెప్పినా నిర్మాణరంగ సంస్థలు వినిపించుకోవట్లేదు. ప్రమాదం వార్త తెలిసి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు.

దేశానికి రాజ్యాంగమే మూలస్తంభం

దేశాన్ని నడిపించే మార్గదర్శక పత్రం: రాష్ట్రపతి

న్యూఢిల్లీ: మన దేశ గుర్తింపునకు రాజ్యాంగమే మూలస్తంభం అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. వలసవాద మనస్తత్వాన్ని వదిలించుకోవడానికి, జాతీయవాద దృక్పథాన్ని అలవర్చుకోవడానికి రాజ్యాంగం దోహదపడిందని అన్నారు. బుధవారం పార్లమెంట్ పాత భవనం సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిరణ్ రిజుజు, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కాంగ్రెస్ ముఖ్యనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సహా అన్ని పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. రాష్ట్రపతి నేతృత్వంలో రాజ్యాంగ ప్రవేశికను అందరూ సామూహికంగా పఠించారు. తెలుగు, మలయాళం, మరాఠి, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ భాషల్లో భారత రాజ్యాంగం డిజిటల్ వెర్షన్‌ను రాష్ట్రపతి విడుదల చేశారు. ఒరిజినల్ రాజ్యాంగం కాలీగ్రఫీకి సంబంధించిన స్మారక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రసంగిస్తూ... ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ప్రజల ఆకాంక్షలను వ్యక్తీకరిస్తున్న పార్లమెంట్ నేడు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. దేశ గుర్తింపునకు, ఆత్మగౌరవానికి రాజ్యాంగమే ప్రతీక అని వివరించారు. దేశాన్ని ముందుకు నడిపించే మార్గదర్శక పత్రమని అభివర్ణించారు.

ఇతర దేశాల నుంచి ప్రశంసలు

''రాజ్యాంగ స్ఫూర్తిని, సామాజిక, సాంకేతికత మార్పులను దృష్టిలో పెట్టుకొని నేర న్యాయ వ్యవస్థకు సంబంధించిన కీలకమైన చట్టాలను అమల్లోకి తీసుకొచ్చాం. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినీయం చట్టాలకు స్ఫూర్తి శిక్ష విధించడం కాదు, ప్రజలకు న్యాయం చేకూర్చాలన్న ఆశయమే. ప్రజలకు ఓటు హక్కు కల్పించి, వారి ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలుస్తున్న భారత పార్లమెంటరీ వ్యవస్థను ఇతర దేశాలు సైతం ప్రశంసిస్తున్నాయి.

సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ ప్రవేశికను పఠిస్తున్న రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ బిర్లా, నడ్డా, రిజిజు, ఖర్గే, రాహుల్, హరివంశ్

భారత రాజ్యాంగ వ్యవస్థకు అనుగుణంగా శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాలు దేశ ప్రగతికి పాటుపడుతున్నాయి. ప్రజల జీవితాలకు స్థిరత్వాన్ని, మద్దతును అందిస్తున్నాయి.

ఆర్థిక న్యాయంలో అతిపెద్ద విజయం సాధించాం

దేశంలో గత కొన్నేళ్లుగా ఎన్నికల్లో ఓటు వేసేవారిలో మహిళా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రజాస్వామ్యం పట్ల వారి సామాజిక విశ్వాసానికి ఇదొక ప్రబల ఉదాహరణ. పంచాయతీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల దాకా అన్ని రకాల ఎన్నికల్లో మహిళలు, యువత, పేదలు, రైతులు, ఎస్సీ, ఎస్టీలు, మధ్య తరగతి.. ఇలా అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. రాజ్యాంగ ఆత్మను వ్యక్తీకరించేవి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమే. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వమే రాజ్యాంగ ఆశయాలు. మన దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా పరుగులు తీస్తోంది. పార్లమెంటరీ వ్యవస్థ విజయవంతం అవుతోందని చెప్పడానికి ఇదే నిదర్శనం. ఆర్థిక న్యాయంలో భారత్ అతిపెద్ద విజయం సాధించింది. ఏకంగా 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడడం నిజంగా గొప్ప విషయం'' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

కీలక ఖనిజాల పథకానికి ఆమోదం

- రూ. 7,280 కోట్లు కేటాయింపు
- కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- స్వావలంబన దిశగా మోదీ సర్కార్ అడుగులు

న్యూఢిల్లీ: కీలక రంగాల్లో అత్యావశ్యకంగా మారిన అరుదైన భూఅయస్కాంత ఖనిజాల సేకరణపై కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టిసారించింది. వీటి దిగుమతుల కోసం చైనాపై ఆధారపడటం మానేసి అరుదైన ఖనిజాల రంగంలో స్వావలంబన దిశగా ముందడుగు వేయాలని కేంద్రం కంకణం కట్టుకుంది. ఇందులోభాగంగా భూఅయస్కాంతాల గనుల తవ్వకం, శుద్ధి, స్వచ్ఛమైన ఖనిజాల తయారీకి సంబంధించి రూ.7,280 కోట్లతో నూతన పథకాన్ని ప్రారంభించాలన్న ప్రతిపాదనకు ప్రధాని మోదీ సారథ్యంలోని కేబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. ఈ పథకానికి రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్స్(ఆర్‌ఈపీఎంఎస్) అని పేరు పెట్టింది. విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, వైమానిక రంగం, రక్షణ పరికరాల్లోని కీలక భాగాలను ఈ భూఅయస్కాంత ఖనిజాలతోనే తయారుచేస్తారు. దీంతో వీటికి విపరీతమైన కొరత ఏర్పడింది. డిమాండ్ తగ్గ సరఫరా సాధించడంతోపాటు స్వావలంబనే లక్ష్యంగా ఈ పథకాన్ని మొదలుపెట్టనున్నట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. కేబినెట్ భేటీ నిర్ణయాలను ఆయన తర్వాత మీడియాకు వెల్లడించారు.

ఔత్సాహిక కంపెనీల కోసం అంతర్జాతీయ బిడ్డింగ్

అంతర్జాతీయ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఔత్సాహిక కంపెనీలను ఆహ్వానిస్తారు. వీటి నుంచి చివరకు ఐదు సంస్థలను ఎంపికచేస్తారు. ఒక్కో కంపెనీకి 1,200 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యాన్ని లక్ష్యంగా నిర్దేశిస్తారు. ఏడేళ్ల కాలానికి కాంట్రాక్ట్ అప్పగిస్తారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థలు తొలి రెండేళ్లలోపు పూర్తిస్థాయిలో తయారీ యూనిట్‌ను స్థాపించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఐదేళ్లలోపు భూఅయస్కాంతాల తయారీ, విక్రయం, ఎగుమతి మొదలెట్టాలి. రూ.7,280 కోట్ల పథకంలో రూ.6,450 కోట్లను విక్రయాల ప్రోత్సాహకాల కింద కేటాయించారు. 6,000 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్య సాధన కోసం మరో రూ. 750 కోట్లను మూలధన సబ్సిడీగా కేటాయించారు. భారత్‌లో ఏటా విద్యుత్ వాహనాలు, సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన రంగం, పారిశ్రామిక ఉపకరణాలు, ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాల్లో భూఅయస్కాంతాల వినియోగం పెరుగుతోంది. దీంతో వీటి డిమాండ్ వచ్చే ఐదేళ్లలో రెట్టింపు కావొచ్చని ప్రభుత్వం అంచనావేస్తోంది. అంతర్జాతీయంగా భూఅయస్కాంత ఖనిజాల తవ్వకం, శుద్ధి, స్వచ్ఛ లోహాల తయారీ రంగంలో చైనా గుత్తాధిపత్యం కొనసాగుతోంది. భారత్‌కు ఏటా 5,000 మెట్రిక్ టన్నుల భూఅయస్కాంతాల అవసరం ఉంది. అయితే ఏడు కీలక భూఅయస్కాంతాలు, వాటి ఉపఉత్పత్తుల ఎగుమతి కోసం ప్రత్యేక లైసెన్సులు తప్పనిసరి అంటూ ఏప్రిల్ 4న చైనా కఠిన నిబంధనలు అమల్లోకి తేవడంతో భారత్‌సహా ప్రపంచదేశాలకు వీటి కొరత విపరీతంగా ఏర్పడింది. దీంతో భారత్ ఇలా భూఅయస్కాంతాల్లో ఆత్మనిర్భరత దిశగా అడుగులేస్తోంది.

ఏమిటీ భూఅయస్కాంతాలు?

తక్కువ ఉద్గారాలు, తక్కువ ఇంధన వినియోగం, మెరుగైన సామర్థ్యం, వేగం, దృఢత్వం, వేడిని తట్టుకోవటం వంటి గుణాలతో కూడిన పరిజ్ఞానంతో తయారైన ఉపకరణాల్లో భూఅయస్కాంతాలనే వాడతారు. అందుకే వీటికి అంతటి డిమాండ్. విద్యుత్, కాంతి సంబంధ, అయస్కాంత, ఉత్ప్రేరక అప్లికేషన్లలో వీటిన ఉపయోగిస్తారు. ఇవి శుద్ధ లోహాల రూపంలో లభించవు. ముఖ్యంగా యురేనియం, థోరియం వంటి రేడియోధార్మిక పదార్థాలతో కలిసి మిశ్రమాలుగా లభిస్తాయి. వీటిని వేరు చేసి, శుద్ధి చేయటం చాలా కష్టమైన పని. భారత్‌లోనూ దాదాపు 72 లక్షల టన్నుల భూఅయస్కాంత నిల్వలున్నాయి. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా వంటి తీరప్రాంత రాష్ట్రాల్లోని మోనోజైట్ ఇసుకలో ఈ నిల్వలు అధికంగా ఉన్నాయి. పశ్చిమబెంగాల్, జార్ఖండ్, గుజరాత్, రాజస్తాన్, మహారాష్ట్రలోనూ ఇవి ఉన్నాయి. కొత్తరకం ఎలక్ట్రానిక్ వస్తువులు, మోటార్లు, ఎనర్జీ టెక్నాలజీ వస్తువులు, స్పీకర్లు, హెడ్‌ఫోన్లు, ప్రింటర్లు, సీడీ/డీవీడీ డ్రైవ్‌లు, సెన్సార్లు, రాకెట్లు, పవర్‌స్టీరింగ్, విండో లిఫ్ట్, సీట్ మోటార్‌లలోనూ వీటిని వాడతారు.

ఇమ్రాన్‌ఖాన్ హత్య?

అడియాలా జైల్లో గుట్టుగా మట్టుబెట్టినట్టు గుప్పుమన్న వార్తలు

ధ్రువీకరించని పాక్ ● మూడు వారాలుగా కలవనివ్వడం లేదు: కుటుంబీకుల ఆవేదన

ఇస్లామాబాద్: రాజకీయ హత్యలకు పెట్టింది పేరైన పాకిస్తాన్‌లో మరో మాజీ ప్రధాని రక్తం చిందిందా? పాకిస్తాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్ (పీటీఐ) సారథి, అలనాటి మేటి క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ హత్యకు గురయ్యారా? రాజకీయ నిర్బంధానికి గురై 2023 నుంచీ జైల్లోనే మగ్గుతున్న ఆయన అక్కడే తుది శ్వాస విడిచారా? గత జనవరి నుంచి రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉంటున్న 72 ఏళ్ల ఇమ్రాన్‌ను అక్కడే సైలెంట్‌గా చంపేశారంటూ అఫ్గాన్ టైమ్స్ అనే సోషల్ మీడియా హాండిల్ ఎక్స్‌లో పెట్టిన పోస్టు బుధవారం పెను దుమారమే రేపింది. అత్యంత విశ్వసనీయ వర్గాలే తమకు ఈ మేరకు సమాచారం ఇచ్చినట్టు అది పేర్కొంది. దాంతో చూస్తుండగానే సోషల్ మీడియా అంతా ఈ వార్తలతోనే ఊగిపోయింది. పాక్‌కు చెందిన పలు సైట్లు కూడా ఇమ్రాన్ కుటుంబీకులు, పీటీఐ నేతలను ఉటంకిస్తూ ఇదే విషయాన్ని ప్రచారంలో పెట్టాయి. అయితే ఇందుకు సంబంధించి ఇప్పటిదాకా అధికారిక ధ్రువీకరణగానీ, ఖండనగానీ వెలువడకపోవడం గమనార్హం. దాంతో పాక్‌వ్యాప్తంగా ఇమ్రాన్ అభిమానులు, పీటీఐ కార్యకర్తలు, నేతలు వీధుల్లోకి వచ్చి ఆందోళన బాట పట్టారు. అడియాలా జైలును ముట్టడించే ప్రయత్నం చేశారు. జైల్లో తనను చిత్రహింసలు పెడుతున్నారని ఇమ్రాన్ గత జూలైలో ఆరోపించారు. జైలు సూపరింటెండెంట్‌తో కలిసి తనను ఏదో చేసేందుకు ఒక కల్నల్ రంగంలోకి దిగినట్టు పేర్కొన్నారు. తనకు ఏమన్నా అయితే ఆర్మీ చీఫ్ సీఎం మునీర్‌నే అందుకు బాధ్యున్ని చేయాలని పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు. జైలు అధికారులు తనను విపరీతంగా

వేధిస్తున్నా రని ఇటీవల ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్‌ను కలిసేందుకు తమను అనుమతించడం లేదని బుధవారం ఆయన కుటుంబీకులు ఆరోపించిన కాసేపటికే ఇలా హత్య వార్త ప్రచారంలోకి వచ్చింది. పాక్ సైన్యమే ఆయన్ను పొట్టన పెట్టుకుందంటూ ఎక్స్ సహా అన్ని సోషల్ సైట్లలోనూ పోస్టులు వెల్లువెత్తాయి. పైగా ఇమ్రాన్‌ను చూపించాలంటూ జైలు వెలుపల ధర్నాకు దిగిన ఆయన సోదరీమణులను పోలీసులు కొట్టి వెళ్ళగొట్టారన్న వార్తలు ఈ ప్రచారానికి మరింత ఆజ్యం పోశాయి. ప్రధానిగా ఉంటూ పాక్‌లో అత్యంత శక్తిమంతమైన సైన్యంతో పెట్టుకున్న కొద్ది రోజులకే ఇమ్రాన్ పదవీచ్యుతుడు కావడం తెలిసిందే. ఆ వెంటనే పలు అవినీతి ఆరోపణలపై ఆయన జైలుకెళ్లారు. తర్వాత ఒక్కొక్క కేసులో ఆయనకు శిక్ష పడుతూ వచ్చింది.

జాతీయ న్యాయ విధానం తీసుకురావాలి

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సూచన
- హాజరైన ఆరు దేశాల ప్రధాన సీజేఐలు

న్యూఢిల్లీ: అంచనా వేయలేని తీర్పుల సంఖ్యను, తీర్పుల్లో భిన్నత్వాన్ని తగ్గించడానికి ఏకీకృత జాతీయ న్యాయ విధానం తీసుకురావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. న్యాయస్థానాలు కచ్చితత్వంతో, స్థిరత్వంతో తీర్పులివ్వడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్సీబీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో జస్టిస్ సూర్యకాంత్ పాల్గొన్నారు. న్యాయ వ్యవస్థలో బార్, ధర్మాసనాల ప్రాధాన్యతను వివరించారు. కోర్టులను రాజ్యాంగానికి రక్షకులుగా భావిస్తే.. దీపం పట్టుకొని వారి మార్గాన్ని ప్రకాశవంతం చేసేవారే బార్ సభ్యులు అని వ్యాఖ్యానించారు. న్యాయమూర్తులు విధులు నిర్వర్తించడానికి బార్ సభ్యులు ఎంతగానో సహకరిస్తున్నారని ప్రశంసించారు. మరోవైపు సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలోనూ జస్టిస్ సూర్యకాంత్ ప్రసంగించారు. ఏకీకృత జాతీయ న్యాయ విధానం గురించి లేవనెత్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ విక్రమ్‌నాథ్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే భూటాన్, కెన్యా, మారిషస్, శ్రీలంక, నేపాల్, మలేసియా సుప్రీంకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు సైతం హాజరు కావడం విశేషం.

రాజ్యాంగ విధులతో బలమైన ప్రజాస్వామ్యం

- దేశ పౌరులంతా రాజ్యాంగ విధులు నిర్వర్తించాలి
- ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడం మనందరి బాధ్యత
- ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా లేఖ

న్యూఢిల్లీ: దేశ పౌరులంతా రాజ్యాంగం నిర్దేశించిన విధులను నిర్వర్తించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బలమైన ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ విధులే పునాది అని ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన బుధవారం దేశ ప్రజలకు ఈ మేరకు లేఖ రాశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ఇందుకోసం ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఇకపై ప్రతిఏటా పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలని, 18 ఏళ్లకు తొలిసారి ఓటు హక్కు పొందిన వారిని సత్కరించుకోవాలని కోరారు. విధులు నిర్వర్తిస్తేనే హక్కులు లభిస్తాయని జాతిపిత మహాత్మాగాంధీ బోధించినట్లు ప్రధాని మోదీ గుర్తుచేశారు. సామాజిక, ఆర్థిక ప్రగతికి విధుల నిర్వహణ అత్యావశ్యకమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ రచనలో బాబూ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తోపాటు మరికొందరు మహనీయులు పోషించిన పాత్రను గుర్తుచేశారు. దేశ స్వాతంత్య్ర పోరాటంలో వల్లభ్‌భాయ్ పటేల్, బిర్సా ముండా, మహాత్మాగాంధీల నాయకత్వాన్ని, త్యాగాలను శ్లాఘించారు.

దేశానికి కృతజ్ఞత చూపాల్సిందే..

''రాజ్యాంగ విధులను అందరూ సక్రమంగా నిర్వర్తిస్తేనే మన ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏలో ఈ అంశాన్ని పొందుపర్చారు. ఉమ్మడిగా సామాజిక, ఆర్థిక ప్రగతిని సాధించడానికి రాజ్యాంగ విధులే మనకు దారి చూపుతాయి. 'వికసిత్ భారత్' దిశగా మన ప్రయాణం సఫలం కావాలంటే రాజ్యాంగ విధులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఈరోజు మనం తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన విధానాలే రాబోయే తరాల జీవితాలను ప్రభావితం చేస్తాయి. మన దేశం మనకు ఎంతో ఇచ్చింది. కృతజ్ఞతలు చూపాలన్న భావన మనసులో నాటుకోవాలి. అప్పుడు రాజ్యాంగ విధుల నిర్వహణ మన జీవితంలో భాగమవుతుంది. ప్రతి పని పూర్తిసామర్థ్యం, అంకితభావంతో పూర్తిచేయాలి. మనం చేసే ప్రతి పని దేశానికి సంబంధించిన లక్ష్యాలను, ప్రయోజనాలను నెరవేర్చేలా ఉండాలి. మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుల స్వప్నాలను సాకారం చేయడం మనందరి బాధ్యత.

జమ్మూకశ్మీర్ ప్రజలకు రాజ్యాంగ హక్కులు

సర్దార్ పటేల్ దార్శనికత, నాయకత్వ పటిమతో దేశం ఐక్యంగా మారింది. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఎ)ను రద్దు చేయడానికి ఆయన స్ఫూర్తిగా నిలిచారు. ఇప్పుడు జమ్మూకశ్మీర్‌లో రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలవుతుండడం సంతోషంగా ఉంది. జమ్మూకశ్మీర్ ప్రజలకు రాజ్యాంగ హక్కులు లభిస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాల ప్రజలకు మేలు జరుగుతోంది. గిరిజనులకు న్యాయం, గౌరవం, సాధికారత చేకూర్చడంలో భగవాన్ బిర్సా ముండా జీవితం మనకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. రాజ్యాంగం దేశ ప్రజలకు ఓటు హక్కును ఇచ్చింది. స్థానిక, రాష్ట్ర జాతీయ ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేయాలి. రాజ్యాంగం కట్టబెట్టిన హక్కును వాడుకోవడం పౌరులుగా మన బాధ్యత.

అది ముమ్మాటికీ రాజ్యాంగం ఘనతే

రాజ్యాంగం గొప్పతనం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఆర్థికంగా వెనకబడిన కుటుంబంలో జన్మించిన నేను ప్రధానమంత్రిగా ఉన్నత స్థానానికి చేరుకున్నానంటే అది ముమ్మాటికీ రాజ్యాంగం ఘనతే. రాజ్యాంగం కల్పించిన అవకాశంతోనే గత 24 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజాజీవితంలో కొనసాగుతున్నా. 2014లో ప్రధానమంత్రిగా తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టినప్పుడు అక్కడి మెట్లకు తలవంచి నమస్కరించడం, మెట్లను చేతితో తాకడం ఇప్పటికీ గుర్తుంది. 2019లో ఎన్నికల ఫలితాల తర్వాత పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగానికి నమస్కరించి, తలపై మోశాను. మన రాజ్యాంగం నాలాంటి ఎంతోమంది నాయకులను ఈ దేశానికి ఇచ్చింది. రాజ్యాంగాన్ని బలోపేతం చేసే అవకాశాన్ని రాజ్యాంగమే కల్పించింది'' అని మోదీ లేఖలో పేర్కొన్నారు.

2 కోట్లకుపైగా ఆధార్ ఐడీల తొలగింపు

- భారీ స్థాయిలో ప్రక్షాళన మొదలెట్టిన కేంద్రం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన మరణాల జాబితాతో సరిపోల్చి కార్డుల డీయాక్టివేషన్

న్యూఢిల్లీ: ఆధార్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టడంతోపాటు ఆధార్ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. జనాభా లెక్కలు చూసే రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సంబంధిత మంత్రిత్వ శాఖలు, ప్రజా పంపిణీ వ్యవస్థలు, నేషనల్ సోషల్ అసిస్టెంట్ ప్రోగ్రామ్‌ల నుంచి సేకరించిన పౌరుల మరణాల జాబితాతో ఆధార్ ఐడీలను సరిపోల్చి మృతుల సంబంధ ఆధార్ గుర్తింపు(ఐడీ)లను నిర్వీర్యంచేస్తోంది. ఇలా తాజాగా 2 కోట్లకుపైగా ఐడీల డీయాక్టివేషన్ పూర్తయినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎప్పటికప్పుడు ప్రక్షాళనతో ఆధార్ కార్డుల సంఖ్యలో ప్రభుత్వానికి సైతం ఒక స్పష్టత ఉంటుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. ఆధార్ డేటాబేస్ సమగ్రతను కాపాడటంతోపాటు ఆధార్ ఐడీ నంబర్ల దుర్వినియోగానికి అడ్డుకట్టవేసేందుకే దేశవ్యాప్తంగా ఇలా ఒకేసారి భారీస్థాయిలో ప్రక్షాళన మొదలుపెట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. మరణించిన వారి ఆధార్ కార్డ్ దుర్వినియోగం కాకూడదని భావించే కుటుంబసభ్యులు సొంతంగా కూడా 'మైఆధార్ పోర్టల్' ద్వారా ఆయా ఐడీల డీయాక్టివేషన్‌ను కోరవచ్చు. మరణాన్ని ధృవీకరించే ముందు ఆయా కుటుంబసభ్యులు తమ ఐడీని ధృవీకరించాల్సి ఉంటుంది. ప్రాథమిక వివరాలతోపాటు మరణ ధ్రువీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆయా దరఖాస్తుల వివరాలను విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) సంస్థ అధికారులు పరిశీలిస్తారు. తనిఖీల తర్వాత మృతుల ఆధార్ ఐడీలను డీయాక్టివేట్ చేస్తారు.

పునరుద్ధరణ కూడా సాధ్యమే

జీవించి ఉన్న పౌరుల ఆధార్ ఐడీ పొరపాటున డీయాక్టివేట్ అయితే తిరిగి పునరుద్ధరణ(రీయాక్టివేట్)కు సైతం ప్రభుత్వం సౌకర్యం కల్పించింది. తాము జీవించే ఉన్నామని తెలిపే ఆధారాలను సమర్పిస్తే వెంటనే పాత ఐడీ కార్డును రీయాక్టివేట్ చేస్తారు. మృతుల ఆధార్ ఐడీలను తొలగించే క్రతువుకు అధికారులు 2024 ఏడాదిలోనే మొదలెట్టారు. అది ఈ ఏడాది పొడవునా కొనసాగుతోంది. ఈ ఏడాది జూలై రెండోవారం నాటికి 1.17 కోట్ల ఐడీలను తొలగించారు. సెప్టెంబర్ నాటికి 1.4 కోట్ల ఐడీలు, తాజాగా 2 కోట్లకుపైగా ఐడీలను తొలగించారు. అయితే ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పౌర నమోదు వ్యవస్థలు సరిగా పనిచేయడం లేదు. ఏ జిల్లాలో ఎంత మంది మరణించారనే వాస్తవిక గణాంకాలు కూడా చాలా రాష్ట్రాల వద్ద సమగ్రస్థాయిలో లేవు. ఇలాంటి అస్పష్టతల నడుమ ఉన్నపళంగా ఆధార్ ఐడీలను క్రియాశీలక స్థితి నుంచి తప్పిస్తే ఎంతో మంది పౌరులు అవస్థలు పడతారని సామాజికరంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో ఈ ఆధార్‌ఐడీల పొరపాటు తొలగింపు అనేది పెద్ద అవరోధంగా మారుతుందని వాళ్లు వ్యాఖ్యానించారు.

బంగ్లా వినతిని పరిశీలిస్తున్నాం: భారత్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను ఆ దేశానికి అప్పగించాలన్న అక్కడి మధ్యంతర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిశీలిస్తున్నట్టు విదేశాంగ శాఖ తెలిపింది. బంగ్లా ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు, శాంతి, ప్రజాస్వామ్యం, స్థిరత్వాల సాధనకు భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. బంగ్లాలో పరిస్థితులను భారత్ నిశితంగా పరిశీలిస్తోందని చెప్పారు. 78 ఏళ్ల హసీనా గతేడాది బంగ్లాలో భారీ నిరసన జ్వాలల నేపథ్యంలో దేశం వీడి భారత్ కు పారిపోయి రావడం, అప్పటినుంచీ ఇక్కడే తలదాచు కుంటుండటం తెలిసిందే. మానవత్వంపైనే తీరని నేరాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ప్రత్యేక ట్రిబ్యునల్ ఆమెకు గత వారమే మరణ శిక్ష కూడా విధించింది.

పాక్‌వి సిగ్గుచేటు వ్యాఖ్యలు

అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమం పాకిస్తాన్ ప్రభుత్వం చేసిన ప్రేలాపనలపై కేంద్రం మండిపడింది. మతోన్మాదం, మైనారిటీలపై అకృత్యాలకు పెట్టింది పేరైన పాక్ నుంచి నైతిక పాఠాలు నేర్చుకునే దుస్థితి భారత్‌కు పట్టలేదని జైస్వాల్ అన్నారు. బాబ్రీ మసీదు స్థలంపై ఆలయం కట్టడం, దానిపై ధ్వజారోహణ చేయడం ఏమిటంటూ పాకిస్తాన్ నోరు పారేసుకోవడం తెలిసిందే.

'అష్ట' లక్ష్మి కోసం ఇష్టంగా..

కారు నంబర్ ఖరీదు రూ. కోటీ 17 లక్షలు ● దేశంలోనే హెచ్‌ఆర్88బి8888 రికార్డు వేలం

కేవలం నాలుగు అంకెల రిజిస్ట్రేషన్ నంబర్ కోసం రూ.కోటికి పైగా ఖర్చు చేస్తారా? అవును.. హరియాణాలో జరిగిన ఆన్‌లైన్ వేలంలో 'హెచ్‌ఆర్88బి8888' నంబర్ ప్లేట్ ఏకంగా రూ.1.17 కోట్ల భారీ మొత్తానికి అమ్ముడుపోయి భారతదేశంలోనే అత్యంత ఖరీదైన కారు రిజిస్ట్రేషన్ నంబర్‌గా రికార్డు సృష్టించింది.

క్రేజీ 'ఎనిమిది'

ఈ నంబర్ ప్లేట్‌లో ఉన్న ప్రధాన ట్విస్ట్ ఏమిటంటే, పెద్ద అక్షరం 'బి' అచ్చు గుండ్రంగా ఉండి, అది కూడా '8' లాగే కనిపిస్తుంది. దీంతో మొత్తం నంబర్ ప్లేట్ చూడటానికి వరుసగా ఎనిమిది (8) అంకెలు ఉన్నట్లు కనిపిస్తుంది. న్యూమరాలజీ ప్రకారం 8వ నంబర్‌కు ఉన్న విలువ, వరుసగా ఉన్న అంకెలు దీనికి అధిక ప్రీమియం ధరను తెచ్చిపెట్టాయి.

కేరళ రికార్డు బ్రేక్!

సాధారణంగా నంబర్ ప్లేట్లపై క్రేజ్ బాగా ఉన్న కేరళలో కూడా గతంలో భారీ వేలం జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో, కేరళకు చెందిన ఒక టెక్ బిలియనీర్.. తన లంబోర్ఘిని కారు కోసం 'కేఎల్07డీజీ 0007' నంబర్‌ను రూ.45.99 లక్షలకు దక్కించుకున్నారు. నేడు ఆ రికార్డు బ్రేక్ అయింది. - సాక్షి, నేషనల్ డెస్క్

- ప్రారంభ ధర: రూ.50,000.
- మధ్యాహ్నం 12 గంటలకు: ధర రూ.88 లక్షలకు చేరుకుంది.
- సాయంత్రం 5 గంటలకు (ఫైనల్ బిడ్): ధర రూ.1.17 కోట్ల వద్ద స్థిరపడింది.
- కేవలం కొద్ది గంటల్లోనే రూ.88 లక్షల నుంచి రూ.1.17 కోట్లకు ధర పెరిగింది.

ఈ నంబర్ ఎందుకంత ప్రత్యేకం?

'హెచ్‌ఆర్88బి8888' సాదాసీదా నంబర్ కాదు.. దీని వెనుక ఒక ప్రత్యేక ఆకర్షణ ఉంది.

- 'హెచ్‌ఆర్': హరియాణా రాష్ట్ర కోడ్.
- '88': రిజిస్ట్రేషన్ జరిగిన ప్రాంతీయ రవాణా కార్యాలయం లేదా జిల్లా కోడ్.
- 'బి': వాహన సిరీస్ కోడ్.
- '8888': ప్రత్యేకమైన నాలుగు అంకెల రిజిస్ట్రేషన్ నంబర్.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2వేల క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు అంతే వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 42.1600 టీఎంసీలు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 582.20 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 11,856 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టాకు 3,422 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉంది.

పక్షపాతంపై నిరసన గళం

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్‌లో కొనసాగుతున్న వ్యవహారాలను వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు నిరసన గళం వినిపించారు. ప్రభుత్వ, జెడ్పీ యంత్రాంగం ఏకపక్ష వైఖరిపై మండిపడ్డారు. బుధవారం ఏర్పాటు చేసిన స్థాయీ సంఘ సమావేశాలను ఆయా సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలు బహిష్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పక్షపాత ధోరణి, ఏకపక్ష విధానాలను నిరసిస్తూ మొత్తం ఆరు సమావేశాలకుగానూ మూడు స్థాయి సంఘ సమావేశాలను బహిష్కరించారు. జెడ్పీటీసీలకు తెలియకుండా, వారి ప్రమేయం లేకుండా తయారు చేసిన అజెండాలను తిరస్కరించారు.

- జెడ్పీలో పనులన్నీ మీరే కేటాయించుకుంటే ఇక ప్రజాప్రతినిధులుగా మేమెందుకు?
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ సభ్యులు
- రాజ్యాంగ దినోత్సవం రోజు జెడ్పీటీసీలకు అవమానం
- ప్రణాళిక–ఆర్థిక, పనుల ఆమోదానికి సంబంధించిన కమిటీలు బహిష్కరణ
- తమ మండలాలకు పనులు కేటాయించలేదని మండిపాటు
- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న చైర్‌పర్సన్ వైఖరిపై ఆగ్రహం
- ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చుకోలేని పరిస్థితుల్లో చైర్‌పర్సన్

అజెండాను తిరస్కరిస్తూ చైర్‌పర్సన్‌కు లేఖ అందజేస్తున్న ఒకటో స్థాయీ సంఘ సభ్యులు

మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు మస్తాన్‌రావు, చిట్టిబాబు, సుబ్బారావు, శివయాదవ్, సిద్ధయ్య, గుల్జార్‌బేగం, కృష్ణకుమారి, నాగ మల్లేశ్వరి

గుంటూరు ఎడ్యుకేషన్ : జెడ్పీలో అవలంబిస్తున్న పక్షపాత ధోరణి, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడం ద్వారా వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు జెడ్పీ పాలకులు, అధికార యంత్రాంగానికి తిరుగులేని గుణపాఠం చెప్పారు. జెడ్పీ కార్యాలయంలో ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం బుధవారం ఆరు స్థాయీ సంఘాలు భేటీ అయ్యి, అజెండాలో పొందుపర్చిన అంశాలపై చర్చించి ఆమోదించాల్సి ఉంది. అయితే జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఆమె చాంబర్లో నిర్వహించాల్సిన ప్రణాళిక–ఆర్థిక అంశాలతో కూడిన 1వ స్థాయీ సంఘం, గ్రామీణాభివృద్ధిపై 2వ స్థాయీ సంఘం, విద్యం–వైద్యంపై 4వ స్థాయీ సంఘం, పనుల ఆమోదంపై 7వ స్థాయీ సంఘ సమావేశాలను వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. 1వ, 7వ సమావేశాలకు హాజరైన సభ్యులు తాము అజెండాలను తిరస్కరిస్తున్నామని, తమ ప్రాతినిధ్యం లేకుండా ఏకపక్షంగా ఆమోదిస్తున్న వైఖరిని ఖండిస్తున్నామని చెప్పి బయటకు వెళ్లిపోయారు. వైస్ చైర్మన్ శొంఠి నర్సిరెడ్డి అధ్యక్షతన వ్యవసాయంపై జరగాల్సిన 3వ స్థాయీ సంఘం కోరం లేక వాయిదా పడింది.

నామమాత్రంగా సమావేశాలా?

సమావేశాలను బహిష్కరించిన అనంతరం వైఎస్సార్ సీపీ సభ్యులు మీడియాతో మాట్లాడారు. నాదెండ్ల, నరసరావుపేట జెడ్పీటీసీలు సభ్యులు కాట్రగడ్డ మస్తాన్‌రావు, పి. చిట్టిబాబులు మాట్లాడుతూ.. జెడ్పీటీసీల ప్రమేయం లేకుండా ఏకపక్షంగా పనులు ఆమోదిస్తున్నారని ఆరోపించారు. స్థాయీ సంఘ సభ్యులకు తెలియకుండా తయారు చేసిన అజెండాను రద్దు పర్చి, సభ్యుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని, అజెండాను సిద్ధం చేసిన తరువాతే మరలా సమావేశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. మాచవరం జెడ్పీటీసీ జె.వెంకట శివయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా గెలిచిన తాము నాలుగేళ్లుగా సంత మండలంలో పనులు చేయించుకోలేకపోతున్నామని, ఓట్లేసి గెలిపించిన ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని అన్నారు. చైర్‌పర్సన్, సీఈవోకు మధ్య సరైన అవగాహన లేకపోవడంతో జెడ్పీటీసీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జెడ్పీటీలకు తెలియకుండా చేర్చిన పనులను రద్దు పర్చాలని డిమాండ్ చేశారు.

నిధులు తెచ్చుకోలేని పరిస్థితి

రొంపిచర్ల జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పార్టీ మారిన చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కూటమి ప్రభుత్వం నుంచి జెడ్పీకి రావాల్సిన నిధులను తీసుకురావడంలో విఫలమయ్యారని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రావల్సిన నిధులు రూ.23 కోట్లకు కేవలం రూ.తొమ్మిది కోట్లే వచ్చాయని చెప్పారు. స్టాంప్ డ్యూటీ కింద రూ.35 కోట్లు కూటమి ప్రభుత్వం రెవెన్యూ మంత్రి జిల్లాకు చెందిన వ్యక్తే అయినప్పటికీ చైర్‌పర్సన్ చేతకానితనంతో నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు.

ఎంపీ సమాధానం చెప్పాలి

జెడ్పీటీసీల ప్రమేయం లేకుండా రూపొందించిన ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదం పొందకుండా తాము ఆరు నెలలపాటు అడ్డుకున్నామని తెలిపారు. అయితే జెడ్పీటీసీలకు తెలియకుండా ఎటువంటి పనులు ఆమోదం పొందవని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఇచ్చిన హామీతో తాము సర్వసభ్య సమావేశపు అజెండాను ఆమోదించామని తెలిపారు. మళ్లీ పాత పద్ధతిలోనే ఏకపక్షంగా పనులు ఆమోదింపచేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై ఎంపీ కృష్ణదేవరాయలు సమాధానం చెప్పాలన్నారు. కమీషన్లు తీసుకుని పనులు ఆమోదిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. జెడ్పీని సొంత జాగీరుగా మార్చుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జెడ్పీలో రాజ్యాంగానికి వ్యతిరేకంగా పరిపాలన కొనసాగుతోందని ఆరోపించారు. సమావేశంలో కందుల సిద్ధయ్య, సంకటి నాగమల్లేశ్వరి, షేక్ గుల్జార్ బేగం, మూలగొండ్ల కృష్ణకుమారి, తుమ్మల సుబ్బారావు, తుమ్మా విజయప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో విశేష పూజలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యషష్టి సందర్భంగా దేవాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం వేకువజామున స్వామి వారికి భక్తుల సమక్షంలో అర్చకులు శంకరమంచి రాజశేఖరశర్మ మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి పదకొండు గంటల వరకు అర్చకులు అభిషేకాలు చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకుని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానం ఆచరించారు. ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు చేశారు. అనంతరం అమరేశ్వరుడిని దర్శించుకున్నారు. సుబ్రహ్మణ్య షష్టి ప్రత్యేక పూజలలో పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు వైద్య విధులే కేటాయించాలి

గుంటూరు మెడికల్: సచివాలయ ఏఎన్ఎంలకు వైద్య విధులతోపాటు పంచాయతీ సంబంధిత పనులు కూడా అప్పగించడంతో వారు సతమతం అవుతున్నారని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు బి.నాగవర్ధన్ తెలిపారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఏఎన్ఎంలను వైద్య ఆరోగ్యశాఖకు చెందిన విధులు మాత్రమే నిర్వహించేలా చూడాలని డీఎంహెచ్ఓను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.కిరణ్, జిల్లా, సిటీ నేతలు ఎండీ షరీఫ్, నరేంద్ర బాబు, నరసింహారావు, వెంకట్ తదితరులు ఉన్నారు.

జిల్లా కోర్టులో బార్ కౌన్సిల్ ఎన్నికల కోలాహలం

గుంటూరు లీగల్ : ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి బుధవారం గుంటూరు జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కౌన్సిల్ మెంబర్‌గా పోటీ చేస్తున్న హైకోర్టు అడ్వకేట్ కొమ్మసాని శ్రీనివాసరెడ్డి గుంటూరు విచ్చేశారు. జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి తన అభ్యర్థిత్వాన్ని బలపరిచి గెలిపించాలని కోరారు. న్యాయవాదులు పెద్ద సంఖ్యలో ఆయన వెంట ఉన్నారు.

వైదిక మార్గంతోనే లోకహితం

తెనాలి: జనబాహుళ్యం వైదిక మార్గాన్ని అనుసరించినప్పుడే లోకానికి హితం చేకూరుతుందని జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీవిద్యాశంకర భారతీస్వామి స్పష్టం చేశారు. పట్టణ నాజరుపేటలోని విద్యాశంకర భారతి నృసింహ సదనాన్ని బుధవారం భారతీస్వామి సందర్శించారు. వేదిక్ బ్రాహ్మణ సేవాసమాఖ్య పర్యవేక్షణలో నిర్మించిన నృసింహ సదనాన్ని సందర్శించాక, సంతోషం వ్యక్తం చేశారు. భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. ధార్మిక ప్రచార కర్త అబ్బూరి వెంకాయమ్మ పీఠానికి రాసిచ్చిన స్థలాన్ని నృసింహ సదనానికి ఇచ్చినట్టు తెలిపారు. సమాఖ్య అధ్యక్షులు అమ్మన్ని సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి, తాడేపల్లి నాగ సుబ్రహ్మణ్యం, కుందేటి సుబ్రహ్మణ్యం కామేశ్వరరావు, తాడేపల్లి శివకుమార్, నందివెలుగు విజయసారథి, మేడూరి శ్రీనివాసమూర్తి, దీవి లక్ష్మీ నరసింహాచార్యులు, దీవి జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

జెడ్పీలో రాజ్యాంగ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు రాజ్యాంగ పీఠికను ఉద్యోగులందరితో చదివించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, ఏవో శామ్యూల్ పాల్, పలువురు జెడ్పీటీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

29 నుంచి పల్నాడు బాలోత్సవం

నరసరావుపేట: పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో ఈ నెల 29, 30వ తేదీలలో మూడవ పిల్లల పండగను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని బాలోత్సవం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, కట్టా కోటేశ్వరరావు వెల్లడించారు. బుధవారం కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ చిన్నారులలో సృజనాత్మకత, దేశభక్తి, అభ్యుదయ భావాలు పెంచేలా నిర్వహిస్తున్నామని న్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగే పోటీలలో 200కుపైగా పాఠశాలలు పాల్గొంటారని చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లలో దైన్యం

తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహకు సమస్యలు చెబుతున్న రైతులు

- అన్నదాతలకు తప్పని కష్టాలు
- కొనుగోలు చేసినా రవాణాలో జాప్యం
- సరిపడా గోతాలు లేక మరో సమస్య
- పచ్చి ధాన్యం క్వింటాకు రూ.1,300 మాత్రమే
- తేల్చి చెబుతున్న వ్యాపారులు

తెనాలి/కొల్లిపర: ధాన్యం కొనుగోళ్ల విషయంలో అధికారుల మధ్య సమన్వయలోపంతో అన్నదాతలకు అవస్థలు తప్పటం లేదు. కొనుగోలు చేసిన గంటల్లోనే రైతు ఖాతాకు నగదు జమ చేస్తామని సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆచరణలో ధాన్యం లోడు రవాణాకు రోజులు పడుతోంది. హార్వెస్టరుతో నూర్పిడి చేసిన ధాన్యంలో మట్టిగడ్డలు, చెత్త ఉంటే కొనుగోలు కేంద్రం, బయట వ్యాపారులు కూడా తీసుకోవడం లేదు. కూలీలతో అదనపు ఖర్చులు భరిస్తూ రైతులు శుభ్రం చేయిస్తున్నారు. తుఫాన్ భయంతో అన్నదాతలు కొంచెం పచ్చిగానే నూర్పిళ్లు కానిచ్చేస్తున్నారు. ఆ కారణంగా వ్యాపారులు క్వింటాకు రూ.1,300 మాత్రమే ఇస్తున్నారు.

అసలు తరలిస్తే కదా...

కొల్లిపర మండల గ్రామం తూములూరులోని కొనుగోలు కేంద్రంలో మూడురోజుల క్రితం తీసుకున్న ధాన్యం లారీలకు అదేరోజున లోడింగ్ చేశారు. అవి వెళ్లేందుకు ట్రక్ షీట్ లేకపోవటంతో తూములూరు అడ్డరోడ్డులోనే నిలిచిపోయాయి. రెండో రోజుకు ట్రక్ షీట్ వచ్చినా, జీపీఎస్ లేకపోవటంతో అవాంతరం ఏర్పడింది. బుధవారం కూడా రోడ్డుపైనే లారీలు ఉన్నాయి. విలేకరులు గమనించి, ఫొటోలు తీసిన కొద్దిసేపటి తర్వాత వాటిని అక్కడ్నుంచి తరలించారు. బుధవారం సాయంత్రం తూములూరును సందర్శించిన తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహతో రైతులు తమ సమస్యలపై మొర పెట్టుకున్నారు. దీంతో సబ్ కలెక్టర్ అక్కడ్నుంచే పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సమాచారమిచ్చారు. అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. సరిపడా గోతాలు అందించాలని ఆదేశించారు. 24 గంటల్లో 3 వేల గోతాలు అందుబాటులో ఉంటాయని రైతులకు చెప్పారు.

తూములూరు అడ్డరోడ్డు వద్ద నిలిచిన ధాన్యం లోడు లారీలు

జెడ్పీ అతిథి గృహానికి తాళం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని జెడ్పీ ప్రాంగణంలో ఉన్న అతిథి గృహానికి తాళం వేయడంతో జెడ్పీటీసీలు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీకి చెందిన సభ్యులు కాసేపు విశ్రాంతి తీసుకుందామని అతిథి గృహానికి వెళ్లారు. కానీ తాళం వేసి ఉండటంతోపాటు కనీసం సమాధానం చెప్పేందుకు సైతం అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో మనస్తాపం చెందారు. జెడ్పీ నిధులతో నిర్మించిన అతిథి గృహంలోకి తమను వెళ్లనివ్వకుండా ఇలా చేయడం చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, అధికారులు పక్షపాత ధోరణికి నిదర్శనం అన్నారు. రాజ్యాగ దినోత్సవం సాక్షిగా తమకు అవమానం జరిగిందని ఆరోపించారు. జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, సంకటి నాగమల్లేశ్వరి, షేక్ గుల్జార్ బేగం, మూలగొండ్ల కృష్ణకుమారి, తుమ్మల సుబ్బారావు, తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

జెడ్పీ అతిథి గృహం గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు

కురగల్లు బాధితులకు న్యాయం జరిగేనా?

- దర్యాప్తు తీరుపై పలు అనుమానాలు
- రైతుల నుంచి తీవ్ర ఆరోపణలు
- వాటాలు పంచుకున్నారంటూ మండిపాటు
- నిందితులు రూ.కోట్ల ఆస్తులు ఎలా కొన్నారని ఆగ్రహం
- సామాన్య ఉద్యోగులకు ఆస్తులెలా వచ్చాయో తేల్చాలి
- డిమాండ్ చేస్తున్న బాధిత అన్నదాతలు

ధర్నా చేస్తున్న బాధితులు (ఫైల్)

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో సంచలనం రేపిన కురగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం లిమిటెడ్ నకిలీ డిపాజిట్ బాండ్ల వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉండడంతో విచారణపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. కురగల్లు పీఏసీఎస్ సీఈవో రమేష్ 2014 నుంచి ఇలాగే దోపిడీ చేస్తున్నాడని, అది బయట పడకుండా మధ్యలో నగదు చెల్లించాడని రైతులు ఆరోపిస్తున్నారు. రూపకల్పన చేసిన వ్యక్తి రమేష్ అయితే.. అమలు చేసింది ఔట్‌సోర్సింగ్‌లో చేస్తూ ప్రస్తుతం పర్మినెంట్ అయిన వ్యక్తితోపాటు అదే గ్రామానికి చెందిన ఓ రాజకీయ నాయకుడని రైతులు అంటున్నారు.

అన్ని ఆస్తులెలా వచ్చాయి?

రమేష్ తన వాటా సొమ్ముతో విజయవాడలో ప్లాట్లు కొని నిర్మాణాలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ పీఏసీఎస్‌లో పనిచేసిన మరో వ్యక్తికి, వారి కుటుంబ సభ్యులందరికీ కలిపి 70 సెంట్ల పొలం మాత్రమే ఉంది. రమేష్‌కు రూ.30 వేల జీతం, తండ్రికి ఒక కొట్టు, అన్నయ్యకు సచివాలయంలో రూ.15 వేల జీతం వస్తుంది. అలాంటి వారు సంవత్సర కాలంలో మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 2 ఎకరాల పొలం, నాలుగు చోట్ల ప్లాట్లు, రూ.కోటి విలువైన బంగారం కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బంగారం డీజీసీసీ కుంభకోణం బయటకు వచ్చిన సమయంలో మంగళగిరిలో కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో ఆయన సోదరుడి పేరు మీద భూమిని కొనుగోలు చేశారు. మరికొంత డబ్బులు వారి బంధువుల ఇంట్లో దాచిపెట్టినట్లు సమాచారం.

కురగల్లు సొసైటీ కార్యాలయం బోర్డు

కంప్యూటర్ ఆపరేటర్ కీలకపాత్ర

కురగల్లు పీఏసీఎస్‌లో జరిగిన కుంభకోణంలో కీలకపాత్ర పోషించింది కంప్యూటర్ ఆపరేటర్ అని, ప్రత్యేక పరిపాలన కారణంగా సొసైటీ ప్రెసిడెంట్ లేకపోవడంతో రమేష్‌తో కలిసి ఇలా చేశారన్నారు. గుంటూరు ప్రధాన కార్యాలయం నుంచి బాండు పేపర్లకు సంబంధించి సీరియల్ నెంబర్ ఒక బుక్ పంపిస్తారని, అది కాకుండా వీరు ప్రత్యేకంగా తయారు చేసిన వాటిపై నమోదు చేసి తమకు ఇచ్చినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు సక్రమంగా దర్యాప్తు చేసి వారు సంపాదించిన అక్రమ ఆస్తులను జప్తు చేసి త్వరితగతిన తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. లేకుంటే రాజధానికి భూములు ఇచ్చిన తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

నకిలీ డిపాజిట్ పత్రాలే కాకుండా ఒరిజనల్ వాటి స్థానంలో కూడా నకిలీవి పెట్టి విత్‌డ్రా చేసిన రమేష్‌పై విచారించి అక్టోబర్ 30వ తేదీన ఆయన్ను సస్పెండ్ చేశారు. ఆ విషయం రైతులకు కానీ, స్థానిక అధికారులకు కానీ తెలియజేయలేదు. దీంతో మరికొందరు రైతులు మళ్లీ డిపాజిట్ చేశారు. అప్పటి నుంచి రమేష్ మరో ఐదుగురు రైతులకు చెందిన రూ.6.70 లక్షలను డిపాజిట్ చేసినట్లు విచారణలో తేలింది.

ఎవరి వాటాలు వారికి...

ఈ కుంభకోణంలో జరిగే అవకతవకలు తెలుసుకునేందుకు కురగల్లు పీఏసీఎస్‌లో ఔట్‌సోర్సింగ్‌లో ఒకరికి ఉద్యోగం ఇచ్చినట్లు తెలుస్తోంది. కురగల్లు గ్రామానికి చెందిన ఓ రాజకీయ నాయకుడికి దీనిలో 10 శాతం, రమేష్‌కు 60 శాతం, 20 శాతం సహకరించిన కీలక వ్యక్తికి, 10 శాతం ఖర్చుల నిమిత్తం వాటాలు తీసుకున్నట్లు బాధితులు చర్చించుకుంటున్నారు. నకిలీ బాండ్ల వ్యవహారం బయటకు వచ్చే సమయానికి ఆ రాజకీయ నాయకుడు తన నకిలీ బాండ్లు ఇచ్చి సొమ్ము రికవరీ చేసుకున్నట్లు చర్చ జరుగుతోంది. కురగల్లులో రమేష్‌పాటు పనిచేసిన వ్యక్తిని మంగళగిరి పోలీసులు నామమాత్రంగా విచారించి వదిలివేశారు. ఈ వ్యవహారంలో అతనితోపాటు ఆయన సోదరుడిని విడివిడిగా విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, రమేష్ ఎక్కడున్నాడో తెలుస్తుందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. మంత్రి నారా లోకేష్‌తోనే ఇది సాధ్యపడుతుందని ఆయన దృష్టికిఎలా తీసుకువెళ్లాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సర కాలంగా ఈ వ్యవహారం కురగల్లు పీఏసీఎస్‌లో జరుగుతున్నా... మంగళగిరి జీడీసీసీ బ్రాంచ్‌లో గతంలో పనిచేసిన చీఫ్ మేనేజర్ మహేంద్రకు కూడా సంబంధాలు ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మహేంద్ర తుళ్లూరులో మేనేజర్‌గా ఉన్నారన్నారు. ఆయన్ను కూడా విచారిస్తే పలు విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

పీజీ ఫలితాల్లో కీర్తికి రాష్ట్ర ప్రథమ ర్యాంక్

కళాశాల ప్రతినిధులు అభినందన

గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లాలోని కాటూరి మెడికల్ కాలేజ్ సామాజిక వైద్య విభాగం పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ వేమూరి కీర్తికి పరీక్ష ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ లభించింది. ఈ మేరకు బుధవారం కళాశాల యాజమాన్యం ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించింది. పీజీ పరీక్షా ఫలితాల్లో 800 మార్కులకుగాను డాక్టర్ వి.కీర్తికి 594 మార్కులు వచ్చాయని కళాశాల యాజమాన్యం తెలిపింది. కమ్యూనిటీ మెడిసిన్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన డాక్టర్ కీర్తికి కళాశాల చైర్మన్ కాటూరి సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్ సైరారావు, డీన్ డాక్టర్ సి.హెచ్.మోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చైతన్య, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి.ఫణీంద్రలు అభినందనలు తెలిపారు.

డాక్టర్ వేమూరి కీర్తి

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1000 గరిష్ఠం : రూ. 1400

మోడల్ ధర రూ. 1200

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	40,236
అమ్మకాలు	38,579
నిల్వ	10,972

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,500
నంబరు–5	11,000–15,500
341	10,500–17,300

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	11,500–17,400
నంబరు–5	10,500–16,000
341	11,500–17,600
4884	12,000–14,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,800
బాడిగ–355	10,500 – 17,700
దేవనూరు డీలక్స్	11,000 – 17,000
ఆర్మూర్	10,000 – 13,500
తాలుకాయలు	5,500 – 8,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,300
బాడిగ – 355	11,000–17,700
దేవనూరు డీలక్స్	10,500–16,500
తాలు	5,200 – 8,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 74

కొమ్ములు : 25 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,050	12,050	12,050

కాయలు : 49 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,500	11,300	11,300

మొత్తం అమ్మకాలు : 55.50 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మారువేషంలో జీజీహెచ్‌లో తనిఖీలు

- వైద్య సిబ్బంది పనితీరు పర్యవేక్షణ
- కొంత మేరకు లోపాలు గుర్తింపు
- సరిచేసుకోవాలంటూ హెచ్చరికలు

రోగిగా రాత్రి సమయంలో చికిత్స కోసం వచ్చిన సూపరింటెండెంట్

మారువేషంలో తనిఖీలు చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ

గుంటూరు మెడికల్: పేదల పెద్ద ఆసుపత్రి గుంటూరు జీజీహెచ్‌లో రాత్రిళ్లు వైద్య సేవలు సరిగా అందడం లేదని ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. రాత్రిళ్లు అధికారులు ఆసుపత్రిలో ఉండకపోవడంతో పేద రోగులకు సకాలంలో వైద్య సేవలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేద రోగులకు సేవలందేలా చూడాల్సిన ఆసుపత్రి సూపరింటెండెంట్ పట్టించుకోవడం లేదనే విషయమై 'సాక్షి'లో ఈనెల 8న 'చిక్కరు.. దొరకరు...!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మంగళవారం రాత్రి రోగి మాదిరిగా మారువేషంలో క్యాజువాలిటీకి వెళ్లారు.

వేషం మార్చినా గుర్తించలేకపోయారు

సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ రోగి లాగా వేషం మార్చి తలకు విగ్గుపెట్టుకుని, మాసిన చొక్కా ధరించి, మూతికి మాస్క్ ధరించి, చేతి కర్రతో క్యాజువాలిటీకి వెళ్లారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న ఉద్యోగినిని సైతం గెటప్ వేయించి తన సహాయకురాలిగా వెంట తీసుకెళ్లారు. బయట పరిచయం ఉన్న ఓ వ్యక్తిని తన సహాయకుడిగా వెంట తీసుకెళ్లారు.

➡ క్యాజువాలిటీలో దగ్గుకుంటూ డ్యూటీలో ఉన్న వైద్యుల వద్దకు వెళ్లారు. తీవ్రంగా దగ్గుతుండటంతో ఒకింత అసహనానికి గురైన జూనియర్ వైద్యులు దగ్గేవారు వేరే గదిలోకి వెళ్లి చూపించుకోవాలని పంపించి వేశారు. వైద్యులు పరీక్షలు చేసి, ఈసీజీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేయించుకోవాలని చీటీ రాసి ఇచ్చారు.

➡ చీటీ తీసుకుని ఈసీజీ గదిలోకి వెళ్లగానే అక్కడ పనిచేస్తున్న ఉద్యోగి ఒకింత అసహనంతో ముందు ఎక్స్‌రే పరీక్ష చేయించుకుని రావాలని, తరువాత ఈసీజీ తీస్తానని వెల్లడించారు. దీంతో సూపరింటెండెంట్ ఏమీ మాట్లాడకుండా ఎక్స్‌రే తీయించుకుని మరలా ఈసీజీ గదికి వచ్చారు. ఈసీజీ టెక్నీషియన్ స్టూడెంట్‌తో పనిచేయించడం తాను ఇతర వ్యాపకాల్లో ఉంటున్న విషయాన్ని గమనించారు.

➡ ఈసీజీ పరీక్ష అనంతరం మందులు తీసుకునేందుకు ఫార్మసీ గదికి వెళ్గా చేతిలో మందులు పెట్టి వెళ్లిపోవాలని సూచించారు. మందులు కవర్‌లో పెట్టి ఇవ్వాలి కదా అని సూపరింటెండెంట్ ప్రశ్నించగా, ఫార్మాశిస్టులు కవర్లు మాకు సప్లయి లేవని, కవర్లు కావాలంటే వెళ్లి సూపరింటెండెంట్‌ను అడగాలని ఆయనకే కాస్తంత కరువుగా సూచించారు.

➡ అనంతరం కాన్పుల విభాగానికి వెళ్లగా, అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, వైద్య సిబ్బంది లోపలికి రాకుండా అడ్డుకున్నారు. గర్భిణులు, మహిళలు లోపల ఉంటారని, లోపలకు అనుమతించమని చెప్పడంతో వెనుదిరిగారు.

➡ అనంతరం జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, మెడిసిన్, సర్జరీ వార్డులు సూపరింటెండెంట్ తనిఖీ చేశారు. సుమారు 3 గంటలకు పైగా ఆసుపత్రిలో మారువేషంలో సూపరింటెండెంట్ తనిఖీ చేసిన విషయాన్ని ఒక్కరు కూడా గుర్తించకపోవడం గమనార్హం. కాగా సూపరింటెండెంట్ తనిఖీల్లో అందరూ విధుల్లో ఉండటం ఆశ్చర్యకరమైన విషయం.

సీఎస్ ఆర్ఎంఓ ఎక్కడ?

ఆసుపత్రిలో సూపరింటెండెంట్ తరువాత సివిల్ సర్జన్ ఆర్ఎంఓ పోస్టు కీలకం. ఆసుపత్రిలోనే నివాసం ఉండి ముఖ్యంగా రాత్రి వేళల్లో విధుల్లో ఉండి, వైద్య సేవలు రోగులకు సకాలంలో అందేలా చూడాల్సిన బాధ్యత సీఎస్ఆర్ఎంఓదే. ఆసుపత్రిలో సీఎస్ ఆర్ఎంఓగా డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓలుగా డాక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఆర్ఎంఓలుగా డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీదేవి ప్రియలు పనిచేస్తున్నారు. సూపరింటెండెంట్ తనిఖీలకు వచ్చిన సమయంలో నలుగురిలో ఒక్కరు కూడా విధుల్లో లేరు. అయినప్పటికీ ఆసుపత్రిలో అందరూ విధుల్లో ఉన్నారని సూపరింటెండెంట్ మీడియాకు తెలియజేయడం వాస్తవానికి దూరంగా ఉంది.

రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది

డీఆర్వో షేక్ ఖాజావలి, డీఈఓ రేణుకలతో బహుమతులు సాధించిన విద్యార్థులు

ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి తదితరులు

అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి

నగరంపాలెం: రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం భారత దేశ ప్రజాస్వామ్యానికి పునాది అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను రక్షించే పవిత్ర గ్రంథమని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ దూరదృష్టి, నిబద్ధత, కృషి వల్లే ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని భారతదేశం పొందిందన్నారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో..

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా ఏఎస్పీలు (పరిపాలన) జీవీ.రమణమూర్తి, హనుమంతు (ఏఆర్) పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఎస్ఐ ఏసురాజు, ఏఓ వెంకటేశ్వరరావు, ఎస్బీ సీఐ రాంబాబు, ఆర్ఐ సురేష్ పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో...

గుంటూరు లీగల్: గుంటూరుబార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవం బుధవారం నిర్వహించారు. గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగళశెట్టి శివ సూర్యనారాయణ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ విలువల గురించి వివరించారు. సీనియర్ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, విధులు దేశాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నాయన్నారు. న్యాయవాది రాయపూడి మణి మాట్లాడుతూ ప్రతి పౌరుడికి సమానత్వం రాజ్యాంగం కల్పించిందన్నారు. న్యాయవాదులు పి.కళ్యాణి, మదిర నాగేశ్వరరావు, చంద్రశేఖర్, ఇమ్మడి వెంకట్రావు, ఆనంద్, పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

గుంటూరు వెస్ట్: రాజ్యాంగం మన ప్రజాస్వామ్యానికి పునాదని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి తెలిపారు. సంవిధాన్ దివస్–రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలైన విద్యార్థులకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో డీఆర్వో, డీఈఓ రేణుక సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ భిన్న మతాలు, సంస్కృతులు ఉన్న దేశంలో ప్రజలందరినీ ఒక్కతాటి మీద నడిపించటం ఒక్క రాజ్యాంగం వల్లే సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో పలువురు విద్యార్థులు రాజ్యాంగంలోని పలు అంశాలను వివరించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న 8 మంది జిల్లా విద్యార్థులను డీఆర్ఓ అభినందించారు.

లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో...

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి మాట్లాడుతూ భారతరాజ్యాంగం పౌరులందరికి ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించేందుకు, మత ఆరాధనలో స్వేచ్ఛను కల్పిస్తుందని తెల్పిపారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ, ఇంజినీ రింగ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ, కంప్ట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ డి.సంపత్‌కుమార్, కంట్రోలర్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే దిక్సూచీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

- చంద్రబాబుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటే గౌరవం లేదు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటే సీఎం చంద్రబాబుకు గౌరవం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని బృందావన్‌గార్డెన్స్‌లో జిల్లా పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటున్నారంటే అది రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పుణ్యమేనన్నారు. గత ప్రభుత్వ హాయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అండగా నిలవడంతో పాటు..విజయవాడ నడిబొడ్డులో అంబేడ్కర్ స్మృతి వనం నిర్మిస్తే..ఈనాడు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం అంబేడ్కర్ స్మృతి వనం విజయవాడలో నిర్మిస్తారా అంటూ వనంపై దాడి చేయడంతో పాటు స్మృతివనాన్ని ఆవిష్కరించిన శిలాఫలాకాన్ని ధ్వంసం చేసినవారిపై ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.
– ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ దేశంలో ఎన్నో మతాలు, కులాలు, వర్గాల వారు ఉన్నప్పటికి వారందరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమకాలీన రాజ్యాంగం రచించడం ద్వారానే ఈనాడు దేశం సుభిక్ష ఉందన్నారు. తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎన్నో కష్టాలు పడి రాజ్యాంగాన్ని రచించారని..దాని ఫలితంగా అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి నియోజకవర్గ పరిశీలకులు గులాం రసూల్, మిర్చి యార్డ్ మాజీ ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు.

ఎన్ఐ యాక్ట్ కేసులో వ్యక్తి అరెస్ట్

లక్ష్మీపురం: ఎన్ఐ యాక్ట్ కేసులో శిక్ష విధింపబడి పరారీలో ఉన్న వ్యక్తిని పట్టాభిపురం పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల ప్రకారం మారుతీనగర్ ప్రాంతానికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తికి, ఏటీ అగ్రహారం ప్రాంతానికి చెందిన శివనాగ రాజు కుమార్ అనే ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో సుబ్బారావు, నాగరాజుపై కోర్టును ఆశ్రయించగా న్యాయమూర్తి నాగరాజుకు ఎన్ఐ యాక్ట్ కేసులో శిక్ష విధించారు. అయితే పరారీలో ఉన్న నాగరాజును పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

జీజీహెచ్‌లో నూతన ఓపీ పీఎస్‌కు భూమిపూజ

ఓపీ పీఎస్‌కు భూమిపూజ చేస్తున్న సూపరింటెండెంట్ రమణ యశస్వి

సాక్షి ఎఫెక్ట్

నగరంపాలెం: గుంటూరు జీజీహెచ్‌లో ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ (ఓపీ పీఎస్) పునఃనిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈనెల 18న సాక్షి దినపత్రికలో 'ఖాకీలకు నిలువ నీడ కరువు' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ క్రమంలో అత్యవసర సేవల చికిత్సా విభాగం ఎదుట ఖాళీ స్థలంలో సూపరింటెండెంట్ రమణ యశస్వి, దాత నగరంపాలెంలోని నందన ఆసుపత్రి నిర్వాహక వైద్యురాలు నందన, ఆమె కుటుంబ సభ్యులు హాజరై శంకుస్థాపన చేశారు. పాత ఓపీ పీఎస్‌ను శంకర్‌విలాస్ రైల్వే ఓవర్‌బ్రిడ్జి పునః నిర్మాణ పనుల్లో భాగంగా తొలగించనున్నారు. నాలుగు నెలల వ్యవధిలో నూతన హంగులతో ఓపీ పీఎస్‌ను నిర్మించేందుకు పనులు చకచకగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సీనియర్ సర్జన్ బాలభాస్కర్, కొత్తపేట పీఎస్ సీఐ వీరయ్య చౌదరి పాల్గొన్నారు.

బంగారు నగల అపహరణ

బత్తలపల్లి: గుంటూరు జిల్లా వెలగపూడిలోని ఏపీ సెక్రటేరియట్‌లో అగ్రికల్చర్, కార్పొరేషన్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ప్రేమింద్రావతి బస్సులో ప్రయాణిస్తుండగా ఆమె బ్యాగ్‌లోని బంగారు నగలు ఉన్న బాక్స్‌ను దుండగులు అపహరించారు. ఘటనపై శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. వివరాలు... తాడిమర్రి మండలం దాడితోట గ్రామంలో నివాసముంటున్న తన మేనమామ ఇంట శుభకార్యంలో పాల్గొనేందుకు సిద్ధమైన ప్రేమింద్రావతి ఈ నెల 23న తన అత్తింటికి వెళ్లి రెండు బంగారు గాజులు, ఓ జత కమ్మలు తీసుకుంది. వీటిని ఓ బాక్స్‌లో ఉంచి దానిని ల్యాప్‌టాప్‌తో పాటు బ్యాగ్‌లో పెట్టుకుని ఈ నెల 24న కర్నూలు నుంచి బయలుదేరి అనంతపురం మీదుగా అదే రోజు మధ్యాహ్నం 2.15 గంటలకు బత్తలపల్లిలోని నాలుగురోడ్ల కూడలిలో దిగింది. అనంతరం దాడితోటకు వెళ్లేందుకు రద్దీగా ఉన్న బస్సు ఎక్కిన ఆమె కొంత దూరం వెళ్లిన తర్వాత తన బ్యాగ్‌ను పరిశీలించుకుంది. జిప్‌లు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి బ్యాగ్‌ను పరిశీలించింది. అందులో బంగారు నగలు ఉంచిన బాక్స్ కనిపించలేదు. బస్సు దాడితోటకు చేరిన తర్వాత తన మేనమామకు జరిగిన విషయాన్ని వివరించింది. బుధవారం ఉదయం భర్త తులసీనాథ్‌రెడ్డితో కలిసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు

పట్నంబజారు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలతో ముందుకు సాగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి రవీంద్రారెడ్డి విమర్శించారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నాలుగు కార్మిక వ్యతిరేక కోడ్‌లను తీసుకుని రావటం దారుణమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కార్మికులు సాధించుకున్న హక్కులను హరించేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వేతన బోర్డులో గతంలో కార్మిక సంఘాల నాయకులు సైతం సభ్యులుగా ఉండేవారని, కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన కార్మిక వ్యతిరేక చట్టాలతో కార్మిక సంఘాలకు వేతన బోర్డులో చోటు లేకపోవటం బాధాకరమన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయటం ఏ మాత్రం సబబు కాదన్నారు. రాష్ట్రంలో 85.86 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులకు మోదీ తీసుకురానున్న నూతన చట్టాలు ఇబ్బందికరంగా మారనున్నాయని తెలిపారు. ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతన చట్టాలు హరించే పరిస్థితి నెలకొంటుందని, ఇదీ కార్మికుల కడుపు కొట్టే నిర్ణయమని దుయ్యబట్టారు. చంద్రబాబు సైతం కేంద్రం చెప్పిన విధంగా వ్యవహరించటం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేకి అయిన చంద్రబాబుకి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు.

రాజధానిలో నిర్మాణ కంపెనీ వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

డ్రైవర్ సీటు వదిలి పక్కన ఉన్న వ్యక్తికి డ్రైవింగ్ ఇవ్వడంతో ఘటన

మృతిచెందిన వృద్ధుడు సుందరరావు

శాఖమూరు(తాడికొండ): రాజధాని ప్రాంతంలో నిర్మాణ కంపెనీకి చెందిన వాహనం ఢీ కొట్టడంతో ఓ వృద్ధుడు దుర్మరణం పాలైన ఘటన తుళ్ళూరు మండలం శాఖమూరు గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం.. ఓ నిర్మాణ కంపెనీకి చెందిన వ్యాను శాఖమూరు గ్రామం మీదుగా వెళుతూ అదుపుతప్పి రోడ్డు పక్కన కూర్చున్న కూకట్లపల్లి సుందరరావు (70) అనే వృద్ధుడిని బలంగా ఢీకొట్టి తొక్కించుకొని ముందుకు వెళ్లడంతో వృద్ధుడు ఘటనా స్థలంలోనే ప్రాణాలొదిలాడు. స్థానికులు డ్రైవర్‌ను, డ్రైవర్ పక్కన కూర్చుని ఉన్న వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. డ్రైవర్ తన సీటు వదిలి గ్యాస్ వెల్డింగ్ చేసే నిర్మాణ కార్మికుడికి డ్రైవింగ్ ఇవ్వడంతోనే ఘటన జరిగిందని ఒప్పుకోవడంతో స్థానికులు తమదైన శైలిలో దేహశుద్ధి చేసి ఇచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి డిమాండ్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. నిర్మాణ కంపెనీకి చెందిన లారీలు, వాహనాలు అధిక వేగంతో రోడ్లపై తిరుగుతుండటంతో నిత్యం ప్రమాదాలకు కారణంగా మారుతుందని, గ్రామాల్లో ఇకపై వాహనాలు తిరగనివ్వమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో నుంచి సరుకు రవాణా చేయకుండా ప్రత్యామ్నాయ రహదారులు ఏర్పాటు చేసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. నిర్మాణ కంపెనీ ప్రతినిధులు ఎవరూ ఘటనా స్థలానికి చేరుకోకపోవడంతో ఆందోళన కొనసాగుతూనే ఉంది.

పోక్సో కేసులో యువకుడు అరెస్ట్

లక్ష్మీపురం: బాలికను అపహరించిన కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం, కోనూరు గ్రామానికి చెందిన పాగేల్లి తిరుపతయ్య అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన ప్రస్తుతం గుంటూరు లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద ఓ అపార్ట్‌మెంట్‌లో సోదరుడి వద్ద ఉంటున్న మైనర్ బాలికకు ఫోన్‌లో మాయ మాటలు చెప్పి ఈనెల 7వ తేదీన అపహరించాడు. దీంతో మైనర్ బాలిక కుటుంబ సభ్యులు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలికను తీసుకు వెళ్లిన కేసులో వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ ప్రత్యేక బృందంతో గాలింపులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తిరుపతయ్య ఈనెల 23న యువతిని వదిలి పరారవ్వడంతో డీఎస్పీ తిరుపతయ్యను అదుపులో తీసుకుని కోర్టుకు హాజరు పరచగా.. కోర్టు నిందితుడికి రిమాండ్ విధించింది.

భార్య మరణానికి కారకుడైన భర్తకు యావజ్జీవం

మేడికొండూరు: భార్యపై అనుమానంతో వేధించి, ఆమె మరణానికి కారణమైన ఓ వ్యక్తికి గుంటూరు కోర్టు జీవిత ఖైదు విధించింది. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలో 2015లో జరిగిన ఈ ఘటనపై గుంటూరు ఒకటో అదనపు జిల్లా జడ్జి వి.ఎ.ఎల్ సత్యవతి బుధవారం కీలక తీర్పు వెలువరించారు. సిరిపురానికి చెందిన కె. హరికృష్ణ తన భార్య ఆదిలక్ష్మి (24)ని అనుమానంతో తరచూ వేధించేవాడు. 2015 మార్చిలో ఆమెపై కత్తితో దాడి చేయడంతో పాటు, అత్తా ఆడపడుచుల వేధింపులు తాళలేక ఆదిలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. చనిపోయే ముందు ఆమె ఇచ్చిన మరణ వాంగ్మూలం ఈ కేసులో కీలక సాక్ష్యంగా నిలిచింది. పోలీసుల దర్యాప్తు, పటిష్టమైన సాక్షాధారాలు పరిశీలించిన న్యాయస్థానం నిందితుడు హరికృష్ణను దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించింది. పదేళ్ల తర్వాత బాధితురాలికి న్యాయం జరగడం పట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హర్షం వ్యక్తం చేశారు. కేసును సమర్థవంతంగా విచారించిన మేడికొండూరు పోలీసులను, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

■ చీరాల పట్టణములో నూతనంగా ప్రారంభం కానున్న వజ్రపూర్ణ ఆర్గానిక్ స్టోర్ నందు పనిచేయుటకు మహిళలు కావలెను ఆసక్తి కల మహిళలు సంప్రదించండి. Ph:98668 99390.

■ గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15000+3000. సం॥ 9121469383

గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనకర్తలు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఫారం నెం–3 (రెగ్యులేషన్స్–15(1)(ఎ) చూడుము)
డెట్స్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్ కోల్‌కతా – కోల్‌కతా వద్ద
అప్పీల్ నెం. 107 ఆఫ్ 2025
(అప్పీల్ డెయిరీ నెం. 1212 ఆఫ్ 2025)
ఐడీలీ ఒరిజినల్ అప్లికేషన్ నెం.10 ఆఫ్ 2023లో తేది.17.09.2025 నాటి ఆర్డర్ నుండి జారీచేయబడినది
(పాత O.A. నెం.954 ఆఫ్ 1999 ఆఫ్ డిఆర్‌టి-1, హైదరాబాద్ మరియు నెం.774 ఆఫ్ 1997 ఆఫ్ డిఆర్‌టి. బెంగళూరు) (డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2 హైదరాబాద్)
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రిజిస్ట్రార్.
డెట్స్ రికవరీ అప్పీలేట్ ట్రిబ్యునల్. కోల్‌కతా

కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695. ఇ-మెయిల్ : armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది & సమయం : తేది.17.12.2025, మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు. ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 17.12.2025, మ॥ 12.00 గం.ల లోపు. రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 17.12.2025, మ॥ 12.00 గం.లలోగా పొందుపరచి జమ చేయాలి.

ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ	నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, నరసరావుపేట సబ్ డివిజన్, నాదెండ్ల మండలం, గొరిజవోలు గ్రామం	రూ. 237.00 లక్షలు	రూ. 23.70 లక్షలు

తేది : 24-11-2025, ప్రదేశం : విజయవాడ

క్లుప్తంగా

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

దుగ్గిరాల: నాబార్డు నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం శంకుస్థాపన చేశామని.. రైతులు పొలం పనులకు వెళ్లేందుకు అనువుగా, ఇబ్బందులు లేకుండా ఉంటుందని మండల ఎంపీపీ షేక్ జబీన్ తెలిపారు. బుధవారం దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేపట్టారు. జబీన్ మాట్లాడుతూ.. కంఠంరాజుకొండూరు గ్రామం నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకూ రూ.4 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనిత, శివ నాగ మల్లేశ్వరరావు, మండల నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా విష్ణువర్ధన్‌రావు

ఫిరంగిపురం: మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవో–జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా కె.విష్ణువర్ధన్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శిగా మేరికపూడి, మునగపాడు గ్రామాల్లో ఆయన పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన విష్ణువర్ధన్‌రావుకు డిప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఏవో రవిబాబు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరమే అందించేలా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణం కూల్చివేతపై విచారణ

మంగళగిరి టౌన్: ఇందిరానగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని కోర్టు ఉత్తర్వుల మేరకు ఎంటీఎంసీ అధికారులు ఈనెల 24వ తేదీ కూల్చివేశారు. దీనిపై హైకోర్టు అడ్వకేట్ కమిషన్ బుధవారం కూల్చివేసిన ఆలయ ప్రదేశాన్ని పరిశీలించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆలయ నిర్మాణాన్ని తొలగించారా లేదా అనే విషయాన్ని పరిశీలించినట్లు తెలుస్తోంది. పరిశీలించిన దానిపై నివేదిక తయారు చేసి కమిషన్ హైకోర్టుకు నివేదిక సమర్పించనున్నారు.

ఏపీ ఐఐసీ బోర్డు డైరెక్టర్‌గా చిరంజీవి

మంగళగిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్‌గా మంగళగిరికి చెందిన కనికళ్ల చిరంజీవిని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఏపీ ఐఐసీ బోర్డు డైరెక్టర్‌గా చిరంజీవి బుధవారం ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. తొలుత మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా ఏపీ ఐఐసీ కార్యాలయం చేరుకున్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులు చిరంజీవిని అభినందించి సత్కరించారు. ఈ పదవికి బాధ్యతాయుతంగా పనిచేస్తానని చిరంజీవి పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి

మంగళగిరి టౌన్: కార్మిక వర్గానికి నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఇళ్లు, స్థలాలు లేని నిరుపేదలకు స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బాలాజీ, పిల్లలమర్రి బాలకృష్ణ, జేవీ రాఘవులు, జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన

ఫిరంగిపురం: మండంలోని బేతపూడి, 113.తాళ్లూరు, యర్రగుంట్లపాడు గ్రామాల్లో జిల్లా ఉద్యాన అధికారి రవీంద్ర ఉద్యాన పంటపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో వాసంతి, ఎం.నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు గ్రీన్ బోర్డులు అందజేత

మంగళగిరి టౌన్: సీకే జూనియర్ కళాశాలకు మంగళగిరి రోటరీ క్లబ్ బుధవారం అధునాత గ్రీన్ బోర్డులను అందజేసింది. రోటరీ ఇంటర్నేషనల్ 7 ప్రాధాన్యత అంశాల్లో ఒకటైన ఎడ్యుకేషన్, లిటరసీలో భాగంగా కళాశాలకు ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం అధునాతన, సౌకర్యవంతమైన గ్రీన్ బోర్డులను అందించినట్లు క్లబ్ అధ్యక్షులు రాజశేఖర్ పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త వేమారెడ్డి ధ్వజం

అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, వేమారెడ్డి, పార్టీ నాయకులు

అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విశదల గ్రామంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: దేశం మొత్తం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నడుస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిలు ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మంగళగిరిలోని కొత్త బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురుగుడు, వేమారెడ్డి మాట్లాడుతూ.. మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఇదే స్ఫూర్తితో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతోకృషి చేసిందన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, మండల అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, పార్టీ నాయకులు మాతంగి బాబు, సంకె సునీత, పచ్చల రత్నకుమారి, మల్లవరపు సుధారాణి, ఈపూరి ఆదాం, కృష్ణ కిషోర్, కట్టెపోగు భూషణం, విక్టర్ ఇమ్మానుయేల్, సంసోనమ్మ, రాజారత్నం, చిన్నపోతుల దుర్గారావు, నూతక్కి జోష్, కలకోటి చక్రవర్తి, ఎండి ఫిరోజ్, గోరేబాబు, గంజి షణ్ముఖ్, అబ్దుల్ రజాక్, పి. రాంబాబు, దాసర ప్రియానందం, కవిత, నీలిమ, తమ్మిశెట్టి గౌతమి, వై. చక్రవర్తి, ప్రశాంత్, ఉదయ్, టి.రాంబాబు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకోటి మధు ఆధ్వర్యంలో బుధవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, ముదిగొండ ప్రకాష్, మేడా వెంకటేశ్వరరావు(పండు), సయ్యద్ సలాం, దర్శి రమేష్, చిల్లిమల్ల సుబ్బారావు, రొడ్డ ఎలీషా, బేతం రామాంజనేయులు, షేక్ హాజీ, బాలసాని అనిల్, హుస్సేన్, కోడిపిల్ల బాల కోటయ్య, గుర్రం రాంబాబు, కురగంటి ఉదయరాజు, బత్తుల దాసు, వివిధ వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడికొండూరు: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్దదని వైఎస్సార్ సీపీ మేడికొండూరు మండల అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా విశదల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మర్రి సుబ్బారావు, తమనంపల్లి శాంతయ్య, ముత్యాల బాలస్వామి, లూర్దు బాబు, కొరివి చెన్నయ్య, గండికోట రసూల్, కొరివి కిషోర్, రాజు, మిరియాల శివరామకృష్ణ, షేక్ జిలాని, షేక్ సుబాని, శ్రీను, నోసిన కోటేశ్వరరావు, లూర్దు రాజు, బుడే, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో..

తాడేపల్లి రూరల్: డోలాస్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ ఆమోద దినోత్సవ ఘనంగా నిర్వహించారు. అత్తోట పోతురాజు, గుడ్ షెపర్డ్ సిబ్బంది సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషుకుమారి, ఉపాధ్యాయులు అశోక్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు. స్థానిక ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ప్రతిజ్ఞ నిర్వహించారు.

ఫిరంగిపురం: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని బుధవారం శాంతిపేట సెంటర్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, పెరికల చిన్నా, దాసరి మెల్కియా, ఒ.పిచ్చిరెడ్డి, డి.సురేష్, షేక్ మస్తాన్‌వలి, ఐ.హేమలతారెడ్డి, ఎస్.సైదులు, ఇజ్రాయిల్, టి.కృష్ణ, కె.ప్రవీణ్‌రెడ్డి, రామయ్య, సాంబశివరావు, డి.బాబురావు, జి.రవి, టి.సాగర్, బి.శ్రీనివాసరెడ్డి, కె.బాలిరెడ్డి, నాగయ్య, డి.నరేంద్రకుమార్, పి.రాజు, జి.ప్రతాప్‌రెడ్డి, భాస్కర్, కె.ప్రాన్సిస్, వై.ఆశీర్వాదం, కె.రామారావు, జానీబాషలు పాల్గొన్నారు. నుదురుపాడు కార్యక్రమంలో విద్యాకమిటీ మాజీ చైర్మన్ షేక్.మస్తాన్‌వలి, హెచ్‌ఎం నల్ల మోతు రత్నబాబు.ఉపాధ్యాయులు ఏవీవీ లక్ష్మీ, డి.సమిత, సీహెచ్ దినేష్, షేక్ కరిష్మా, విద్యార్థులు పాల్గొన్నారు. ఫిరంగిపురం గ్రామంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్ నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవోలు షేక్.మహబూబ్ సుబానీ, రవికాంత్‌లు పాల్గొన్నారు. హెచ్‌ఎం శౌరిరాజు, ఇమ్మానియేల్, సుదర్శన్, వెళంగిణి రాజు, పి.ప్రసాద్, త్యాగరాజు, శ్రీనివాసరావు, చంద్రనాయక్, టి.వీరయ్య, కె.సంతోష్‌రావు, కె.సుదర్శన్, సీహెచ్ నాగేశ్వరరావు, సాగర్, ఇర్మియ, కె.రామారావులు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వేమవరంలో గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. కార్యదర్శి శౌరిజోజి, హెచ్‌ఎం శ్రీనివాస్ కార్తీక్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుబ్బయ్య, ఉపాధ్యాయుడు దివి, కమల్‌మోహన్, వెంకటేష్‌నాయక్, నాగలక్ష్మీ విద్యార్థులు పాల్గొన్నారు.

తాడికొండ: రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసిందని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. తాడికొండలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుంటి రఘువరన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తాడికొండ పోలీస్‌స్టేషన్ కూడలిలోని అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి, ఎస్సీ, యువజన, బీసీ విభాగం మండల అధ్యక్షులు గుంటి రఘువరన్, షేక్ అజీస్, దమ్మాటి మోహనరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాకి వెంకటస్వామి, వివిధ విభాగాల అధ్యక్షులు బొంతా శ్రీకాంత్, బోడపాటి ధర్మరాజు, బందెల సుమన్, షేక్ బాజీ, చిలకా రవి, పులి రమేష్, ఇసుకపల్లి రమేష్, ఖలీల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుళ్లూరు మండలంలో..

తుళ్లూరు పీహెచ్‌సీ ఎదురుగా గల అంబేడ్కర్ విగ్రహానికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరరావు, గ్రామపార్టీ అధ్యక్షులు కంతేటి చిన్న వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల నాయకులు కొప్పుల శేషగిరిరావు, బెజ్జం రాంబాబు, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, ఆలోకం సురేష్, కాకర్ల నాగేశ్వరరావు, షేక్ జానీ భాషా, సుంకర శ్రీనివాసరావు, కంతేటి బాలు, నేలపాటి వినోద్, బండి ప్రసాద్, పుట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి..

మంగళగిరి టౌన్: మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ పి.ఒ. ప్రేమ్ రాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడికొండ: తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోదం దినోత్సవం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సమతావాణి, ఎంఈవో తెనాలి ఇందిర, ఏపీఎం ఆర్.సాంబశివరావు, ఏవో చంద్రశేఖర్, ఈవోఆర్డీ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ ఆధ్వర్యంలో..

కొత్త బస్టాండ్ వద్ద గల ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. గౌతమ బుద్ధ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. స్థానిక బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, సంఘ నాయకులు క్రాంతికుమార్, పారేపల్లి మహేష్, రామకృష్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తాడికొండలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బీసీ సంఘ రాష్ట్ర కార్యాలయంలో సంఘం నాయకులు

ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

తాడేపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. వడ్డేశ్వరం కేబీ భవన్‌లో ఏపీ రైతుసంఘం గుంటూరు జిల్లా ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రచార ఆర్భాటాలు తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సి ఉండగా.. నరేంద్రమోదీ విధానాలను అవలంభిస్తూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. 2026 జనవరి 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐకేఎస్ ఆధ్వర్యంలో గుంటూరులో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘాల నాయకులు కంచుమాటి అజయ్, కాజా వెంకటేశ్వరరావు, కొర్రపోలు ఈశ్వరరెడ్డి, వల్లూరు భారతి, బిక్కి శ్రీనివాసరావు, ఇమ్మడి రామారావు, మాధవరెడ్డి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రాజధానిపై సమగ్ర చట్టం చేయాలి

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టమైన ప్రకటన చేయడంతో పాటు పార్లమెంట్‌లో సమగ్ర చట్టం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. బుధవారం ఉండవల్లి సెంటర్ నుంచి రాయపూడి సీఆర్డీయే కార్యాలయం వరకూ బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు ఇవ్వడంతో పాటు కేంద్ర కార్యాలయాలన్నీ కేంద్రమే నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. విభజన హామీ చట్టంలో పేర్కొన్న హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటేశ్వరరావు, రామారావు, ఆర్.వి. రాఘవయ్య, ఎస్కే పీరు సాహెబ్, ఈశ్వర్ రెడ్డి, భక్తిరెడ్డి, రామకృష్ణ, మేరి, వై.బర్నబాస్, పల్లె కృష్ణ పాల్గొన్నారు.

దళితుల పొలాలను కబ్జా చేసేందుకు కుట్ర!

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధి ఆత్మకూరులోని దళితులు సాగు చేసుకుంటున్న భూములను కబ్జా చేసేందుకు పలువురు స్థానికులు కుట్ర చేస్తున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్, మంగళగిరి తహసీల్దార్‌లకు స్థానిక రైతులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కంతేటి జీవన సాగర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరుకు చెందిన రైతు సింగంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పూర్వీకుల నుంచి 50 ఏళ్లుగా పొలం చేసుకుంటున్నామని, ఒక వారం రోజులుగా కొందరు కబ్జా దారులు ఆ పొలాల్లో మట్టి తోలించి ప్రొక్లయినర్లతో పొలాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే నారా లోకేష్ పేరు చెబుతున్నారని, లోకేష్ దీనికి వ్యతిరేకమని ఆయన మీద ఎలాంటి అభియోగం చేయడం లేదని పేర్కొన్నారు. సర్వే నెం.143/బీ లో ఉన్న భూములు కోర్టులో నడుస్తున్నాయని.. దీనిపై లోకేష్ పేరుతో కబ్జాదారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

టిడ్కో గృహవాసుల సమస్యలను పరిష్కరించాలి

మంగళగిరి టౌన్: నవులూరులోని టిడ్కో గృహ సముదాయ వాసులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఎంటీఎంసీ కమిషనర్‌కు విన్నవించుకున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నవులూరులో బుధవారం కమిషనర్ అలీమ్ బాషా విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా టిడ్కో గృహ సముదాయంలో ఉన్న మహిళలు కమిషనర్‌ను కలిసి సమస్యలను తెలియజేశారు. రాత్రి సమయాల్లో మందుబాబుల ఆగడాలు ఎక్కువ అయ్యాయని.. గృహ సముదాయ ఆవరణలో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రం అద్దాలను సైతం ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో మందుబాబుల వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాత్రి సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. స్పందించిన కమిషనర్ మందుబాబుల ఆగడాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, శానిటరీ సెక్రటరీ షాహిదా సుల్తానా, శానిటరీ సూపర్‌వైజర్ గోపాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురుషుడు, బాలుడి మృతదేహాల ఆచూకీ లభ్యం

తాడేపల్లికి చెందిన తండ్రీకుమారులుగా గుర్తింపు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానదిలో లభించిన గుర్తు తెలియని పురుషుడు, బాలుడి మృతదేహాల ఆచూకీ లభించింది. మంగళవారం ఉదయం ప్రకాశం బ్యారేజీ దిగువన గణేష్ విగ్రహాల నిమజ్జనం చేసే ప్రదేశంలో ఒక పురుషుడు, ఒక బాలుడి మృతదేహాలు లభించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన కోడుపుగంటి కరుణాకర్(35), అతని కుమారుడు భగవాన్(7)గా గుర్తించారు.

వివరాలు ఇవి..

కరుణాకర్ నగరంలోని ఒక హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య రాధిక, కుమార్తె సోఫియా, కుమారుడు భగవాన్ ఉన్నారు. నెల రోజుల క్రితం పని నిమిత్తం అతను తన కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లి తిరిగి ఆదివారం నగరానికి వచ్చారు. నలుగురూ బ్యారేజీ సమీపంలోని సీతమ్మ వారి పాదాల వద్దకు చేరుకున్నారు. కరుణాకర్, అతని కుమారుడు భగవాన్ కృష్ణానదిలోకి వెళ్లగా.. అతని భార్య, కుమార్తె ఘాట్ మీద కూర్చున్నారు. నదిలోకి వెళ్లిన భర్త, కుమారుడు ఎంతసేపటికి తిరిగి బయటకు రాలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. నదిలో గుండా సీతానగరం వైపు వెళ్లి ఇంటికి చేరుకుని ఉంటారని భావించి తల్లి కుమార్తెలిద్దరూ ఇంటికి వెళ్లారు. ఇంట్లో కూడా వారు లేరు. చుట్టుపక్కల, బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం అతని భార్య రాధిక మరలా కృష్ణానది వద్దకు రాగా పోలీసులకు మృతదేహాలు లభించిన విషయాన్ని స్థానికులు ఆమెకు చెప్పారు. వెంటనే ఆమె పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పింది. గుర్తులు ఆధారంగా నదిలో లభించిన మృతదేహాలు తన భర్త, కుమారుడివిగా గుర్తించింది. వివరాలు సేకరించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను పోలీసులు ఆమెకు అప్పగించారు.

భక్తిశ్రద్ధలతో షష్ఠి పూజలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ 21 వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివార్లకు ఉదయం వేదపండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్ర నామ అర్చనలు చేశారు. యాగశాలలో హోమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమాలను నిర్వాహకులు రవిశంకర్ పర్యవేక్షించారు.

మంగళగిరి టౌన్: నవులూరు గ్రామంలోని నాగేంద్రస్వామి పుట్టతోటలో సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టతోట ఆవరణలో ఉన్న నవ నాగేంద్రులు, 23 నాగేంద్రస్వామి వార్ల విగ్రహాలు కొలువై ఉన్న పీఠాల వద్ద స్వామివార్ల విగ్రహాలకు భక్తులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కాసు రామకృష్ణారెడ్డి, రత్నకుమారి దంపతులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తాడేపల్లి రూరల్: సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పర్వదినం సందర్భంగా మంగళగిరి రూరల్ రామచంద్రాపురంలో సుబ్రహ్మణ్యస్వామికి బుధవారం వైభవంగా పూజలు నిర్వహించారు. పట్టణ పరిధి మహానాడు నాగేంద్రస్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి 5, 6 సచివాలయాల్లో ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో ఫోర్టిఫైడ్ రైస్‌పై బుధవారం అవగాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఫ్‌సీఐ కృష్ణ కెనాల్ డిపో మేనేజర్ వి.మనోహర్, మేనేజర్ క్యూసీ ఎన్.రామ్లాబీవి మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ రైస్‌పై ప్రజలు ఎలాంటి అపోహలకు గురి కావద్దని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎఫ్‌సీఐ కృష్ణ కెనాల్ సిబ్బంది, క్యూసీ సిబ్బంది, తాడేపల్లి 5, 6 సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మాక్ అసెంబ్లీ

తాడేపల్లి రూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎం, వివిధ శాఖల మంత్రులు, ప్రతిపక్ష నాయకుడు, ప్రతిపక్ష ఎమ్మెల్యేల పాత్రలను ఎంచుకుని మాక్ అసెంబ్లీలో విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

బొత్సకు భద్రతా లోపంపై నివేదిక ఇవ్వండి

కలెక్టర్‌కు జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పైడితల్లి సిరిమానోత్సవం రోజున వైఎస్సార్‌సీపీ నాయకుడు, శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణకు ప్రొటోకాల్, భద్రత లోపంపై విచారణ చేసి వేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఏటా మాదిరిగానే సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు డీసీసీబీ కార్యాలయాన్ని కేటాయించాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ లేఖ ద్వారా కోరారు. కానీ.. అధికార పార్టీ నేతలు.. అధికారులపై ఒత్తిడి తెచ్చి డీసీసీబీ కార్యాలయం కాకుండా వేరే స్థలాన్ని కేటాయించేలా చేశారు. అక్కడ సరిగ్గా ఏర్పాట్లు చేయకపోవడంతో ఉత్సవం జరుగుతున్న సమయంలో బొత్స సత్యనారాయణకు కేటాయించిన వేదిక కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో పాటు పోలీస్ అధికారికి, మరో బాలికకు గాయాలయ్యాయి. దీనిపై స్పందించిన బొత్స సత్యనారాయణ.. ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఫిర్యాదు చేశారు. దీనిపై జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందిస్తూ.. దీనిపై విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

చంద్రబాబుకు క్రెడాయ్ ప్రాపర్టీ షో ఆహ్వానం

సాక్షి, అమరావతి: ప్రజలకు రియల్ ఎస్టేట్ రంగంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జనవరిలో నిర్వహించనున్న ప్రాపర్టీ షోకు హాజరు కావాలని క్రెడాయ్ ప్రతినిధులు బుధవారం సీఎం చంద్రబాబుకు ఆహ్వానం అందించారు. ఎంపీ కేశినేని చిన్ని, క్రెడాయ్ విజయవాడ చాప్టర్ చైర్మన్ సి. సతీష్ బాబు, అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ఆర్ మోహన్‌రావు, కె.రఘురామ్, ఉపాధ్యక్షుడు బి.పవన్, సభ్యుడు పి.శ్రీనివాస్‌రాజు తదితరులు చంద్రబాబును కలిసి పలు అంశాలపై చర్చించారు.

ఫైబర్ నెట్ కేసు ఉపసంహరణకు మెమో దాఖలు

విజయవాడలీగల్: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న 2014–2019 సమయంలో ఏపీ ఫైబర్ నెట్‌లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ ఫైబర్ నెట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేసిన బ్రహ్మానందరెడ్డి డిఫాక్టో కంప్లెనైంట్‌గా అప్పట్లో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ కేసును ఉపసంహరించుకుంటున్నట్లుగా ఏసీబీ న్యాయస్థానంలో బుధవారం మెమో దాఖలు చేశారు. న్యాయమూర్తి దీనిపై తీర్పును ఈనెల 28కి వాయిదా వేశారు.

అవును.. 50 శాతం రియల్ ఎస్టేట్‌కి అనుమతించాం

ఐటీ ముసుగులో రియల్ లూటీ కథనంపై ఐటీ శాఖ స్పందన

సాక్షి, అమరావతి: టైలర్‌మేడ్ రాయితీల కింద 50 శాతం భూమిని ఇతర అవసరాలకు వినియోగించుకోవడానికి అనుమతించామని ఐటీ శాఖ స్పష్టం చేసింది. 'ఐటీ ముసుగులో రియల్ లూటీ' పేరిట సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఆ శాఖ స్పందించి, వివరణ ఇచ్చింది. సీఎం అధ్యక్షతన ఉండే పెట్టుబడుల ప్రోత్సాహకమండలి (ఎస్ఐపీబీ)కి టైలర్ మేడ్ ప్రోత్సాహకాల కింద భారీ ప్రాజెక్టులకు అధిక రాయితీలతో ప్రతిపాదించే పూర్తిస్థాయి అధికారం తమకు ఉందని పేర్కొంది. లిఫ్ట్ పాలసీ కింద కే రహేజా గ్రూపునకు మొత్తం భూమిని 99 పైసలకే ఇచ్చామని, ఇదే విధంగా సత్వా, ఏఎన్ఎస్ఆర్‌కు కూడా అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించింది. ఏపీ ఐటీ, జీసీసీ పాలసీ 2024–29 కింద నిర్మించే భవనాల్లో 33 శాతం ఇతర అవసరాలకు వినియోగించుకోవడానికి అనుమతిస్తామని, కానీ కపిల్ గ్రూపునకు చెందిన బీవీఎం ఎనర్జీకి టైలర్‌మేడ్‌ప్రోత్సాహకాల కింద నిబంధనల కంటే అదనంగా 40 శాతం వరకు అనుమతించినట్లు స్పష్టం చేసింది.

పతనమైన ధరలు.. 'సాగ'ని రబీ

సీజన్ ఆరంభమై 55 రోజులైనా 12 శాతమే!

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారులో పతనమైన పంటల ధరలు రబీ సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సాగు చేసినా మిగిలేది శూన్యమని భావిస్తూ రైతులు పొలాలను బీడుపెడుతున్నారు. సీజన్ ప్రారంభమై 55 రోజులు గడిచినా 12 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలు వేయని దుస్థితి నెలకొంది. వాస్తవానికి ఈ ఏడాది తీవ్ర ఒడిదొడుకుల మధ్య ఖరీఫ్ సాగైంది. వరుస వైపరీత్యాలకు తోడు చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులను తీవ్ర నష్టాలపాల్జేసింది. ఈ పాటికే 40 శాతంపైగా కోతలు పూర్తవాల్సి ఉండగా, ఈ ఏడాది 10–15 శాతం కూడా కాలేదు. దీనికితోడు ముందస్తు రబీ సాగు ఏర్పాట్లలో సర్కారు ఘోరంగా విఫలమైంది. అదునుకు విత్తనం కూడా సరఫరా చేయలేక చేతులెత్తేసింది. ఇంకోపక్క రెండో పంటకు నీరివ్వలేమని తెగేసి చెప్పడంతో ఫలితంగా కృష్ణా జిల్లాతో సహా పలు జిల్లాల్లో రైతులు సాగునీటి కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. రబీ సాగుకు శాపం

ఈ ఏడాది ఖరీఫ్‌లో 86.32 లక్షల ఎకరాలకు గాను 72.77 లక్షల ఎకరాలకు మించి సాగవలేదు. లక్ష్యంలో 13.55 లక్షల ఎకరాల్లో పంటలు పండించలేదు. ఆర్థిక భారం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక జోలికి వెళ్లలేదు. వర్షాభావ పరిస్థితులకు

తోడు అధిక వర్షాలు, తుపాన్ల ప్రభావంతో దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చంద్రబాబు ప్రభుత్వం నుంచి కనీస సాయం కూడా లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలా ఖరీఫ్‌కు దూరమైన, నష్టపోయిన రైతులు ముందస్తు రబీకి సిద్ధమైనా ప్రభుత్వం నుంచి సహకారం లభించలేదు. నెల రోజులు ఆలస్యంగా, అదును దాటిన తర్వాత అరకొరగా విత్తనాల సరఫరాకు మొదలెత్తడం ట్టడం, రెండో పంటకు నీరివ్వకపోవడంతో రైతులు రబీ సాగుపై వెనకడుగు వేశారని వ్యవసాయ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

గతంలో ఎన్నడూ లేనంత మందకొడిగా

రాష్ట్రంలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 51.75 లక్షల ఎకరాలు. ఈ ఏడాది లక్ష్యం 57.78 లక్షల ఎకరాలు. ఈ పాటికే 13.62 లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉంది. 2019–20లో నవంబర్ 26 నాటికి 15.87 లక్షల ఎకరాలు, 2020–21లో 13.50 లక్షల ఎకరాలు, 2021–22లో 14.50 లక్షల ఎకరాలు, 2022–23లో 11.82 లక్షల ఎకరాలు, 2023–24లో 11.40 లక్షల ఎకరాల్లో పంటలు పండించారు. నిరుడు రబీలో కూడా 13 లక్షల ఎకరాల్లో సాగైంది. అలాంటిది ఈ సీజన్‌లో 8.89 లక్షల ఎకరాలకు మించి సాగవని దుస్థితి. ముతక ధాన్యాల సాగు లక్ష్యం 8.34 లక్షల ఎకరాలైతే... వేసింది కేవలం 1.4 లక్షల ఎకరాల్లోనే. అపరాలు సాగు లక్ష్యం 23.27 లక్షల ఎకరాలకు 5.32 లక్షల ఎకరాలకు పరిమితమైంది. నూనె గింజల సాగు లక్ష్యం 3.70 లక్షల ఎకరాలకు కేవలం 30 వేల ఎకరాల్లో మాత్రమే వేశారు. ఖరీఫ్‌లో ఒక్క పంటకూ మద్దతు ధర లభించకపోవడం, దెబ్బతిన్న పంటలకు పైసా పరిహారం అందించకపోవడం, అదునుకు విత్తనాలు సరఫరా చేయకపోవడం, రెండో పంటకు సాగు నీరు ఇవ్వకపోవడం రబీ మందకొడిగా సాగడానికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ఇలాగైతే సీజన్ ఆఖరుకు కనిష్ట స్థాయిలోనే సాగు నమోదవుతుందని అంటున్నారు.

ప్రధాన పంటల వారీగా చూస్తే (లక్షల ఎకరాల్లో)

పంట	రబీ లక్ష్యం	నవంబర్ నాటికి సాగైన విస్తీర్ణం
వరి	19.87	1.42
శనగ	10.70	3.75
మినుము	8.60	0.72
మొక్కజొన్న	5.42	0.82
జొన్నలు	2.47	0.57
వేరుశనగ	2.47	0.22
పొగాకు	2.42	0.40
పెసలు	2.30	0.15

మంత్రి కొడుక్కి నీపై మనసైంది!

- నువ్వంటే చాలామంది టీడీపీ నేతలు పడి ఛస్తున్నారు
- వారికి సహకరించకపోతే ఉద్యోగం చేయనీయను
- ఒంటరి మహిళకు మంత్రి అనధికారిక పీఏ వేధింపులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'మంత్రిగారి కొడుక్కి నీపై మనసైంది. ఆయన వద్దకు వెళ్లు. నువ్వంటే టీడీపీలో చాలామంది నాయకులు పడిఛస్తున్నారు. వాళ్లతో గడుపు. సహకరించకపోతే ఉద్యోగం చేయనీయను' భర్త చనిపోయిన బాధలో ఉండి గుండె జబ్బు బాధితురాలైన కుమార్తెతో జీవనం సాగిస్తున్న ఓ మహిళకు మంత్రి అనధికార పీఏ వేధింపులు ఇవి. బాధితురాలి కథనం ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన ఉపాధ్యాయుడు 2021లో కరోనాతో మరణించారు. ఆయన భార్య కారుణ్య నియామకం కోసం ప్రయత్నిస్తుండగా.. ఆ వీధిలోనే ఉండే సతీష్ జోక్యం చేసుకున్నాడు. ఆ జిల్లాకు చెందిన ప్రస్తుత మంత్రి అనధికార పీఏగా

వ్యవహరిస్తున్నాడు. ఆమెకు మాయమాటలు చెప్పి.. ఖర్చులు ఉంటాయని రూ.5 లక్షలు గుంజాడు. లోబర్చుకునేందుకు యత్నించాడు. చివరకు ఆ మహిళకు విద్యాశాఖలో ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం వచ్చింది. తన ఉద్యోగం కోసం జిల్లా పరిషత్‌లో సతీష్ ఎవరికీ లంచాలు ఇవ్వలేదని తెలిసి బాధితురాలు నిలదీసింది. దీంతో పగ పెంచుకుని, ఆమెను సాలూరు నుంచి గుమ్మలక్ష్మీపురం మండలంలోని మారుమూల స్కూల్‌కు బదిలీ చేయించాడు.

మంత్రికి విన్నవించినా..

ఆకస్మిక బదిలీతో హతాశురాలైన మహిళ తాను ఉద్యోగంలో చేరి ఏడాదిన్నరే అయిందని, గుండె జబ్బుతో బాధపడుతున్న బిడ్డ ఉందని, అత్యవసరమైతే మారుమూల గిరిజన గ్రామంలో వైద్యం దొరకదని జిల్లా మంత్రికి మొరపెట్టుకుంది. సతీష్ తన దగ్గర డబ్బు తీసుకుని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. మంత్రి.. సతీష్‌నే వెనుకేసుకొచ్చారు. బాధితురాలు విద్యాశాఖ మంత్రి పేషీని సంప్రదించింది. అక్రమ బదిలీపై హైకోర్టును ఆశ్రయించగా.. ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

అయినా ఆగని వేధింపులు

'డబ్బులు తిరిగిచ్చేది లేదు. టీడీపీలో చాలామంది నాయకులు నువ్వంటే పడి ఛస్తున్నారు. వాళ్లతో గడపకపోతే సహకరించకపోతే ఉద్యోగం చేయనీయను' అంటూ సతీష్ ఆ మహిళకు మెసేజ్‌లు పంపాడు. బాధితురాలి ఇంటికి టీడీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లను పంపి బెదిరించాడు. తనకు జరిగిన అన్యాయాన్ని మంత్రికి చెప్పుకుందామని బాధితురాలు వెళ్లగా.. అక్కడా ఆమెపైన, ఆమె బంధువులపైన సతీష్‌కు చెందినవారు దాడి చేశారు. పోలీసులను సంప్రదిస్తే పట్టించుకోలేదు.

నకిలీ మద్యానికి మూలం జనార్దనరావే!

- ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ ప్లాంట్ ఏర్పాటు
- జయచంద్రారెడ్డితో భాగస్వామ్యంతో ములకలచెరువులో నకిలీ ప్లాంట్
- పోలీసు కస్టడీలో నిందితుల వెల్లడి

ములకలచెరువు: నకిలీ మద్యానికి మూలం జనార్దనరావేనని కస్టడీలోని నిందితులు అధికారులకు తెలిపారు. నకిలీ మద్యం కేసులో రిమాండ్‌లో ఉన్న ఆరుగురు నిందితులను మూడు రోజులపాటు మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ చంద్రశేఖర్‌రెడ్డి, సిట్ అధికారులు విచారించారు. నకిలీ ప్లాంట్ నిర్వహణలో ముఖ్యపాత్ర పోషించిన కట్టారాజు, బాలాజీ నుంచి కీలక విషయాలు రాబట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 'అన్నమయ్య జిల్లా ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలలో నకిలీ ప్లాంట్ నడిపింది జనార్దనరావే. గోవాలో మద్యం వ్యాపారం చేసుకుంటున్న బాలాజీతో స్నేహం చేసిన జనార్దనరావు తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరపల్లి జయచంద్రారెడ్డి భాగస్వామ్యంతో ములకలచెరువులో డాబాను లీజుకు తీసుకుని నకిలీ ప్లాంట్ ఏర్పాటు చేశారు. జయచంద్రారెడ్డి పీఏ రాజేష్‌కు మద్యం దుకాణం రావడంతో నకిలీ మద్యం తయారీ చేయడం సులభంగా ఉంటుందని భావించి ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ ప్రారంభించారు. పీటీఎం మండలానికి చెందిన కట్టా సురేంద్రనాయుడు మద్యం దుకాణం సైతం లీజుకు తీసుకుని అక్కడి నుంచి మండల వ్యాప్తంగా నకిలీ మద్యం బెల్టుషాపులకు తరలించారు. ములకలచెరువులో ప్లాంట్ నిర్వహణ మొత్తం జనార్దనరావు, జయచంద్రారెడ్డి కనుసన్ననే జరిగింది' అని వారు అధికారులకు తెలిపారు.

ముగిసిన మూడు రోజుల కస్టడీ

ఈ కేసులో నెల్లూరు సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న కట్టారాజును మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయానికి సోమవారం తీసుకొచ్చారు. అతనితో పాటు మదనపల్లి జైల్లో రిమాండ్‌లో ఉన్న బాలాజీ, సుదర్శన్, కొడాలి శ్రీనివాసరావు, అష్రఫ్, చైతన్యబాబును మూడు రోజులపాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. బుధవారంతో కస్టడీ ముగియడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. అనంతరం వారిని కోర్టు నుంచి మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు.

మాకు 15 ఏళ్లు అధికారం ఇవ్వండి

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

సాక్షి, అమలాపురం/మలికిపురం/రాజోలు: 'మీ సమస్యల పరిష్కారం కోసం నాకు పనిచేసే అవకాశం ఇవ్వండి, మా కూటమి ప్రభుత్వానికి 15 ఏళ్లు అధికారం ఇవ్వండి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడులో 'పల్లె పండుగ 2.0'ను బుధవారం ఆయన ప్రారంభించి, పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లె పండుగ 1.0 విజయవంతమైందని, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. అదే స్ఫూర్తితో 2.0 ప్రారంభిస్తున్నామని, ఈసారి రూ.6,787 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పారు. రాత్రికి రాత్రి అద్భుతాలు చేయలేమని, రోడ్లు వేయలేమని, డ్రైన్లలో పూడిక తీసివేయలేం కాబట్టి కొంత సమయం ఇవ్వడంతో పాటు తమకు పనిచేసుకునే వెసులుబాటు ఇవ్వాలని కోరారు. కేశవదాసుపాలెం వద్ద శంకరగుప్తం, కేశనపల్లి డ్రైన్ నుంచి సముద్రపు నీరు పోటెత్తిన కారణంగా పాడైన కొబ్బరి పంటను ఆయన పరిశీలించారు. అనంతరం పంటలు నష్టపోయిన 13 గ్రామాల ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

పవన్‌కు రైతులు ఝలక్

శంకరగుప్తం మేజర్ డ్రైన్ ముంపునకు, కొబ్బరి చెట్లు చనిపోవడానికి గల కారణాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టి వేయాలని చూసిన పవన్‌కు రైతులు ఝలక్ ఇచ్చారు. 2019 నుంచి ఈ సమస్య ఎందుకు వచ్చింది అని పవన్ ప్రశ్నించగా, రైతులు ఇది గత ప్రభుత్వం నుంచి కాదని, 40 ఏళ్ల నుంచీ

పల్లె పండుగ 2.0 పైలాన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

ఈ ముంపు సమస్య ఉందని చెప్పారు. దీంతో పవన్ మౌనంగా ఉండిపోయారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, తాను ఏమీ చేయలేదని గత ప్రభుత్వ అనుకూల మీడియా రాస్తోంది అంటూ ఆయన 'సాక్షి'లో వచ్చిన ''ఒక్క దానికీ దిక్కులేదు'' కథనాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. తాను ఏం చేశానో అందరికీ తెలుసునన్నారు. కథనంలో ప్రస్తావించిన హామీలు నెరవేర్చినట్టు మాత్రం చెప్పకుండా తప్పించుకున్నారు.

రెండు హెలిప్యాడ్లు

పవన్ కళ్యాణ్ పర్యటనకు రాజోలు నియోజకవర్గంలో ఏకంగా రెండు హెలిప్యాడ్లు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. తొలుత ఆయన మలికిపురం మండలం గూడపల్లి వద్ద దిగేందుకు ఒక హెలీ ప్యాడ్, శివకోడు వద్ద ఎక్కేందుకు మరో హెలీ ప్యాడ్ నిర్మించారు. ఈ రెండు గ్రామాల మధ్య దూరం 10 కిలోమీటర్లు మాత్రమే కావడం గమనార్హం.

ప్రైవేట్‌కు 1,300 ఎకరాల మున్సిపల్ భూములు

పీపీపీలో ప్రాజెక్టులకు కట్టబెట్టేందుకు ప్రణాళిక

- ప్రైవేటు సంస్థలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ రూ.2 వేలకోట్లు
- 18 యూడీఏల్లో ప్రభుత్వ భూములకు రెక్కలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ)లో ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్న చంద్రబాబు ప్రభుత్వం ఈ విధానాన్ని మున్సిపాలిటీలకు విస్తరించింది. విలువైన 1,300 ఎకరాల భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. భూములతోపాటు కంపెనీల యాజమాన్యాలకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.2 వేల కోట్ల వయబులిటీ గ్యాప్ ఫండింగ్ ఇస్తున్నట్టు ప్రకటించింది. రాష్ట్రంలో మున్సిపాలిటీల్లో నీటిసరఫరా ప్రాజెక్టులు, రవాణా నెట్‌వర్క్, హౌసింగ్ తదితర 12 రకాల మౌలిక సదుపాయాలను కల్పించాలంటే 2029 నాటికి రూ.66,523 కోట్ల పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని, ఈ లక్ష్యాలను చేరుకునేందుకు పీపీపీని అమలు చేస్తున్నట్టు వెల్లడించింది. ఈ విధానంలో 2.30 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ప్రైవేటు సంస్థలకు వేల ఎకరాల భూములను కట్టబెట్టడంతోపాటు వయబులిటీ ఫండింగ్ ఇవ్వడాన్ని చంద్రబాబు ప్రభుత్వం గొప్పగా చెబుతోంది.

నిరుపయోగం పేరుతో నేతలకు ధారాదత్తం

పట్టణప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ

భూమిని అనుయాయులకు కట్టబెట్టేందుకు చంద్రబాబు సర్కారు స్కెచ్ వేసింది. ఈ భూములను వాణిజ్యపరంగా లాభదాయకంగా మార్చేందుకని కలరింగ్ ఇచ్చి రాష్ట్రంలోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(యూడీఏ)ల ద్వారా అమలుచేస్తున్న ల్యాండ్ మానిటైజేషన్ ప్రోగ్రామ్‌తో అప్పగించేందుకు సిద్ధమైంది. మొత్తం 18 యూడీఏల్లో 73 ల్యాండ్ పార్సిల్స్‌లో 1,300 ఎకరాలను ఇప్పటికే గుర్తించారు. ఈ భూములు నిరుపయోగంగా ఉన్నాయని తేల్చారు. ఇప్పటికే నాలుగు యూడీఏల్లో ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) జారీచేశారు. మిగిలిన వాటికి త్వరలో ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. పీపీపీ విధానంలో పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేయవచ్చని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చని, ఈ విధానం దేశంలో పట్టణాభివృద్ధిలో రాష్ట్రాన్ని నిలబెడతాయని పేర్కొనడం గమనార్హం.

ట్యాక్స్ బాదుడికి రంగం సిద్ధమైనట్టే?

మున్సిపాలిటీలు, పంచాయతీల్లో రోడ్లు, రవాణాను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగిస్తే ప్రభుత్వంపై ఆర్థికభారం ఉండదని గతంలో అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రైవేటు సంస్థలు రోడ్లు వేసి ట్యాక్స్ వసూలు చేసుకోవచ్చన్నారు. ఇప్పుడు ఈ పీపీపీ విధానాన్ని మున్సిపాలిటీలకు ఆపాదించి అమల్లోకి తెచ్చినట్టయింది. ప్రజలకు తాగునీటి సరఫరా, రోడ్లు, విద్య వంటి సదుపాయాలు ఉచితంగా ప్రభుత్వం కల్పించాలి. కానీ అందుకు విరుద్ధంగా చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రస్తుతం ప్రకటించిన నీటిసరఫరా, రవాణా, హౌసింగ్ తదితర 12 రకాల మౌలిక సదుపాయాలను ప్రైవేటుకు కట్టబెడుతోంది. దీంతో వీటిపై ప్రజల నుంచి పన్ను వసూలుకు ఆయా సంస్థలకు అధికారం ఇచ్చినట్టేనని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పీపీపీ విధానం: ముఖ్య కార్యదర్శి

పట్టణ ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి, జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ఆర్థిక మండలాల్లో రూ.35 వేలకోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించాలని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపల్‌శాఖలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంపై సమగ్ర పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేసినట్టు ఆయన తెలిపారు.

కస్టడీలో ఉంచి ఏం సాధిస్తారు?

మద్యంపై అక్రమ కేసులో బాబు సర్కార్‌కు సుప్రీంకోర్టు సూటి ప్రశ్న

ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పకు లొంగుబాటు నుంచి మినహాయింపు

- ట్రయల్ కోర్టు విధించిన షరతులకు లోబడి బెయిల్‌పై కొనసాగుతారని వెల్లడి
- 26వ తేదీలోపు లొంగిపోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే
- 200 మంది సాక్షులుంటే... విచారణకు ఎంత సమయం పడుతుందో..
- అంతకాలం వీరిని జైల్లో ఉంచడం సరికాదు
- సిట్ ఆందోళనకు అరెస్ట్ పరిష్కారం కాదు
- కౌంటర్ దాఖలుకు రాష్ట్ర ప్రభుత్వం, సిట్‌కు సుప్రీం నోటీసులు
- తదుపరి విచారణ డిసెంబర్ 15కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం అక్రమ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పకు సుప్రీంకోర్టులో బుధవారం ఊరట లభించింది. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం (నవంబర్ 26న) వారు సరెండర్ కావాల్సిన అవసరం లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 'వారిని కస్టడీలో ఉంచితే దానితో ఏ ప్రయోజనం ఒనగూరుతుందో మీరు చెప్పాలి. వారిలో ఒకరు సీనియర్ అధికారి అని మాకు తెలుసు. సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని మీరు భావిస్తే దానికి తగిన షరతులు విధించవచ్చు. అంతేకానీ అరెస్ట్ పరిష్కారం కాబోదు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. '200 మంది సాక్షులను విచారించాలని మీరు (సిట్, ప్రభుత్వం) చెబుతున్నారు. కనీసం 100 మంది సాక్షులు ఉన్నారనుకుందాం. అలాంటప్పుడు విచారణ పూర్తయ్యేందుకు మీరు ఎంతకాలం తీసుకుంటారు?' అని ప్రశ్నించింది. తదనంతరం సరెండర్ నుంచి పిటిషనర్లకు మినహాయింపునిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ట్రయల్ కోర్టు విధించిన షరతులకు లోబడి వారు డిఫాల్ట్ బెయిల్‌పై కొనసాగుతారని స్పష్టం చేసింది. ఏపీ ప్రభుత్వం 10రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. రిజాయిండర్‌కు పిటిషనర్లకు మరో 5రోజులు గడువు మంజూరు చేస్తూ విచారణను డిసెంబర్ 15వ తేదీకి వాయిదా వేసింది.

అకడమిక్ చర్చల్లోకి వెళ్లాలనుకోవడం లేదు

బెయిల్ మంజూరు సరికాదంటూ రాష్ట్ర ప్రభుత్వం, సిట్ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ అగర్వాల్ చేసిన వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. ఈ కేసులో దాదాపు 400 మంది సాక్షులు ఉన్నారని, ఇప్పటికి ఇంకా 200 మందికి పైగా సాక్షులను విచారించాల్సి ఉందన్నారు. 'మొదట ట్రయల్ కోర్టు మా చార్జ్‌షీట్‌ను విస్మరించింది. ఇప్పుడు చార్జ్‌షీట్‌ను తగిన విధంగా సమర్పించాం. ట్రయల్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసే ప్రయత్నం చేస్తాం' అంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున సిద్ధార్థ లూథ్రా నివేదించగా, దీనిపై చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకుంటూ, 'కోర్టు సమయం వృథా అయ్యే అకడమిక్ చర్చల్లోకి వెళ్లాలనుకోవడం లేదు' అని వ్యాఖ్యానించారు.

'కస్టడీ'పై సీజేఐ కీలక ప్రశ్నలు

- హైకోర్టు ఉత్తర్వులపై దాఖలు చేసిన పిటిషన్ల విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాష్ట్ర ప్రభుత్వ (సిట్) తీరుపై పలు కీలక ప్రశ్నలు సంధించారు. కీలక వ్యాఖ్యలు, సూచనలు చేశారు.
- నిందితులను ఇప్పుడు కస్టడీలో ఉంచడం వల్ల కొత్తగా సాధించేదేముంది?
- 200 మంది సాక్షులను విచారించాలని మీరు (సిట్, ప్రభుత్వం) చెబుతున్నారు. కనీసం 100 మంది సాక్షులు ఉన్నారనుకుందాం. అలాంటప్పుడు విచారణ పూర్తయ్యేందుకు మీరు ఎంతకాలం తీసుకుంటారు?
- పెద్ద సంఖ్యలో సాక్షులను విచారించాలన్న కారణంతో ఒక వ్యక్తిని చాలా కాలం జైలులో ఉంచడం సరైంది కాదు.
- రెగ్యులర్ బెయిల్ పిటిషన్ ఆధారంగానే నిందితునికి బెయిల్ రావాలని భావించడం వల్ల (న్యాయమైన విచారణకు భంగం లేకుండా నిందితుడికి స్వేచ్ఛ ఇవ్వవచ్చని కోర్టు భావించేంతవరకూ) డిఫాల్ట్ బెయిల్ విషయంలో అనేక పిటిషన్లు చివరకు నిరర్థకంగా మారుతున్నాయి.
- సాక్షులను ప్రభావితం చేస్తారన్న ఆందోళన ఉంటే, కఠినమైన షరతులు విధించి బెయిల్ ఇవ్వవచ్చు.
- అంతేకానీ అరెస్ట్ పరిష్కారం కాదు.

దర్యాప్తులో లోపాలకు నిందితులను బలి చేయకూడదు — పిటిషనర్ల వాదనలు

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు సి. ఆర్యమ సుందరం, నిరంజన్ రెడ్డి, సిద్ధార్థ దవేలు బలమైన వాదనలు వినిపించారు. దర్యాప్తులో లోపాలకు నిందితులను బలి చేయకూడదన్న పిటిషనర్ల వాదనలపై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. వాదనల్లో ముఖ్యాంశాలు ఇవీ. దర్యాప్తు పూర్తయ్యాక అరెస్ట్ చేయడం అన్యాయం. హైకోర్టు ఆదేశాల ప్రకారం పిటిషనర్లు బుధవారం సరెండర్ కావాల్సి ఉంది. ఈ కేసు విచారణ అత్యవసరం. నిందితులు ఇప్పటికే 108 రోజులు కస్టడీలో ఉన్నారు. సెప్టెంబర్ నుంచి బెయిల్‌పై బయట ఉన్నారు. ఇప్పుడు మళ్లీ అరెస్ట్ చేయడం అన్యాయం. దర్యాప్తు సంస్థ గడువులోగా పూర్తి చార్జ్‌షీట్ దాఖలు చేయలేదు. సాంకేతిక కారణాలతో బెయిల్ రద్దు చేయడం సరికాదు. దర్యాప్తులో లోపాలకు నిందితులను బలి చేయకూడదు. అసంపూర్ణ చార్జ్‌షీట్ దాఖలైనప్పుడు నిందితులకు డిఫాల్ట్ బెయిల్ హక్కు ఉంటుందా? ఉండదా? అనే అంశంపై సుప్రీంకోర్టులోనే భిన్న తీర్పులు ఉన్నాయి. రీతు ఛబ్రియా కేసులో దర్యాప్తు పూర్తి కాకుండా కేవలం చార్జ్‌షీట్ వేసినంత మాత్రాన నిందితుడు డిఫాల్ట్ బెయిల్ హక్కు కోల్పోడని తీర్పు ఉంది. కపిల్ వాధ్వాన్ కేసులో చార్జ్‌షీట్ వేసి, కోర్టు కాగ్నిజెన్స్ తీసుకుంటే ఇక డిఫాల్ట్ బెయిల్ రాదని పేర్కొన్నారు. ఈ న్యాయపరమైన వైరుధ్యంపై స్పష్టత కోసం 'మన్‌ప్రీత్ తల్వార్' కేసును ఇప్పటికే ముగ్గురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి సిఫార్సు చేశారు. ఆ కేసులో తీర్పు వచ్చేంతవరకు, లేదా ఈ కేసులో తదుపరి విచారణ జరిగేంతవరకు నిందితుల స్వేచ్ఛను హరించడం సరికాదు.

అసలేం జరిగింది?

నిర్దేశిత గడువులోగా చార్జ్‌షీట్ దాఖలు కానందున ధనుంజయరెడ్డి, కృష్ణమోహనరెడ్డి, బాలాజీ గోవిందప్పకు గతంలో ట్రయల్ కోర్టు 'డీఫాల్ట్ బెయిల్' మంజూరు చేసింది. దాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ఏపీ హైకోర్టు వారి డీఫాల్ట్ బెయిల్‌ను రద్దు చేసింది. నవంబర్ 26లోగా ట్రయల్ కోర్టులో లొంగిపోవాలని, రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

● సువర్ణ మాసం

● బ్లైండ్ క్రికెటర్స్ టీమ్

● కబడ్డీ టీమ్

● మహిళల వన్డే వరల్డ్‌కప్ టీమ్

ఇంకో మూడు రోజుల్లో... 'ఇక సెలవా మరి' అని నవంబర్ నెల చరిత్రలో కలిసిపోనుంది. అయితేనేం. మహిళల క్రీడా ప్రపంచానికి సంబంధించి ఈ మాసం చరిత్రలో ఎప్పటికీ నిలిచి పోనుంది. మహిళ వన్డే వరల్డ్ కప్‌ను టీమ్ ఇండియా గెల్చుకోవడం, తొలి అంధ మహిళల టీ20 వరల్డ్ కప్‌ను మన అమ్మాయిలు సాధించడం, భారత మహిళల కబడ్డీ జట్టు వరల్డ్ కప్‌ను చేజిక్కించుకోవడం... ఒకే నెలలో మూడు చారిత్రక విజయాలు. ఇవి గాలి వాటు విజయాలు కాదు. ఎన్నో సంవత్సరాల కష్టానికి దక్కిన అపూర్వ ఫలితాలు. ఈ విజయాల్లో నుంచి సిము దాస్‌లాంటి పేదింటి బిడ్డలు ప్రపంచానికి ఘనంగా పరిచయం అయ్యారు...

నవంబర్ నవ శక్తి

నవంబర్ 2న నవి ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో భారత మహిళా క్రికెట్ జట్టు తొలిసారిగా ఐసీసీ వరల్డ్‌కప్‌ను గెలుచుకున్న క్షణం దేశాన్ని ఉత్తేజ పరిచింది. ఒక విజయం మరో విజయానికి స్ఫూర్తినిస్తుంది అన్నట్లుగా ఆ విజయం బ్లైండ్ ఉమెన్ క్రికెట్ టీమ్‌కు బలమైన స్ఫూర్తిని ఇచ్చింది.

తొలిసారే...చారిత్రక విజయం!

అంధ మహిళా క్రికెటర్‌ల కోసం క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇండియా(సీఏబీఐ) మొదటిసారిగా టీ 20 వరల్డ్‌కప్‌కు శ్రీకారం చుట్టింది. ఇండియా బ్లైండ్ ఉమెన్ క్రికెట్ టీమ్ తొలి టీ20 వరల్డ్ కప్‌ను గెలుచుకొని చరిత్ర సృష్టించింది. దీపిక సారథ్యంలోని జట్టు ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా విజయం దిశగా దూసుకుపోయింది.

ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే విజయం

భారత జట్టులో చోటు సంపాదించడానికి అనేక సవాళ్లను అధిగమించిన అమ్మాయిలు బ్లైండ్ ఉమెన్ క్రికెట్ టీమ్‌లో ఉన్నారు. వీరిలో చాలా మంది గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ కుటుంబాలు, చిన్న పట్టణాల నుంచి వచ్చారు. చిన్నప్పటి నుంచి ఏళ్లకు ఏళ్లు ప్రాక్టీస్ చేసిన వారు కాదు వారు. గత కొన్ని సంవత్సరాలలో మాత్రమే క్రికెట్ నేర్చుకొని అందులో ప్రావీణ్యం సాధించారు.

మన టీమ్ వరల్డ్ కప్‌ను గెల్చుకోవడం దేశవ్యాప్తంగా ఎంతోమంది దివ్యాంగ మహిళలకు క్రీడలపై ఆసక్తిని పెంచేలా, 'మేము సైతం' అంటూ ఆటల్లో దూసుకుపోయేలా చేస్తుందనడంలో సందేహం లేదు.

'దివ్యాంగులు క్రికెట్ లేదా ఇతర క్రీడల్లోకి అడుగు పెట్టడానికి ఈ విజయం స్ఫూర్తిని ఇచ్చింది' అంటున్నారు మన దేశంలోని అంధుల క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ మహంతేష్.

ధైర్యమే వజ్రాయుధమై...

కర్నాటకలోని తుమకూర్‌కు చెందిన దీపిక టీసి చిరునవ్వు లేకుండా మాట్లాడడం అరుదైన దృశ్యం. చిరునవ్వు ఆమె సహజ ఆభరణం. ఆత్మవిశ్వాస సంతకం. 'నేను బడికి వెళ్లింది క్రికెట్ ఆడడానికి కాదు. అంధత్వంతో కూడా హాయిగా ఎలా జీవించవచ్చో తెలుసుకోవడానికి' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది కెప్టెన్ దీపిక. రైతు అయిన ఆమె తండ్రి చిక్కతిమప్ప... 'ఎప్పుడూ ధైర్యంగా ఉండాలి' అని చెబుతుండేవాడు. ఆటలో అది తనకు ఒక మంత్రంలా, వజ్రాయుధంలా పనిచేసింది. జయాపజయాలను అధిగమించేలా చేసింది. 'బ్లైండ్ క్రికెట్ అనేది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఉంటుందనే విషయం నాకు చాలా కాలం వరకు తెలియదు' అని ఒకప్పుడు చెప్పిన దీపిక టీమ్‌ను విజయపథంలోకి తీసుకు వెళ్లి వరల్డ్‌కప్ గెల్చుకోవడంలో కెప్టెన్‌గా కీలక పాత్ర పోషించింది.

పేదింటి బిడ్డకు పెద్ద పేరు వచ్చింది

'మా విజయం ఎంతోమంది అంధ అమ్మాయిలకు స్ఫూర్తిని ఇస్తుంది' అంటుంది అస్సాంకు చెందిన బ్లైండ్ క్రికెటర్ సిము దాస్. ఈ విజేత ఎన్నో కష్టాల రహదారుల్లో నుంచి నడిచి వచ్చింది. 'బిడ్డ అంధురాలు' అని తెలుసుకున్న సిము దాస్ తండ్రి కుటుంబాన్ని విడిచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి సిముకు తల్లే అన్నీ అయింది. కొంతకాలానికి తల్లి మంచం పట్టింది. రోజుకు రెండు పూటలా భోజనం కష్టం అయింది. దివ్యాంగుడైన ఆమె సోదరుడికి నిరంతర సహాయం అవసరం. ఎన్ని కష్టాలు చుట్టుముట్టినప్పటికీ సిము ఒక కలను నిలబెట్టుకుంది. తాను ఉన్న పరిస్థితుల దృష్ట్యా అది అసాధ్యం అనిపించే కల. కాని సిము ఎక్కడా వెనకడుగు వేయలేదు. క్రికెట్ తన పాషన్ మాత్రమే కాదు జీవితం అయిపోయింది. క్రికెట్‌పై ఎంత ఆసక్తి ఉన్నప్పటికీ ఆమెకు సలహాలు ఇచ్చేవారు లేరు. ప్రోత్సాహాన్ని ఇచ్చేవారు లేరు. ఎలా ప్రారంభించాలో, ఎక్కడ ప్రారంభించాలో తెలియదు. 'బ్యాటిల్ ఫర్ బ్లైండ్‌నెస్' సంస్థతో సిముకు అండ దొరికింది. ఉచిత వసతి, పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం ఆమెకు ఎంతగానో నచ్చింది. 'నేను క్రికెటర్ కావాలనుకుంటున్నాను' తన మనసులోని మాటను బలంగా చెప్పింది. 'మేమున్నాం' అంటూ సంస్థ ఆమె భుజం తట్టింది. క్రికెట్‌లో శిక్షణ ఇప్పించింది. అంకితభావం, కష్టంతో భారత జట్టులో స్థానం సాధించింది సిము. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా(సీఏబిఐ) భారతదేశం, నేపాల్‌ల మధ్య నిర్వహించిన మహిళా క్రికెట్ సిరీస్‌లో సిము 'బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికైంది.

సంజు...స్టార్ రైడర్

రైడర్ స్థానంలో ఉండడమంటే ఆత్మవిశ్వాసంతో ఉండడం, చాలా చురుగ్గా ఉండడం. మెరుపు నిర్ణయాలతో ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టడం. ఈ లక్షణాలన్నీ సంజు దేవిలో ఉన్నాయి. అందుకే ఆమె మహిళల కబడ్డీ జట్టులో స్టార్ రైడర్‌గా దూసుకుపోతోంది.

మన టీమ్ మహిళల కబడ్డీ వరల్డ్ కప్‌ను గెల్చుకోవడంలో సంజు దేవి కీలక పాత్ర పోషించింది.

'కబడ్డీ అమ్మాయిల ఆట కాదు' అనుకునే ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బ ప్రాంతానికి చెందిన సంజు దేవి స్వరాష్ట్రంలోనే కాదు ఎన్నో రాష్ట్రాల్లో ఎంతో మంది అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది. మహిళల కబడ్డీ వరల్డ్‌కప్ కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి ఇండియన్ నేషనల్ టీమ్‌కు ఎంపికైన తొలి మహిళగా తన ప్రత్యేకత నిలుపుకుంది సంజుదేవి.

చిన్నప్పటి నుంచే కబడ్డీలో అద్భుత ప్రతిభ చూపేది సంజు. 6వ ఏసియన్ ఉమెన్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. బిలాస్‌పూర్‌లోని ఉమెన్స్ రెసిడెన్షియల్ కబడ్డీ అకాడమీలో చేరడం సంజుకు టర్నింగ్ పాయింట్‌గా మారింది. దిల్ కుమార్ రాథోడ్‌లాంటి కోచ్‌ల దగ్గర కబడ్డీలో పాఠాలు నేర్చుకుంది. ఆ పాఠాలే ఆమె విజయానికి మెట్లు అయ్యాయి.

● మన(సు)లో మాట

కొత్త వస్తువులు చూస్తే కొనకుండా ఉండలేకపోతున్నాను!

నాకు చిన్నప్పటి నుంచి ఏ కొత్త వస్తువు చూసినా, కొనాలన్న ఆశ ఎక్కువ. స్కూలు రోజుల్లో రకరకాల పెన్నులు, ప్రతీ సంవత్సరం రెండు మూడు స్కూల్ బ్యాగులు, చెప్పులు, షూస్ కొనేవాడిని. తర్వాత నా ఆసక్తి బట్టలు మీదకు మళ్ళింది. మార్కెట్‌లోకి కొత్త రకం డ్రెస్‌లు వచ్చినప్పుడల్లా కొనమని పట్టుబట్టేవాణ్ణి. కొనకపోతే అలిగి అన్నం తినడం మానేసేవాడిని. తర్వాత నా మోజు సైకిళ్ళ మీకికి తిరిగింది. టీవీలో కొత్త మోడల్ సైకిల్ కనిపించగానే పాత సైకిల్ అమ్మేసి కొత్తదాన్ని కొనేవాడిని. కాలేజి రోజుల్లో ప్రతి నెలా ఫోన్ మార్చేవాడిని, డిగ్రీ పూర్తయ్యాక బైకులు నాకొత్త వ్యసనం అయ్యాయి. మార్కెట్ లో కొత్త బైక్ విడుదలయితే నా పాత బైక్ తక్కువ ధరకే అమ్మేసి అప్పు తీసుకొని మరీ కొత్త బైక్ కొనేవాడిని. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఆఫర్స్, డీల్స్ కోసం వెతకడం, నియంత్రణ లేకుండా ఖర్చు చేయడం చేస్తున్నాను. ఇలా కొన్న వాటిని తక్కువ ధరకు అమ్మి మళ్లీ కొత్త వస్తువులు కొంటున్నాను. దీనివలన డబ్బులు కోల్పోతున్నాను. ఇంట్లో భార్యతో గొడవలు, మనశ్శాంతి కూడా ఉండడం లేదు. ఈ అలవాటుని ఎలా మార్చుకోవాలి?

- శ్యామ్ సుందర్, గోదావరిఖని

మీరు చెప్పిన లక్షణాలన్నీ 'కంపల్సివ్ బైయింగ్ డిజార్డర్' అనే మానసిక సమస్యకు దగ్గరలో ఉన్నాయి. ఇది 'ఇంపల్సివ్ కంట్రోల్ డిజార్డర్'అనే మానసిక వ్యాధుల కేటగిరీలోకి వస్తుంది. దీనిలో ఏదో ఒక విషయం మీద విపరీతమైన తపన ఉంటుంది. ఆ పని చేసేదాకా మనసులో నిలకడ ఉండదు. ఎప్పుడూ అనే ఆలోచనలే ఉంటాయి. ఆ పని చేయగానే ఎంతో హాయిగా, ప్రశాంతంగా ఉంటుంది. దీనివలన నష్టం జరిగినప్పుడు తర్వాత బాధపడుతూ ఉంటాము. అది షాపింగ్ అవ్వొచ్చు, జూదం అనొచ్చు, ఎక్కువగా సెక్స్ ఆలోచనలు రావడం కావచ్చు లేదా అతిగాని తినాలనే ఆరాటం కావచ్చు. వీటన్నింటిలో 'డోపమైన్' అనే రసాయనం స్థాయి పెరుగుతుంది. దానివలన తాత్కాలికంగా చాలా ఆనందం కలుగుతుంది. ఒక్కసారి డోపమైన్ స్థాయి తగ్గితే మళ్ళీ ఆ పని చేస్తేనే ఆ రసాయనం పెరిగి ఆనందం కలుగుతుంది. క్రమేణా ఇదొక వ్యసనం లాగా మారుతుంది. చాలా మంది ఆల్కహాల్, ఇతర డ్రగ్స్ కి బానిసలా అవడం వెనుక కూడా ఇదే మెకానిజం ఉంటుంది. ఇక మీ సమస్య విషయానికి వస్తే 'కంపల్సివ్ బైయింగ్ డిజార్డర్‌కు ఖచ్చిత మైన మందులు లేనప్పటికీ 'యాంటీ డిప్రెసెంట్' 'యాంటీ క్రేవింగ్' మందులు వాడి కొంత వరకు మీ ప్రవర్తనని అదుపు చేయవచ్చు. దానితోపాటు సైకోథెరపీ, మారైటల్ థెరపీ కూడా ఉపయోగ పడుతుంది. ఎవరో చెప్పినట్లు ఆఫర్‌లో కొంటే 50 శాతం డబ్బులు మిగులుతాయి. అసలు ఆఫర్లకి దూరంగా ఉంటే 100 శాతం మన డబ్బులు మన దగ్గరే ఉంటాయి కదా... మీరు దిగులు చెందకుండా వెంటనే మంచి సైకియాట్రిస్టుని కలవండి. అన్నీ కుదుట పడతాయి.

డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ. మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

* ఓటింగ్‌కు చివరి తేదీ నేడే. డిసెంబరు ఒకటిన వర్డ్ ఆఫ్ ఇయర్ వెల్లడి

● ఆక్స్‌ఫర్డ్... ఈ ఏటి మేటి...

భాషలో డిజిటల్ హవా!

* షార్ట్ లిస్ట్ రూపొందించిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్

* వర్డ్ ఆఫ్ ద ఇయర్-2025 కోసం కొన్ని పదాల ఎంపిక

ప్రపంచమంతటా పెద్దఎత్తున విస్తరిస్తున్న డిజిటల్ సంస్కృతి కొత్తపదాల పుట్టుకపైనా, వాటి వాడుకపైనా ఎలాంటి ప్రభావం చూపుతోందో చూడండంటూ వాటికేసి చూపుతున్నారు భాషావేత్తలు, భాషానిపుణులు! ఈ ఏడాది ముగింపునకు వస్తుండగా... ఎప్పటిలాగే కొత్తగా వాడుకలోకి వస్తున్న పదాల తాలూకు లఘుపట్టికను రూపొందించింది ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్. అలాగే ఏడాది 'వర్డ్ ఆఫ్ ద ఇయర్'ను ఎంపిక చేయాలంటూ ఓటింగ్‌నూ నిర్వహిస్తోంది. ఈ నెల (నవంబరు) 27 నాటితో ముగిసే ఈ ఓటింగులో ఈ ఏడాదిలో కీలకంగా, అందరినీ ఆకర్షిస్తూ నిలిచిన పదాన్ని ఎంపిక చేయాలంటూ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ పిలుపునిచ్చింది.



ఆరా ఫార్మింగ్ అంటే: సోషల్ మీడియా ప్రపంచంలో తానో స్టైలిష్ వ్యక్తిగా, అత్యంత ఆకర్షణీయమైన వ్యక్తిత్వం ఉన్నవాడిగా (కరిస్మాటిక్‌గా), ఓ ప్రభావపూర్వకమైన వ్యక్తిగా, అలాగే ఓ కూల్ పర్సన్‌గా కనిపించేలా తనను తాను ఆవిష్కరించుకోడాన్ని 'ఆరా ఫార్మింగ్' అంటారు. ఇలా తనను తాను ఓ అద్భుతమైన ఆకర్షణీయమైన వ్యక్తిగా ప్రొజెక్టు చేసుకునే వ్యక్తి చేసే ప్రయత్నమే 'ఆరా ఫార్మింగ్' అన్నమాట. ఇక ఈ పదబంధంలోని పదాల లిటరల్ మీనింగ్ అందరికీ తెలిసిందే. 'ఆరా' అంటే ఓ గొప్ప వ్యక్తి చుట్టూ ఆవరించి ఉండే ప్రకాశం. 'ఫార్మింగ్' అంటే పండించడం, దిగుబడి సాధించడం అని అర్థాలు. అంటే ఈ డిజిటల్ ప్రపంచంలో ఓ గొప్ప ప్రకాశవంతమైన ఇమేజ్‌లాంటిది సాధించుకునేందుకు చేసే ప్రయత్నం అని చెప్పుకోవచ్చు.

బయో హ్యాక్ : హ్యాకింగ్ అంటే అందరికీ తెలిసిందే. ఒకరి వ్యక్తిగత అంశాలను తస్కరించడం. మార్పులు చేయడం వంటివి. అయితే దీని అర్థం విచిత్రంగా ఉంది. యోగా వ్యాయామం, జీవనశైలిలో మార్పుల ద్వారా దేహం బరువును అదుపులో పెట్టుకోవడం, తమ సొంత జీవక్రియల్లో ఆరోగ్యవంతమైన మార్పులు తెచ్చుకోడానికి డిజిటల్ ప్రపంచానికి చెందిన 'హ్యాకింగ్' అనే పదాన్ని 'బయో'కు ముందు చేర్చి పుట్టించిన పదం ఇది.

రేజ్ బెయిట్: రేజ్ అంటే కోపం లేదా ఆగ్రహం. బెయిట్ అంటే ఎర. 'ఆన్‌లైన్'లో ఎవరినైనా రెచ్చగొడుతూ, వాళ్లు రెచ్చిపోయి ఆగ్రహంతో చిందులు తొక్కేలా చేసేలా చేయడాన్ని 'రేజ్ బెయిట్' అంటారు. అంటే... ఎదుటివారిని గిల్లడం (టీజింగ్), కవ్వించడం లేదా అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తూ... ఈ ఎర సహాయంతో... ఎదుటివారు రెచ్చిపోయి కోపంతో ఆగ్రహోదగ్రులయ్యేలా చేసే ప్రక్రియే 'రేజ్ బెయిట్'.



ఇవీ ఈ ఏడాదిలో కొత్తగా ఎంపికైన పదాలు

ఈ ఏడాది షార్ట్ లిస్ట్ చేశాక నిలిచిన కొత్త ఇంగ్లిష్ పదాలేమిటంటే... మొదటిది 'ఆరా ఫార్మింగ్', రెండోది 'బయో హ్యాక్' మూడోది 'రేజ్ బెయిట్'. ఇటీవలి డిజిటల్ సంస్కృతి పదాలపై చూపుతున్న ప్రభావానికి ఈ మూడు పదాలూ ఒక ఉదాహరణ అంటున్నారు భాషానిపుణులు. అదెందుకో వీటి అర్థాలు చూస్తే తెలుస్తుందంటూ వారు చెబుతున్నారు.

ఈ మూడు పదాల్లో వర్డ్ ఆఫ్ ద ఇయర్‌గా ఏది ఎంపిక అవుతున్నదీ డిసెంబరు మొదటి తేదీన తేలుతుంది. అన్నట్లు గత ఏడాది వర్డ్ ఆఫ్ ఇయర్ ఏమిటో తెలుసా? 'బ్రెయిన్ రాట్'. దీని అర్థం ఏమిటంటే... డిజిటల్ ప్రపంచంలో అవాంఛితమైన పనులన్నీ చేస్తూ తమ మేధస్సునూ, ఆలోచనా శక్తినీ, వృథా చేసుకోవడమే ఈ బ్రెయిన్ రాట్‌కు అర్థం. అంటే అక్కరలేని రీల్స్ అన్నీ చూస్తూ సమయం, వివేచన, విచక్షణ వీటన్నింటినీ వృథాచేసుకోడాన్ని 'బ్రెయిన్ రాట్'గా చెప్పవచ్చు.

● బ్యూటిప్

చలికాలంలో కూడా చేతులు మెరవాలంటే...

● చేతులు, వేళ్లు చలికాలంలో కూడా చక్కగా మెరుస్తూ కనిపించాలంటే మ్యానిక్యూర్‌తో పని లేదు. వారానికోసారి చేతుల్ని స్క్రబ్ చేయాలి. తర్వాత సున్నితంగా మసాజ్ చేయాలి. దీనికోసం కొద్దిగా నిమ్మరసంలో తేనె కలపాలి. దీనిని చేతులకి రాయాలి. ఆ తర్వాత మెల్లిగా మసాజ్ చేస్తే చేతులపై నలుపు తగ్గుతుంది. చేతులు కూడా కోమలంగా మారతాయి.

● అదే విధంగా, గ్లిజరిన్, రోజ్ వాటర్ కలిపి దానిని చేతులకి రాయండి. దీని వల్ల చేతులు కోమలంగా మారతాయి. చేతులపై ఉండే నలుపు తగ్గుతుంది. కాబట్టి, రెగ్యులర్‌గా రాయడం అలవాటు చేసుకోండి. ముందుగానే రెండింటిని సమాన పరిమాణంలో కలిపి ఓ కంటెయినర్‌లో స్టోర్ చేసుకుంటే అవసరం ఉన్నప్పుడు వాడుకోవచ్చు.

రియా మజుందార్ సింఘాల్



భారతదేశంలోని మొట్టమొదటి, అతిపెద్ద స్థిరమైన ప్యాకేజింగ్ కంపెనీ అయిన 'ఎకోవేర్ సొల్యూషన్స్' వ్యవస్థాపకురాలు రియా మజుందార్ సింఘాల్. ముంబయ్‌వాసి అయిన రియా బయోడిగ్రేడబుల్ వస్తువులను తయారుచేస్తుంది. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అత్యున్నత నారీ శక్తి పురస్కారం అందుకుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో యంగ్ గ్లోబల్ లీడర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్– క్లీన్ ఎయిర్ జాతీయ కమిటీ సభ్యురాలు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలో చదువుకున్న రియా భారతదేశంలో ప్లాస్టిక్ ముప్పును పరిహరించే ఏకైక లక్ష్యంతో 'ఎకోవేర్ సొల్యూషన్స్'ను స్థాపించింది. ప్లాస్టిక్‌ను పూర్తిగా కంపోస్ట్ చేయగల ప్రత్యామ్నాయాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ఫుడ్ ప్యాకేజింగ్ పరిశ్రమను బ్రేక్ చేసింది. వ్యవసాయ పంటల వ్యర్థాల నుండి ఎకోవేర్ తయారవుతుంది. వాయు కాలుష్యాన్ని నివారిస్తుంది. భారతదేశంలో అతిపెద్ద ఫుడ్ సర్వీస్ ఆపరేటర్ అయిన ఇండియన్ రైల్వేలను ఎకోవేర్ బయోడిగ్రేడబుల్స్ ట్రేలకు మారేలా ఒప్పించడం రియా సాధించిన గొప్ప విజయాలలో ఒకటి.

అజైతా షా

గ్రామీణ భారతావనిలోని ఇళ్లకు అధిక నాణ్యత, స్వచ్ఛమైన శక్తితో నడిచే సౌర దీపాలు, కుకింగ్ స్టౌలు.. వంటి ఉపకరణాలను అందించడానికి 'ఫ్రాంటియర్ మార్కెట్స్(క్లీన్ ఎనర్జీ)'ను స్థాపించింది. మహిళా వ్యవస్థాపకుల నెట్‌వర్క్ ద్వారా అమ్మకాలు, సేవలను కొనసాగిస్తుంది. అజైతా క్లీన్ ఎనర్జీ యాక్సెస్ ప్రపంచానికి కొత్తేమీ కాదు, ఫ్రంటియర్ మార్కెట్స్‌కు ముందు భారతదేశం అంతటా 10,000కు పైగా గ్రామాల్లో 13 లక్షలకు పైగా మహిళలకు సేవలందిస్తూ, ఏడేళ్లుగా మైక్రోఫైనాన్స్ రంగంలో పనిచేశారు. గ్రామాల్లో సరైన విద్యుత్తు అందుబాటులో లేదన్న వాస్తవాన్ని అర్థం చేసుకొని ఫ్రాంటియర్ మార్కెట్లను ప్రారంభించింది. గ్రామీణ కుటుంబాలకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తుంది. ఈ క్లీన్ ఎనర్జీ వినియోగదారులలో 70 శాతం మహిళలే ఉన్నారు.

● పర్యావరణ స్ఫూర్తి

క్లీన్ ఎనర్జీ స్టార్స్

వ్యాపారం ద్వారా లాభం పొందాలి... అలాగే పర్యావరణానికి, సమాజానికి మేలు చేకూర్చాలి. ఈ రెండు విధానాలను వ్యాపారంలో చేర్చడం పెద్ద సవాల్. పర్యావరణహిత వ్యాపారాలు చేస్తూ ఎకో ఎంట్రప్రెన్యూర్‌లుగా రాణిస్తున్నారు నేటి మహిళలు. క్లీన్ ఎనర్జీ స్టార్టప్స్‌తో దేశంలోనే ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు: ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

నీలిమా మిశ్రా

ఒడిశాలోని భువనేశ్వర్‌లో వ్యర్థాల నిర్వహణ రంగంలో ఒక విప్లవాత్మక స్టార్టప్ ద్వారా సంచలనం సృష్టిస్తోంది. పర్యావరణ స్పృహ కలిగిన నీలిమా రబీ నారాయణ్ మిశ్రా స్థాపించిన 'సీబా గ్రీన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' సస్టెయినబిలిటీలో ఒక ఉద్యమం. పర్యావరణ పరిరక్షణకు అంకితమైన ఈ స్టార్టప్ ఐక్యరాజ్య సమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలలో ఒకటిగా చేర్చింది. 2019లో నెలకొల్పిన ఈ స్టార్టప్ తన అనుభవాలనుండి పుట్టుకువచ్చిందని చెబుతుంది నీలిమా మిశ్రా. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుండి పట్టాలు పొందిన నీలిమ 'సీబా గ్రీన్' ద్వారా వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. వ్యర్థాలను సేకరించడం, సేంద్రీయ వ్యర్థాలను విలువైన కంపోస్ట్‌గా మార్చడం, రీ సైక్లింగ్‌ను సులభతరం చేస్తూ పరిశుభ్రమైన నగరాలకు ఊపిరి ఊదుతుంది.

ఆర్తి రాణా తరు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరి జిల్లాకు చెందిన ఆర్తి రాణా తరు 350 స్వయం సహాయక సంఘాలలోని పదివేల మంది మహిళల ద్వారా చేత చేనేత ఉత్పత్తులను తయారు చేయిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచింది. ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్, వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ వంటి సంస్థల మద్దతుతో ఆరేడేళ్లలో వేల మందికి చేరువయ్యింది ఆర్తి. మొదట ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానాలో సాధారణంగా కనిపించే పొడవైన, దృఢమైన గడ్డితో బుట్టలు, పెన్ స్టాండ్‌లను తయారు చేశారు. ఇవి వారి చేనేత వస్త్రాలతో పాటు ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిబిషన్‌లో ప్రజాదరణ పొందాయి. సస్టెయినబిలిటీ సాధించడం, మహిళల్లో స్వావలంబనను ప్రోత్సహించడంలో ఆర్తి రాణా 2020లో నారీ శక్తి పురస్కార్‌తో పాటు మరెన్నో సత్కారాలూ అందుకుంది.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) నవంబర్ 26న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,27,210	1,13,430	1,61,500
విజయవాడ	1,30,100	1,17,250	1,63,000
విశాఖపట్నం	1,27,910	1,17,250	1,76,000
రాజమండ్రి	1,30,100	1,12,770	1,63,000
ప్రొద్దుటూరు	1,25,900	1,15,830	1,63,000
చెన్నై	1,28,730	1,18,000	1,76,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



“టెస్టు జట్టుకు కోచ్‌గా నేను సరైనవాడినా కాదా అనేది చెప్పడం నా చేతుల్లో లేదు. దీనిపై బీసీసీఐ నిర్ణయం తీసుకుంటుంది. నేను గతంలోనే చెప్పినట్లు భారత జట్టు ముఖ్యం తప్ప వ్యక్తులు కాదు. చాలా మంది న్యూజిలాండ్ చేతిలో ఓటమి గురించి కూడా మాట్లాడుతున్నారు. కానీ ఇదే యువ జట్టుతోనే నేను ఇంగ్లండ్‌లో టెస్టు సిరీస్‌లో మంచి ఫలితాలు రాబట్టిన విషయం మరచిపోవద్దు. నా కోచింగ్‌లోనే జట్టు చాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ కూడా గెలిచింది. కివీస్‌తో సిరీస్‌తో దీనిని పోల్చవద్దు. ప్రస్తుతం జట్టులో అనుభవం తక్కువగా ఉంది. ఓటమికి సాకులు చెప్పే అలవాటు నాకు ఎప్పుడూ లేదు. నిజానికి ‘సంధి కాలం’ అనే మాటను నేను వాడను కానీ మా పరిస్థితి ఇప్పుడు సరిగ్గా అలాగే ఉంది. ఈ టెస్టులో ఒకదశలో మెరుగైన స్థితిలో ఉన్న జట్టు ఒక 30 నిమిషాల స్పెల్‌లో కుప్పకూలింది. మన ఆటగాళ్లు ఇంకా నేర్చుకుంటున్నారు. వారికి తగినంత సమయం ఇవ్వాలి.

-గౌతమ్ గంభీర్, భారత హెడ్ కోచ్

“చాలా గొప్ప విజయం. అసాధారణ ఘనత ఇది. భారత్‌లో టెస్టు సిరీస్ గెలవడం సాధారణంగా ఊహకు కూడా అందనిది. మా ఆటపై సందేహాలు వ్యక్తం చేసిన వారందరికీ సమాధానమిది. మంచి సన్నద్ధతతో పాటు పరిస్థితులకు తగినట్లుగా మా ఆటను మార్చుకున్నాం. తమ బాధ్యతపై ప్రతీ ఒక్కరికి స్పష్టత ఉండటం మేలు చేసింది.

-తెంబా బవుమా, దక్షిణాఫ్రికా కెప్టెన్

పరాజయం పరిపూర్ణం

రెండో టెస్టులో చిత్తుగా ఓడిన భారత్

- రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 140 ఆలౌట్
- 408 పరుగులతో దక్షిణాఫ్రికా ఘన విజయం
- 2-0తో సిరీస్ హస్తగతం

పంత్

408 టెస్టుల్లో పరుగులపరంగా భారత్‌కు ఇదే అతి పెద్ద ఓటమి. 2004లో ఆస్ట్రేలియా చేతిలో (నాగ్‌పూర్‌లో) భారత్ 342 పరుగుల తేడాతో ఓడింది.

3 స్వదేశంలో భారత్ వైట్‌వాష్‌కు గురి కావడం ఇది మూడోసారి. 2000లో దక్షిణాఫ్రికా చేతిలో 0–2తో, 2024లో న్యూజిలాండ్ చేతిలో 0–3తో ఓడింది.

9 ఈ మ్యాచ్‌లో మార్క్‌రమ్ పట్టిన క్యాచ్‌ల సంఖ్య. ఒక టెస్టులో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఫీల్డర్‌గా రహానే (8) రికార్డును అతను సవరించాడు.

11 కెప్టెన్‌గా బవుమాకిది 11వ టెస్టు విజయం. ఆడిన 12 టెస్టుల్లో ఒకటి డ్రా కాగా, అతని నాయకత్వంలో జట్టు ఒక్క టెస్టూ ఓడలేదు.

సిరీస్ ట్రోఫీతో దక్షిణాఫ్రికా జట్టు

మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకుంటే చాలు అదే మాకు రెండో టెస్టులో విజయంతో సమానం... నాలుగో రోజు ఆట ముగిసిన తర్వాత భారత ఆటగాడు రవీంద్ర జడేజా చేసిన వ్యాఖ్య ఇది. ‘డ్రా’ చేసుకోవడం కాదు కదా... మన ఆటగాళ్లు కనీస స్థాయి పోరాటం కూడా చేయలేకపోయారు... చివరి రోజు సఫారీ స్పిన్నర్లు పదునైన బంతులతో మన పని పట్టి అలవోకగా మిగిలిన ఎనిమిది వికెట్లు పడగొట్టారు. రికార్డు విజయంతో సిరీస్‌ను గెలుచుకొని వరల్డ్ చాంపియన్‌గా తమ స్థాయిని ప్రదర్శిస్తూ దక్షిణాఫ్రికా సింహనాదం చేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మ్యాచ్‌ను శాసించిన యాన్సెన్ చివరి క్యాచ్‌ను అద్భుతంగా అందుకోవడం సరైన ముగింపు కాగా... ఏడాది వ్యవధిలో సొంతగడ్డపై రెండు సిరీస్‌లలో వైట్‌వాష్‌కు గురైన భారత బృందం అవమాన భారాన్ని తమ ఖాతాలో వేసుకుంది.

గువాహటి: దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో లాంఛనం ముగిసింది. అనూహ్యమేమీ జరగకుండా భారత్ సులువుగా తలవంచింది. ఊహించిన విధంగానే రెండు సెషన్ల లోపే మ్యాచ్ చేజారింది. టీమిండియా మిగిలిన 8 వికెట్లు తీసేందుకు సఫారీ బౌలర్లకు 48 ఓవర్లు సరిపోయాయి. బుధవారం ముగిసిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 408 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తుగా ఓడించింది. ఓవర్‌నైట్ స్కోరు 27/2తో ఆట కొనసాగించిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 63.5 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. రవీంద్ర జడేజా (87 బంతుల్లో 54; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించడం మినహా మిగతా బ్యాటర్లంతా పూర్తిగా విఫలమయ్యారు. ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ (6/37) ఆరు వికెట్లతో భారత్ పని పట్టాడు. కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టును కూడా గెలిచిన దక్షిణాఫ్రికా తాజా ఫలితంతో 2–0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. 25 ఏళ్ల తర్వాత ఆ జట్టు భారత్‌లో సిరీస్ గెలవడం విశేషం. 93 పరుగులు చేయడంతో పాటు 7 వికెట్లు తీసిన మార్కో యాన్సెన్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలవగా... మొత్తం 17 వికెట్లు తీసిన సైమన్ హార్మర్ ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’గా ఎంపికయ్యాడు. ఇరు జట్ల మధ్య ఆదివారం నుంచి వన్డే సిరీస్ జరుగుతుంది.

జడేజా మినహా...

ఓటమి నుంచి తప్పించుకునేందుకు చివరి రోజు బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలో కాస్త అదృష్టం కలిసొచ్చింది. యాన్సెన్ బౌలింగ్‌లో 4 పరుగుల వద్ద సాయి సుదర్శన్ క్యాచ్ ఇవ్వగా అది నోబాల్‌గా తేలింది. ఆ తర్వాత 4 పరుగుల వద్ద కుల్దీప్ యాదవ్ (5) ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను మార్క్‌రమ్ వదిలేశాడు. అయితే ఇది ఎంతోసేపు సాగలేదు. ఒకే ఓవర్లో కుల్దీప్, జురేల్ (2)లను అవుట్ చేసి దెబ్బ కొట్టిన హార్మర్... కొద్ది సేపటికే కెప్టెన్ రిషభ్ పంత్ (13)ను కూడా వెనక్కి పంపాడు. టీ విరామానికి భారత్ స్కోరు 90/5కు చేరింది. అయితే ప్రతీ బంతిని డిఫెన్స్ ఆడుతూ పట్టుదల ప్రదర్శించిన సాయి సుదర్శన్ (139 బంతుల్లో 14; 1 ఫోర్)) ఎట్టకేలకు ముత్తుసామి వేసిన ఒక చక్కటి బంతికి అవుటయ్యాడు. ఆ తర్వాత జడేజా, సుందర్ (16) కొద్దిసేపు పోరాడారు. అయితే కొత్త స్పెల్‌లో మళ్లీ బౌలింగ్‌కు దిగిన హార్మర్ 8 పరుగుల వ్యవధిలో సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి (0)లను అవుట్ చేయగా... మహరాజ్ ఒకే ఓవర్లో జడేజా, సిరాజ్ (0)లను వెనక్కి పంపడంతో దక్షిణాఫ్రికా శిబిరంలో వేడుకలు మొదలయ్యాయి.

ఐదో స్థానానికి భారత్..

భారీ ఓటమి తర్వాత ఇప్పటికిప్పుడు భారత టెస్టు జట్టు ప్రదర్శనపై ఎలాంటి చర్చా జరిగే అవకాశం లేదు. దక్షిణాఫ్రికాతో వన్డేలు, టి20ల తర్వాత న్యూజిలాండ్‌తో భారత్ స్వదేశంలోనే వన్డే, టి20 సిరీస్‌లు ఆడనుంది. ఆపై టి20 వరల్డ్ కప్, ఐపీఎల్ ఎలాగూ ఉంటుంది. కాబట్టి ఈ పరాజయంపై విశ్లేషణలు, ప్రశ్నలు ఇక్కడితోనే ముగిసిపోవచ్చు! మరోవైపు తాజా ఓటమితో ఐసీసీ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ 48.15 పాయింట్ల శాతంతో ఐదో స్థానానికి పడిపోయింది. అయితే ఈ ఓటమి తర్వాత డబ్ల్యూటీసీ ఫైనల్‌కు వెళ్లాలంటే భారత్ చాలా శ్రమించాల్సి ఉంటుంది. భారత తమ తర్వాతి టెస్టు మ్యాచ్ 2026 ఆగస్టులోనే ఆడనుంది. శ్రీలంకకు వెళ్లి 2 టెస్టులు, ఆపై న్యూజిలాండ్‌లో 2 టెస్టులతో పాటు స్వదేశంలో ఆస్ట్రేలియాతో 5 టెస్టులు ఆడాల్సి ఉంది. డబ్ల్యూటీసీలో భాగంగా ఉన్న ఈ 9 టెస్టుల్లో ప్రదర్శన మన ఫైనల్ ప్రస్థానాన్ని నిర్దేశించనుంది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 201; **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** 260/5 డిక్లేర్డ్; **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 13; రాహుల్ (బి) హార్మర్ 6; సుదర్శన్ (సి) మార్క్‌రమ్ (బి) ముత్తుసామి 14; కుల్దీప్ (బి) హార్మర్ 5; జురేల్ (సి) మార్క్‌రమ్ (బి) హార్మర్ 2; పంత్ (సి) మార్క్‌రమ్ (బి) హార్మర్ 13; జడేజా (స్టంప్డ్) వెరీన్ (బి) మహరాజ్ 54; సుందర్ (సి) మార్క్‌రమ్ (బి) హార్మర్ 16; నితీశ్ రెడ్డి (సి) వెరీన్ (బి) హార్మర్ 0; బుమ్రా (నాటౌట్) 1; సిరాజ్ (సి) యాన్సెన్ (బి) మహరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం** (63.5 ఓవర్లలో ఆలౌట్) 140.

వికెట్ల పతనం: 1–17, 2–21, 3–40, 4–42, 5–58, 6–95, 7–130, 8–138, 9–140, 10–140. **బౌలింగ్:** యాన్సెన్ 15–7–23–1, ముల్డర్ 4–1–6–0, హార్మర్ 23–6–37–6, మహరాజ్ 12.5–1–37–2, మార్క్‌రమ్ 2–0–2–0, ముత్తుసామి 7–1–21–1.

అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ గేమ్స్

రెండోసారి భారత్‌కు ఆతిథ్య హక్కులు

గ్లాస్గో (స్కాట్లాండ్): ఊహించిన విధంగానే 2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణ హక్కులు భారత్ దక్కించుకుంది. ఈ మేరకు కామన్వెల్త్ స్పోర్ట్ కార్యవర్గం బుధవారం వివరాలు వెల్లడించింది. కామన్వెల్త్ ఎగ్జిక్యూటివ్ బోర్డు గత నెలలోనే అహ్మదాబాద్‌ను వేదికగా ఎంపిక చేయనున్నట్లు ప్రకటించగా... ఇప్పుడు కార్యవర్గం దానికి ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషకు కామన్వెల్త్ స్పోర్ట్ అధ్యక్షుడు డొనాల్డ్ రుకరే ఆతిథ్య హక్కుల పత్రాలు అందజేశారు. దీంతో రెండు దశాబ్దాల తర్వాత భారత్ ఈ క్రీడలకు ఆతిథ్యమివ్వనుంది. 2010 కామన్వెల్త్ గేమ్స్ ఢిల్లీలో జరిగాయి. ‘కామన్వెల్త్ గేమ్స్ కోసం తదుపరి వేదిక ఖరారైంది. భారత్ ఈ క్రీడలకు కొత్త అభిరుచి, మరింత ఔచిత్యం తీసుకొస్తుందని విశ్వసిస్తున్నాం. గొప్ప సంస్కృతిని కొనసాగిస్తూ క్రీడల స్థాయిని పెంచుతుంది’ అని కామన్వెల్త్ స్పోర్ట్ అధ్యక్షుడు డొనాల్డ్ రుకరే అన్నారు. కామన్వెల్త్ స్పోర్ట్ నిర్ణయాన్ని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ స్వాగతించారు. ‘ఇది గర్వించే క్షణం. 2047 కల్లా టాప్–5 క్రీడా దేశాల్లో భారత్ ఒకటిగా ఎదుగుతుంది’ అని మాండవీయ పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తున్న భారత్‌కు కామన్వెల్త్ క్రీడల నిర్వహణ మంచి రిహార్సల్ కానుంది. 2030 కామన్వెల్త్ క్రీడల కోసం అహ్మదాబాద్‌తో పాటు... నైజీరియా నగరం అబుజా కూడా పోటీపడింది. అయితే నిర్వాహకులు మాత్రం భారత్‌నే ఎంపిక చేశారు. అబుజాను 2034 కామన్వెల్త్ క్రీడల కోసం పరిగణించనున్నారు.

- నేడు డబ్ల్యూపీఎల్ వేలం
- 31 బంతుల్లో సెంచరీ చేసిన ఉర్విల్ పటేల్
- ప్రపంచకప్ చెస్ విజేత సిందరోవ్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఆన్‌లైన్ హింసను అరికట్టాలి

“మనం హింస గురించి ఆలోచించినప్పుడు వీధుల్లో, ఇంట్లో, పని ప్రదేశాల్లో జరుగుతుందనుకుంటాం. కానీ, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కూడా జరుగుతోంది. ప్రతి ముగ్గురిలో ఒక మహిళ హింసని ఎదుర్కొంటోంది” అని పేర్కొన్నారు సమంత. మహిళలపై పెరుగుతోన్న ఆన్‌లైన్ వేధింపులకు వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితితో కలిసి పని చేయనున్నారామె. మహిళల గౌరవాన్ని కాపాడటం అందరి బాధ్యత అంటూ యూఎన్ విమెన్ ఇండియా నిర్వహిస్తున్న ‘నో ఎక్స్‌క్యూజ్’ కార్యక్రమానికి సమంత మద్దతుగా నిలిచారు. నవంబరు 25న ప్రారంభమైన ఈ కార్యక్రమం డిసెంబర్ 10 వరకు జరగనుంది. “సోషల్ మీడియాలో కామెంట్స్, ఆన్‌లైన్ బెదిరింపులు, డీప్ ఫేక్ ఫొటోలు వంటివన్నీ జరుగుతున్నాయి. ఇవి మహిళలు నలుగురిలో తమ గొంతు వినిపించడానికి కూడా భయపడేలా చేస్తున్నాయి... అభద్రతాభావాన్ని కలిగిస్తున్నాయి. నేను ఎన్నోసార్లు ఈ పరిస్థితిని అనుభవించాను. వేధింపుల వల్ల చాలామంది మహిళల జీవితాలు, కెరీర్ ఆగిపోయాయి. ఆన్‌లైన్‌లో అబ్యూజ్ చేయడాన్ని జోక్‌గా ట్రీట్ చేయడం ఆపేస్తే మనం ఇంటర్నెట్‌ని బెటర్‌గా మార్చొచ్చు. ఆన్‌లైన్ హింసను అరికట్టడానికి మరింత బలమైన వ్యవస్థలు రావాలి. ఇది మహిళలకు భద్రతగా మారుతుంది. ఇలాంటి వాటిపై మహిళల్లో అవగాహన పెరగాలి” అని సమంత పేర్కొన్నారు.

- సమంత

ఒక్క రోజులో జరిగే కథ ఇది

- కీర్తీ సురేశ్

● కుమార్, కీర్తీ సురేశ్

“‘రివాల్వర్ రీటా’ ఒక్క రోజులో జరిగే కథ. చాలా అద్భుతమైన పాత్రలు ఉన్నాయి. రాధికగారు చక్కని పాత్ర చేశారు. మా సినిమాని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను” అని కీర్తీ సురేశ్ అన్నారు. ఆమె టైటిల్ రోల్‌లో నటించిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘రివాల్వర్ రీటా’. జేకే చంద్రు దర్శకత్వం వహించారు. రాధికా శరత్‌కుమార్, సూపర్ సుబ్బరాయన్, సునీల్, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషించారు. సుధన్ సుందరం– జగదీష్ పళనీసామి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో కీర్తీ సురేశ్ మాట్లాడుతూ– “నన్ను రీటాగా అద్భుతంగా చూపించిన చంద్రుగారికి ధన్యవాదాలు. ఈ సినిమాని పక్కా కమర్షియల్‌గా తీశారాయన. మా నిర్మాతలు లేకపోతే ఈ సినిమా ఇంత అద్భుతంగా వచ్చేది కాదు. ఈ సినిమాని తెలుగు, కన్నడలో డిస్ట్రిబ్యూట్ చేస్తున్న కుమార్‌గారికి కృతజ్ఞతలు” అని చెప్పారు. నటుడు అజయ్ ఘోష్ మాట్లాడుతూ– “నేను నటించిన ‘రంగస్థలం, పుష్ప’ చిత్రాల తర్వాత అంత సంతృప్తిగా అనిపించిన సినిమా ‘రివాల్వర్ రీటా’” అని పేర్కొన్నారు. “ఈ సినిమాని ఆంధ్ర, తెలంగాణలో రిలీజ్ చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు” అన్నారు డిస్ట్రిబ్యూటర్ కుమార్.

హిస్టారికల్ యాక్షన్ షురూ



● బి. గోపాల్, బాలకృష్ణ

‘వీరసింహారెడ్డి’ వంటి హిట్ సినిమా తర్వాత హీరో బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘ఎన్‌బీకే111’ (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రం ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. ఇందులో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ హిస్టారికల్ యాక్షన్ చిత్రాన్ని వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి బాలకృష్ణ కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు బి. గోపాల్ క్లాప్ ఇచ్చారు. దర్శకులు బోయపాటి శ్రీను, బాబీ, బుచ్చిబాబు గౌరవ దర్శకత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ స్క్రిప్ట్‌ను నిర్మాతకు అందజేశారు. “ఒక భారీ చారిత్రక కథలో బాలకృష్ణను ఇప్పటివరకు చూడని ఒక కొత్త అవతారంలో చూపించనున్న చిత్రం ఇది. చక్కని భావోద్వేగాలు, అద్భుతమైన యాక్షన్‌తో ఈ సినిమా ప్రేక్షకులకు మంచి విజువల్ వండర్‌గా గొప్ప అనుభూతిని ఇవ్వనుంది” అని మేకర్స్ తెలిపారు.

ఏఐ వాడలేదు..ఈఐ వాడాం

- సంగీతదర్శకులు వివేక్ - మెర్విన్

రామ్, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా, ఉపేంద్ర లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘ఆంధ్ర కింగ్ తాలూకా’. మహేశ్ బాబు. పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం నేడు (గురువారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో ఈ చిత్రసంగీత దర్శకులు వివేక్–మెర్విన్ మాట్లాడుతూ– “తమిళంలో దాదాపు 20 సినిమాలు చేశాం. ‘ఆంధ్ర కింగ్ తాలూకా’ తెలుగులో మా మొదటి సినిమా. 2024లో రామ్‌గారు మా మ్యూజిక్ వర్క్‌ని మెచ్చుకుంటూ ఫోన్ చేసి, మాట్లాడారు. ఆ తర్వాత ‘ఆంధ్ర కింగ్ తాలూకా’ సినిమా గురించి చెప్పారు. ఈ చిత్రంలో ఏడు పాటలు ఉన్నాయి. రామ్‌గారికి మంచి మ్యూజిక్ సెన్స్ ఉంది. ట్యూన్‌ను కంపోజ్ చేసిన తర్వాత ‘నువ్వుంటే..’ పాట లిరిక్స్‌ను ఆయనే రాశారు. ఈ సినిమాకు మంచి మ్యూజిక్ ఆల్బమ్ కుదిరింది. స్క్రిప్ట్ కొత్తగా ఉండటంతో కొత్త సౌండ్‌ని క్రియేట్ చేసే స్కోప్ దొరికింది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. కొత్త తరహా మ్యూజిక్ కోసం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టూల్స్‌ని వినియోగించడం అనే విధానానికి మేం వ్యతిరేకం కాదు. కానీ ఈ సినిమా కోసం మేం ఏఐ వాడలేదు. కథలో మంచి ఎమోషన్ ఉంది. అందుకే ఈఐ (ఎమోషనల్ ఇంటెలిజెన్స్) వాడి, మ్యూజిక్ కంపోజ్ చేశాం” అని చెప్పారు.

పదహారు రోజుల పండగ ప్రారంభం

● సాయికృష్ణ , గోపిక, శేఖర్ కమ్ముల

సాయికృష్ణ దమ్మాలపాటి, గోపికా ఉదయన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ‘పదహారు రోజుల పండగ’ సినిమా బుధవారం ప్రారంభమైంది. ‘వినాయకుడు, విలేజ్‌లో వినాయకుడు, కేరింత’ చిత్రాల ఫేమ్ సాయి కిరణ్ అడివి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సురేష్ కుమార్ దేవత, హరిత దుద్దుకూరు, ప్రతిభ అడివి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు శేఖర్ కమ్ముల క్లాప్ ఇచ్చారు. నిర్మాత డి. సురేష్‌బాబు గౌరవ దర్శకత్వం వహించారు. రచయిత–నిర్మాత కోన వెంకట్, నిర్మాత కేకే రాధా మోహన్ నిర్మాతలకు స్క్రిప్ట్ అందించారు. “సాయికిరణ్‌గారి దర్శకత్వంలో మంచి కథతో నా మొదటి సినిమా చేయడం అదృష్టం. ప్రేక్షకులను అలరించడానికి కష్టపడి పని చేస్తా” అని చెప్పారు సాయికృష్ణ దమ్మాలపాటి. “‘పదహారు రోజుల పండగ’ వంటి మంచి టైటిల్‌ను సజెస్ట్ చేసిన కృష్ణవంశీగారికి థ్యాంక్స్” అన్నారు సాయికిరణ్ అడివి. “మా ‘పదహారు రోజుల పండగ’ వంద రోజుల పండగ కావాలని కోరుకుంటున్నా” అన్నారు సురేష్ కుమార్. “ఈ సినిమాలో అత్తమ్మ రోల్ చేస్తున్నాను” అని తెలిపారు రేణు దేశాయ్. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్.

సాయిలు సవాల్ విని భయమేసింది

- దర్శకుడు బాబీ

● ‘రాజు వెడ్స్ రాంబాయి’ సక్సెస్ మీట్‌లో శ్రీవిష్ణు, బాబీతో యూనిట్

“నిజాయితీగా కష్టపడి పని చేస్తే దేవుడు తప్పకుండా విజయాన్ని అందిస్తాడు. ‘రాజు వెడ్స్ రాంబాయి’ టీమ్‌కి కూడా అలాంటి విజయాన్ని అందించాడు. ఈ యంగ్ టీమ్ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొనడం సంతోషంగా ఉంది. వేణు ఊడుగుల దగ్గర ఉన్న కథలు మన ఇండస్ట్రీకి చాలా అవసరం” అని హీరో శ్రీ విష్ణు చెప్పారు. అఖిల్ ఉడ్డెమారి, తేజస్విని జంటగా నటించిన చిత్రం ‘రాజు వెడ్స్ రాంబాయి’. సాయిలు కంపాటి దర్శకత్వంలో డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్, డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్‌సూన్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. నిర్మాతలు వంశీ నందిపాటి, బన్నీ వాసు ఈ సినిమాని ఈ నెల 21న విడుదల చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం సక్సెస్ సెలబ్రేషన్స్‌కి శ్రీ విష్ణు, డైరెక్టర్ బాబీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ– “ఒక సినిమాతో ఇలా టీమ్ అంతా ఎమోషనల్‌గా కనెక్ట్ కావడం ఫస్ట్ టైమ్ చూస్తున్నాను. వేణు ఊడుగులని చూస్తుంటే నాకూ ప్రొడ్యూసర్ కావాలని ఉంది. డైరెక్టర్ సాయిలు అమీర్‌పేట (ఒకవేళ సినిమా ఫ్లాప్ అయితే అమీర్ పేట్‌లో అర్ధనగ్నంగా నిలబడతానని సాయిలు పేర్కొన్నారు) సవాల్ చేసినప్పుడు సాటి డైరెక్టర్‌గా భయమేసింది. కానీ తను బాక్సాఫీస్ బద్దలు కొట్టే సక్సెస్ ఇచ్చాడు” అని తెలిపారు. “‘రాజు వెడ్స్ రాంబాయి’ని నా జీవితంలో మర్చిపోలేను” అన్నారు సాయిలు కంపాటి. “మా సినిమా ప్రివ్యూ చూసిన కొందరు ఒక్క షో కూడా ఆడదన్నారు. కానీ, ప్రేక్షకులు మా చిత్రాన్ని గుండెల్లో పెట్టుకున్నారు” అని వేణు ఊడుగుల చెప్పారు. నిర్మాతలు రాహుల్ మోపిదేవి, వంశీ నందిపాటి, సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి, ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ, కంటెంట్ హెడ్ నితిన్, పాటల రచయిత మిట్టపల్లి సురేందర్, నటీనటులు అనితా చౌదరి, శివాజీ రాజా, చైతన్య జొన్నలగడ్డ, రచయితలు కోన వెంకట్, బీవీఎస్ రవి తదితరులు మాట్లాడారు.

మేఘం మెరిసిందే...

● అనస్వర, రోషన్

“ఎర్రర్ర బొట్టు దిద్ది వెండి మేఘం మెరిసిందే... మెరిసిందే...’ అంటూ సాగుతుంది ‘ఛాంపియన్’ సినిమాలోని ‘గిర గిర గింగిరా గిరే..’ పాట. రోషన్, అనస్వర రాజన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘ఛాంపియన్’. జీ స్టూడియోస్ సమర్పణలో ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 25న విడుదల కానుంది. ఈ సినిమాలోని ‘గిర గిర గింగిరాగిరే...’ అంటూ సాగే పాట లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. మిక్కీ జె. మేయర్ స్వరకల్పనలో కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను రామ్ మిరియాల పాడారు.

నిర్మాత చలసాని ఆర్‌బీ చౌదరి కన్నుమూత

‘నేను ప్రేమిస్తున్నాను, నేటి గాంధీ, సెల్ఫీ రాజా’ చిత్రాల నిర్మాత చలసాని ఆర్‌బీ చౌదరి (55) కన్నుమూశారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. ఎన్టీఆర్‌తో ‘గజదొంగ’, చిరంజీవితో ‘అడవి దొంగ’ వంటి పలు విజయవంతమైన సినిమాలు నిర్మించిన చలసాని గోపి తనయుడే ఆర్‌బీ చౌదరి. ఆయన పూర్తి పేరు చలసాని రామబ్రహ్మం చౌదరి. తండ్రి బాటలో నిర్మాతగా మారి, జేడీ చక్రవర్తి హీరోగా ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో ‘నేను ప్రేమిస్తున్నాను’ (1997) మూవీ నిర్మించారు ఆర్‌బీ చౌదరి. ఆ తర్వాత ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలోనే రాజశేఖర్ హీరోగా ‘నేటి గాంధీ’ (1999), ‘అల్లరి’ నరేశ్ హీరోగా ‘సెల్ఫీ రాజా’ (2016) వంటి సినిమాలు నిర్మించారు. ఆర్‌బీ చౌదరి అంత్యక్రియలు స్వగ్రామమైన ఏపీలోని కృష్ణాజిల్లా పెదమద్దాలిలో నేడు జరగనున్నాయి.

సాక్షి బిజినెస్
గురువారం
27-11-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,023	321
85,610	26,205

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్డాక్	23,269	▲	242
డోజోన్స్	47,538	▲	425
ఎఫ్టీఎస్ఈ 100	9,691	▲	82
డాక్స్	23,686	▲	222
హాంగ్సెంగ్	3,864	▼	6
నికాయ్	49,559	▲	900

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.65	89.67
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.40	118.36
€	యూరో	ఎస్‌బీఐ	101.40	104.13
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	46.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.62	59.50
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.47	70.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.92	24.42
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.41	24.67
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.74	13.56

మార్కెట్ రాకెట్...

- రికార్డుల బాటలో పరుగులు
- 1,023 పాయింట్ల హైజంప్
- 85,610 వద్ద నిలిచిన సెన్సెక్స్
- సరికొత్త రికార్డుకు చేరువలో నిఫ్టీ
- 321 పాయింట్ల ప్లస్‌తో 26,205కు
- బ్యాంకింగ్, ఆటో ఇండెక్సుల రికార్డ్

అటు యూఎస్ ఫెడ్, ఇటు ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు దేశీ స్టాక్ మార్కెట్లకు ఒక్కసారిగా జోష్‌నిచ్చాయి. ఇన్వెస్టర్లు మూకుమ్మడిగా కొనుగోళ్లకు దిగడంతో మార్కెట్లు రికార్డుల బాటలో సాగాయి. వెరసి డిసెంబర్ డెరివేటివ్ సిరీస్ తొలి రోజు దూకుడు ప్రదర్శించాయి.

ముంబై: మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పెడుతూ దేశీ స్టాక్ మార్కెట్లు బౌన్సయ్యాయి. తొలి నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగడంతో మార్కెట్లు చివరివరకూ బలపడ్డాయి. సెన్సెక్స్ 1,023 పాయింట్లు జంప్‌చేసి 85,610 వద్ద ముగిసింది. నిఫ్టీ 321 పాయింట్లు దూసుకెళ్లి 26,205 వద్ద నిలిచింది. ఇంతక్రితం 2024 సెప్టెంబర్ 27న ఇంట్రాడేలో నిఫ్టీ 26,277 పాయింట్లను తాకగా.. సెన్సెక్స్ 85,978కు చేరింది. ఇవి చరిత్రాత్మక గరిష్టాలుకాగా.. సరికొత్త రికార్డులకు చేరువలో అంటే సెన్సెక్స్ 300 పాయింట్లు, నిఫ్టీ 77 పాయింట్ల దూరంలో స్థిరపడ్డాయి. దీంతో ఒక్క రోజులోనే మార్కెట్ల విలువ రూ. 4.25 లక్షల కోట్లకుపైగా బలపడింది. వెరసి గత మూడు రోజుల్లో వాటిల్లిన నష్టాలనుంచి మార్కెట్లు పూర్తిగా రికవర్ అయ్యాయి. సెన్సెక్స్ 1,045 పాయింట్లు, నిఫ్టీ 307 పాయింట్లు చొప్పున కోల్పోయిన సంగతి తెలిసిందే. కాగా.. డిసెంబర్ పరపతి సమీక్షలలో ఆర్‌బీఐ, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోతలు పెట్టనున్న అంచనాలు ఇటీవల బలపడినట్లు నిపుణులు పేర్కొన్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లకు ప్రోత్సాహం లభిస్తున్నట్లు తెలియజేశారు. రష్యా, ఉక్రె యిన్ మధ్య సఖ్యతపై అంచనాలు సైతం ఇందుకు జత కలిసినట్లు విశ్లేషించారు.

అన్ని రంగాలూ సై

ఎన్ఎస్ఈలో అన్ని రంగాలూ 0.6–2 శాతం మధ్య లాభపడ్డాయి. బ్యాంక్ నిఫ్టీ, ఆటో రంగాలు సరికొత్త గరిష్టాలకు చేరాయి. నిఫ్టీ దిగ్గజాలలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ద్వయం, జియో ఫైనాన్స్, ఇండిగో, సీఐఎల్, టాటా స్టీల్, ఆర్ఐఎల్, గ్రాసిమ్, యాక్సిస్, టీఎంపీవీ, శ్రీరామ్, విప్రో, టెక్ఎం, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్, సన్ ఫార్మా, ఎల్అండ్‌టీ, మారుతీ, టీసీఎస్, కొటక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ 4–1.5 శాతం మధ్య ఎగశాయి. కేవలం ఎయిర్‌టెల్, అదానీ, ఐషర్ 1.6–0.5 శాతం మధ్య డీలాపడ్డాయి.

చిన్న షేర్లు సైతం

మార్కెట్ల బాటలో చిన్న షేర్లకూ డిమాండ్ పెరిగింది. దీంతో బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 1.25 శాతం చొప్పున బలపడ్డాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ సరికొత్త గరిష్టాన్ని అందుకుంది. ట్రేడైన షేర్లలో 2,721 లాభపడగా.. 1,453 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 4,778 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 6,248 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశాయి. ఇది మార్కెట్లకు బలాన్నిచ్చినట్లు నిపుణులు తెలియజేశారు.

ఆర్ఐఎల్ హవా..!

రూ. 21 లక్షల కోట్లకు మార్కెట్ విలువ

ప్రైవేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) షేరు బీఎస్ఈలో 2 శాతం లాభపడి రూ. 1,570 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 1,572 వద్ద 52 వారాల గరిష్టానికి చేరింది. తాజాగా కంపెనీ మార్కెట్ విలువ రూ. 21 లక్షల కోట్లను అధిగమించింది. ఈ ఏడాది ఇప్పటివరకూ ఆర్ఐఎల్ షేరు 29 శాతం లాభపడింది. ఇండెక్స్ హెవీవెయిట్ షేరు కావడంతో మార్కెట్లు సైతం బలపడుతున్నాయి!

బంగారం@1,30,100

- ఢిల్లీలో మరో రూ.1,200 పెరుగుదల
- రూ.1,63,100కు చేరిన వెండి ధర

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరల్లో ర్యాలీ బుధవారమూ కొనసాగింది. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు రూ.1,200 పెరగడంతో రూ.1,30,100 స్థాయిని చేరింది. ఇది రెండు వారాల గరిష్ఠ స్థాయి. వెండి ధర సైతం కిలోకి రూ.2,300 పెరిగి రూ.1,63,100 స్థాయిని అందుకుంది. యూఎస్ ఫెడ్ వచ్చే నెల భేటీలో రేట్ల కోత చేపడుతుందన్న అంచనాలు బలపడడం విలువైన లోహాల ధరల్లో ర్యాలీకి కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. ''ఇటీవలే ఫెడ్ గవర్నర్లు ఇద్దరు సానుకూల వ్యాఖ్యలు చేయడం, యూఎస్ స్థూల ఆర్థిక డేటా మృదువుగా ఉండడం వచ్చే నెలలో ఫెడ్ వడ్డీ రేట్ల కోత చేపడుతుందన్న అంచనాలను బలోపేతం చేశాయి''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం స్పాట్ ధర ఔన్స్‌కు 33.50 డాలర్లు (0.81 శాతం) ఎగసి 4,164 డాలర్లకు చేరింది. మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీ విభాగం ఏవీపీ ప్రవీణ్ సింగ్ సైతం ఇదే విధమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. యూఎస్ ఆర్థిక డేటా మృదువుగా ఉండడానికి తోడు వైట్ హౌస్ నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హసెట్ తదుపరి ఫెడ్ చైర్మన్ అవుతారన్న అంచనాలు సైతం రేట్ల కోత సెంటిమెంట్‌కు దారితీసినట్టు చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో వెండి స్పాట్ ధర ఔన్స్‌కు 1.71 డాలర్లు పెరిగి 52.37 డాలర్లకు చేరింది.

ఎక్సెల్‌సాఫ్ట్ టెక్ గుడ్

ఇటీవలే ఐపీవోకు వచ్చిన ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్ షేరు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో 12.5 శాతం ప్రీమియంతో లిస్టయ్యింది. ఇష్యూ ధర రూ. 120తో పోలిస్తే రూ. 135 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఒక దశలో 19 శాతం జంప్‌చేసి గరిష్టంగా రూ. 143కు చేరింది. చివరికి 5 శాతం లాభంతో రూ. 126 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 1,449 కోట్లను దాటింది.

ఎయిర్‌టెల్‌లో వాటా విక్రయం

రూ. 7,195 కోట్లు అందుకున్న ప్రమోటర్లు

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌లో తాజాగా ప్రమోటర్లు 0.56 శాతం వాటా విక్రయించారు. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 3.43 కోట్ల షేర్లను ఆఫ్‌లోడ్ చేశారు. షేరుకి రూ. 2,097.81 సగటు ధరలో విక్రయించడం ద్వారా రూ. 7,195 కోట్లకుపైగా అందుకున్నారు. ప్రమోటర్ సునీల్ భారతీ మిట్టల్ కుటుంబ సంస్థ ఇండియన్ కాంటినెంట్ ఇన్వెస్ట్‌మెంట్(ఐసీఐఎల్) ఈ వాటాను ఆఫర్ చేసింది. దీంతో ఎయిర్‌టెల్ ప్రమోటర్లలో ఒకటైన ఐసీఐఎల్ వాటా 1.48 శాతం నుంచి 0.92 శాతానికి క్షీణించింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం వాటా కొనుగోలుదారుల వివరాలు వెల్లడికావలసి ఉంది. 2025 సెప్టెంబర్30కల్లా ఎయిర్‌టెల్‌లో భారతీ టెలికంతోపాటు, సింగ్‌టెల్ సంస్థ పాస్టెల్ తదితరాలు ఉమ్మడిగా 50.27 శాతం వాటా కలిగి ఉన్నాయి.

వాటా విక్రయం నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు ఎన్ఎస్ఈలో 1.6 శాతం నష్టంతో రూ. 2,127 వద్ద ముగిసింది.

డేటా సెంటర్లపై రూ. 60,000 కోట్లు

- 2028 నాటికి ఇన్వెస్ట్ చేయనున్న ఆపరేటర్లు
- రెట్టింపు స్థాయికి పెరగనున్న సామర్థ్యాలు
- క్రిసిల్ నివేదిక

న్యూఢిల్లీ: దేశీయంగా డేటా సెంటర్ల ఆపరేటర్లు వచ్చే రెండేళ్ల కాలంలో భారీగా ఇన్వెస్ట్ చేయనున్నారు. 2026–2028 మధ్య కాలంలో రూ. 55,000–రూ. 60,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నారు. దీంతో డేటా సెంటర్ల సామర్థ్యం రెట్టింపై 2.3–2.5 గిగావాట్ల స్థాయికి చేరనుంది. క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. ఇటు కంపెనీలు, అటు రిటైల్ వినియోగదారులు భారీగా డిజిటల్ టెక్నాలజీలను వినియోగిస్తున్న నేపథ్యంలో 2028 ఆర్థిక సంవత్సరం నాటికి డేటా సెంటర్ ఆపరేటర్ల ఆదాయం వార్షికంగా 20–22 శాతం మేర వృద్ధి చెందుతుందని క్రిసిల్ అంచనా వేసింది. అప్పటికల్లా ఏటా రూ. 20,000 కోట్ల స్థాయికి చేరొచ్చని పేర్కొంది. ''పెరుగుతున్న డిమాండ్‌కి తగ్గట్లుగా సేవలు అందించేందుకు పరిశ్రమ 2026–28 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో రూ. 55,000–65,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉంది. ఈ నిధులు ప్రధానంగా రుణాల రూపంలోనే రానున్నప్పటికీ, స్థూలలాభాలు మెరుగ్గా ఉండటం వల్ల వ్యాపార పరిమాణానికి రుణ నిష్పత్తి స్థిరంగా 4.6–4.7 రెట్ల స్థాయిలో ఉంటుంది'' అని క్రిసిల్ వివరించింది.

మూడు అంశాల దన్ను..

డేటా సెంటర్ పరిశ్రమ వృద్ధికి మూడు అంశాలు దన్నుగా నిలవనున్నాయి. డిజిటల్ పరివర్తన, టెక్నాలజీ పురోగతిలో భాగంగా పబ్లిక్ క్లౌడ్ వినియోగాన్ని కంపెనీలు వేగంగా అందిపుచ్చుకుంటూ ఉండటం, కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీలపై పెట్టుబడులు పెరుగుతుండటం, 5జీ టెక్నాలజీ విస్తృత వినియోగం వీటిలో ఉంటాయి. భారత్‌లో ప్రస్తుతం డేటా సెంటర్ల సాంద్రత ప్రపంచంలోనే అత్యంత తక్కువగా ఎక్సాబైట్‌కి 65 మెగావాట్లుగా ఉందని క్రిసిల్ పేర్కొంది. మరోవైపు, డిమాండ్‌కి తగ్గ స్థాయిలో సేవలందించేందుకు 2028 మార్చి నాటికి పరిశ్రమ సామర్థ్యం రెట్టింపు కానుందని వివరించింది.

భారత్‌లో టెస్లా సెంటర్

ఒకే చోట రిటైల్, డెలివరీ, ఆఫ్టర్ సేల్స్ సర్వీసులు

న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా తాజాగా భారత్‌లో తమ తొలి టెస్లా సెంటర్‌ను గురుగ్రామ్‌లో ప్రారంభించింది. రిటైల్, ఆఫ్టర్–సేల్స్ సర్వీస్, డెలివరీ, చార్జింగ్‌లాంటి ప్రధాన సేవలన్నింటినీ ఒకే చోట అందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. భారత్‌లో వివిధ రకాల కస్టమర్ల లైఫ్‌స్టయిల్స్‌కి అనుగుణంగా చార్జింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్ తెలిపారు. పెద్ద ఎత్తున సూపర్‌చార్జింగ్ సదుపాయాలతో పాటు కస్టమర్లకు హోమ్–చార్జింగ్ సొల్యూషన్స్‌ని కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 80 లక్షల పైగా టెస్లా కార్ల విక్రయాలు, 3.2 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు దోహదపడ్డాయని ఆయన తెలిపారు. టెస్లా భారత్‌లో విక్రయించే మోడల్ వై కారు ధర రూ. 59.89 లక్షలుగా ఉంది.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: ఎన్విరాన్‌మెంట్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: జనరల్ ఇంగ్లిష్

టెట్.. సక్సెస్ రూట్

» టీజీ టెట్–2026 జనవరి ప్రక్రియ ప్రారంభం
» పేపర్–1, 2లుగా టెట్ పరీక్ష నిర్వహణ
» డీఈడీ, బీఈడీ అర్హతగా పోటీ పడే అవకాశం
» ఈ నెల 29 వరకు దరఖాస్తు అవకాశం

తెలంగాణ రాష్ట్రంలో టీజీ టెట్–2026 జనవరి నోటిఫికేషన్ విడుదలైంది. వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 31 వరకు ప్రతి రోజు రెండు షిఫ్ట్‌లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టాలనుకుంటే.. టెట్‌లో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. బీఈడీ, డీఈడీ విద్యార్థులు టెట్‌లో రాణించేందుకు కృషి చేస్తే.. అదే ప్రిపరేషన్‌తో భవిష్యత్తులో నిర్వహించే టీచర్ నియామక పరీక్షల్లోనూ విజయావకాశాలను మెరుగు పరచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. టెట్‌కు దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

రెండు పేపర్లుగా టెట్

తెలంగాణ ఎస్‌సీఈఆర్‌టీ ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం–పేపర్–1, పేపర్–2.. రెండు పేపర్లుగా టెట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధనకు టెట్ పేపర్–1కు హాజరవ్వాల్సి ఉంటుంది. ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించడానికి టెట్ పేపర్–2లో ఉత్తీర్ణత పొందాల్సి ఉంటుంది.

పేపర్–1 అర్హతలు

ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సుల్లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణత ఉండాలి (లేదా) 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు బీఈడీ, బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఉత్తీర్ణత శాతాల్లో అయిదు శాతం మినహాయింపు ఇస్తారు.

పేపర్–2 అర్హతలు

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు బీఈడీ లేదా బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణులవ్వాలి లేదా నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీ పాసవ్వాలి.
- లాంగ్వేజ్ పండిట్ కోర్సులకు సంబంధించి నిర్దేశిత లాంగ్వేజ్ ఆప్షనల్ సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా సంబంధిత లాంగ్వేజ్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్ ఉత్తీర్ణత లేదా సంబంధిత సబ్జెక్ట్ సాహిత్యంలో బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణత ఉండాలి. వీటితోపాటు నిర్దేశిత లాంగ్వేజ్‌లో లాంగ్వేజ్ పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్/సంబంధిత లాంగ్వేజ్ మెథడాలజీలో బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.

150 మార్కులకు పేపర్–1

- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించేందుకు అర్హతగా పేర్కొన్న టెట్ పేపర్–1ను 150 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం అయిదు విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్ 1.. 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు–30 మార్కులకు, గణితం 30 ప్రశ్నలు–30 మార్కులకు, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు–30 మార్కులకు ఉంటాయి.
- పరీక్షలో రెండో విభాగంగా పేర్కొన్న లాంగ్వేజ్–1 సబ్జెక్ట్ విషయంలో తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠి, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు. అభ్యర్థులు ఎంచుకున్న లాంగ్వేజ్‌ను పదో తరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివుండాలి. మూడో విభాగంగా పేర్కొన్న లాంగ్వేజ్–2(ఇంగ్లిష్) అభ్యర్థులందరికీ కామన్‌గా ఉంటుంది.

పేపర్–2 ఇలా

- సంబంధిత సబ్జెక్ట్‌లలో స్కూల్ అసిస్టెంట్ పోస్ట్‌లకు అర్హతగా నిర్దేశించిన టెట్ పేపర్–2ను కూడా 150 మార్కులకు నిర్వహిస్తారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్1...30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్ 2(ఇంగ్లిష్) 30 ప్రశ్నలు–30 మార్కులకు, సంబంధిత సబ్జెక్ట్ 60 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి.
- రెండో విభాగం లాంగ్వేజ్–1లో అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, మరాఠీ, తమిళం, సంస్కృతం సబ్జెక్ట్‌లను పదో తరగతి వరకు ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివుండాలి.
- నాలుగో విభాగంగా ఉన్న సంబంధిత సబ్జెక్ట్ విషయంలో.. మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగాన్ని, సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని ఎంచుకుని పరీక్ష రాయాలి.
- అదే విధంగా సబ్జెక్ట్ పేపర్‌కు సంబంధించి కంటెంట్ నుంచి 24 ప్రశ్నలు, పెడగాజీ నుంచి ఆరు ప్రశ్నలు చొప్పున ప్రతి సబ్జెక్ట్ విభాగం నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు.
- సైన్స్ సబ్జెక్ట్‌లో ఫిజికల్ సైన్స్ నుంచి 12 ప్రశ్నలు, బయలాజికల్ సైన్స్ నుంచి 12 ప్రశ్నలు చొప్పున కంటెంట్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. మిగతా ఆరు ప్రశ్నలు సైన్స్ పెడగాజీ నుంచి అడుగుతారు.
- సోషల్ విభాగంలో హిస్టరీ, జాగ్రఫీ, సివిక్స్, ఎకనామిక్స్‌ల నుంచి 48 కంటెంట్ ప్రశ్నలు, 12 పెడగాజీ ప్రశ్నలు ఉంటాయి.

కనీసం 60 శాతం మార్కులు

టెట్ పేపర్–1, పేపర్–2లలో అభ్యర్థులు తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధించాలనే నిబంధన విధించారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో(90 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో (70 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరిలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో(60 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. ఈ మార్కులు సాధించిన వారికే టెట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు జారీ చేస్తారు.

ప్రిపరేషన్ పక్కాగా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

రెండు పేపర్లలోనూ మొదటి విభాగంగా ఉండే చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ నుంచి బోధన, అభ్యసనానికి సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన వాటిని క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు–సూత్రాలు,ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి.

ఇక పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం– నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజిలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తే.. ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

లాంగ్వేజ్–1, 2లకు ఇలా

లాంగ్వేజ్ విభాగాలకు సంబంధించి అభ్యర్థులు ఎంచుకున్న భాషలో నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతో పాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకుని చదవాలి. పెడగాజికి సంబంధించి టీచింగ్ మెథడ్స్, అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యం పై ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

పేపర్–1లో ఉండే ఈ రెండు సబ్జెక్ట్‌లలో మంచి మార్కుల కోసం అభ్యర్థులు.. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. సబ్జెక్టులో ఉన్న 30 ప్రశ్నల్లో 24 ప్రశ్నలు కంటెంట్‌పై ఉంటే.. 6 ప్రశ్నలు పెడగాజి నుంచి అడుగుతారు. ఇక పేపర్–2లో మ్యాథమెటిక్స్, సైన్స్‌పై ప్రశ్నలు ఉంటాయి. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్‌తోపాటు తెలంగాణ మీద ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటున్నాయి.

సైన్స్

టెట్ పేపర్–2లో సైన్స్ సబ్జెక్ట్ అభ్యర్థులు ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

దీనికి సంబంధించి ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదవాలి. వాతావరణ, భౌగోళిక పరిస్థితులు, నదులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

మెథడాలజీ

ఇందులో ప్రధానంగా బోధనా పద్ధతులు, టీచర్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం), బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి. పేపర్–1, పేపర్–2లో అడిగే అంశాలు ఒక్కటే అయినా.. వాటి క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. దీన్ని గుర్తించి ప్రిపరేషన్ కొనసాగించాలి.

ప్రాక్టీస్ ముఖ్యం

టీజీ టెట్–2026ను జనవరి 2 నుంచి నిర్వహించనున్నారు. అంటే అభ్యర్థులకు దాదాపు నెల రోజుల సమయం అందుబాటులో ఉందని చెప్పొచ్చు. ప్రస్తుత సమయంలో అభ్యర్థులు వ్యూహాత్మకంగా అడుగులు వేయాలి. గత ప్రశ్నపత్రాల ఆధారంగా ఇంగ్లిష్, తెలుగు, పెడగాజి విభాగాల్ని అధ్యయనం చేసి బిట్స్ ప్రాక్టీస్ చేయాలి. గత టెట్ ప్రశ్నపత్రాలను పరిశీలించి, అంశాల వారీగా ప్రాధాన్యాన్ని గుర్తించాలి. కంటెంట్ విభాగంలో పేపర్–1 రాసే అభ్యర్థులు మూడు నుంచి అయిదో తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లోని ముఖ్యాంశాలను రివిజన్ చేయాలి. పేపర్–2 అభ్యర్థులు 6, 7, 8 తరగతుల పాఠ్యపుస్తకాల్లోని కీలకాంశాలను చదవాలి. కంటెంట్‌కు సంబంధించి ఎక్కువగా సమాచార ఆధారిత ప్రశ్నలే ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు జ్ఞాపకశక్తిని పెంపొందించుకునే ప్రయత్నం చేయాలి. దటెట్‌లో కొంత క్లిష్టమైన విభాగం మెథడాలజీ. ఇందులో ఎక్కువ మార్కులు సాధించాలంటే.. లక్ష్యాలు, బోధనా పద్ధతులు, బోధనోపకరణాలు, మూల్యాంకనం, కరిక్యులం అంశాలపై దృష్టిసారించాలి.

మోడల్ పేపర్లు

ప్రస్తుతం అభ్యర్థులు వీలైనన్ని మోడల్ పేపర్లను సేకరించి, సాధన చేయాలి. దీనివల్ల ఏయే అంశాల్లో బలహీనంగా ఉన్నారో తెలుస్తుంది. మోడల్ పేపర్లు రాయడం ఎంత ముఖ్యమో వాటిని విశ్లేషించుకోవడం అంతా కంటే ప్రధానం. విశ్లేషించుకొని తప్పులను సమీక్షించుకోవాలి. తెలంగాణ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా పేపర్–2 సోషల్ స్టడీస్ అభ్యర్థులు వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ఎగ్జామ్ ముందు రోజు రివిజన్ చేసుకునేలా షార్ట్‌నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, నవంబర్ 29
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** 2025 డిసెంబర్ 12 నుంచి
- **టెట్ తేదీ:** జనవరి 3 నుంచి జనవరి 31 వరకు (ప్రతి రోజు ఉదయం 9 నుంచి 11:30 వరకు; మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు)
- **ఫలితాల వెల్లడి:** 2026 ఫిబ్రవరి 10–16 మధ్యలో
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://tgtet.aptonline.in/tgtet

విద్య, ఉద్యోగ సమాచారం

బీడీఎల్ హైదరాబాద్‌లో 156 ట్రేడ్ అప్రెంటిస్‌లు

హైదరాబాద్ కాంచన్‌బాగ్ యూనిట్‌లో భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) ట్రేడ్ అప్రెంటిస్(ఐటీఐ)ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 156.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఫిట్టర్–70, ఎలక్ట్రీషియన్–10, ఎలక్ట్రానిక్స్ మెకానిక్–30, మెషినిస్ట్–15, మెషినిస్ట్ గ్రైండర్–02, మెకానికల్ డీజిల్–05, మెకానిక్ ఆర్–ఏసీ–05, టర్నర్–15, వెల్డర్–04.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 08.12.2025 నాటికి 14 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తుఫారమ్‌తో పాటు అవసరమైన సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలను జతచేసి మేనేజర్(హెచ్ ఆర్) అప్రెంటిస్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్), కాంచన్‌బాగ్, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.12.2025.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.12.2025.
» **వెబ్‌సైట్:** https://bdlindia.in

సీఎస్ఐఆర్–ఎస్ఈఆర్సీలో 30 సైంటిస్ట్ పోస్టులు

చెన్నై(తమిళనాడు)లోని సీఎస్ఐఆర్–స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్(ఎస్ఈఆర్సీ) సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులకు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.11.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.12.2025.
» **వెబ్‌సైట్:** https://serc.res.in

క్లుప్తంగా...

తప్పిన తుపాన్ ముప్పు

- ఇండోనేషియాలో తీరం దాటిన 'సెనియార్'
- మరోవైపు బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి సెనియార్ తుపాన్ ముప్పు తప్పింది. అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం.. క్రమంగా ఇండోనేషియా వైపు కదులుతూ బుధవారం తుపాన్‌గా మారి తీరం దాటింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు మినహా ఎటువంటి ప్రభావం ఉండదని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు నైరుతి బంగాళాఖాతం, ఆగ్నేయ శ్రీలంక, హిందూ మహాసముద్రం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం అక్కడే కొనసాగుతోంది. అలాగే ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి సగటున 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఇది వచ్చే 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని.. ఆ తర్వాత 48 గంటల్లో తమిళనాడు, పుదుచ్చేరి తీరాల వైపు కదులుతూ బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఏడాదికి 50 ఉపగ్రహాల ప్రయోగానికి ప్రణాళిక

ఇస్రో చైర్మన్ నారాయణన్

సాక్షి, చెన్నై: ఏడాదికి 50 ఉపగ్రహాలు ప్రయోగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు. రానున్న మూడేళ్లలో 150 ఉపగ్రహాల ప్రయోగానికి యోచిస్తున్నామన్నారు. కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2040 నాటికి అభివృద్ధి చెందిన దేశాల అంతరిక్ష కార్యక్రమాలతో సమానంగా ఇస్రో ప్రణాళికలు ఉంటాయన్నారు. మహేంద్రగిరి ఇస్రో కేంద్రం పెద్దఎత్తున అభివృద్ధి చెందుతోందని.. ఇది ఎనిమిది వేల ఎకరాలలో విస్తరించి ఉందని.. అత్యాధునిక ప్రయోగశాలలు ఉన్నాయని నారాయణన్ వివరించారు. ఏడాదికి 50 చొప్పున మూడేళ్లలో 150 ఉపగ్రహాల ప్రయోగంలో ప్రైవేటు భాగస్వామ్యం కూడా అవసరమని తెలిపారు. అయితే, ఇవన్నీ ఇస్రో నియంత్రణలో ఉంటాయని చెప్పారు. ప్రైవేటుకు అవసరమైన సహకారం, సాయాన్ని ఇస్రో అందిస్తుందన్నారు.

విపత్తులపై ఖచ్చితమైన సమాచారం..

విపత్తు హెచ్చరికలకు సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు అందించేలా ఇస్రో ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నట్లు నారాయణన్ చెప్పారు. చంద్రయాన్–5 ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపిందని, జపాన్ అంతరిక్ష సంస్థ దీనిని అమలుచేస్తుందన్నారు. 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని ఆయన చెప్పారు. ఇందుకు సంబంధించిన తొలిదశ పనులకు ఆమోదం లభించిందని తెలిపారు. అమెరికాతో కలిసి ఆరువేల కిలోల టెలీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని వాణిజ్యపరంగా ప్రయోగించనున్నామన్నారు. డిసెంబర్‌లో నింగిలోకి రోబోను పంపించేందుకు చర్యలు విస్తృతం చేశామని నారాయణన్ చెప్పారు.

రూ.10 వేలు ఆశిస్తే రూ.12 కోట్లకు నోటీసులు!

- సిమ్ కార్డు, బ్యాంకు ఖాతా అప్పగింత ఫలితం
- బోగస్ కంపెనీ సృష్టించి ఐటీసీ కాజేసిన వైనం

చిత్తూరు అర్బన్: టమాటాలు విక్రయించే ఓ వ్యక్తి రూ.10 వేల కోసం ఆశపడి కొందరు మధ్యవర్తులకు తన పేరిట ఉన్న సిమ్ కార్డు, బ్యాంకు ఖాతా నిర్వహణ అప్పగించడంతో ఏకంగా రూ.12.32 కోట్లు చెల్లించాలంటూ సీజీఎస్‌టీ నుంచి నోటీసులొచ్చిన వైనమిది. కొంత మంది బోగస్ పేర్లతో కంపెనీ సృష్టించి అందినకాడికి దండుకుని, అమాయకులను ఇరికిస్తోందని తద్వారా స్పష్టమవుతోంది. చిత్తూరు తోటపాళ్యంకు చెందిన ఓ వ్యక్తి తోపుడు బండిపై టమాటాలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని వార్షిక ఆదాయం రూ.లక్ష కూడా దాటదు. ఈ క్రమంలో కొందరు మధ్యవర్తులు ఇతనికి రూ.10వేలు ఇచ్చి బ్యాంక్ ఖాతాను, సిమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో 2024 అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూలై వరకు నిర్వహించిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి రూ.12,32,30,425 చెల్లించాలని సదరు వ్యక్తికి తిరుపతిలోని సీజీఎస్‌టీ కమిషనర్ కార్యాలయం నుంచి జాయింట్ కమిషనర్ పేరిట నోటీసులు అందాయి. ఏమిటా అని ఆరా తీస్తే బాధితుడి పేరిట కొందరు వ్యక్తులు ఓ కంపెనీ ఏర్పాటు చేసి, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకున్నట్లు.. తద్వారా తప్పుడు ఇన్‌వాయిస్‌లు, బిల్లులతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కల్పించడంతో రూ.12.32 కోట్లు జరిమానా చెల్లించాలని నోటీసులు జారీ అయినట్లు తెలిసింది. కొంత మంది బోగస్ కంపెనీ నిర్వహించి, పెద్ద మొత్తంలో ఐటీసీ కాజేయడం వల్లే ఇలా జరిగిందని ప్రాథమిక సమాచారం. ఇలాంటి బాధితులు జిల్లాలో మరికొందరు ఉన్నట్టు తెలుస్తోంది.

'టెలిగ్రామ్'లో సినిమాల కొనుగోలు

రవికి విక్రయించిన వారిని గుర్తించడం ఈజీ కాదు!

- లావాదేవీ తర్వాత అంతర్ధానమైన ఖాతాలు
- రికార్డు చేసిన సినిమాల క్వాలిటీ పెంచే బాధ్యత ఔట్ సోర్సింగ్‌కు
- రవికి పోలీసు కస్టడీ పొడిగింపు

ఇమ్మడి రవి

సాక్షి, హైదరాబాద్: 'ఐబొమ్మ', 'బపం' వెబ్‌సైట్లు నడిపించిన ఇమ్మడి రవికి అనేక పైరసీ సినిమాలు విక్రయించిన వారిని గుర్తించడం అంత ఈజీ కాదని... దాదాపు అసాధ్యమని సైబర్ క్రైమ్ పోలీసులు వ్యాఖ్యానిస్తున్నారు. అతడు టెలిగ్రాం యాప్ ద్వారా వీటిని ఖరీదు చేయడమే అందుకు కారణమని చెప్తున్నారు. రవి ఆరేళ్ల కాలంలో తన వెబ్‌సైట్లలో 21 వేలకు పైగా సినిమాలను పొందుపరిచాడు. వీటిలో ఏ ఒక్కటీ తాను నేరుగా పైరసీ చేయలేదు. మూవీ రూల్జ్, తమిళ్ వన్ సహా అనేక పైరసీ వెబ్‌సైట్లలో ఉన్న సినిమాలను స్క్రీన్ రికార్డింగ్ చేసే వాడు. దీంతోపాటు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో విడుదలైన వాటినీ ఇదే విధానంలో రికార్డు చేసే వాడు. దీనికోసం రవి కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎంఎస్) అనే సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసి వినియోగించాడు. ఇలా రికార్డింగ్ చేసిన చిత్రాలు ఆయా సైట్లు, ఓటీటీల్లో విడుదలైన కొన్ని గంటల తర్వాత ఐబొమ్మతో పాటు దాని అనుబంధ వెబ్‌సైట్లలోకి వచ్చేవి.

టెలిగ్రాం యాప్స్ నుంచీ ఖరీదు

సోషల్‌మీడియా యాప్ టెలిగ్రాం వేదికగానూ పైరసీ చిత్రాల క్రయవిక్రయాలు జరుగుతుంటాయని, తాను ఆ రకంగానూ కొన్నింటిని కొన్నానని రవి పోలీసుల విచారణలో చెప్పారు. వివిధ రకాలైన ఐడీలతో ఈ యాప్‌లోకి ప్రవేశించే వ్యక్తులు పైరసీ సినిమాలను హైపర్ లింక్ ద్వారా పొందుపరుస్తారు. యూఎస్‌డీటీ, బిట్ కాయిన్ల రూపంలో వారికి చెల్లింపులు జరిపితే ఆ చిత్రాన్ని చూసే అవకాశం ఇస్తారు. ఇలా ఆ చిత్రాలను రవి ఖరీదు చేసి, రికార్డు కూడా చేశాడు. ఓ ఐడీ ద్వారా ప్రవేశించిన విక్రేత నిర్ణీత మొత్తం అందిన వెంటనే అంతర్ధానం అయిపోతాడు. ఈ కారణంగానే విక్రేత ఆచూకీ కనిపెట్టడం దాదాపు అసాధ్యం అని అంటున్నారు. రవి వెబ్‌సైట్లలో దాదాపు హెచ్‌డీ క్వాలిటీ సినిమాలే ఉంటాయి. దీన్ని చూసిన పోలీసులు అతడి వెనుక భారీ నెట్‌వర్క్ ఉంటుందని, సర్వర్లను హ్యాక్ చేసి ఈ సినిమాలు సంగ్రహిస్తాడని భావించారు. అయితే విచారణలో రవి బయటపెట్టిన అంశాలు ఈ అనుమానాలను పటాపంచలు చేశాయి. ఓ సినిమాను రికార్డింగ్ చేసిన తర్వాత దాని ఆడియో, వీడియోల క్వాలిటీలను పెంచేవాడు. దీనికోసం కరేబియన్ దీవుల్లో ఉన్న కొందరితో ఔట్ సోర్సింగ్ విధానంలో ఒప్పందాలు చేసుకున్నాడు.

మరో మూడు రోజుల పోలీసు కస్టడీ

రవిపై మొత్తం ఐదు కేసులు నమోదై ఉన్నాయి. ఈ నెల రెండో వారంలో పోలీసులు ఓ కేసులో అతడిని అరెస్ట్ చేసి ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నారు. మరో వారం రోజులు అదనపు కస్టడీ కోరగా... మూడు రోజులకు అనుమతిస్తూ న్యాయస్థానం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అతన్ని గురువారం చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకుని శనివారం వరకు విచారించనున్నారు. మరోవైపు మిగిలిన నాలుగు కేసుల్లో రవిని కోర్టు నుంచి ప్రిజనర్స్ ట్రాన్సిట్ వారెంట్ పొందడం ద్వారా అరెస్టు చేయాల్సి ఉంది. రెండు కేసుల్లో ఈ వారెంట్ పొందిన అధికారులు ఒకదాంట్లో అరెస్టు చేశారు. ప్రస్తుత కస్టడీ ముగిసిన తర్వాత ఈ కేసులోనూ పోలీసు కస్టడీకి తీసుకోవాలని నిర్ణయించారు. ఇదే పంథాలో మిగిలిన మూడు కేసుల్లోనూ చేయనున్నారు.

ఇంటర్‌నెట్ బొమ్మ, బలపాలే పేర్లు...

రవి నిర్వహించిన వెబ్‌సైట్లకు పెట్టిన పేర్లపై సైబర్ క్రైమ్ పోలీసులకు క్లారిటీ వచ్చింది. ఐబొమ్మ పూర్తి స్వరూపం ఇంటర్‌నెట్ బొమ్మ. రవి స్వస్థలం విశాఖపట్నం. ఆ ప్రాంతంలో సినిమాను బొమ్మగా పిలుస్తుంటారు. తాను ఆ బొమ్మను ఇంటర్‌నెట్‌లో చూపిస్తున్నందుకే ఐబొమ్మ అనే పేరు పెట్టాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని భావించి, డొమైన్‌లో వచ్చిన సాంకేతిక సమస్యతో దాని స్పెల్లింగ్ నుంచి 'ఎల్' తీసేసి 'బపం'గా మార్చాడు.

పర్యాటకంలో కన్సల్టెంట్ల 'ప్రభ'!

- ఏపీటీడీసీ రెగ్యులర్ ఉద్యోగుల సేవలను దూరం పెట్టిన సర్కార్
- డిప్యుటేషన్ మీద వచ్చినవారికి, కన్సల్టెంట్లకే పట్టం
- పర్యాటక ఆస్తులను అమ్మేయడమే లక్ష్యంగా కుట్ర
- ప్రభుత్వం ఆర్డర్ లేకుండా ఏడాదిగా ఉన్నతస్థాయిలో కొనసాగుతున్న అధికారి
- నిబంధనలకు విరుద్ధంగా ట్రెజరీ నుంచి జీతాలు
- 30 మందికిపైనే కన్సల్టెంట్లు
- పెట్టుబడుల కోసం ప్రత్యేకంగా ఇద్దరికి ఏకంగా ఏడాదికి రూ.కోటి సమర్పణ
- ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన ఐదుగురు కన్సల్టెంట్లకు రూ.3.5 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర పర్యాటకశాఖ ప్రైవేటు కన్సల్టెంట్లు, డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న అధికారుల హస్తాల్లో విలవిల్లాడుతోంది. పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ), ఏపీ పర్యాటక ప్రాధికార సంస్థ (ఆప్టా)లోను వారి హవానే సాగుతోంది. ఏపీటీడీసీ రెగ్యులర్ ఉద్యోగులను ప్రధాన కార్యాలయం నుంచి బదిలీ పేరుతో బయటకు పంపించడమే కాకుండా డిప్యుటేషన్, కన్సల్టెంట్ ఉద్యోగులతో కార్యకలాపాలు సాగిస్తూ ఇష్టారీతిన వ్యవహారాలు కొనసాగించడం పరిపాటిగా మారిపోయింది. వాస్తవానికి చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా పర్యాటక ఆస్తులను ప్రైవేటుపరం చేసేందుకు చకచకా పావులు కదిపింది. దీనికోసం ప్రత్యేకంగా కన్సల్టెంట్ల వ్యవస్థతో పాటు పాలకులు చెప్పినట్టు వినే అధికారులను డిప్యుటేషన్లపై ఏపీటీడీసీ, ఆప్టాలో నియమించి అడ్డగోలు దోపిడీకి తెగబడుతోంది. పర్యాటకశాఖలో 30 మందికిపైనే కన్సల్టెంట్లు పనిచేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది.

ఆప్టా ఉద్యోగులకు మొండిచెయ్యి

ఆప్టాలో ఓ ప్రైవేటు ఏజెన్సీకి చెందిన ఐదుగురు కన్సల్టెంట్లు, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్) నుంచి మరో ఆరుగురు కన్సల్టెంట్లు పనిచేస్తున్నారు. వీరికి ఏడాదికి ఏకంగా రూ.5 కోట్ల వరకు చెల్లిస్తోంది. అంతటితో ఆగకుండా ప్రత్యేకంగా పెట్టుబడులను తీసుకొచ్చేందుకు ఇద్దరు కన్సల్టెంట్లను ఏకంగా ఏడాదికి రూ.కోటి వరకు చెల్లించే ప్రాతిపదికపై తీసుకొచ్చింది. వీరితోపాటు ఆప్టా, ఏపీటీడీసీల్లో ఉద్యోగ విరమణ చేసిన 18 మందిని ఆన్‌రోల్ కన్సల్టెంట్ కింద చేర్చుకుంది. ఆప్టాలో అయితే పొరుగు శాఖల నుంచి వచ్చిన వ్యక్తులే ఏళ్లుగా తిష్టవేసి ఉద్యోగులను శాసించే స్థాయికి వెళ్లిపోయారు. ఇటీవల ఆప్టాకు శాశ్వత ఉద్యోగి పదవీ విరమణ దగ్గరకు వస్తున్న తరుణంలో తన సేవలను గుర్తిస్తూ పదోన్నతి కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించుకోగా.. డిప్యుటేషన్‌పై ఆప్టాలో పనిచేస్తున్న అధికారులు అడ్డుచెప్పడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆడిట్ శాఖకు చెందిన ఓ అధికారి పర్యాటకశాఖ అనుమతి లేకపోయినా ఏళ్లతరబడి ఆప్టాలో డైరెక్టర్ హోదాలో కొనసాగుతున్నారు. డిప్యుటేషన్ కొనసాగింపు ఆర్డర్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా తన పై అధికారి సాయంతో ట్రెజరీ నుంచి జీతం తీసుకుంటూ ఆప్టా ఉద్యోగులపైనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. గత జూన్‌లో ప్రమోషన్లు ఇవ్వాల్సి ఉండగా వాటిని అడ్డుకున్న సదరు అధికారి పదవీ విరమణ చేస్తున్న ఆప్టా ఉద్యోగి కి ప్రమోషన్ ఇవ్వడానికి నిబంధనలు అంగీకరించవని చెప్పడం గమనార్హం. పైగా ఆ అధికారికి ఇన్నేళ్లు ఆర్డర్ లేకుండా పని చేస్తుండటంపై పర్యాటక శాఖ మెమో కూడా జారీ చేసింది.

అనధికారిక డిప్యూటీ సీఈవో..

ఆప్టాకు సీఈవోగా ఏపీటీడీసీ ఎండీ వ్యవహరిస్తారు. సీఈవోకు అనుబంధంగా డిప్యూటీ సీఈవో కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆప్టాలో కన్సల్టెంట్ల 'ప్రభ' దేదీప్యమానంగా వెలుగుతోంది. ఎంతగా అంటే.. సదరు కన్సల్టెంట్ అనధికారిక డిప్యూటీ సీఈవోగా చలామణి అవుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కన్సల్టెంట్లకు ఎక్కడా లేనివిధంగా కీలకమైన పర్యాటక ఆస్తుల పర్యవేక్షణ, నిర్వహణలో ఫ్రీహోల్డ్ ఇచ్చేసింది. దీంతో ఆ కన్సల్టెంట్ ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. ఆప్టాతో పాటు ఏపీటీడీసీ అధికారులకు సైతం పెట్టుబడులకు సంబంధించి కనీస సమాచారం కూడా ఇవ్వడంలేదు. ఆ కన్సల్టెంట్ తీసుకొచ్చినవాళ్లే పెట్టుబడిదారులు.. తాను తయారు చేసిందే డీపీఆర్. ఇందులో వాస్తవాలతో పనిలేదు. ప్రభుత్వానికి కాగితాలపై లెక్కలు చూపించి రూ.కోట్ల విలువైన భూములను అప్పనంగా పంచిపెట్టడమే సదరు కన్సల్టెంట్ ప్రధాన విధి. అందుకే 2014–19 మధ్య ఆప్టాలో ఓ వెలుగు వెలిగిన ఆ కన్సల్టెంట్ మళ్లీ 2024లో చంద్రబాబు సర్కార్ రాగానే వాలిపోయారు. తాజాగా సీఐఐ సదస్సులో పర్యాటకశాఖకు 104 ఎంవోయూల్లో రూ.17,973 కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు గొప్పగా ప్రకటించారు. కానీ పెట్టుబడిదారుల వివరాలను మాత్రం ఇప్పటికీ బయటపెట్టడం లేదు. ఎందుకంటే ఆ పెట్టుబడిదారుల జాబితాలో చెప్పుకోదగ్గ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు లేవు. మొత్తం పెట్టుబడిదారుల్లో 95 శాతానికిపైగా ఏపీలోని వివిధ ప్రాంతాల వారే. వారి పేర్లతో ఎంవోయూలు చేసుకోవడం గమనార్హం. దీనివెనుక సదరు కన్సల్టెంట్ చక్రం తిప్పినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

ఏపీటీడీసీలోనూ అంతే

ఏపీటీడీసీలోని కీలక విభాగాల్లో జీఎం స్థాయిలో ఒక్కరు కూడా శాశ్వత ఉద్యోగులు లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. కనీసం ఈడీ స్థాయిలో పనిచేస్తున్న ఓ అధికారికి ఏడాది కిందట డిప్యుటేషన్ ముగిసింది. అయినా ఇప్పటివరకు పొడిగింపు ఆర్డర్ లేకుండానే కొనసాగుతున్నారు. పైగా నిబంధనలకు విరుద్ధంగా నెలనెలా జీతం తీసుకోవడం, శాశ్వత ఉద్యోగులను చిన్నచూపు చూస్తుండటం ఏపీటీడీసీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. కీలకమైన ఆర్థిక వ్యవహారాలను ఆప్టాలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న అధికారికి అప్పగించడం విచిత్రంగా ఉంది. పైగా ఆరు క్లస్టర్ల ద్వారా 22 హరిత హోటళ్లను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్న తరుణంలో ఏపీటీడీసీ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వాస్తవానికి స్వయం సమృద్ధి సాధించడం ద్వారా సింహభాగం ఉద్యోగుల జీతాలు, ఇతర ఖర్చులను ఏపీటీడీసీ ఆదాయం నుంచే భరించేది. ప్రభుత్వం నుంచి మాత్రం ఏటా సుమారు రూ.2.50 కోట్ల వరకు కేటాయింపులు ఉండేవి. కానీ ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులను ప్రభుత్వం రూ.64 లక్షలకు కుదించేసింది. తద్వారా ఏపీటీడీసీని వ్యూహాత్మకంగా దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది.

'పాదరసం'తో భార్య ప్రాణం తీశాడు

- ఒక్కో అవయవం పాడవుతూ.. 9 నెలల నరకం తర్వాత భార్య మృతి
- బెంగళూరులో ఓ భర్త దురాగతం

మరణానికి ముందు ఆస్పత్రిలో విద్య

దొడ్డబళ్లాపురం: ఓ భర్త అత్యంత క్రూరంగా భార్యను హత్య చేశాడు. పాదరసం ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా.. ఒక్కో అవయవం పాడయ్యేలా చేసి.. 9 నెలల పాటు నరకం చూపించి హతమార్చాడు. ఈ దారుణ ఘటన బెంగళూరులో జరిగింది. మరణానికి ముందు భార్య పోలీసులకు వీడియో ద్వారా వాంగ్మూలం ఇచ్చింది. ఆ వివరాలు.. విద్య(37), బసవరాజు దంపతులకు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. వీరు బెంగళూరులోని అత్తిబెలె ప్రాంతంలో నివసిస్తున్నారు. కొన్నాళ్లుగా భార్య, భర్త మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో బసవరాజు రోజూ విద్యను హింసించేవాడు. ఈ నేపథ్యంలో భార్యను ఎవరికీ అనుమానం రాకుండా అంతమొందించాలనుకున్న బసవరాజు.. ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పని చేసే శ్వేత, ఆమె భర్త సాయంతో క్లోరోఫాం, పాదరసం, సిరంజిలు తీసుకున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న రాత్రి బసవరాజు విద్యతో ప్రేమగా మాట్లాడుతూ.. క్లోరోఫాం ఇచ్చాడు. కొంచెం మత్తులోకి జారుకున్నాక పాదరసం ఇంజెక్షన్ చేశాడు. మరుసటి రోజు సాయంత్రం స్పృహలోకి వచ్చిన విద్యకు కుడి తొడ భాగంపై వాపు, విపరీతమైన నొప్పి వచ్చింది. నడవడానికి కూడా తీవ్ర ఇబ్బంది పడింది. అప్పటి నుంచి ఆరోగ్యం క్షీణిస్తుండడంతో అత్తిబెలెలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లింది. అక్కడి వైద్యుల సూచన మేరకు మార్చి 7న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. వారు వైద్య పరీక్షలు నిర్వహించి.. ఆమె శరీరాన్ని పాదరసం విషమయం చేస్తున్నట్లు గుర్తించారు. అక్కడ నెలన్నర పాటు చికిత్స తీసుకున్నా ఆరోగ్యం మెరుగవ్వకపోవడంతో.. విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. ఒక్కొక్క అవయవం పాడవుతుండగా.. 9 నెలల పాటు నరకం చూసిన విద్య సోమవారం మరణించింది. అంతకుముందు పోలీసులకు ఫిర్యాదు, వీడియో వాంగ్మూలం ఇచ్చింది. తన భర్త బసవరాజు, మామ మరిశ్యామాచారి కలిసి తనను హత్య చేసేందుకు పాదరసం ఇంజెక్షన్ ఇచ్చారని ఫిర్యాదులో తెలిపింది. బసవరాజు కుటుంబంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్టీల సర్దుబాటుకు చర్యలు

సాక్షి, అమరావతి: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల (సీఆర్‌టీ)ను సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని డైరెక్టర్ సదాభార్గవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ–25 ద్వారా ప్రభుత్వం 881 మంది రెగ్యులర్ టీచర్లను నియమించడంతో ఆ పోస్టుల్లో పనిచేస్తున్న 129 మంది సీఆర్టీలను సర్దుబాటు చేసినట్లు పేర్కొన్నారు. మరో 37 మందిని సర్దుబాటుచేసే విషయమై చర్చించేందుకు బుధవారం సమావేశం నిర్వహించామన్నారు. వీరిని త్వరలోనే సర్దుబాటు చేస్తామని చెప్పారు.

చంద్రబాబు అవినీతి కేసుల విత్‌డ్రాపై న్యాయ పోరాటం చేస్తాం

వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

- అధికార బలంతో కేసుల మాఫీకి ముఖ్యమంత్రి యత్నం
- లిక్కర్, స్కిల్ స్కాం సహా పలు కేసుల విత్‌డ్రా చట్టవిరుద్ధం
- అవినీతి మురికిని బాబు అధికారంతో కడిగేసుకుంటున్నారు
- ప్రజాప్రయోజనాలుంటే తప్ప కేసులు విత్ డ్రా చేసుకోకూడదు
- స్పష్టమైన విధానాన్ని నిర్దేశించిన సుప్రీంకోర్టు

సాక్షి, అమరావతి: ''అవినీతి కేసులను అధికార బలంతో విత్‌డ్రా చేసుకుంటే శుద్ధపూస అయిపోతావా చంద్రబాబూ? ప్రజాప్రయోజనం ఉంటే తప్ప కేసులను మాఫీ చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టంగా నిర్దేశించగా, ముఖ్యమంత్రి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు'' అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, మాజీ అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. లిక్కర్ స్కామ్‌లో అంటిన మురికిని తన పదవిని ఉపయోగించి చంద్రబాబు కడిగేసుకుంటున్నారని అన్నారు. ''రూ.4,400 కోట్ల అమరావతి అసైన్డ్ ల్యాండ్స్, రూ.371 కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్, ఏపీ ఫైబర్‌నెట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు స్కాం కేసుల్లో చంద్రబాబు బెయిల్ మీద ఉన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఫిర్యాదుదారుల మీద ఒత్తిడి తెచ్చి వీటినుంచి బయటపడాలని చూస్తున్నారు. ఇది చట్టసమ్మతం కాదు. ఇవన్నీ చంద్రబాబు బెయిల్ రద్దు చేసేందుకు తగిన కారణాలు. వైఎస్సార్‌సీపీ న్యాయవిభాగం దీనిపై పోరాటం చేస్తుంది'' అని స్పష్టం చేశారు. చంద్రబాబుకు ఆయన న్యాయవాదుల మీద తప్ప చట్టం మీద నమ్మకం లేదని, ఒకవేళ ఉంటే అవినీతి కేసులను ధైర్యంగా ఎదుర్కోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పొన్నవోలు మీడియాతో మాట్లాడారు. ''2019కి ముందు బాబు పాలనలో బార్లు, మద్యం షాప్‌లకు ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా ప్రివిలేజీ ఫీజు ఎత్తివేయడంతో ఖజానాకు రూ.3 వేల కోట్లకు పైగా నష్టం జరిగింది. ఐదు డిస్టిలరీలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీబీసీఎల్) ఎండీగా ఉన్న వాసుదేవరెడ్డి ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. కానీ, బాబు ప్రభుత్వం వచ్చాక వాసుదేవరెడ్డి, మరో ఉద్యోగి సత్యప్రసాద్‌ను బెదిరించారు. కేసు విత్‌డ్రాకు అభ్యంతరం లేదని వాసుదేవరెడ్డితో కోర్టుకు లేఖ ఇప్పించారు. ఇంతకన్నా సాక్షులను ప్రభావితం చేయడం, బెదిరించడం ఏం ఉంటుంది?'' అని పొన్నవోలు పేర్కొన్నారు. బాబు ప్రభుత్వం చాలా కేసులను వెనక్కు తీసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు.

మేనిఫెస్టోలో ఇదే చెప్పారా?

''అధికారం ఇస్తే మా మీద కేసులు విత్ డ్రా చేసుకుంటామని మేనిఫెస్టోలో చెప్పారా? అధికారంలోకి వచ్చాక ప్రజా శ్రేయస్సును తుంగలో తొక్కి మీ పనులు చక్కబెట్టుకుంటున్నారు. పాలకులు వారిపై ఉన్న కేసులను ఉపసంహరించుకోకూడదు. ప్రభుత్వమే ముద్దాయి, న్యాయమూర్తిగా వ్యవహరించడం రాజ్యాంగం మూలసూత్రాలకు విరుద్ధం. పోలీసు, ముద్దాయి, వ్యవస్థ మూడూ ఏకమైన రోజు రాజ్యాంగం ఖూనీ అయినట్టేనని న్యాయ కోవిదులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నవారు వారిపై కేసులను విత్‌డ్రా చేసుకోవడం మీద సుప్రీం చాలా స్పష్టంగా తీర్పులిచ్చింది'' అని పొన్నవోలు వివరించారు. ''మద్యం అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ నేతలను ఇరికించేందుకు ఒక వెర్షన్ చెప్పమంటున్నారంటూ వాసుదేవరెడ్డి హైకోర్టులో పిటిషన్ వేస్తే... ఆయనతోనే మీరు మీపై ఉన్న కేసు విత్‌డ్రా పిటిషన్ వేయించారు. ఇది కచ్చితంగా సాక్ష్యాలను చెరిపేయడం, సాక్షులను బెదిరించడం కిందకే వస్తుంది. ఇవన్నీ చంద్రబాబు బెయిల్ రద్దు కావడానికి కారణం అవుతాయి. ఆయన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలంటే, కేసుల విచారణను ఎదుర్కోవాలి'' అని సూచించారు.

ఆర్మీ జవాన్ అక్రమ అరెస్ట్

- రెడ్‌బుక్ రాజ్యాంగానికి పరాకాష్ట
- సమస్యలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని అక్కసు
- ఓ మహిళ చేత ఫిర్యాదు చేయించి అక్రమ కేసులు బనాయింపు
- ఢిల్లీ వెళ్లి మరీ అరెస్టు చేసిన వైనం

తన భార్యపై సోషల్ మీడియాలో కొందరు పెట్టిన అసభ్యకర పోస్టులను చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న జవాన్ వినోద్‌కుమార్ యాదవ్

గిద్దలూరు రూరల్: దేశ సేవలో మమేకమైన ఆర్మీ జవాన్‌పైనా చంద్రబాబు ప్రభుత్వం అక్రమ కేసు పెట్టించి.. ఢిల్లీ వెళ్లి మరీ అతడిని అరెస్టు చేయించిన వైనమిది. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం ఏవిధంగా పనిచేస్తోందో అనే దానికి ఈ ఘటన అద్దం పడుతోంది. బాధిత జవాన్ తెలిపిన వివరాల ప్రకారం.. రాచర్లకు చెందిన మల్లెబోయిన వినోద్‌కుమార్ యాదవ్ చండీఘడ్‌లో ఆర్మీలో నాయక్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య విజయలక్ష్మి గతంలో బీజేపీ నాయకురాలిగా ఉండేది. గిద్దలూరు నియోజకవర్గంలోని పలు సమస్యలను ఉదహరిస్తూ అధికార పార్టీ నాయకులపై వినోద్‌కుమార్ యాదవ్ సోషల్ మీడియాలో కొంతకాలంగా పోస్టులు పెడుతున్నాడు. దీంతో రాచర్లకు చెందిన ఓ మహిళ చేత వినోద్‌కుమార్ అసభ్యకరంగా ప్రవర్తించారంటూ ఫిబ్రవరిలో రాచర్ల పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నేతలు ఫిర్యాదు చేయించారు. పోలీసులు అతడిపై అక్రమ కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి కోర్టులో హాజరుకావడం లేదని.. ఈ నెల 17న కోర్టులో హాజరు కావాలని నోటీసు ఇచ్చేందుకు పోలీసులు వినోద్‌కుమార్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో తన కుమారుడు విధి నిర్వహణలో ఉన్నాడని, ఆ నోటీసులు తాను తీసుకోలేనని అతడి తండ్రి చెప్పాడు. నోటీసులు ముట్టినట్టుగా పోలీసులే సంతకాలు చేసుకున్నారని వినోద్‌కుమార్ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీలోపు హాజరుకావాలంటూ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిందని చెప్పి పోలీసులు ఢిల్లీలో ఉన్న వినోద్‌కుమార్‌ను విమానంలో విజయవాడకు తీసుకొచ్చి అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో బుధవారం గిద్దలూరు కోర్టుకు తరలించారు. కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో జవాన్ మీడియాతో మాట్లాడుతూ.. తన తరపున న్యాయవాది పిటిషన్ వేసేందుకు ఎవరినీ రానివ్వకుండా ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని వాపోయారు. తన భార్య విజయలక్ష్మిపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతుంటే వాటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు బీజేపీ నాయకులకు విలువ లేకుండా చేస్తున్నారన్నారు. ఒక బీసీ మహిళపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడితే వారిపై ఎలాంటి చర్యలు లేవని వాపోయారు. తనపై అక్రమంగా కేసులు బనాయించి బయటకు రాకుండా చేసేందుకు పాలకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించినందుకు తనపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన కుటుంబానికి అధికార పార్టీకి చెందిన నాయకుల వల్ల ప్రాణహాని ఉందని వాపోయారు. తనకు బెయిల్ ఇప్పించేందుకు స్థానిక న్యాయవాదులు సైతం భయపడి సహకరించడం లేదన్నారు. దేశం కోసం పోరాడే సైనికుడిపై రౌడీ షీట్ కేసులు సైతం నమోదు చేసేందుకు పోలీసులు వెనుకాడటం లేదని చెప్పారు. ఈ విషయమై రూరల్ సీఐ రామకోటయ్యను వివరణ కోరగా.. కోర్టు ఆదేశాల మేరకు మాత్రమే అతడిని అరెస్ట్ చేసి తీసుకొచ్చినట్టు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

వారిలో 32 మందిపై రూ.1.19 కోట్ల రివార్డు

చర్ల, దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 32 మందిపై సుమారు రూ.1.19 కోట్ల నగదు రివార్డు ఉంది. బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్రకుమార్ యాదవ్ ఈ వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టుల కోసం అమలుచేస్తున్న కార్యక్రమాలతో పాటు మావోయిస్టు పార్టీలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో లొంగిపోతున్నారని ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం లొంగిపోయిన 41 మందిలో తొమ్మిది మందిపై రూ.8 లక్షల చొప్పున, ముగ్గురిపై రూ.5 లక్షల చొప్పున, 12 మందిపై రూ.2 లక్షల చొప్పున, ఎనిమిది మందిపై రూ.లక్ష చొప్పున నగదు రివార్డులు ఉన్నట్లు తెలిపారు. లొంగిపోయిన వారికి తక్షణ సాయంగా రూ.50 వేల చొప్పున అందించామని, ఇంకా లొంగిపోయేందుకు సిద్ధమవుతున్న మావోయిస్టులంతా నేరుగా రావాలని, ప్రభుత్వం ద్వారా పునరావాసం కల్పిస్తామని వివరించారు. అలాగే, ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో ఇటీవల లొంగిపోయిన 25 మంది మావోయిస్టులకు 5 జీ స్మార్ట్ ఫోన్లను ఆ జిల్లా కలెక్టర్ దేవేష్ కుమార్ ధృవ్, ఎస్పీ కిరణ్ చవాన్ బుధవారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ సూచన మేరకు వాటిని అందజేశామని తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

సాక్షి,అమరావతి: విద్యారంగంలోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి బుధవారం విద్యాశాఖ మంత్రి లోకేశ్ తోపాటు ఆయా యాజమాన్యాల ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు. మనబడి–మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అసంపూర్తి పనులు పూర్తి చేయాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో పార్ట్ టైం టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టుల స్థాయి పెంచుతూ జీవో ఇవ్వాలని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులకు బదిలీలు నిర్వహించాలని, అన్ని యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో పీఈటీలకు పీడీ లాంగ్వేజ్ పదోన్నతులు, మిగిలిన ఎల్పీలకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

మిథున్‌రెడ్డి బెయిల్ షరతుల సడలింపుపై నేడు తీర్పు

విజయవాడ లీగల్ : మద్యం అక్రమ కేసులో బెయిల్‌పై ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి ఈనెల 28 నుండి వచ్చేనెల 20 వరకు జరిగే పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు వీలుగా షరతులు సడలించాలని కోరుతూ ఏసీబీ న్యాయస్థానంలో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు బుధవారం పూర్తయ్యాయి. తీర్పును ఏసీబీ కోర్టు న్యాయమూర్తి భాస్కరరావు గురువారానికి వాయిదా వేశారు.

'చెవిరెడ్డి'వసతుల పిటీషన్‌పై తీర్పు వాయిదా..

ఇదే కేసులో విజయవాడ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తనకు మంచం, టేబుల్, ఇంటి భోజనం వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దాఖలు చేసిన పిటీషన్‌పై వాదనలు బుధవారం పూర్తయ్యాయి. ఈ పిటిషన్‌పై తీర్పుతో పాటు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, చెరుకూరి వెంకటేష్‌నాయుడు, గుంటూరు జైలులో వున్న బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్లపై విచారణను కూడా న్యాయమూర్తి గురువారానికి వాయిదా వేశారు.

విశాఖలో రిలయన్స్ డేటా సెంటర్

రూ.98వేలకోట్లతో డిజిటల్ కనెక్షన్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: డేటా సెంటర్ క్యాపిటల్‌గా విశాఖ ఎదుగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. రిలయన్స్ గ్రూపు అనుబంధ కంపెనీ డిజిటల్ కనెక్షన్ విశాఖలో హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రూ.98,000 కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని, దీంతో భారీగా ఉద్యోగ కల్పనతో పాటు అంతర్జాతీయంగా టెక్నాలజీ పెట్టుబడులు, ఆవిష్కరణలకు విశాఖ వేదికగా మారుతుందన్నారు.

విశాఖలో జాతీయ దత్తత అవగాహన సదస్సు

నేడు, రేపు నిర్వహించనున్న అడాప్షన్ రిసోర్స్ అథారిటీ

సాక్షి, న్యూఢిల్లీ: సంతానం లేని దపంతులకు పిల్లల దత్తతపై అవగాహన పెంచేందుకు నేషనల్ అడాప్షన్ అవేర్‌నెస్ కాంక్లేవ్–2025 (జాతీయ దత్తత అవగాహన సదస్సు)ను విశాఖపట్నంలో నిర్వహించనున్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ, ఏపీ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సహకారంతో ఈ నెల 27, 28వ తేదీల్లో రెండు రోజులపాటు విశాఖపట్నంలో ఈ కార్యక్రమం జరగనుంది. దేశవ్యాప్తంగా జాతీయ దత్తత అవగాహన మాసంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బుధవారం కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ప్రత్యేక అవసరాలున్న పిల్లల సంస్థాగతీకరించని పునరావాసం (దివ్యాంగ పిల్లలు)' అనే థీమ్‌తో ఈ సమావేశం జరగనుంది. సంతానం లేని తల్లిదండ్రులలో అవగాహన పెంచేందుకు, దత్తత తీసుకోవడాన్ని ప్రోత్సహించేందుకు 'అడాప్షన్ ఆఫ్ చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ (దివ్యాంగ చిల్డ్రన్)' అనే ప్రత్యేక చిత్రం కూడా ఈ సందర్భంగా ఆవిష్కరిస్తారు. సదస్సులో ప్రత్యేక అవసరాలున్న పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు తమ జీవిత అనుభవాలను పంచుకుంటారు. అలాగే.. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన ఉంటాయి.

సీఐడీ విచారణకు హాజరైన ధర్మారెడ్డి, నరసింహ కిశోర్

సాక్షి, అమరావతి: తిరుమల పరకామణి కేసులో అప్పటి టీటీడీ అదనపు ఈవో ధర్మారెడ్డి, అప్పటి సీవీఎస్‌వో, ప్రస్తుత రాజమహేంద్రవరం ఎస్పీ నరసింహ కిశోర్ బుధవారం సీఐడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ధర్మారెడ్డిని, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు నరసింహ కిశోర్‌ను సీఐడీ అధికారులు విడివిడిగా విచారించారు. పరకామణి కేసులో నిబంధనల మేరకే తాము వ్యవహరించామని వారిద్దరూ సీఐడీ అధికారులకు వివరించినట్టు తెలుస్తోంది.

నౌకాదళ అద్భుతాలకు మరో సారి

దాదాపు దశాబ్దకాలంగా డే ఎట్ సీ నిర్వహించని తూర్పు నౌకాదళం

- ఏటా విశాఖ ప్రజలకు నిరాశే
- 2016 తర్వాత నౌకాదళ అద్భుతాలకు ప్రజలు దూరం
- నౌకల్లో సాధారణ ప్రజల్ని తీసుకెళ్లి విన్యాసాలు ప్రదర్శించే ప్రక్రియని విస్మరిస్తున్న నేవీ
- ఈ ఏడాది నేవీ డే విన్యాసాలూ ఉండే అవకాశం లేదంటున్న నౌకాదళవర్గాలు
- 2026లో జరిగే ఐఎఫ్ఆర్, మిలాన్, మహాసాగర్‌పైనే దృష్టిసారించిన నేవీ అధికారులు

విశాఖ ప్రజలకు ఎమోషన్‌గా నేవీ డే

సాక్షి, విశాఖపట్నం : నవంబర్ వచ్చిందంటే చాలు, విశాఖపట్నం నగరంలో నేవీ డే సంబరాలు మొదలవుతాయి. తూర్పు నౌకాదళం పాఠశాల విద్యార్థులకు యుద్ధ నౌకల సందర్శన అవకాశాలు కల్పించడం, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, నేవీ బ్యాండ్ ప్రదర్శనలు వంటి కార్యక్రమాలతో సందడి చేస్తుంటుంది. ముఖ్యంగా ఆర్‌కే బీచ్‌లో వారం రోజుల ముందు నుంచి నిర్వహించే నేవీ రిహార్సల్స్‌తో పాటు, 'డే ఎట్ సీ' పేరుతో నిర్వహించే కార్యక్రమం కోసం నగరవాసులే కాక, విశాఖకు వచ్చే సందర్శకులూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. అయితే 2016 తర్వాత నుంచి ఈ 'డే ఎట్ సీ' కార్యక్రమం నగర ప్రజలకు దూరమైపోయింది. ఈసారి నౌకాదళ విన్యాసాలు కూడా చూసే అవకాశం లేదని తెలుస్తోంది. 2026 ఫిబ్రవరిలో ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలాన్ విన్యాసాలతో పాటు మహాసాగర్ (ఐవోఎన్ఎస్) సింపోజియంపై నేవీ అధికారులు దృష్టి సారించిన నేపథ్యంలో ఈ ఏడాది నేవీ డేని సాదాసీదాగా నిర్వహించాలని భావిస్తున్నారు.

దాయాది దేశంపై సాధించిన విజయానికి ప్రతీకగా ఏటా విశాఖలోనే నౌకాదళ దినోత్సవాలను వైభవంగా నిర్వహిస్తుండటంతో, వైజాగ్ వాసులు ఆ రోజును, ఆ వేడుకలను తమ సొంత వేడుకలుగా భావిస్తుంటారు. నేవీ డే విన్యాసాలకు లక్షలాది జనం పోటెత్తి విజయవంతం చేస్తుంటారు. అందుకే వైజాగ్ ప్రజలకు తూర్పు నౌకాదళం నేవీ డే కానుకగా 'డే ఎట్ సీ' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమంలో సాధారణ ప్రజలను యుద్ధ నౌకల్లో సాగర జలాల్లోకి తీసుకెళ్లి, సముద్రం మధ్యలో విన్యాసాలను ప్రదర్శించేవారు. ఈ వేడుకలు చూసి వైజాగ్ ప్రజలు మురిసిపోయేవారు. దీంతో నేవీ డే ఎప్పుడు వస్తుందా, 'డే ఎట్ సీ' కి ఎప్పుడు వెళ్తామా అని ప్రజలు ఎదురుచూసేవారు. దురదృష్టవశాత్తు 2016 నుంచి వైజాగ్ వాసులకు ఈ గొప్ప అవకాశం దక్కడం లేదు.

వచ్చే ఏడాది మెగా విన్యాసాలపై దృష్టి

నేవీ డేకి 10 రోజుల ముందుగానే ఆర్‌కే బీచ్ పరిసరాలు యుద్ధ వాతావరణంతో గంభీరంగా కనిపించేవి. ప్రతి రోజూ వివిధ రకాల విన్యాసాలు చేసేవారు. తర్వాత, డిసెంబర్ 4కు ముందు నిర్వహించే రిహార్సల్స్ చూసేందుకు కూడా లక్షలాది సందర్శకులు వస్తుంటారు. కానీ, ఈసారి ఇవి కూడా ఉండే అవకాశం లేదని నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి. డిసెంబర్ 4న జరిగే నేవీ డే వేడుకలను కూడా సాధారణంగా నిర్వహించాలని భావిస్తున్నారని తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం.. వచ్చే ఏడాది రెండు అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లు ఉండటమే. 2026 ఫిబ్రవరి 15 నుంచి విశాఖ నగరం ప్రతిష్టాత్మక నౌకాదళ విన్యాసాలు, సదస్సులకు వేదికగా మారనుంది. ఫిబ్రవరి 15 నుంచి వారం రోజుల పాటు ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ–2026 నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత మిలాన్–2026 విన్యాసాలు జరగనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విన్యాసాలు పూర్తయిన తర్వాత, మహాసాగర్ పేరుతో ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం (ఐవోఎన్ఎస్) సదస్సు తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో నిర్వహించనున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ విన్యాసాల నేపథ్యంలో, నేవీ డేని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సమయం సరిపోదని నౌకాదళ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కారణంగానే, ఈసారి ఆర్‌కే బీచ్‌లో డిసెంబర్ 4న వేడుకలు సాధారణంగా నిర్వహించి, ఐఎఫ్ఆర్, మిలాన్ సమయాలలో అదరగొట్టేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి.

ఐఎఫ్ఆర్ తర్వాత నిరాశే మిగిలింది

ప్రతి ఏటా నేవీ డే కోసం రెండు వారాల ముందు నుంచే ఆర్‌కే బీచ్ పరిసరాల్లో రిహార్సల్స్ నిర్వహిస్తుంటారు. ఇవి ప్రతి సంవత్సరం ఆకట్టుకుంటున్నా, 'డే ఎట్ సీ' కార్యక్రమాన్ని నిర్వహించకపోవడంతో నేవీ డేపై ప్రజల్లో క్రమంగా ఆసక్తి తగ్గుతోంది. 'డే ఎట్ సీ' కోసం సుమారు ఆరు నౌకల వరకూ నేవీ సిబ్బంది ప్రజల్ని తీసుకెళ్లేందుకు వినియోగించేవారు. కానీ 2016 నుంచి ఈ కార్యక్రమం కోసం ఎదురుచూస్తున్న నగర ప్రజలకు ప్రతి ఏటా నిరాశే ఎదురవుతోంది. 2016 ఫిబ్రవరిలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ విజయవంతం కావడంతో, ఆ ఏడాది నవంబర్‌లో 'డే ఎట్ సీ'ని ఘనంగా నిర్వహించారు. వందలాది మంది ప్రజల్ని సముద్ర జలాల్లోకి తీసుకెళ్లి విన్యాసాలు చూపించారు. అయితే అదే ఇప్పటివరకు చివరి 'డే ఎట్ సీ'గా మిగిలిపోయింది. 2017లో నేవీ డేకి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి రావడంతో భద్రతా కారణాల దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని తూర్పు నౌకాదళాధికారులు ప్రకటించారు. ఆ తర్వాత నుంచి స్పష్టమైన కారణాలు చెప్పకుండానే ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తూ వచ్చారు. 2020లో కోవిడ్ కారణంగా విన్యాసాలకు కూడా స్వస్తి చెప్పారు. కేవలం నాలుగు యుద్ధ నౌకల్ని విద్యుత్ వెలుగుల్లో ఆర్‌కే బీచ్‌కు సమీపంలో ఉంచుతూ, నేవీ డే వేడుకల్ని ఎలాంటి రిహార్సల్స్ కూడా చూపించకుండానే ముగించారు. పరిస్థితులు సద్దుమణిగినా, నౌకాదళాధికారులు మాత్రం 'డే ఎట్ సీ' అంశాన్ని మరుగునపర్చారు.

మసకబారుతున్న సింహాచలం ఆలయ ప్రతిష్ట

టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసంతృప్తి

గంటా శ్రీనివాసరావుకు అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానాన్ని వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని, త్వరలో దేవస్థానాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, తిరిగి పూర్వవైభవం తీసుకువస్తామని మాజీ మంత్రి, భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన సింహాద్రినాథుడిని దర్శించుకుని మీడియాతో మాట్లాడారు. దేవస్థానంలో ఉద్యోగ వ్యవహారాలు, భక్తులు ఇచ్చే విరాళాలు, బంగారు ఆభరణాల లెక్కలు, ఇతర అంశాల్లో కొన్ని నెలలుగా అనేక ఆరోపణలు, వివాదాలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఈ ఆరోపణలు, వివాదాలు ఆలయ ప్రతిష్టను మసక బారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేవస్థానంలో త్వరలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి పరిస్థితిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. నిజనిజాలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. దేవస్థానానికి రెగ్యులర్ ఈవో లేకపోవడం కూడా ఇందుకు ఒక కారణమని, ఇన్‌చార్జి ఈవోలు ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించలేకపోతున్నారని పేర్కొన్నారు. అతి త్వరలోనే పూర్తిస్థాయి ఈవోని నియమిస్తామన్నారు.

పెన్షనర్లు.. అష్టకష్టాలు

రిటైర్డ్ ఉద్యోగుల జీవితాలతో చంద్రబాబు సర్కారు చెలగాటం

బెనిఫిట్లు అందించడంలో తాత్సారం / 30 ఏళ్లలో ఇలా లేదంటున్న పెన్షనర్లు

ఇతని పేరు నందా నాయక్. సర్వే, భూ రికార్డుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఈ ఏడాది మార్చి 31న ఉద్యోగ విరమణ చేశారు. గ్రాట్యుటీ రూ.12 లక్షలు, ఈఎల్ (ఎర్న్ లీవ్) రూ.8 లక్షలు రావాలి. ఆ డబ్బులు వస్తాయనే ఆశతో ఇటీవల తన కుమారుని వివాహానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్లు అందించకపోవడంతో చేతిలో డబ్బు లేక కుమారుడి వివాహాన్ని వాయిదా వేసుకున్నారు.

అనంతపురం అర్బన్: చంద్రబాబు పాలనలో ప్రభుత్వ పెన్షనర్ల కష్టాలు చెప్పనలవిగా మారాయి. ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఆర్థిక ప్రయోజనాలు అందక తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. చేతిలో డబ్బు లేక కొందరు పెన్షనర్లు ఇళ్లలో జరగాల్సిన శుభకార్యాలయాలను సైతం వాయిదా వేసుకుంటున్నారు.

గ్రాట్యుటీ రూ.94.88 కోట్లు పెండింగ్

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వం గ్రాట్యుటీ కింద గరిష్టంగా రూ.16 లక్షలు చెల్లిస్తుంది. అనంతపురం జిల్లాలో గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు వివిధ హోదాల్లో 593 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందినట్లు సమాచారం. వీరికి గ్రాట్యుటీ రూపంలో అందాల్సిన రూ.94.88 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేయలేదు. ఇక.. సర్వీసులో ఉండగా ఉద్యోగులు మిగుల్చుకున్న ఎర్న్ లీవ్‌లకు (ఈఎల్) రిటైర్మెంట్ సమయంలో డబ్బు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ఉద్యోగి దాదాపు 300 రోజులు (పది నెలలు) ఎర్న్ లీవులను వెనక్కి ఇస్తారు. ఈ క్రమంలో ఒక్కో ఉద్యోగికి సగటున రూ.8 లక్షలుగా 593 మందికి రూ.47.44 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించకుండా పెండింగ్ ఉంచిందని పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం..

రిటైర్మెంట్ బెనిఫిట్లను ప్రభుత్వం చెల్లించకపోవడంపై కొందరు పెన్షనర్లు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. రెవెన్యూ శాఖలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కొందరు కోర్టులో కేసు వేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు సమాచారం. ఉద్యోగి రిటైర్మెంట్ తరువాత బెనిఫిట్లను ప్రభుత్వం మూడు నెలలకు మించి పెండింగ్‌లో ఉంచరాదని సుప్రీం కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడం లేదని పెన్షనర్ల సంఘం నాయకులు చెబుతున్నారు.

పెన్షనర్లు చాలా ఇబ్బంది పడుతున్నారు

రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. 18 నెలలుగా రిటైర్మెంట్ బెనిఫిట్లు అందలేదు. 30 ఏళ్ల సర్వీసులో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదు. ఉద్యోగి రిటైర్ అయిన 3 నెలల్లోపు బెనిఫిట్లు చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. ప్రభుత్వం నుంచి డబ్బులు రాక పెన్షనర్లు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– శీల జయరామప్ప, పెన్షనీర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మనల్నెవడ్రా ఆపేది!

- గతంలో సీజ్ చేసిన క్వారీల్లో మళ్లీ తవ్వకాలు
- జరిమానా వేసిన వాటిల్లోనూ దందా
- శెట్టూరు మండలం యాటకల్లులో వేల క్యూబిక్ మీటర్ల రోడ్డు మెటల్ తరలింపు
- అటు వైపు కన్నెత్తి చూడని అధికారులు

▸ చియ్యేడు గ్రామ పొలం సర్వే నం. 231లో హెక్టార్ భూమిలో రోడ్డు మెటల్ క్వారీకి ఎం. గాయత్రి పేరిట లీజు తీసుకున్నారు. రాయల్టీ చెల్లించకుండా భారీ ఎత్తున మెటల్‌ను తరలించడంతో గతంలో గనులశాఖ, విజిలెన్సు అధికారుల బృందం సంయుక్తంగా క్వారీని పరిశీలించింది. అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించి రూ. 76 లక్షల మేర నిర్వాహకులకు జరిమానా విధించి క్వారీని సీజ్ చేసింది. నిర్వాహకులు మాత్రం పైసా కూడా చెల్లించకుండానే ఇటీవల క్వారీలో తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

▸ ఇది అనంతపురం రూరల్ మండలం క్రిష్ణంరెడ్డిపల్లి సమీపం చియ్యేడు పొలం సర్వే నంబర్ 231లో ఏర్పాటైన రోడ్డు మెటల్ క్వారీ. ఇక్కడ ఒక హెక్టార్‌లో రోడ్డు మెటల్ తవ్వకాలకు లీజు పొందిన ఎం.జ్ఞానేశ్వర్ గనులశాఖకు ఎలాంటి రాయల్టీ చెల్లించకుండానే వేల క్యూబిక్ మీటర్ల రోడ్డు మెటల్‌ను తవ్వి తరలించేశాడు. 2022 మార్చి 10న గనులశాఖ అధికారులు క్వారీని తనిఖీ చేసి రూ.1.31 కోట్ల మేర ఖనిజాన్ని అక్రమంగా తరలించారని నిర్ధారించి క్వారీని సీజ్ చేశారు. అయితే, చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్వారీలో మళ్లీ తవ్వకాలు ప్రారంభించిన నిర్వాహకుడు.. ఇప్పటికే వేల క్యూబిక్ మీటర్ల రోడ్డు మెటల్‌ను అక్రమంగా తరలించేశాడు.

అనంతపురం టౌన్: అనంతపురం జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ఖనిజాన్ని తవ్వి తరలించేస్తున్నారు. గతంలో భారీగా జరిమానాలు విధించి సీజ్ చేసిన క్వారీల్లో సైతం తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 'ప్రభుత్వం మాదే మమ్మల్ని ఎవడ్రా ఆపేది' అన్న రీతిలో టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ జేబులు నింపుకుంటున్నారు. విషయం గనుల శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు అందినా క్వారీల వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదిగో సాక్ష్యం..

శెట్టూరు మండలం యాటకల్లు గ్రామ సమీపంలో కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన డి.శివప్రసాద్ 1.07 హెక్టార్లలో రోడ్డు మెటల్ క్వారీకి లీజు తీసుకున్నాడు. గనుల శాఖకు ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా దాదాపు 6,700 క్యూబిక్ మీటర్ల రోడ్డు మెటల్‌ను అక్రమంగా తవ్వేశాడు. గనులశాఖ అధికారులు 2024 మేలో క్వారీని పరిశీలించి రూ.43 లక్షల మేర నిర్వాహకునికి జరిమానా నోటీసులు జారీ చేసి క్వారీని సీజ్ చేశారు. ప్రస్తుతం క్వారీ నిర్వాహకుడు కళ్యాణదుర్గానికి చెందిన ప్రజాప్రతినిధి అండతో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నాడు. గనులశాఖ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా క్వారీ వైపు కన్నెత్తి చూడడం లేదంటే ఏస్థాయిలో అధికార బలాన్ని ప్రదర్శిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

చట్టరీత్యా నేరం

అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న క్వారీలకు జరిమానాలు విధించాం. వాటిని చెల్లించిన తర్వాతే మళ్లీ కార్యకలాపాలు చేపట్టాలి. పైసా చెల్లించకుండా తవ్వకాలు చేయడం చట్టరీత్యా నేరం. విచారణ చేపట్టి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. – ఆదినారాయణ, డిప్యూటీ డైరెక్టర్, గనులశాఖ

ఖనిజం పేరు	లీజు ఉన్న క్వారీలు	విస్తీర్ణం
ఐరన్ ఓర్	2	9హెక్టార్లు
బ్లాక్ గ్రానైట్	42	100హెక్టార్లు
కలర్ గ్రానైట్	151	522హెక్టార్లు
రోడ్డు మెటల్	146	600హెక్టార్లు
క్వార్ట్జ్	28	398హెక్టార్లు

ప్రైవేట్ పార్శిల్ సర్వీస్‌లో తనిఖీలు

బిల్లుల్లేని రూ.20 లక్షల విలువైన సిగిరెట్లు, పాన్ మసాలాలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న సిగిరెట్లు, పాన్ మసాలాలను పరిశీలిస్తున్న విజిలెన్స్, జీఎస్టీ అధికారులు

నెల్లూరు (క్రైమ్): ఓ ప్రైవేట్ పార్శిల్ సర్వీసులో బిల్లులు లేకుండా అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రూ.20 లక్షలు విలువ చేసే సిగిరెట్లు, పాన్ మసాలలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం బుధవారం స్వాధీనం చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. కొందరు అక్రమార్కులు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ వివిధ రాష్ట్రాల నుంచి సిగిరెట్లు, పాన్‌మసాలాలు దిగుమతి చేసుకుంటున్నారు. నెల్లూరు వెంకటరామపురంలోని బీఎంపీఎస్ పార్శిల్ సర్వీస్‌లో పెద్ద ఎత్తున సిగిరెట్లు, పాన్‌మసాలాలు అక్రమ రవాణా అవుతున్నాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు బుధవారం పక్కా సమాచారం అందింది. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె. నరసింహరావు, డీసీటీఓ కె. విష్ణురావు, డీసీటీఓ(జీఎస్టీ)ఎన్వీ సుబ్బారావు తమ సిబ్బందితో కలిసి పార్శిల్ సర్వీస్ కార్యాలయంలో ఆకస్మిక దాడులు చేశారు. కార్యాలయంలోని 27 బాక్స్‌లను తనిఖీ చేయగా అందులో 24 బాక్సుల్లో సిగిరెట్లు, మూడు బాక్స్‌ల్లో పాన్‌మసాలా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అవి ఎవరు? ఎక్కడికి? ఎవరి పేరుపై బుక్ చేశారనే వివరాలపై అధికారులు ట్రాన్స్‌పోర్టు కార్యాలయ సిబ్బందిని ఆరా తీశారు. వారు తమ వద్ద ఫోన్ నంబరు మాత్రమే ఉందని ఇతర వివరాలు ఏమిలేవని చెప్పారు. పట్టుబడినవి నకిలీవా? అసలైనావా అని గుర్తించేందుకు శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నారు. ఫోన్‌నంబర్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. చెన్నై నుంచి నర్సారావుపేటకు గుర్తు తెలియని వ్యక్తి బుక్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పార్శిల్ కార్యాలయంలో ఏదైనా వస్తువు పార్శిల్ చేసే సమయంలో అక్కడి సిబ్బంది ఎవరు? ఎవరికి? ఎక్కడికి పంపుతున్నారు.. వారి చిరునామా, ఫోన్ నంబర్లను సేకరించిన తర్వాతే బుకింగ్ చేసుకుంటారు. అవేమి లేకుండా కేవలం ఫోన్ నంబర్ ఆధారంగా పాన్‌మసాలాలు, సిగిరెట్లు తరలింపుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పార్శిల్ రవాణా సిబ్బంది ప్రమేయం ఏమైనా ఉందానే అనుమానాలు ఉండడంతో అన్నీ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు చెప్పారు.

రాజ్యాంగ దినోత్సవ నిర్వహణపై వివాదం

ద్వారకాతిరుమల క్షేత్రంలో వేడుకలను విరమించిన అధికారులు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు అధికారులు చేసిన ప్రయత్నం వివాదానికి దారితీసింది. ఆలయాల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జరపాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో చినవెంకన్న దేవస్థానం అధికారులు ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై నివాళులర్పించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచారు. స్వామి వారి ఉచిత ప్రసాదాన్ని స్వీకరించి బయటకు వచ్చిన భక్తులు, అలాగే కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంలో ఉన్న వారు ఒక్కసారిగా అధికారులతో వాగ్వాదానికి దిగారు. దేవుడి సన్నిధిలో మనిషి ఫొటోకి ఎలా పూజలు చేస్తారని మండిపడ్డారు. అసలు ఆలయాల్లో రాజకీయాలు ఏంటని నిలదీశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అధికారులు అంబేద్కర్ చిత్రపటాన్ని పట్టుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన

అధ్యాపకుడికి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

నాగులుప్పలపాడు: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేసిన ఘటన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలో బుధవారం జరిగింది. నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 2 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు. కళాశాల అధ్యాపకుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. బుధవారం కళాశాలకు వచ్చిన ఓ విద్యార్థినితో సదరు అధ్యాపకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ విద్యార్థిని ఆమె కుటుంబసభ్యులకు చెప్పింది. దీనిపై పూర్తి విచారణ చేసిన గ్రామస్తులు ఆ ఘటన నిజమేనని నిర్ధారించుకొని అధ్యాపకుడిని నిలదీశారు. ఈ క్రమంలో వారిపై ఎదురుదాడి చేయడంతో గ్రామస్తులు అతడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల నుంచి 72 ప్రత్యేక రైళ్లు...

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వేర్వేరు ప్రాంతాల నుంచి 42 ప్రత్యేక రైలు సర్వీసులు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. చర్లపల్లి–బ్రహ్మపూర్ (07027) ప్రత్యేక రైలు డిసెంబర్ 12 నుంచి జనవరి 30 వరకు ప్రతి శుక్రవారం, డిసెంబర్ 6 నుంచి జనవరి 31 వరకు బ్రహ్మపూర్–చర్లపల్లి (07028) రైలు ప్రతి శనివారం, డిసెంబర్ 6 నుంచి జనవరి 17 వరకు చర్లపల్లి–అనకాపల్లి (07035) ప్రతి శనివారం, అనకాపల్లి–చర్లపల్లి (07036) డిసెంబర్ 7 నుంచి జనవరి 18 వరకు ప్రతి ఆదివారం, జాల్నా–ఛప్రా (07651) డిసెంబర్ 3 నుంచి 31 వరకు ప్రతి బుధవారం, ఛప్రా–జాల్నా (07652) డిసెంబర్ 5 నుంచి జనవరి 2 వరకు ప్రతి శుక్రవారం నడపనున్నారు.

ఐదువారాల ఐశ్వర్య వ్రతం
మార్గశిర లక్ష్మీవార వ్రతం

హేమంతం వచ్చిందంటే చాలు కోటి శుభాల మార్గశీర్షం వచ్చేసినట్టే. లక్ష్మీకళతో లోగిళ్లన్నీ కళకళలాడినట్టే. ఎటు విన్నా 'లక్ష్మీ నమస్తుభ్యం...' ఎటు చూసినా 'నమస్తేస్తు మహామాయే...' అంటూ ఆ అమ్మను ఆర్తితో స్తుతించడం, పూజించడం వీనుల విందుగా వినిపిస్తూ, నయనార విందం చేస్తుంటుంది. శ్రీ మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన ఈ మాసం ఆయన సతీమణి మహాలక్ష్మికీ మక్కువైనదే! ఈ మాసంలో వచ్చే మొదటి గురువారం నుంచి ఐదు వారాలపాటు తనను నియమనిష్ఠలతో కొలిచినవారికి కోరిన వరాలను ప్రసాదిస్తుంది మహాలక్ష్మి. మార్గశిరమాసంలో మహాలక్ష్మిని ఎవరైతే మనస్ఫూర్తిగా ధ్యానిస్తారో, పూజిస్తారో సంవత్సరంలోని మిగిలిన పదకొండు మాసాల్లోనూ వారికి అష్టలక్ష్మీవైభవం సమకూరుతుంది. వారి మార్గం విజయపథమై విరాజిల్లుతుంది. ఆ వ్రతవిధానం...

లక్ష్మీదేవి కరుణాకటాక్షాలు పొందాలనుకునేవారంతా మార్గశిరంలో ప్రత్యేక పూజలు చేస్తూ అమ్మవారికి దగ్గరవుతుంటారు. ఈ మాసంలో ప్రధానంగా చెప్పుకోదగింది లక్ష్మీవార వ్రతమే. దీన్నే కొందరు గురువార లక్ష్మీపూజ అని, లక్ష్మీదేవి నోము అని పిలుస్తారు. మార్గశిర లక్ష్మీవార వ్రతం, ఈప్సితాలను ఈడేర్చుకునేందుకు మహిళలకు, లోకానికి దక్కిన మహోత్కృష్టమైన వరం.

ఐదువారాల అద్భుత వ్రతం...

మార్గశిర లక్ష్మీపూజ ఐదు గురువారాలు చేయాల్సిన ఐశ్వర్య వ్రతం. ఈ నెలలో గనుక నాలుగే లక్ష్మీవారాలు వస్తే, ఐదవ వారంగా పుష్యమాసం తొలి గురువారం నాడు కూడా నోము నోచుకోవాలి. ఒకవేళ ఏ కారణం వల్లనైనా మొదటి గురువారం లేదా మధ్యలో మరేదైనా గురువారం నాడు ఈ వ్రతం చేయలేనివారు కూడా పుష్యమాసంలో వచ్చే మొదటి గురువారం నాడు ఈ వ్రతాన్ని చేసుకోవచ్చు.

వ్రతవిధానం

ముందుగా ప్రాతఃకాలాన నిద్రలేచి తలారా స్నానం చేసి ఇంటి ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దాలి. లక్ష్మీదేవి ప్రతిమను పూజా మందిరంలో ప్రతిష్ఠించుకోవాలి. దేవి కొలువున్న ప్రదేశాన్ని పూలతో, బియ్యప్పిండితో వేసిన ముగ్గుతో అలంకరించాలి.

మహాగణపతి పూజతో వ్రతం మొదలవుతుంది. విఘ్నేశ్వరార్చన అనంతరం మహాలక్ష్మికి షోడశోపచార పూజ నిష్ఠగా నిర్వహించాలి. 'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణరజత స్రజాం' అంటూ ప్రార్థన చేసి అమ్మవారిని ఆవాహన చేసుకోవాలి. ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, శుద్ధోదక స్నానం, వస్త్రం, చామరం, చందనం, ఆభరణం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలాదులు, కర్పూర నీరాజనాన్ని శ్రద్ధతో సమర్పించాలి.

' 'ఓం మహాలక్ష్మీ చ విద్మహే విష్ణుపత్నీ చ ధీమహి తన్నో లక్ష్మీః ప్రచోదయాత్ '

అంటూ లక్ష్మీగాయత్రి పఠిస్తూ అమ్మవారికి మంత్ర పుష్పాన్ని సమర్పించాలి.

అనంతరం 'సహస్రదళ పద్మస్థాం పద్మనాభ ప్రియాం సతీం' అనే సిద్ధలక్ష్మీ కవచాన్ని సభక్తికంగా చదువుకోవాలి. తరువాత అష్టోత్తర నామావళి పూజ చేసి, మహానైవేద్యం సమర్పించాలి. నైవేద్యానంతరం లక్ష్మీవార వ్రత కథ చెప్పుకుని అక్షతలు శిరసున ధరించాలి. చివరగా క్షమాప్రార్థన చేయాలి. అమ్మవారికి సమర్పించే మహానైవేద్యం విషయంలో కొన్ని నియమాలు పాటించాలని పెద్దలు చెబుతారు.

- తొలి గురువారం అమ్మవారు పుట్టినవారంగా ప్రఖ్యాతమైంది. కాబట్టి ఈ రోజు నోము సందర్భంగా పులగం నివేదన చేయాలి.
- రెండవవారం అట్లు, తిమ్మనం
- మూడోవారం అప్పాలు, పరమాన్నము
- నాలుగోవారం చిత్రాన్నం, గారెలు నివేదించాలి.
- ఐదోవారం నాడు అమ్మవారిని ఈ వ్రతానికి పూర్ణ ఫలాన్నిమ్మని ప్రార్థిస్తూ పూర్ణం బూరెలను నివేదించాలి.

ఆ రోజు ఐదుగురు ముత్తయిదువులను ఆహ్వానించి వారికి స్వయంగా వండి వడ్డించాలి. అనంతరం దక్షిణ తాంబూలాదులిచ్చి వారి ఆశీస్సులు పొందాలి. దీంతో మార్గశిర లక్ష్మీవ్రతం పూర్తయినట్టే. మంగళగౌరీవ్రతంలాగ పూజపూర్తయ్యాక ఉద్యాపన చెప్పే క్రియ ఈ నోములో ఉండదు. ఎందుకంటే మన ఇంట్లో సౌభాగ్యలక్ష్మి నిత్యం విలసిల్లేందుకే ఈ పద్ధతిని పాటించాలనేది పండితుల ఉవాచ.

నియమనిష్ఠలు కీలకం

గురువార వ్రతం అత్యంత భక్తిశ్రద్ధలతో నియమంగా ఆచరించాల్సిన గొప్ప నోము. కాబట్టి ఈ నోము నోచే స్త్రీలు ఆయా లక్ష్మీవారాల్లో శుచిగా ఉండాలి. తలకు నూనె రాయడం, జుట్టు దువ్వుకోవడం, చిక్కులు తీసుకోవడం నిషిద్ధం. తొలిసంధ్య, మలిసంధ్య నిదురపోకూడదు. కల్లలాడకూడదు. నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరించిన వారి ఇంట లేమి అనే శబ్దం పొడసూపదు. ఐశ్వర్యదేవత వరాలు కురిపించి విజయాలను చేకూరుస్తుంది.

ఒక్క గురువారాలలోనే కాకుండా ఈ మాసంలోని ప్రతిరోజూ లక్ష్మిని పూజిస్తే విష్ణుసతి దీవెనలతో పదికాలాలు పచ్చగా వర్ధిల్లవచ్చని పురాణాలు చెబుతున్నాయి. అమ్మవారికి ప్రీతికరమైన పూలు, పండ్లు, సువాసనలిచ్చే అగరుధూపం, పరిమళ ద్రవ్యాలను సమర్పించడం ఆమె అనుగ్రహాన్ని పొందే మార్గాలలో ఒకటైన సులభ మార్గం.

– డి.వి.ఆర్.

● నిర్మలవాణి

మూలాధార చక్రం... కార్తికేయ స్థానం



మన సూక్ష్మ శరీరంలో శ్రీ కార్తికేయుని స్థానం కుడివైపు మూలాధార చక్రంలో ఉంటుంది. మన లోపల కుండలినీ శక్తి కుడివైపు మూలాధార చక్రాన్ని దాటి పైకి రావాలంటే, మనలో శ్రీ కార్తికేయుని గుణగణాలు ఉండాలి. ఆ గుణగణాలు ఏమిటో, కుడివైపు మూలాధార చక్రాన్ని శుద్ధి చేసుకుంటూ శ్రీ కార్తికేయుని ఆశీస్సులను పొందడమెలానో శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల నుంచి తెలుసుకుందాం.

శ్రీ గణేశుడు గణాలన్నింటికీ రాజు అయితే శ్రీ కార్తికేయుడు సర్వ సైన్యాధ్యక్షుడు. అతను మన కుడివైపు ఉండే పింగళా నాడిని ప్రభావితం చేసే శక్తికి ప్రతీకగా ఉంటాడు. ఈ శక్తి మన ప్రాణ శక్తితో అనుసంధానింపబడి ఉంటుంది. శ్రీ కార్తికేయుని అనుగ్రహం పొందడం వలన మానవులకు పసిపిల్లల అమాయకత్వంతో కూడిన తేజస్సు, చక్కటి క్రియాశీలత, చెడును అంతమొందించ గల అంతర్గత దైవ శక్తి లభిస్తాయి. భగవంతుని పట్ల వినయ విధేయతలు, నాయకత్వ లక్షణాలు, అందరికీ మార్గ దర్శకత్వం చేయగల శక్తి, దైవికమైన జ్ఞానం, వివేకం లభిస్తాయి.

శ్రీ కార్తికేయుని నివాసం కుడివైపు మూలాధార చక్రమే అయినా కుడివైపు నాడి అయిన పింగళా నాడి మొత్తంపై అతని ప్రభావం ఉంటుంది. అందువలనే అతనికి 'సుపింగళా' అనే నామం ఏర్పడింది. మన కుడివైపు మూలాధార చక్రం శుభ్రమైనప్పుడు, కుడివైపు ఉండే పింగళా నాడి మొత్తం శుభ్రమవుతుంది. మన లోపల మూలాధార చక్రం, ఆజ్ఞా చక్రం ఒకదానితో మరొకటి పరిపూర్ణ సంబంధాన్ని కలిగి ఉంటాయి. అందువల్లే కుడివైపు మూలాధార చక్రం శుభ్రమైనప్పుడు కుడివైపు ఆజ్ఞా చక్రం కూడా శుభ్రపడి మనలో అహంకారాన్ని నియంత్రించే శక్తిని మెరుగుపరుస్తుంది.

'అహం కరోతి ఇతి అహంకారః' అన్నారు మన పెద్దలు. అంటే 'నేను చేస్తున్నాను అనుకుంటే అది అహంకారం'. నిజానికి మన ద్వారా జరిగే ప్రతీ పనినీ మన లోపల ఉండే భగవంతుని శక్తి జరిపిస్తుంది. ఆ నిజాన్ని విస్మరించి మన ద్వారా ఏదైనా గొప్ప పని జరిగినప్పుడు అది మనమే చేశామనుకొని భ్రమ పడితే, అప్పుడు అది మన సూక్ష్మ శరీరంలో అహంకారమనే బుడగను ఏర్పరుస్తుంది. ఈ అహంకారమనే బుడగ మన ఆజ్ఞా చక్రం ఎడమవైపు అవరోధంగా నిలిచి మన కుండలినీ శక్తి ఆజ్ఞా చక్రమును దాటకుండా అడ్డుకుంటుంది. శ్రీ కార్తికేయుని ధ్యానము వలన అహంకారము తగ్గి మన లోపల శ్రద్ధ నెలకొంటుంది. మన మెదడులో దైవికమైన విచక్షణా శక్తి ఏర్పడి జ్ఞానంతో ప్రకాశిస్తుంది.

భగవంతుని సంహారక శక్తి శ్రీ కార్తికేయుడు నరకలోక ద్వారాన్ని నియంత్రిస్తూ ఉంటాడు. శ్రీ భైరవనాథుడు మన ఎడమ వైపు ఉండే ఇడా నాడి మొత్తం సంచరిస్తూ, అక్కడ ఏమైనా దుష్ట శక్తులు ఉంటే వాటిని నరకానికి తరిమేస్తారు. అవి తిరిగి మన మీద దాడి చేయకుండా ఉండడానికి శ్రీ కార్తికేయుడు నరకలోక ద్వారాన్ని మూసివేస్తాడు. కావున కుడివైపు మూలాధార చక్రం ఎవరిలో అయితే బలంగా ఉంటుందో, వారు ఎడమవైపు దుష్ట శక్తుల బారిన పడకుండా ఉంటారు. ఆ విధంగా శ్రీ కార్తికేయుని ప్రభావం ఎడమవైపు ఇడా నాడి మీద కూడా ఉంటుంది. మానవులలో ఉండే మొండితనం, మూర్ఖత్వం, క్రూరత్వం, రాక్షసత్వం వంటి గుణాలు కుడివైపు మూలాధార చక్రాన్ని బలహీన పరుస్తాయి. మనలోని రాక్షస గుణాలు అంతం కావాలంటే మన అంతర్గత సూక్ష్మ శరీరంలో కార్తికేయుని స్థానమైన కుడి మూలాధార చక్రం బలంగా ఉండాలి.

– డా. పి. రాకేశ్
(పరమపూజ్య మాతాజీ నిర్మలాదేవి ప్రసంగాలు, ప్రవచనాల ఆధారంగా...)

● కథానీతి

సాంగత్య ఫలం... బలం

ఆదిశేషుడు సమస్త భూమండలాన్ని తన వేయి పడగలపై మోస్తున్నాడు. ఒకరోజు బ్రహ్మ దేవునికి దీటుగా సృష్టికి ప్రతి సృష్టి గావించిన రాజర్షి విశ్వామిత్రుడు వచ్చి ఆదిశేషుడిని తనతో రమ్మన్నాడు. ఆదిశేషుడు మిక్కిలి వినయ విధేయతలతో ''ఓ మహర్షీ! ఈ సమస్త భూమండలం నా శిరస్సుపైనే వుంది. దీనిని పరిరక్షించడమే నా కర్తవ్యం. నేను ఈ కార్యాన్ని విస్మరిస్తే, ఈ భూమండలం పాతాళం వైపు పడిపోవడం తథ్యం. అప్పుడు కోటానుకోట్ల జీవరాశులు నా మూలంగా నాశనమైపోతాయి'' అన్నాడు. ఆ మాటలకు విశ్వామిత్ర మహర్షి చిరునవ్వు నవ్వి ''అటువంటిదే గనక జరిగితేనేను నా అమోఘమైన తపశ్శక్తితో దానిని ఆపుతాను'' అన్నాడు.

ఆదిశేషుడు అందుకు ఒప్పుకోలేదు. విశ్వామిత్రుడు ఎన్ని విధాలుగా నచ్చజెప్పి చూసినా ఆదిశేషుడు తన నిర్దేశిత కార్యాన్ని వదలనని మొండిపట్టు పట్టాడు. ఆదిశేషుని మంకుపట్టు చూసి విశ్వామిత్రునికి తీవ్రమైన కోపం వచ్చింది. కమండలం ఎత్తి శపించబోయాడు. ఆదిశేషుడు భయపడి చేసేదిలేక భూమిని పక్కకు పెట్టి వచ్చాడు.

అంతలోనే ఘోరమైన విపత్తు సంభవించింది. ఆదిశేషుని వేయిపడగలపై భద్రంగా వున్న భూగోళం వెంటనే పాతాళం వైపు పడిపోవడం ప్రారంభించింది. దానిపై నివాసముంటున్న వేల కోట్ల జీవరాశులు ప్రాణభయంతో ఆర్తనాదాలు చేయడం ప్రారంభించాయి.

జరిగిన దానిని చూసి తీవ్రమైన దుఃఖంతో ఆదిశేషుడు మ్రాన్పడిపోగా, తపశ్శక్తి సంపన్నుడనన్న గర్వంతో విశ్వామిత్రుడు తన కమండలంలోని నీరు ధారపోసి 'ఆగు' అంటూ భూమిని ఆజ్ఞాపించాడు. భూగోళ పతనం ఆగకపోగా, మరింత వేగంగా పడిపోవడం ప్రారంభించింది. విశ్వామిత్ర మహర్షి పట్టరాని ఆగ్రహంతో ''నా తపశ్శక్తి అంతా ధారపోస్తున్నాను, వెంటనే ఆగు'' అంటూ ఆజ్ఞాపించాడు. అయినా ఫలితం లేకపోయింది. దాంతో విశ్వామిత్రునికి అహంకార మైకం తొలగిపోయింది. భూమిని ఆపడానికి తన తపశ్శక్తి చాలదని తెలుసుకున్నాడు. ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా నారద మహర్షి అక్కడికి వచ్చి జరిగిన దానిని తెలుసుకొని ''నీవు ఎప్పుడైనా సజ్జన సాంగత్యం చేసి ఉంటే ఆ ఫలితాన్ని వెంటనే ధారపోయి. భూపతనం ఆగిపోతుంది'' అని చెప్పాడు.

విశ్వామిత్రుడు ఆలోచనలో పడ్డాడు. తాను అందరితో తగవులు పెట్టుకోవడమేకాని సజ్జన సాంగత్యం చేసింది లేదు. సాటి ముని పుంగవులతోనూ తగవులే. సత్సంగం చేసింది లేదు. అయినా తాను వశిష్ఠ మహర్షి వద్దకు వెళ్ళిన సంగతి జ్ఞప్తికి తెచ్చుకొని ఆ పుణ్యాన్ని ధారపోయగా వెంటనే భూగోళ పతనం ఆగిపోయింది. ఆదిశేషుడు యధావిధిగా తిరిగి భూమండలాన్ని తలకు ఎత్తుకున్నాడు.

ఇందులోని నీతి ఏమిటంటే... మానవులలో దానవ మానవ గుణాలు రెండూ నిక్షిప్తమై వుంటాయి. సమయం సందర్భం బట్టి ఏదో ఒక గుణం బయటకు ప్రకటితమౌతూ వుంటుంది. దుర్జనులతో సాంగత్యం చేస్తే అసుర గుణం బలీకృతమై ఎన్నో చెడ్డ పనులను చేస్తాం. అదే సజ్జన సాంగత్యం చేసినట్లయితే మనలో రజో తమో గుణాలను తగ్గించి సాత్విక భావాలను పెంచుతుంది. అందుకే సజ్జన సాంగత్యం ఎంతో బలం..ఫలం.

– భాస్కర్

● ఇస్లాం వెలుగు

ఇరుగు - పొరుగు

ఇస్లాం చూపిన మానవతా మార్గం మనిషి తన జీవితాన్ని సమాజం అనే విస్తృత వ్యవస్థ మధ్య గడుపుతాడు. ఆ వ్యవస్థలో అత్యంత దగ్గరి సంబంధం కుటుంబం తరువాత పొరుగుదారిదే. మన కష్ట సుఖాలను గురించి ముందుగా తెలిసేది కూడా వాళ్లకే, మన ఆనందాల కేరింతలు కూడా ముందుగా వాళ్ళకే వినిపిస్తాయి. ఇస్లాం ఈ సహజమైన సంబంధాన్ని సాధారణ సామాజిక మర్యాద స్థాయిలోనే ఉంచలేదు; దాన్ని ఒక మత పరమైన, నైతిక, బాధ్యత స్థాయికి తీసుకెళ్లింది. అందుకే ఖురాన్, హదీసులు ఇరుగు, పొరుగు హక్కులను అద్భుతమైన స్పష్టతతో వివరించాయి.

ఖురాన్‌లోని అన్ నిసా సూరాలో దైవాదేశం ఇలా ఉంది: 'పొరుగువారితో సత్ప్రవర్తనతో మెలగండి, వారు మీతో సంబంధమున్న పరిచితులైనా, అపరిచితులైనా, తోటి సహచరులైనా, సహ ప్రయాణీకులైనా – పరోపకారం కలిగి ఉండండి.' ఈ ఒక్క వాక్యమే ఇస్లాంలోని విశ్వమానవ దృక్కోణాన్ని తెలియజేస్తుంది. పొరుగువారిని మతం, కులం, భాష అనే గీతలతో విభజించకుండా, వారిపట్ల మన సత్ప్రవర్తనను దైవాజ్ఞగా ప్రకటించడం విశేషం. పొరుగువారు ఎవరన్నది ముఖ్యం కాదు; వారెవరైనా సరే, వారితో మన సంబంధాలు మానవీయ కోణంలో ఉన్నాయా లేవా అన్నదే ముఖ్యం.

ముహమ్మద్ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: 'జిబ్రీల్ (అలై) నాకు పొరుగుదారి హక్కులను గురించి ఎంతగా ఉపదేశించారంటే, వారిని వారసత్వంలో భాగస్వాములు చేస్తారేమోనని నేను భావించాను,' అని ఆయన చెప్పిన హదీసు, ఈ బాధ్యత ఎంత గంభీరమైనదో తెలియజేస్తుంది. మరో సందర్భంలో ప్రవక్త (స), 'తన ప్రవర్తన కారణంగా తన పొరుగువారు ఇబ్బంది పడితే ఆ వ్యక్తి నిజమైన విశ్వాసి కాదు,' అని హెచ్చరించారు. విశ్వాసం అనే పవిత్ర గుణాన్ని, పక్కింటివారి సౌకర్యానికి, సురక్షితానికి, మన ప్రవర్తనకు నేరుగా అనుసంధానించిన ఈ బోధన, ఇస్లామీయ నైతికతకు అత్యున్నత రూపం.

పక్కింటివారిపై ఇస్లాం మోపిన కర్తవ్యాలలో ప్రధానమైనది, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడటం. మన ఇల్లు, మన అలవాట్లు, మన మాటతీరు, మన ప్రవర్తన ఇతరుల ప్రశాంతతకు భంగం కలిగించకూడదు. అలా జరిగితే అది మానవత్వానికి మాత్రమే కాదు, ఇమాన్‌కు కూడా విరుద్ధం అవుతుంది. అంతేకాదు, పొరుగువారు అనారోగ్యంతో ఉంటే వారిని పరామర్శించే తొలి వ్యక్తి మనమే కావాలి. శుభ, అశుభ కార్యాల్లో వారి సహాయంగా నిలబడటం, రోజువారీ జీవితంలో చిన్న చిన్న సహాయం చేయడం, వారు ఏ మతానికి చెందినవారైనా హృదయపూర్వక బంధాన్ని కొనసాగించడం – ఇవన్నీ ఇస్లాం అత్యంత పవిత్రంగా పేర్కొన్న బాధ్యతలు. పొరుగువారితో సంబంధం, ప్రేమతో కూడిన పలకరింపు, పరస్పర విశ్వాసం సమాజ శాంతికి మౌలిక పునాదులు. నేటి పట్టణ జీవనంలో మనం ఒకే భవనంలో నివసిస్తూ కూడా పరస్పరం పేర్లు తెలియకుండా బతికేస్తున్నాం. ఈ దూరం పెరిగినప్పుడు చిన్న అపార్థాలు కూడా పెద్ద గొడవలకు దారితీస్తాయి. పరస్పర సంబంధాలు సజావుగా ఉంటే ఇలాంటి చిన్నా చితకా విషయాలు అసలు సమస్యే కావు. సంబంధాలు సరిగా లేకపోతేనే వివాదాలు తలెత్తుతాయి. అందుకే ప్రవక్త (స) పొరుగుదారి హక్కులను ఇటువంటి నైతిక పటిష్ఠతతో బోధించారు; మనుషుల మధ్య, మనసుల మధ్య గోడలు కట్టడం కాకుండా, హృదయాలను కలిపే వంతెనలు నిర్మించాలని ఆయన ఉపదేశించారు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

నేనడిగింది ధర్మం...

అదొక ఆలయం. ఆ ఆలయం ముంగిట ఓ యాచకుడు కూర్చున్నాడు. ''ధర్మం చెయ్యండి బాబూ'' అంటూ వచ్చీపోయే వారిని యాచిస్తున్నాడు. అటువైపుగా కొందరు ధనవంతులు వచ్చారు. వారిని చూసీ చూడడంతోనే యాచకుడు చేతిలో బిచ్చపాత్ర చాచి ''ధర్మం బాబయ్యా!'' అని అడిగాడు. కానీ వారిలో ఒక్కరూ చిల్లిగవ్వ కూడా ఆ పాత్రలో వెయ్యలేదు. అలా వెళ్ళిపోయిన వారిలో ఓ ధనవంతుడి దగ్గరున్న ఓ డబ్బు సంచీ కింద జారిపడిపోయింది. ఆ విషయం అతనికి తెలియలేదు. కానీ ఆ డబ్బు సంచీని యాచకుడు చూశాడు. దాన్ని తీసుకుని తన దగ్గర ఉంచుకున్నాడు. ఆలయం లోపలికి వెళ్ళిన కాసేపటికి డబ్బు సంచీ పోగొట్టుకున్న వ్యక్తి పరిగెత్తుకుంటూ బయటకు వచ్చాడు.

''ఇక్కడెక్కడైనా నా సంచీ పడిపోయుంటే చూసేవా?'' అని అడిగాడు ఆ ధనవంతుడు. ''నేను చూశాను బాబయ్యా! మీరొస్తే మీకివ్వాలనే నా పక్కనే పెట్టుకున్నాను'' అన్నాడు యాచకుడు. ధనవంతుడు ఆత్రుతతో ''ఏదీ ఆ సంచీ, ఇటివ్వు, అందులో అయిదు వందల దీనారాలు ఉండాలి...నువ్వేమన్నా తీసుకున్నావా'' అని అడిగాడు. ''నేనసలు ఆ సంచీ లోపల ఏం ఉందో కూడా చూడలేదు బాబయ్యా! మీరే లెక్కపెట్టుకోండి'' అన్నాడు యాచకుడు. ధనవంతుడు లెక్కపెట్టి చూసుకుంటే అతను చెప్పిన అయిదు వందల దీనార్లు అలాగే ఉన్నాయి. దాంతో అతని ముఖాన అప్పటి వరకూ ఉన్న కంగారు, దాంతో పట్టిన చెమటా మటుమాయమై ముఖంలో సంతోషం ఉప్పొంగింది. ఆ ఆనందంతోనే అతను అందులోంచి కొంత డబ్బు తీసి ''ఇదిగో ఇది నా కానుక'' అంటూ యాచకుడికి ఇచ్చాడు.కానీ యాచకుడు తనకక్కరలేదని సున్నితంగా తిరస్కరిస్తూ ఇలా అన్నాడు. ''మీరు కానుకగా ఇచ్చే సొమ్ము నాకక్కరలేదు. నేను మొదట మిమ్మల్ని ధర్మం చెయ్యండి బాబూ అని ధర్మం అడిగాను. అప్పుడే ఇచ్చి ఉంటే మహదానందంగా తీసుకునేవాడిని'' అన్నాడు యాచకుడు. ధనవంతుడు మౌనంగా వెళ్ళిపోయాడు.

– యామిజాల జగదీశ్

● సువార్త

దేవుడు - దేవుని అభిషిక్తుడు



మెస్సీయ అనబడే క్రీస్తుకు 'దేవుని అభిషిక్తుడు' అని అర్థం. క్రీస్తు పరలోక దేవుని అభిషిక్తుడు. ప్రత్యేకంగా దేవునిచే పంపబడినవాడు. 'నీవు నన్ను పంపితివని ఈ లోకము నమ్మాలి' అనునది ఆ రోజులలో యేసు తన దేవునికి చేసే రోజువారీ ప్రార్థన కూడా. ఇక్కడ అభిషిక్తుడు అంటే మానవాళి రక్షణ నిమిత్తం దేవునిచే అభిషేకించబడినవాడు లేదా పంపబడినవాడు. యేసుక్రీస్తు అను శబ్దమునకు 'రక్షణాభిషిక్తుడు' అని అర్థం.

దేవుని అభిషేకానికి అర్థం ఒక పని నిమిత్తం ఒకరిని ఉన్నతంగా ఏర్పాటు చేయడం. ప్రత్యేక పరచడం. పరిశుద్ధ పరచడం. ఆత్మ సంబంధ పరిచర్య ఎంతో మహిమ గలది. అట్టి క్రీస్తు పరిచర్య చాలా ప్రత్యేకమైనది. నశించిన దానిని వెదకి రక్షించే పని ఆయనది. యేసు సుప్రసిద్ధ ప్రధాన యాజకుడు కూడా. యేసు రాజు, యాజకుడుగా నియమించబడ్డాడు. యాజకుడు చేసే పని మానవాళికి దేవునికి మార్గమై మధ్యవర్తియై మానవాళి ని పాప క్షమాపణకు దగ్గరగా చేయడం. దేవుని ఉగ్రత నుండి తప్పించేలా దేవుని ప్రేమ, క్షమాపణలను మానవాళి రుచి చూసేలా చేయడం. క్రీస్తులో రాజు, యాజకుడు అనే ఈ ఇద్దరూ ఉన్నారు. ఇదే క్రీస్తు ప్రత్యేకత. క్రీస్తుకు పూర్వం ఈ రెండు విడివిడిగా ఉండేవి.

దేవుని దివ్య సంకల్పంలో క్రీస్తు త్యాగపూరిత విధేయతా బలియాగం వలన ఈ రెండు హోదాలు ఒక్క క్రీస్తుకు మాత్రమే ఆపాదించబడ్డాయి. క్రీస్తుకు లోబడి అయనలా దేవునికి పరిచర్య చేసేవారు ఎవరైనా కేవలం ప్రభువైన క్రీస్తును బట్టే రాజులు, యాజకులు కాగలుగుతారు. యేసును క్రీస్తుగా చేసిన దేవుని నియామకం అన్ని నియామకాల కన్న గొప్పది.

ఇప్పుడైతే రాజులు, యాజకులు మరీ ముఖ్యంగా, రాజ యాజకులు (రాయల్ ప్రీస్ట్స్) తయారీలో అనగా కింగ్ మేకర్‌గా క్రీస్తు పనితనం అద్భుతం. కేవలం ఆ క్రీస్తునుబట్టే అనగా ఆ దేవ దేవుని అభిషిక్తుని బట్టే అంతా నేడు రాజులు, యాజకులు కాగలుగుతున్నారు. ఇట్టి ఆత్మ సంబంధ హోదాలు, అధికారాలు అన్నింటి కన్న గొప్పవి. వీటి విషయమై ఆత్మ సంబంధంగా లోతుగా ఆలోచనలు చేస్తేనే వాటి సదుద్దేశ సత్యాలు, సారాలు వెలుగునపడి అనుభవానికి అందుతాయి. జీవితాలను ఫలభరితంగా మారుస్తాయి.

మనకు క్రీస్తు తరువాత దేవుడే. దీని భావం క్రీస్తు మీద శిరస్సుగా అనగా అధికారిగా పాలకుడుగా దేవుడు తప్ప ఎవరూ లేరు. అందుకే ప్రభువు అనే దేవుని నియామకం చాలా చాలా అత్యున్నతం.

యేసునాథా! క్రీస్తునాథా! అన్న గౌరవార్ధ ఉన్నతమైన యుక్తమైన సంబోధనలు క్రీస్తుకు తగినవే. యేసయ్యా యేసుతండ్రి యేసు నాయనా అనే లేఖన విరుద్ధపు తమ అజ్ఞాన భావజాలం నుండి అనేకులు బయటకు రాకతప్పదు.

యేసుక్రీస్తు వారిని నోటితో ప్రభువు అని పిలిచినా, ఆయనను ప్రభువుగా హృదయంలో ప్రతిష్ఠించుకొన్ననూ, ఇలా క్రియాపూర్వకంగా ప్రియమారా పిలిచినా మొట్టమొదటగా ఆనందించేది దేవుడే. దేవుని సంకల్పం బహు బాగా అర్థం అగుటకు అన్నిటా క్రీస్తును కేంద్రంగా చేసి ఆయనను ప్రభువు గా నియమించినది దేవుడే అన్నది ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

– జేతమ్

బిజినెస్ రీల్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ మైక్రో సిప్

ముంబై: యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ తక్కువ మొత్తంతో ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులకు వీలు కల్పిస్తూ నిర్ణయించింది. ఇందుకు వీలుగా మైక్రోసిప్‌ను ప్రవేశపెట్టినట్లు ప్రకటించింది. దీంతో ఇన్వెస్టర్లు రూ.100 నుంచి యాక్సిస్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రూ.1,000 పెట్టుబడిని పది పథకాల్లో రూ.100 చొప్పున ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా.. వాటి పనితీరును పరిశీలిస్తూ నష్టాల భయం లేకుండా మార్కెట్లు ఎలా పని చేస్తాయో తెలుసుకోవచ్చని పేర్కొంది.

యువతకు నాస్కామ్ ఫౌండేషన్, ఐబీఎం శిక్షణ

క్లౌడ్ కంప్యూటింగ్‌లో 87,000 మందికి ట్రైనింగ్

న్యూఢిల్లీ: అట్టడుగు వర్గాల యువతకు భవిష్యత్ తరపు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణనిచ్చేందుకు టెక్ దిగ్గజం ఐబీఎం, నాస్కామ్ ఫౌండేషన్ జట్టు కట్టాయి. ఐబీఎం స్కిల్స్‌బిల్డ్ ప్రోగ్రాం కింద 87,000 మందికి శిక్షణనివ్వనున్నాయి. పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాల్లో ట్రైనింగ్ ఇచ్చి వారిలో ఉద్యోగ సామర్థ్యాలను పెంపొందించనున్నాయి. ఈ ప్రోగ్రాం కింద కృత్రిమ మేథ (ఏఐ), సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ తదితర అంశాల్లో ఉచితంగా డిజిటల్ కోర్సులు, శిక్షణను అందిస్తారు. మెంటార్స్ నుంచి కూడా మద్దతు ఉంటుంది. 2030 నాటికి 3 కోట్ల మందికి శిక్షణనివ్వాలన్న ఐబీఎం లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు, భారతదేశవ్యాప్తంగా హైబ్రిడ్ విధానంలో అమలవుతుంది.

ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణాలకు చెక్

తాజాగా రూ. 48,463 కోట్లు చెల్లింపు



న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ 2025 సెప్టెంబర్‌కల్లా రుణదాతలకు రూ. 48,463 కోట్ల రుణాలను తిరిగి చెల్లించింది. దీంతో రూ. 61,000 కోట్ల రుణ చెల్లింపుల లక్ష్యంలో 80 శాతం చెల్లింపులను పూర్తిచేసింది. కంపెనీ దివాలా అపిల్లేట్ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్ఏటీకి దాఖలు చేసిన తాజా అఫిడవిట్ వివరాలివి. 2025 మార్చికల్లా చెల్లించిన రూ. 45,281 కోట్లతో పోలిస్తే ఇవి 7 శాతం అధికం. కంపెనీ మొత్తం రుణ భారం రూ. 99,355 కోట్లుకాగా.. రూ. 61,000 కోట్ల చెల్లింపులను లక్ష్యంగా పెట్టుకుంది. తాజా చెల్లింపులతో వీటిలో 80 శాతం లక్ష్యాన్ని పూర్తిచేయగలిగింది. ఆస్తుల రిజల్యూషన్ ద్వారా ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణ భారాన్ని తగ్గించుకుంటోంది. దీనిలో భాగంగా నగదు, ఇన్విట్ యూనిట్లు తదితరాలను రుణ దాతలకు పంపిణీ చేస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-11-2025

విశాఖ	635-00
చిత్తూరు	673-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	645-00
విజయవాడ	660-00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	650-00
వరంగల్	652-00
రిటైల్ ధర	7.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	1,153.00	3.69
HDFCLIFE	788	2.8
BAJAJFINSV	2,082.00	2.55
BAJFINANCE	1,011.00	2.51
JIOFIN	308	2.39

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	2,127.00	-1.6
ADANIENT	2,313.90	-0.81
EICHERMOT	7,180.00	-0.53
SBILIFE	2,027.00	-0.2
ASIANPAINT	2,872.00	-0.13

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,807
ఎన్ఎస్ఈ	94,725
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,42,399
ఎఫ్ఐఐ	+ 4,778
డీఐఐ	+ 6,248

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	58.29	$	58.11
బ్రెంట్	62.19	$	61.08

గిగ్ వర్కర్లకు భారీ డిమాండ్

- క్విక్ కామర్స్ కంపెనీల నియామకాలు అప్
- 5,00,000 నుంచి 7,00,000 మందితో సేవలు
- జాబితాలో స్విగ్గీ, బ్లింకిట్, జెప్టో, బిగ్‌బాస్కెట్
- మెట్రో నగరాలలో సేవలకు పెరిగిన డిమాండ్

కరోనా మహమ్మారి తలెత్తిన తదుపరి దేశీయంగా ఊపిరిపోసుకున్న క్విక్ కామర్స్ సర్వీసులు మరింత క్విక్‌గా విస్తరిస్తున్నాయి. నిజానికి తొలుత ఈకామర్స్ కంపెనీల సర్వీసులకు డిమాండ్ ఊపందుకోగా.. ఆపై ఇది క్విక్ సర్వీస్ కంపెనీలకు వ్యాప్తించింది. దీంతో గిగ్ వర్కర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం సైతం గిగ్ వర్కర్ల భద్రతకు కొత్త చట్టాలను తీసుకురావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వివరాలు చూద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్

దేశీయంగా ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, టాటా క్లిక్ తదితర పలు ఈకామర్స్ దిగ్గజాలు ఇంటివద్దకే వస్తువులను అందించడం ద్వారా సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టాయి. ఈ బాటలో ఫుడ్ డెలివరీ కోసం ఏర్పాటైన ఎటర్నల్(గతంలో జొమాటో), స్విగ్గీ వేగవంత సర్వీసులను అందించడం ద్వారా పలు నగరాలలో చొచ్చుకుపోయాయి. గ్రోసరీస్‌ను త్వరిత గతిన అందించేందుకు తెరతీసిన బ్లింకిట్, బిగ్‌బాస్కెట్ సైతం వినియోగదారులను త్వరితగతిన ఆకట్టుకున్నాయి. మరోపక్క అర్బన్ కంపెనీ, నోబ్రోకర్ తదితరాలు గృహ పరిరక్షణ, వస్తు సేవల సంబంధ సర్వీసులను సైతం అందించడం ద్వారా వేగంగా బిజినెస్‌ను విస్తరిస్తున్నాయి. కాగా.. 10 నిముషాలలో గ్రోసరీస్‌ను డెలివరీ చేయడం ద్వారా ప్రధానంగా బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో, బిగ్ బాస్కెట్ బిజినెస్‌లను భారీగా విస్తరిస్తున్నాయి. ఇవికాకుండా క్యాబ్, బైక్ ట్యాక్సీ సేవలను సమకూర్చేందుకు ఆవిష్కృతమైన ఓలా, ఉబర్, ర్యాపిడో సైతం ప్రధాన నగరాలలో సర్వీసులను భారీగా విస్తరిస్తున్నాయి. వెరసి కొద్ది నెలలుగా గిగ్ వర్కర్లకు దేశీయంగా డిమాండ్ పెరుగుతూ వస్తోంది.

గ్రోసరీ డెలివరీలు జూమ్

బ్లింకిట్(ఎటర్నల్), స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో, బిగ్ బాస్కెట్ సుమారు 10 నిముషాల్లోనే వినియోగదారులకు సరుకులను డెలివరీ చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఇందుకు భారీస్థాయిలో డెలివరీ వర్కర్లను నియమించుకుంటున్నాయి. అంతేకాకుండా సరుకులను నిల్వపెట్టుకునేందుకు వీలుగా డార్క్ స్టోర్లను సైతం విస్తారంగా ఏర్పాటు చేస్తున్నాయి. తద్వారా ఆయా ప్రాంతాలలో వేగవంత డెలివరీలను చేపట్టగలుగుతున్నాయి. దీనిలో గిగ్ వర్కర్లే ప్రధాన పాత్ర పోషిస్తుండటంతో భారీగా నియమించుకుంటున్నాయి.

70-80% అప్

క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ వినియోగదారులను ఆకట్టుకుంటుండటంతో వినియోగదారుల ఇంటివద్దకే డెలివరీలు అందించేందుకు గిగ్ వర్కర్ల నియామకం ఇటీవల ఊపందుకుంది. ఫలితంగా బ్లింకిట్, స్విగ్గీ, జెప్టో సగటున నెలకు 4,50,00 నుంచి 5,00,000 మందిని నియమించుకుని సర్వీసులు అందిస్తున్నాయి. ఆయా కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు, మానవ వనరుల సంస్థలు అందించిన వివరాల ప్రకారం గతేడాది(2024)లో ఈ కంపెనీలన్నీ సగటున 2,50,000 నుంచి 3,00,000 మందిని వినియోగించుకున్నాయి. ఈ ఏడాది జూలై–సెప్టెంబర్ కాలాన్ని తీసుకుంటే జొమాటో 5.5 లక్షల మంది నెలవారీ యాక్టివ్ డెలివరీ పార్ట్‌నర్స్‌తో బిజినెస్ నిర్వహిస్తోంది. మాతృ సంస్థ ఎటర్నల్ వివరాల ప్రకారం గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 11 శాతం అధికం. స్విగ్గీ మరింత అధికంగా 6.9 లక్షల మందిని డెలివరీ సర్వీసులకు వినియోగించుకుంటోంది. గతేడాదితో పోలిస్తే సంఖ్య 32 శాతం జంప్‌చేసింది.

ప్రధాన నగరాల హవా

ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రధాన నగర ప్రాంతాలలో క్విక్ సర్వీసులకు భారీ డిమాండ్ కనిపిస్తున్నట్లు స్టాఫింగ్ పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఇటీవల ఫుడ్ డెలివరీ సంస్థలతో పోలిస్తే క్విక్ కామర్స్ కంపెనీలు వేతన సంబంధ ప్రోత్సాహకాలివ్వడం ద్వారా డెలివరీ పార్ట్‌నర్స్‌ను సర్వీసులలో కొనసాగించుకోగలుగుతున్నట్లు తెలియజేశాయి. డార్క్ స్టోర్లలో విశ్రాంతికి సైతం వీలుండటం డెలివరీ పార్ట్‌నర్స్‌కు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు వివరించాయి.

డెలివరీల జోరు

సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఈ ఏడాది జూలై–సెప్టెంబర్‌లో బ్లింకిట్ 22.3 కోట్ల ఆర్డర్లను డెలివరీ చేసింది. వార్షికంగా ఇది 140 శాతం పురోగతికాగా.. ఇన్‌స్టామార్ట్ 49 శాతం అధికంగా 10.1 కోట్ల డెలివరీలను పూర్తిచేసింది. బ్రోకరేజీ సంస్థ బెర్న్‌స్టీన్ అంచనాల ప్రకారం ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ కంపెనీల 10 నిముషాల డెలివరీలు నిర్వహించేందుకు 2030కల్లా 15 లక్షల మంది పార్ట్‌నర్స్‌ను నియమించుకోవలసి ఉంటుంది. అంతేకాకుండా డార్క్ స్టోర్ల ద్వారా ఇందుకు దన్నుగా ప్యాకింగ్, పికప్ సేవలకు మరో 2,00,000 నుంచి 3,00,000 మంది గిగ్ వర్కర్స్ అవసరం ఉంటుంది. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే బ్లింకిట్ 1,816 డార్క్ స్టోర్లను ఏర్పాటు చేసుకోగా.. ఇన్‌స్టామార్ట్ 1,102 స్టోర్లు, జెప్టో 1,000 స్టోర్లు నిర్వహిస్తున్నాయి. 2027కల్లా మొత్తం డార్క్ స్టోర్లను 3,000కు పెంచుకోవాలని బ్లింకిట్ ప్రణాళికలు అమలు చేస్తుండటం గమనార్హం!

ద్రవ్యోల్బణం అంచనాల్లో పక్షపాతం ఉండదు

ఆర్‌బీఐ డీజీ పూనమ్ గుప్తా

ముంబై: సెంట్రల్ బ్యాంక్ ద్రవ్యోల్బణం అంచనాల్లో ఎలాంటి పాక్షిక దృష్టి ఉండదని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ (డీజీ) పూనమ్ గుప్తా స్పష్టం చేశారు. ఎన్నో నమూనాలను అనుసరిస్తూ, నిపుణులతో సంప్రదింపుల అనంతరం ఆర్‌బీఐ ద్రవ్యోల్బణం అంచనాలకు వస్తుందన్నారు. అయితే, అంచనాలు తప్పడం అన్నది అంతర్జాతీయంగా కనిపించే ధోరణేనన్నారు. బ్యాలన్స్ ఆఫ్ పేమెంట్స్ (భారత్ నుంచి విదేశాలకు నిధుల రాకపోకలు)కు సంబంధించి డేటాను ప్రస్తుతం మూడు నెలలకు ఒకసారి విడుదల చేస్తుండగా, ఇకపై నెలవారీ తీసుకురావడాన్ని పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయంగా వాణిజ్య విధానాల్లో గణనీయమైన మార్పులను ప్రస్తావించారు. ద్రవ్యోల్బణంపై అతిగా వేసిన అంచనాలే గత కొన్ని నెలలుగా ఆర్‌బీఐ రేట్లను మరింత తగ్గించకుండా నిరోధించిందన్న విమర్శలకు గుప్తా ఇలా స్పందించారు. ''అంచనాల్లో లోపాలను పరిమితం చేయడం ఎంతో అవసరం. అయితే అంచనాలు వేసే విషయంలో ఎలాంటి పాక్షికత ఉండదు''అని కేంద్ర గణాంకాలు ప్రణాళికల అమలు శాఖ నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా గుప్తా స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణం అంచనాలపై మీడియాలో వచ్చిన విమర్శనాత్మక కథనాలను అంగీకరిస్తూ, అభిప్రాయాలను ఆర్‌బీఐ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు.

3 శాతం 'నిమ్' సాధిస్తాం

- ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించినా సరే
- ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ ఎంపీసీ డిసెంబర్ సమీక్షలో రెపో రేటును పావు శాతం మేర తగ్గించినప్పటికీ, తాము పెట్టుకున్న 3 శాతం నికర వడ్డీ మార్జిన్ (నిమ్) లక్ష్యాన్ని సాధిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ధీమా వ్యక్తం చేశారు. డిసెంబర్‌లో రేటు కోత ఉంటే, అది పావు శాతం మించకపోవచ్చన్నది తమ అంచనా అని చెప్పారు. దీనివల్ల తమ మార్జిన్లపై పెద్ద ప్రభావం ఉండదన్నారు. రేటు తగ్గింపునకు అవకాశం ఉందని, ఈ విషయాన్ని గత సమీక్ష సందర్భంగానే పేర్కొన్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ వారం మొదట్లో ప్రకటించడం గమనార్హం. దినికితోడు స్థూల ఆర్థిక పరిస్థితులు సానుకూలంగా ఉండడంతో వచ్చే ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశంలో రేట్ల కోత ఉంటుందన్న అంచనాలు పెరిగిపోయాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతంగా, పూర్తి ఆర్థిక సంవత్సరానికి (2025–26) 7 శాతంగా ఉండొచ్చని శెట్టి అభిప్రాయపడ్డారు. అధిక వృద్ధి రేటు, సానుకూల ద్రవ్యోల్బణం పరిస్థితులతో రేట్ల కోతకు అవకాశాలున్నట్టు చెప్పారు.

పలు మార్గాలున్నాయ్..

ఆర్‌బీఐ ఈ ఏడాది ఒక శాతం వరకు రేట్లు తగ్గించడంతో మార్జిన్లను కాపాడుకోవడం బ్యాంకులకు సవాలుగా మారిన తరుణంలో.. తన మార్జిన్లను కాపాడుకునేందుకు ఎస్‌బీఐకి పలు చోదకాలున్నట్టు శెట్టి పేర్కొన్నారు. ''సీఆర్ఆర్ ఒక శాతం కోత పూర్తిగా అమల్లోకి రావడంతో దీనివల్ల వడ్డీ ఆదాయం మెరుగవుతుంది. రుణాలకు మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయి. గడువు ముగిసే ఫిక్స్‌డ్ డిపాజిట్లకు కొత్త వడ్డీ రేట్లు అమలు చేయడంతోపాటు, సేవింగ్స్ డిపాజిట్లపై 0.2 శాతం వడ్డీ రేటు తగ్గించడం వల్ల మార్జిన్ల పరంగా ప్రయోజనం కలుగుతుంది''అని శెట్టి వివరించారు. ఎస్‌బీఐ ఆస్తుల్లో కేవలం 30 శాతమే ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ ఆఫ్ రెపో రేటుతో అనుసంధానమైనవిగా చెప్పారు. దీనివల్ల ఆర్‌బీఐ రేట్ల కోత చేపట్టినప్పుడు మూడింట ఒక వంతు రుణాల రేట్లను మార్చాల్సి వస్తుందని, దీంతో మార్జిన్లపై ఒత్తిడి పరిమితంగానే ఉంటుందని వివరించారు. సెప్టెంబర్ త్రైమాసికంలో ఎస్‌బీఐ నిమ్ 2.93 శాతంగా ఉండడం గమనార్హం.

ఏఐతో ఉత్పాదకత పెరుగుతుంది

- విద్య, వైద్య సేవలను మరింతగా విస్తరించవచ్చు
- సేల్స్‌ఫోర్స్ దక్షిణాసియా ప్రెసిడెంట్ అరుంధతి భట్టాచార్య

న్యూఢిల్లీ: కంపెనీలు మరిన్ని లాభాల కోసమే కృత్రిమ మేథ (ఏఐ) జపం చేస్తున్నాయనే అభిప్రాయం మారాల్సిన అవసరం ఉందని సేల్స్‌ఫోర్స్ దక్షిణాసియా ప్రెసిడెంట్ అరుంధతి భట్టాచార్య వ్యాఖ్యానించారు. దీనితో ఉత్పాదకత పెరుగుతుందని, కొత్త ఉద్యోగాలు వస్తాయని, వైద్యం..విద్య లాంటి సేవలను గణనీయంగా విస్తరించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఏజెంటిక్ ఏఐ వల్ల ఉద్యోగాల తొలగింపు కన్నా ఉద్యోగులకు మరింత సాధికారత లభిస్తుందని వివరించారు. ఏఐ శకంలో ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉంటుందని ఆమె చెప్పారు. ఆరోగ్య సంరక్షణ అవసరాలు పెరిగే కొద్దీ ఆసుపత్రులు కిక్కిరిసిపోయే అవకాశం ఉందని .. అలాంటి పరిస్థితుల్లో ఏజెంటిక్ ఏఐ, డిజిటల్‌పరమైన మద్దతుతో వాటిపై ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ వ్యవస్థ విషయానికొస్తే రోగ లక్షణాలను రికార్డ్ చేసేందుకు, పేషంటును చూడటానికి ముందే డాక్టరుకు ప్రాథమిక విశ్లేషణ ఇచ్చేందుకు ఏజెంటిక్ ఏఐ ఉపయోగపడుతుందని భట్టాచార్య చెప్పారు. టెక్నాలజీ, యూపీఐలాంటి ప్లాట్‌ఫాంల వల్లే బ్యాంకింగ్ పరిధిలోని వారికి కూడా సర్వీసులను విస్తరించేందుకు వీలయ్యిందన్నారు. మరోవైపు, అంతర్జాతీయంగా సేల్స్‌ఫోర్స్‌కి వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో భారత్ కూడా ఒకటిగా కొనసాగుతోందని ఆమె చెప్పారు.

ఎడెల్‌వీజ్ లైఫ్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో 99.29%

హైదరాబాద్: ఎడెల్‌వీజ్ లైఫ్ ఇన్సూరెన్స్ గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) 99.29 శాతం క్లెయిమ్‌లను పరిష్కరించినట్టు ప్రకటించింది. వచ్చిన మొత్తం మరణ పరిహార క్లెయిమ్‌ల్లో ఎన్నింటికి చెల్లింపులు చేసిందన్నది ఈ రేషియో తెలియజేస్తుంది. ''గత కొన్నేళ్లలో మా ప్రక్రియలను ఎంతో మెరుగుపరిచాం. క్లెయిల్ ప్రక్రియలను సులభతరం చేశాం. పాలసీదారులకు సరైన మార్గదర్శనం దిశగా చర్యలు తీసుకున్నాం. వీటి ఫలితంగా గత మూడేళ్లుగా క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియోని 99 శాతం పైనే కొనసాగిస్తున్నాం. కుటుంబాలకు అవసరాల్లో మేమున్నామన్న భరోసాకు తోడు నిర్వహణ సామర్థ్యాలకు ఇది నిదర్శనం''అని ఎడెల్‌వీజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో సుమిత్ రాయ్ తెలిపారు.

దేశీయంగా రేర్ ఎర్త్ తయారీకి దన్ను

న్యూఢిల్లీ: రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్ల ఉత్పత్తి కోసం ఉద్దేశించిన రూ. 7,280 కోట్ల స్కీముతో దేశీయంగా వాటి తయారీకి, సరఫరాకి ఊతం లభిస్తుందని పరిశ్రమ ధీమా వ్యక్తం చేసింది. తవ్వకం, వెలికితీత, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ప్రాసెసింగ్, వివిధ రంగాలకు అవసరమయ్యే మ్యాగ్నెట్ల తయారీ వ్యవస్థకు ఈ పథకంతో గణనీయంగా ప్రయోజనం చేకూరుతుందని భారతీయ ఖనిజ పరిశ్రమ సంస్థల సమాఖ్య ఎఫ్ఐఎంఐ పర్కొంది. దేశ వ్యూహాత్మక తయారీ సామర్థ్యాలను పటిష్టం చేసేందుకు ఈ ప్రోత్సాహక స్కీము తోడ్పడుతుందని అసోచాం సెక్రటరీ జనరల్ మనీష్ సింఘాల్ తెలిపారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎలక్ట్రానిక్స్, మెడికల్ డివైజ్‌లు, పునరుత్పాదక విద్యుత్, రక్షణ తదితర రంగాల వృద్ధిపై భారత్ ప్రధానంగా దృష్టి పెడుతున్న పరిస్థితుల్లో వార్షికంగా 6,000 టన్నుల (ఎంటీపీఏ) రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల తయారీ సామర్థ్యాన్ని సంతరించుకునేందుకు ప్రయత్నించడమనేది సకాలంలో తీసుకుంటున్న చర్యగా ఆయన అభివర్ణించారు. దీనివల్ల దిగుమతులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని, భవిష్యత్ టెక్నాలజీల అభివృద్ధిలో భారత్ మరింత ప్రముఖ పాత్ర పోషించే అవకాశం ఉంటుందని సింఘాల్ వివరించారు. దీనితో మైనింగ్, ప్రాసెసింగ్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ తదితర విభాగాలవ్యాప్తంగా కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఈవై ఇండియా పార్ట్‌నర్ రాజు కుమార్ తెలిపారు.

వ్యాగన్ లీజింగ్ విభాగంలోకి టిటాగర్ రైల్

కోల్‌కతా: టిటాగర్ రైల్ సిస్టమ్స్ కొత్తగా వ్యాగన్ల లీజింగ్ వ్యాపార విభాగంలోకి ప్రవేశించే ప్రణాళికల్లో ఉంది. దీర్ఘకాలిక లీజు సర్వీసులు అందించడం ద్వారా ప్రైవేట్ రంగ మార్కెట్లో గణనీయ వాటా దక్కించుకోవాలని భావిస్తోంది. ఈ దిశగా వెంచర్ ఏర్పాటుకు సంబంధించి లైసెన్సు పొందినట్లు, సంస్థ స్వరూపంపై కసరత్తు చేస్తున్నట్లు టిటాగర్ వైస్ చైర్మన్ ఉమేష్ చౌదరి చెప్పారు. సొంతంగానే లేదా స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ద్వారా కార్యకలాపాలు చేపట్టే విషయంపై చర్చలు జరుగుతున్నాయని వివరించారు. ఏటా 1,500–2,000 వ్యాగన్ల స్థాయిలో మార్కెట్లో డిమాండ్ ఉందని పేర్కొన్నారు. మరోవైపు టిటాగర్ రైల్ చేతిలో ప్రస్తుతం దాదాపు రూ. 28,000–29,000 వేల కోట్ల ఆర్డర్లు ఉన్నట్లు చౌదరి వివరించారు. వీల్స్ కొరత తీరిపోవడంతో ఉత్పత్తి నెలకు 800–850 వ్యాగన్ల స్థాయిలో మళ్లీ సాధారణ స్థితికి వచ్చినట్లు పేర్కొన్నారు.

మహీంద్రా మాన్యులైఫ్ ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ఫండ్

హైదరాబాద్: మహీంద్రా మాన్యులైఫ్ మ్యుచువల్ ఫండ్ కొత్తగా మహీంద్రా మాన్యులైఫ్ ఇన్‌కం ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఎఫ్‌వోఎఫ్ పేరిట ఓపెన్ ఎండెడ్ ఫండ్ ఆఫ్ ఫండ్ స్కీమును ఆవిష్కరించింది. పన్ను పరమైన ప్రయోజనాలను అందుకునేందుకు.. 24 నెలలు, అంతకుమించిన దీర్ఘకాలం పెట్టుబడులపై పన్నుల అనంతరం స్థిరమైన మరియు మెరుగైన రాబడులను కోరుకునే ఇన్వెస్టర్లకు ఈ ఫండ్‌ది అనుకూలమని సంస్థ ప్రకటించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) నవంబర్ 21న ప్రారంభమై డిసెంబర్ 1న ముగుస్తుంది. ''డెట్ మరియు ఆర్బిట్రేజ్ వ్యూహాల సామర్థ్యాలను మేళవించి అన్ని పరిస్థితులకు అనువుగా ఉండే విధంగా ఇన్‌కం ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఎఫ్‌వోఎఫ్ రూపొందించాం. వడ్డీ రేట్లలో అస్థిరతలతో కూడిన అనిశ్చిత మార్కెట్లలో, పన్నుల అనంతరం మెరుగైన రాబడులకు ఉపయోగకరంగా ఉంటుంది'' అని మహీంద్రా మాన్యులైఫ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, సీఈవో ఆంథోనీ హెరెడియా తెలిపారు.

వినూత్న ఉత్పత్తులపై ఫార్మా ఫోకస్ చేయాలి

ఫార్మెక్సిల్ చైర్మన్ జోషి సూచన

గ్రేటర్ నోయిడా: ప్రపంచ ఫార్మసీగా భారత్ తన స్థానాన్ని నిలబెట్టాలంటే వచ్చే అయిదేళ్లలో దేశీ ఫార్మా పరిశ్రమ క్రమంగా వినూత్నమైన, సంక్లిష్టమైన జనరిక్స్ తయారీ వైపు మళ్లాలని ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషి చెప్పారు. బయోసిమిలర్లు, బయోలాజిక్స్, పెప్టైడ్‌లు మొదలైన వాటిపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా పోటీ, భౌగోళిక–రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోతున్న నేపథ్యంలో కేవలం పేటెంట్లు ముగిసిన ఉత్పత్తులనే తయారు చేయడం కాకుండా పరిశోధనల ఆధారిత ఆవిష్కరణలవైపు మళ్లాల్సిన అవసరం ఉందని జోషి చెప్పారు. జనరిక్ మార్కెట్ స్థాయిని దాటి ఇతర విభాగాల్లోనూ భారత్ స్థానాన్ని పటిష్టం చేయడంపై దృష్టి పెట్టాల్సి ఉందని సీపీహెచ్ఐ–పీఎంఈసీ ఇండియా 18వ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన తెలిపారు. అమెరికా టారిఫ్‌ల ముప్పుపై ఆందోళన నెలకొన్నప్పటికీ ఈ ఏడాది ఎగుమతులు ఇప్పటివరకు వృద్ధి బాటలోనే ఉన్నాయని, 2.31 శాతం పెరిగాయని జోషి చెప్పారు. ఇక ఫార్మసీ బోధనాంశాల్లో కూడా మార్పులు చేయాల్సి ఉందని సదస్సులో పాల్గొన్న కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సిలబస్ అనేది వాస్తవ పరిస్థితులను, నేటి ఫార్మా వ్యవస్థ అవసరాలను ప్రతిబింబించేలా ఉండటం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డ్రగ్ డిస్కవరీ, రీసెర్చ్ మెథడాలజీల నుంచి ముడి వస్తువుల సేకరణ, ఏఐ ఆధారిత ఫార్ములేషన్ డెవలప్‌మెంట్‌లాంటి అన్ని అంశాల గురించి విద్యార్థుల్లో అవగాహనను పెంపొందించేలా పాఠ్యాంశాలు ఉండాలని తెలిపారు.

పెట్టుబడి నిపుణుల అర్హత సడలింపు

సెబీ తాజా మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా పెట్టుబడి సలహాదారులు(ఐఏలు), పరిశోధనా విశ్లేషకులు(ఆర్ఏలు)గా గుర్తింపు పొందేవారి అర్హతల నిబంధనలను సడలించింది. తద్వారా ఇందుకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గ్రాడ్యుయేట్లను అనుమతించింది. అయితే ఎన్ఐఎస్ఎం సర్టిఫికేషన్ పరీక్షలో ఉత్తీర్ణతను తప్పనిసరి నిబంధనగా చేర్చింది. దీంతో అర్హతపొందే వ్యక్తులు సంబంధిత విభాగంలో విజ్ఞానంతోపాటు వృత్తిసంబంధ అవగాహనను కలిగి ఉండే వీలు కల్పించింది. సెబీ తాజాగా జారీ చేసిన రెండు నోటిఫికేషన్లలో నిబంధనల సవరణలను పేర్కొంది. ప్రస్తుతం దరఖాస్తుదారులు ఫైనాన్స్ సంబంధ విభాగాలలో గ్రాడ్యుయేషన్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయవలసి ఉంది. ఫైనాన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్, ఎకనమిక్స్, క్యాపిటల్ మార్కెట్లలో డిగ్రీ కలిగినవారికి మాత్రమే రిజిస్ట్రేషన్‌కు వీలు కల్పిస్తోంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఇకపై ఏ విభాగంలోని గ్రాడ్యుయేట్లకైనా రిజిస్ట్రేషన్‌కు అర్హత ఉంటుంది. అయితే ఇందుకు ఎన్ఎస్ఐఎం పరీక్ష ఉత్తీర్ణత తప్పనిసరి.

భారత్‌ను గెలిపించిన సంజయ్

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత్ మళ్లీ గెలుపు బాట పట్టింది. బుధవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 4–3 గోల్స్ తేడాతో ఆతిథ్య మలేసియా జట్టును ఓడించింది. కొరియాపై తొలి మ్యాచ్‌లో 1–0తో నెగ్గిన భారత్... బెల్జియంతో జరిగిన రెండో మ్యాచ్‌లో 2–3తో ఓడిపోయింది. మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున సెల్వం కార్తీ (7వ నిమిషంలో), సుఖ్‌జీత్ సింగ్ (21వ నిమిషంలో), అమిత్ రోహిదాస్ (39వ నిమిషంలో), కెప్టెన్ సంజయ్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మలేసియా జట్టుకు ఫైజల్ సారి (13వ నిమిషంలో), ఫిత్రి సారి (36వ నిమిషంలో), మర్హాన్ జలీల్ (45వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. మ్యాచ్ మరో ఏడు నిమిషాల్లో ముగుస్తుందనగా సంజయ్ గోల్ చేసి భారత్‌ను 4–3తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత ఈ ఏడు నిమిషాలు భారత రక్షణ పంక్తి మలేసియా ఆటగాళ్లను నిలువరించి ఈ టోర్నీలో రెండో విజయాన్ని ఖాయం చేశారు. ఈ మ్యాచ్‌లో భారత్‌కు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు, రెండు పెనాల్టీ స్ట్రోక్‌లు లభించాయి. నాలుగు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని... రెండు పెనాల్టీ స్ట్రోక్‌లలో ఒక దానిని భారత్ సద్వినియోగం చేసుకుంది. ఆరు జట్లు పోటీ పడుతున్న ఈ టోర్నీలో భారత్ మూడు మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. రెండింటిలో గెలిచి, ఒక దాంట్లో ఓడిపోయి ఆరు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది.

వరల్డ్‌కప్ స్టార్స్‌పైనే దృష్టి

- నేడు డబ్ల్యూపీఎల్ వేలం
- 73 ఖాళీల కోసం 277 మంది క్రికెటర్లు బరిలో
- దీప్తి శర్మ, శ్రీచరణిల కోసం ఫ్రాంచైజీలు పోటీపడే చాన్స్
- మధ్యాహ్నం గం. 3:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

దీప్తి



శ్రీ చరణి

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్ మెగా వేలానికి రంగం సిద్ధమైంది. న్యూఢిల్లీ వేదికగా గురువారం ఈ ప్రక్రియ సాగనుంది. మొత్తం ఐదు ఫ్రాంచైజీల్లో 73 స్థానాలు ఖాళీ ఉండగా... వీటి కోసం 277 మంది ప్లేయర్లు పోటీ పడుతున్నారు. ఇందులో 194 మంది భారత ప్లేయర్లు ఉన్నారు. వారిలో 52 మంది క్యాప్డ్ (జాతీయ జట్టుకు ఆడినవారు) ప్లేయర్లు కాగా... 142 మంది అన్ క్యాప్డ్ ప్లేయర్లు. ఇక విదేశాల నుంచి 83 మంది పోటీ పడుతున్నారు. ఇందులో 66 మది క్యాప్డ్ ప్లేయర్లు... 17 మంది అన్ క్యాప్డ్ ప్లేయర్లు ఉన్నారు. ఒక్కో జట్టు కనిష్టంగా 15 మంది, గరిష్టంగా 18 మంది ప్లేయర్లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

- ఇటీవల జరిగిన ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ చేజిక్కించుకున్న భారత ప్లేయర్లకు వేలంలో భారీ డిమాండ్ ఉండే అవకాశాలున్నాయి. వరల్డ్‌కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కోసం ఫ్రాంచైజీలు పోటీ పడొచ్చు. గతంలో యూపీ వారియర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన దీప్తిని వేలంలో ఎవరు దక్కించుకుంటారో చూడాలి. దీప్తితో పాటు రేణుక సింగ్, సోఫీ డివైన్, అమెలియా కెర్ (న్యూజిలాండ్), ఎకిల్‌స్టోన్ (ఇంగ్లండ్), అలీసా హీలీ, మెగ్ లానింగ్ (ఆస్ట్రేలియా), వాల్‌వర్ట్ (దక్షిణాఫ్రికా) మార్క్యూ ప్లేయర్ల జాబితాలో ఉన్నారు.
- వన్డే వరల్డ్‌కప్ గెలిచిన భారత జట్టులోని క్రాంతి గౌడ్, శ్రీ చరణి, హర్లీన్ డియోల్, ప్రతీక రావల్‌కు కూడా భారీ ధర దక్కే అవకాశాలున్నాయి. స్నేహ్ రాణా, పూజ వస్త్రకర్, ఉమా ఛెత్రీ కోసం కూడా ఫ్రాంచైజీలు పోటీ పడొచ్చు. విదేశీ ప్లేయర్ల జాబితాలో డిక్లెర్క్, లిచ్‌ఫీల్డ్, అలానా కింగ్ కూడా ఉన్నారు.
- 5 ఫ్రాంచైజీలు కలిసి ఈ వేలంలో రూ. 41.1 కోట్లు ఖర్చు చేయనున్నాయి. అందులో అత్యధికంగా యూపీ వారియర్స్ దగ్గర 14.5 కోట్లు ఉన్నాయి. వేలానికి ముందు ఆ జట్టు కేవలం ఒక్క ప్లేయర్‌ను మాత్రమే రీటైన్ చేసుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ వద్ద అతి తక్కువగా రూ. 5.70 కోట్లు ఉన్నాయి. ఢిల్లీతో పాటు ముంబై ఇండియన్స్ జట్లు వేలానికి ముందు ఐదుగురు ప్లేయర్లను రీటైన్ చేసుకున్నాయి. దీంతో వేలంలో ఈ రెండు జట్లకు 'రైట్ టు మ్యాచ్' అవకాశం లేదు. వేలంలో నలుగురు అసోసియేట్ ఆటగాళ్లు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. తీర్థ సతీశ్, ఇషా ఓజా (యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్), తారా నోరిస్ (అమెరికా), థిపట్చా పుథవాంగ్ (థాయ్‌లాండ్) వేలం బరిలో ఉన్నారు. వచ్చే ఏడాది జనవరి 7 నుంచి డబ్ల్యూపీఎల్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

తరుణ్ ముందంజ

- ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్, ప్రణయ్
- శ్రియాన్షి, అన్‌మోల్ అవుట్

లక్నో: సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి, ఆంధ్రప్రదేశ్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో తరుణ్ 21–7, 21–9తో సతీశ్ కుమార్ కరుణాకరన్ (భారత్)పై, ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 21–13, 21–10తో కావిన్ (భారత్)పై గెలుపొందారు. భారత్‌కే చెందిన హెచ్‌ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జి, మిథున్ మంజునాథ్, సనీత్ దయానంద్, రాహుల్ భరద్వాజ్, ఆలాప్ మిశ్రా కూడా తొలి రౌండ్‌లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ ఉన్నతి హుడా, రక్షిత శ్రీ, తస్నీమ్ మీర్, దేవిక సిహాగ్, మాన్సి సింగ్, ఇషారాణి బారువా, అనుపమ, తన్వీ శర్మ రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. భారత రైజింగ్ స్టార్స్ అన్‌మోల్, శ్రియాన్షి వలిశెట్టి మాత్రం తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. అన్‌మోల్ 8–21, 10–21తో హినా అకెచి (జపాన్) చేతిలో, శ్రియాన్షి 15–21, 20–22తో నెష్లిహాన్ అరిన్ (టర్కీ) చేతిలో ఓడిపోయారు.

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) జంట 21–5, 21–7తో సంజిత్–దివ్య (భారత్) జోడీపై గెలిచింది.

సూపర్ సిందరోవ్

- ప్రపంచకప్ చెస్ చాంపియన్‌గా ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్
- ఈ టైటిల్ సాధించిన పిన్న వయస్కుడిగా రికార్డు

పనాజీ: ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ఉజ్బెకిస్తాన్ టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ జవోఖిర్ సిందరోవ్ తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని సాధించాడు. బుధవారం ముగిసిన పురుషుల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో 19 ఏళ్ల సిందరోవ్ చాంపియన్‌గా అవతరించాడు. తద్వారా ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన అతి పిన్న వయస్కుడిగా సిందరోవ్ గుర్తింపు పొందాడు. చైనా గ్రాండ్‌మాస్టర్ వె యితో జరిగిన టైబ్రేక్‌లో సిందరోవ్ 1.5–0.5తో గెలుపొందాడు. ఇద్దరి మధ్య నిర్ణీత రెండు క్లాసిక్ ఫార్మాట్ గేమ్‌లు 'డ్రా' కావడంతో... విజేతను నిర్ణయించేందుకు బుధవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. తెల్ల పావులతో ఆడిన తొలి గేమ్‌ను సిందరోవ్ 45 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. నల్ల పావులతో ఆడిన రెండో గేమ్‌లో సిందరోవ్ 60 ఎత్తుల్లో గెలుపొంది టైటిల్‌ను ఖరారు చేసుకున్నాడు. విజేతగా నిలిచిన సిందరోవ్‌కు 1,20,000 డాలర్లు (రూ. 1 కోటీ 7 లక్షలు), రన్నరప్ వె యికి 85,000 డాలర్లు (రూ. 75 లక్షల 83 వేలు), మూడో స్థానం పొందిన ఎసిపెంకో (రష్యా)కు 60,000 డాలర్లు (రూ. 53 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ ముగ్గురు వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి కూడా అర్హత సాధించారు. ఫాబియానో కరువానా (అమెరికా), అనీశ్ గిరి (నెదర్లాండ్స్), మథియాస్ బ్లూబామ్ (జర్మనీ) ఇప్పటికే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత పొందారు. క్యాండిడేట్స్ టోర్నీ విజేత ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం పోటీపడతాడు.

ఉర్విల్ ఉగ్రరూపం

37 బంతుల్లో 12 ఫోర్లు, 10 సిక్స్‌లతో 119 నాటౌట్

- 31 బంతుల్లోనే సెంచరీ పూర్తి
- రెండో వేగవంతమైన శతకం చేసిన భారత ప్లేయర్‌గా రికార్డు
- సర్వీసెస్‌పై గుజరాత్ ఘనవిజయం
- ముస్తాక్ అలీ టి20 టోర్నీ

ఉర్విల్

సాక్షి, హైదరాబాద్: దేశవాళీల్లో దంచికొడుతున్న ఉర్విల్ పటేల్ (37 బంతుల్లో 119 నాటౌట్; 12 ఫోర్లు, 10 సిక్స్‌లు) రికార్డు సెంచరీతో చెలరేగాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్ గ్రూప్ 'సి'లో భాగంగా సర్వీసెస్‌తో మ్యాచ్‌లో ఈ గుజరాత్ ప్లేయర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఫలితంగా సికింద్రాబాద్ జింఖానా మైదానంలో జరిగిన ఈ పోరులో గుజరాత్ జట్టు 8 వికెట్ల తేడాతో సర్వీసెస్‌ను చిత్తుచేసింది. ఈ మ్యాచ్ ద్వారానే గుజరాత్ టి20 జట్టు పగ్గాలు అందుకున్న 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఉర్విల్ పటేల్... సర్వీసెస్ బౌలింగ్‌ను ఊచకోత కోశాడు. బంతి పడిందే ఆలస్యం దానిపై ఆకలిగొన్న సింహంలా విరుచుకు పడిన ఉర్విల్... బౌండరీల ద్వారానే 108 పరుగులు రాబట్టడం విశేషం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన సర్వీసెస్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఓపెనర్ గౌరవ్ కోచర్ (37 బంతుల్లో 60; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే రాణించగా... తక్కినవాళ్లంతా విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో హేమంగ్ పటేల్, అర్జాన్ నాగ్‌వస్వల్లా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో గుజరాత్ 12.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసి గెలుపొందింది. ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడిన 27 ఏళ్ల ఉర్విల్ 31 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్నాడు. గతేడాది ఇదే టోర్నీలో త్రిపురపై ఉర్విల్ 28 బంతుల్లోనే శతకం చేయగా... టీమిండియా బ్యాటర్ అభిషేక్ శర్మ కూడా పంజాబ్ తరఫున మేఘాలయపై 28 బంతుల్లోనే సెంచరీ చేశాడు. ఇప్పుడు ఉర్విల్ రెండో వేగవంతమైన సెంచరీ రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. 2023 విజయ్ హజారే ట్రోఫీలో చండీగఢ్‌పై ఉర్విల్ 41 బంతుల్లోనే శతకం చేశాడు. మరో ఓపెనర్ ఆర్య దేశాయ్ (35 బంతుల్లో 60; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి ఉర్విల్ తొలి వికెట్‌కు 174 పరుగులు జోడించాడు. దీంతో గుజరాత్ జట్టు సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. ఇదే గ్రూప్‌లో భాగంగా హైదరాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌ల్లో పంజాబ్ జట్టు 5 వికెట్ల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌పై, పుదుచ్చేరి 5 పరుగుల తేడాతో హరియాణాపై, బెంగాల్ 6 వికెట్ల తేడాతో బరోడాపై విజయాలు సాధించాయి.

రహానే మెరుపులు

సీనియర్ బ్యాటర్ అజింక్యా రహానే (33 బంతుల్లో 62; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో ముంబై జట్టు ముస్తాక్ అలీ టోర్నీలో బోణీ కొట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా లక్నో వేదికగా జరిగిన పోరులో ముంబై 7 వికెట్ల తేడాతో రైల్వేస్‌పై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన రైల్వేస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసింది. అశుతోష్ రాణా (30 బంతుల్లో 61; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం ముంబై జట్టు ఛేదనలో 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' రహానేతో పాటు భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (30 బంతుల్లో 47; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) సత్తా చాటాడు.

ఇతర మ్యాచ్‌ల్లో ఛత్తీస్‌గఢ్ 27 పరుగుల తేడాతో విదర్భపై, ఉత్తరప్రదేశ్ 6 వికెట్ల తేడాతో గోవాపై, కర్ణాటక 5 వికెట్ల తేడాతో ఉత్తరాఖండ్‌పై, జమ్మూకశ్మీర్ 5 వికెట్ల తేడాతో మహారాష్ట్రపై, సౌరాష్ట్ర 4 వికెట్ల తేడాతో త్రిపురపై, రాజస్తాన్ 6 వికెట్ల తేడాతో తమిళనాడుపై, చండీగఢ్ 6 వికెట్ల తేడాతో బిహార్‌పై, జార్ఖండ్ 7 వికెట్ల తేడాతో ఢిల్లీపై, కేరళ 10 వికెట్ల తేడాతో ఒడిశాపై విజయాలు సాధించాయి. కేరళ ఓపెనర్ రోహన్ (60 బంతుల్లో 121 నాటౌట్; 10 ఫోర్లు, 10 సిక్స్‌లు) అజేయ శతకంతో ఆకట్టుకున్నాడు.

హైదరాబాద్, ఆంధ్ర శుభారంభం

రాణించిన మిలింద్, రాహుల్, అర్ఫాజ్ • ఆకట్టుకున్న రికీ భుయ్, సత్యనారాయణ రాజు

రాహుల్ బుద్ధి

మిలింద్

కోల్‌కతా: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్, ఆంధ్ర జట్లు విజయంతో శుభారంభం చేశాయి. కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో మధ్యప్రదేశ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో సీవీ మిలింద్ సారథ్యంలోని హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. లక్నోలో ఎకానా స్టేడియంలో అస్సాం జట్టుతో జరిగిన గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో రికీ భుయ్ నాయకత్వంలోని ఆంధ్ర జట్టు 29 పరుగుల తేడాతో నెగ్గింది.

హైదరాబాద్‌తో జరిగిన పోరులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మధ్యప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. శివాంగ్ కుమార్ (28 బంతుల్లో 45; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వెంకటేశ్ అయ్యర్ (11) తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. హైదరాబాద్ బౌలర్లలో సీవీ మిలింద్ 34 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... రక్షణ్ రెడ్డి 26 పరుగులిచ్చి 2 వికెట్లు, అర్ఫాజ్ అహ్మద్ 6 పరుగులిచ్చి 2 వికెట్లు తీసుకున్నారు. అజయ్‌దేవ్ గౌడ్, ఆశిష్ శ్రీవాస్తవ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. అనంతరం హైదరాబాద్ 18.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 145 పరుగులు సాధించి గెలిచింది. ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (6 బంతుల్లో 14; 1 ఫోర్, 1 సిక్స్), అమన్ రావు (13 బంతుల్లో 16; 2 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ ప్రజ్ఞయ్ రెడ్డి (6 బంతుల్లో 9; 1 ఫోర్) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరుకున్నారు. ఈ దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రాహుల్ బుద్ధి (46 బంతుల్లో 59 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్), తనయ్ త్యాగరాజన్ (19 బంతుల్లో 18; 1 ఫోర్) నాలుగో వికెట్‌కు 59 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దారు. తనయ్ అవుటయ్యాక వచ్చిన భవేశ్ సేథ్ (6 బంతుల్లో 9; 1 సిక్స్) ఎక్కువసేపు క్రీజులో నిలువలేదు. అయితే అర్ఫాజ్ (13 బంతుల్లో 18 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) అండతో రాహుల్ హైదరాబాద్‌ను విజయతీరానికి చేర్చాడు. శుక్రవారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో మహారాష్ట్రతో హైదరాబాద్ తలపడుతుంది.

రికీ భుయ్

అస్సాం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులు సాధించింది. భారత క్రికెటర్ కేఎస్ భరత్ (0) ఖాతా తెరవకుండానే వెనుదిరగ్గా... షేక్ రషీద్ (10 బంతుల్లో 11; 2 ఫోర్లు) కూడా నిరాశపరిచాడు. అయితే సౌరభ్ కుమార్ (16; 2 ఫోర్లు), పాండురంగరాజు (19; 2 ఫోర్లు), కేవీ శశికాంత్ (19; 1 ఫోర్, 1 సిక్స్) సహకారంతో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రికీ భుయ్ (35 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్) ఆంధ్రకు గౌరవప్రద స్కోరును అందించాడు. 144 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అస్సాం జట్టు 19.4 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రియాన్ పరాగ్ (5) విఫలమయ్యాడు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు 20 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా... పృథ్వీరాజ్ 12 పరుగులకు 2 వికెట్లు, చీపురపల్లి స్టీఫెన్ 25 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టి తమ జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించారు.

రాజు

భారత టీటీ జట్లకు రెండు పతకాలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌లో భారత జట్లు రెండు పతకాలు సాధించాయి. రొమేనియా వేదికగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత బాలుర అండర్–19 జట్టు రజత పతకంతో మెరవగా... బాలికల అండర్–15 జట్టు కాంస్యం సాధించింది. చక్కటి ఆటతీరుతో ఫైనల్‌కు చేరుకున్న బాలుర అండర్–19 జట్టు బుధవారం జరిగిన ఫైనల్లో 0–3తో జపాన్ చేతిలో ఓడింది. అంకుర్ 17–15, 6–11, 12–10, 4–11, 11–13తో రైసీ కవాకమి (జపాన్) చేతిలో పోరాడి ఓడగా... అభినందర్ 7–11, 8–11, 6–11తో కజకి యోషియామా (జపాన్) చేతిలో ఓడాడు. మూడో సింగిల్స్ మ్యాచ్‌లో ప్రియానుజ్ భట్టాచార్య 9–11, 7–11, 3–11తో టమిటో వటనబే (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. అంతకుముందు సెమీస్‌లో భారత జట్టు 3–2తో చైనీస్ తైపీపై విజయం సాధించింది. బాలికల అండర్–15 జట్టు సెమీఫైనల్లో 0–3తో దక్షిణ కొరియా చేతిలో ఓడింది. తొలిసారి ఈ టోర్నీ బరిలోకి దిగిన భారత అమ్మాయిల అండర్–15 జట్టు క్వార్టర్స్‌లో 3–1తో జర్మనీపై గెలిచింది. బాలికల అండర్–19 క్వార్టర్ ఫైనల్లో భారత్ 2–3తో చైనీస్ తైపీ చేతిలో ఓడింది.

రొనాల్డోకు ఊరట

వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడేందుకు మార్గం సుగమం

జెనీవా: పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో వచ్చే ఏడాది జరగనున్న 'ఫిఫా' ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్‌లో బరిలోకి దిగడంపై సందిగ్ధత వీడింది. ఇటీవల ఐర్లాండ్‌తో మ్యాచ్ సందర్భంగా రొనాల్డోకు 'రెడ్ కార్డు' దక్కింది. దీంతో అతడిపై మూడు మ్యాచ్‌ల నిషేధం పడింది. అయితే ఈ మూడు మ్యాచ్‌ల్లో రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని ఏడాది తర్వాత అమలు చేయవచ్చని 'ఫిఫా' వెసులుబాటు కల్పించింది. దీంతో ఈ నెల 16న అర్మేనియాతో జరిగిన మ్యాచ్‌కు దూరమైన రొనాల్డో... వచ్చే ఏడాది జరగనున్న వరల్డ్‌కప్ ఆరంభం నుంచి అందుబాటులో ఉండనున్నాడు. 2026 జూన్ 11 నుంచి అమెరికా, కెనడా, మెక్సికో వేదికగా 'ఫిఫా' ప్రపంచకప్ జరగనుండగా... దానికి ముందు పోర్చుగల్ జట్టు రెండు ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడనుంది.





హవాయి అగ్నిపర్వతాల జాతీయపార్క్‌లోని కిలాయియా అగ్నిపర్వత బిలం నుంచి బుధవారం భారీస్థాయిలో లావా ఉప్పొంగి ప్రవహిస్తున్న దృశ్యం

26/11 ముంబై దాడులు జరిగి 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం జమ్మూ నగరంలో మృతులకు నివాళులర్పిస్తున్న పాఠశాల విద్యార్థులు

బంగ్లాదేశ్‌లోని ఢాకాలో కొరాయిల్ మురికివాడలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించి అంతటా అగ్నికీలలు వ్యాపించిన దృశ్యం

ఏఐ వెలిగించిన కిరణం!



దారి తప్పిన చిన్నారి.. 17 ఏళ్ల తర్వాత ఇంటికి..

అనగనగా ఓ చిన్నారి.. ఐస్‌క్రీమ్ కొనుక్కోవడానికి ఇంటి గడప దాటింది. అంతే.. తప్పిపోయింది. ఇంటి చిరునామా మరిచిపోయింది. దశాబ్దంన్నరకు పైగా సాగిన ఆ కన్నీటి కథకు, ఆధునిక సాంకేతికత అనూహ్యమైన ముగింపు పలికింది. దశాబ్దం క్రితం నమోదైన ఓ 'మిస్సింగ్ గర్ల్' ఫిర్యాదు, అత్యాధునిక ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికత... వెరసి ఓ పాకిస్తానీ యువతిని 17 ఏళ్ల తర్వాత తన కుటుంబంతో తిరిగి కలిపాయి. 2008లో ఇస్లామాబాద్‌లో తప్పిపోయిన కిరణ్ అనే బాలిక.. ఇప్పుడు 27 ఏళ్ల యువతిగా ఎదిగి కన్నవారి ఒడికి చేరుకుంది.

ఎధీ ఆశ్రయానికి తరలింపు

'నేను ఏడుస్తూ ఒంటరిగా ఉన్నాను. అప్పుడు ఎవరో ఒక దయామయి నన్ను ఇస్లామాబాద్‌లోని ఎధీ సెంటర్‌కు తీసుకెళ్లినట్టు గుర్తు. అప్పట్లో నాకు ఏమీ గుర్తు లేదు'.. అని కిరణ్ గుర్తు చేసుకుంది. కొద్ది రోజుల్లోనే, మానవతామూర్తి దివంగత అబ్దుల్ సత్తార్ ఎధీ భార్య బిల్కిస్ ఎధీ.. కిరణ్‌ను కరాచీకి తీసుకెళ్లారు. అప్పటి నుండి, ఎధీ ఆశ్రయంలో.. బిల్కిస్ సంరక్షణలో కిరణ్ పెరిగింది. కిరణ్ తల్లి దండ్రుల ఆచూకీ కోసం ఇస్లామాబాద్‌కు పలుమార్లు వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఎధీ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

ఎధీ ఫౌండేషన్ ప్రస్తుత చైర్‌పర్సన్ ఫైసల్ ఎధీ భార్య సభా ఫైసల్ ఎధీ మాట్లాడుతూ.. కిరణ్ తల్లిదండ్రులను గుర్తించడానికి ఇస్లామాబాద్‌కు ఎన్నిసార్లు వెళ్లినా ఫలితం దక్కలేదన్నారు. ఆశలు సన్నగిల్లిన సమయంలో, ఫౌండేషన్ ఈ ఏడాది మొదట్లో పంజాబ్‌లో 'సేఫ్ సిటీ ప్రాజెక్ట్'లో పనిచేస్తున్న సైబర్ సెక్యూరిటీ నిపుణుడు నబీల్ అహ్మద్‌ను సంప్రదించింది. 'మేము అతనికి కిరణ్ ప్రస్తుత ఫొటోలు, ఆమె బాల్యం గురించి తెలిసిన స్వల్ప సమాచారాన్ని అందజేశాం'.. అని సభా వివరించారు.

పట్టు వదలని 'ఎధీ' ప్రయత్నం

కేసును సవాలుగా తీసుకున్న నబీల్, ఇస్లామాబాద్ పోలీస్ స్టేషన్‌లో దశాబ్దం క్రితం నమోదైన 'మిస్సింగ్ గర్ల్' రిపోర్ట్‌ను గుర్తించారు. ఆ రిపోర్ట్‌లోని పాత ఫొటోలు, కిరణ్ ప్రస్తుత ఫొటోలను, అత్యాధునిక ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్, ట్రాకింగ్ సాఫ్ట్‌వేర్ల సహాయంతో విశ్లేషించారు. పాత రూపానికి, ప్రస్తుత రూపానికి పోలికలను ఏఐ అత్యంత కచ్చితత్వంతో అందించడంతో, కిరణ్ కుటుంబాన్ని గుర్తించడం సాధ్యమైంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

టైలర్‌గా పనిచేసే అబ్దుల్ మజీద్, తానే కిరణ్ తండ్రినని ధ్రువీకరిస్తూ కరాచీకి చేరుకున్నారు. 'కిరణ్ ఫొటోలను పత్రికల్లో వేయించినా ప్రయోజనం లేకుండా పోయింది. నా కూతురిని చూస్తానని ఆశ వదులుకున్నాను'.. అని మజీద్ భావోద్వేగానికి లోనయ్యారు. సేఫ్ సిటీ ప్రాజెక్ట్ అధికారులు తనను సంప్రదించినప్పుడు ఆ ఆనందాన్ని వర్ణించలేనని తెలిపారు. 'ఇక్కడి నా కుటుంబ సభ్యులను (ఎధీ ఆశ్రయం) వదిలి వెళ్లడంబాధగా ఉన్నా, బిల్కిస్ ఆపాకు నేను ఎప్పటికీ కృతజ్ఞురాలిని'.. అని కిరణ్ సంతోషంగా వీడ్కోలు పలికింది. ఏఐ సాంకేతికత సాయంతో ఎధీ ఆశ్రయం నుండి.. తన కుటుంబానికి చేరిన అయిదో యువతి కిరణ్ కావడం విశేషం. కాలం చెరిపేసిన గతాన్ని, ఏఐ సాంకేతికత చెక్కు చెదరకుండా తిరిగి లిఖించింది... ఇది సైన్స్, సెంటిమెంట్ మేళవించిన అద్భుతం.

నా కూతుర్ని చూస్తాననుకోలేదు

అంగారకునిపై నేటికీ జీవం?

అంగారకుడు. పూర్తిగా రాళ్లమయం. ఎటు చూసినా పర్వతాలే. అయితే ఆ గ్రహంపైనా ఒకప్పుడు జీవం ఉండేదని సైంటిస్టులు గతంలోనే నిర్ధారించారు. అయితే వందల కోట్ల ఏళ్ల క్రితమే అది నామరూపాల్లేకుండా పోయిందన్నది వాళ్లు ఇప్పటిదాకా చెబుతూ వచ్చిన మాట. అది నిజం కాదని, ఆ తర్వాత కూడా అంగారకునిపై జీవజాలం మనుగడ చాలాకాలం పాటు కొనసాగిందని తాజా పరిశోధన ఒకటి బల్లగుద్ది మరీ చెబుతోంది. ఇంకా చెప్పాల్సి వస్తే, అంగారకుని లోలోపలి పొరల్లో బహుశా ఇప్పుడు కూడా సూక్ష్మజీవజాలం ఉనికి బయటపడ్డా ఆశ్చర్యం లేదన్నది దాని సారాంశం!

దిబ్బలే రాళ్లయిన వేళ...

అత్యంత ఆసక్తికరంగా ఉన్న ఈ పరిశోధనకు న్యూయార్క్ యూనివర్సిటీ అబుదాబీ (ఎన్‌వైయూఏడీ) సైంటిస్టుల బృందం సారథ్యం వహించింది. ఈ అధ్యయన వివరాలను జియోఫిజికల్ జర్నల్‌లో ప్రచురించారు. పరిశోధనలో భాగంగా అంగారకునిపై నాసా తాలూకు క్యూరియాసిటీ రోవర్ పరిశోధనలు చేస్తున్న గాలే బిల ప్రాంతంలోని అతి ప్రాచీన ఇసుక దిబ్బలపై ప్రధానంగా దృష్టి సారించారు. లోపలి పొరల్లోని నీటి కారణంగా ఈ ప్రాంతమంతా కొన్ని వందల కోట్ల ఏళ్ల క్రితమే రాళ్లూ గుట్టలమయంగా మారిపోయింది. అంగారకుని మీది ఆ రాళ్ల స్వరూప స్వభావాలను యూఏఈ ఎడారుల్లో అటూ ఇటుగా అలాంటి పరిస్థితుల్లోనే ఏర్పడ్డ అటువంటివే అయిన రాళ్లతో పోల్చి చూశారు. గాలే బిలం సమీపంలోని పర్వత ప్రాంతం నుంచి భారీ నీటి ప్రవాహం ఇసుక దిబ్బల దిగువ పొరలకు ఇంకినట్టు ఈ పరిశోధనకు రీసెర్చ్ అసిస్టెంట్‌గా వ్యవహరించిన భారతీయ శాస్త్రవేత్త విష్ణుశ్ కృష్ణమూర్తి వివరించారు. ''ఆ జలం కొన్ని కోట్ల ఏళ్లపాటు వాటిని కిందినుంచి తడుపుతూ వచ్చింది. ఫలితంగా జిప్సం వంటి ఖనిజాలు పురుడు పోసుకున్నాయి. భూమిపై కూడా ఎడారి ప్రాంతాల్లో అత్యంత సహజంగా కనిపించే ఖనిజాల్లో జిప్సం ఒకటన్నది తెలిసిందే. మా పరిశోధనలో అంతిమంగా తేలింది ఒక్కటే. అంగారకుని తడి నేలలు ఉన్నపళంగా పొడిబారిపోలేదు. అక్కడి ఉపరితలం మీది నదీనదాలు, సరస్సుల వంటివన్నీ పూర్తిగా ఇంకిపోయిన తర్వాత కూడా ఎంతోకొంత జలధార అట్టడుగు పొరల్లో ఉంటూనే వచ్చింది. కనుక మా అంచనా ప్రకారం ఆ ప్రాంతాల్లో సూక్ష్మజీవజాలం నేటికీ ఉనికిలోనే ఉన్నా ఆశ్చర్యమేమీ లేదు'' అని ఆయన చెప్పుకొచ్చారు. అదే గనక జరిగితే జిప్సం తదితర ఖనిజాలతో కూడిన గాలే బిలం వంటి ప్రాంతాలే ఆ జీవానికి ఆటపట్టులని తెలిపారు. కనుక భావి అంగారక యాత్రలన్నింటికీ సహజంగానే అలాంటి ప్రదేశాలే లక్ష్యాలుగా మారతాయని కృష్ణమూర్తి వివరించారు. పరిశోధనకు ఎన్‌వైయూఏడీ తాలూకు స్పేస్ ఎక్స్‌ప్లరేషన్ లేబొరేటరీ చీఫ్ దిమిత్రా అట్రీ సారథ్యం వహించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

డైనోసార్ల నాటి చేప!

- నేడు ఉనికే ప్రమాదంలో
- కాపాడేందుకు విశ్వప్రయత్నాలు
- కాలంతో పోటీపడుతున్న సైంటిస్టులు

అవడానికి అది చేప మాత్రమే. కానీ దాని ఘనత అంతా ఇంతా కాదు. ఎందుకంటే పూర్వ చారిత్రక యుగం నుంచీ ఉనికిని కాపాడుకుంటూ వస్తున్న అత్యంత మొండి ఘటంగా తిరుగులేని రికార్డు దాని సొంతం. మరోలా చెప్పాలంటే అది డైనోసార్లతో రాసుకుపూసుకు తిరిగిన బాపతు. అంటే కనీసం కోటిన్నర ఏళ్ల నాటిదన్నమాట. అత్యంత కఠినమైన కాలపరీక్షకు కూడా తట్టుకుని నిలిచిన అంతటి మొండి జీవి ఉనికి కాస్తా ఇప్పుడు ప్రమాదంలో పడింది. కారణం? మనిషే. అతని పేరాశ పుణ్యమా అని అంతరించిపోయే జాబితాలో చేరిన ఆ చేప జాతిని ఎలాగైనా కాపాడేందుకు క్యూబా సైంటిస్టులు కాలంతో పోటీ పడి మరీ శ్రమిస్తున్నారు...! అది క్యూబా తీరం వెంబడి పొడవుగా సాగిన ఉప్పునీటి కయ్యలోని జెప్టా చిత్తడి నేలల ప్రాంతం. ప్రాణాంతకమైన వ్యాధులను మోసుకు తిరిగే భయానకమైన దోమలకు పెట్టింది పేరు. అలాంటి ప్రాంతానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. డైనోసార్ల కాలంనుంచీ నేటిదాకా మనుగడలో ఉన్న ఒకే ఒక్క చేప జాతి అయిన మంజువారీలకు ప్రపంచంలోకెల్లా ఏకైక ఆవాసమది. పొడవుగా, సన్నగా, నాజూకుగా, పదునైన పళ్లతో ఉండే ఈ చేప అంతరించే జాబితాలోని జీవజాలంలో ముందువరుసలో ఉంది. దాంతో పాతికేళ్ల క్రితమే ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) తాలూకు అంతరించను న్న జీవుల జాబితాలోకి ఎక్కింది. శతాబ్దాల తరబడి మనిషి సాగించిన విచ్చలవిడి వేటే ఇందుకు ప్రధాన కారణం. దాంతో ఈ సహస్రాబ్దం తొలినాళ్లకల్ల మంజువారీ దాదాపుగా అంతరించిపోయినంత పనైంది! దాంతో ఒక దశలో దానిపై అంతా ఆశలు వదులుకున్నారు! కానీ ఉన్నట్టుండి మూడేళ్లకు అంటే 2003 ప్రాంతంలో జెప్టా చిత్తడినేలల్లో ఈ చేప జాతి మళ్లీ కనిపించింది. దాంతో క్యూబా సర్కారు కళ్లు తెరిచింది. దాన్ని ఎలాగైనా కాపాడేందుకు నడుం బిగించింది. ఈ గురుతర బాధ్యతను అక్కడి ప్రఖ్యాత జీవ శాస్త్రవేత్త ఆండ్రెస్ హర్టాడో బృందానికి అప్పగించింది. ఆయన వెంటనే రంగంలోకి దిగారు. మంజువారీ చేపలను విడిగా పెంచేందుకు చిత్తడి నేలల సమీపంలోనే యుద్ధ ప్రాతిపదికన ఒక ప్రత్యేక హాచరీని ఏర్పాటు చేశారు. వాటి సంఖ్య హాచరీలో పట్టనంతగా పెరిగిన కొద్దీ పెద్ద వయసు చేపలను చిత్తడి కయ్యల్లోకి వదులుతూ వస్తున్నారు. ఇప్పుడు స్థానిక మత్స్యకారులు తమకు మంజువారీలు తరచూ కనిపిస్తున్నట్టు చెబుతున్నారు. అయితే, ''అప్పుడే ఆనందించడానికి లేదు. మంజువారీలకు అవసరమైన ఆహారాన్ని బయటి పరిస్థితుల్లో అందుబాటులో ఉంచడం చాలా కష్టమైన పని. ఆ సవాలును పూర్తిగా అధిగమించినప్పుడే నిజమైన ఆశ ఉన్నట్టు. వీటిని అంతరించే జీవుల జాబితా నుంచి కొన్నాళ్ల తర్వాతైనా బయట పడేయడం సాధ్యమని చెప్పగలమన్నట్టు''అని వివరించారాయన. క్యూబాలోని చేపలన్నింట్లోకెల్లా మంజువారీ రత్నం వంటిదని గర్వంగా చెబుతారు ఆండ్రెస్. అందుకే ఈ చేపను స్థానికులు క్యూబన్ గార్ అని కూడా మురిపెంగా పిలుచుకుంటారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కాలుష్యం దెబ్బకు వర్చువల్ విధానంలో వాదోపవాదనలు !

సుప్రీంకోర్టు కార్యకలాపాలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: కాలుష్యకోరల్లో చిక్కుకున్న ఢిల్లీలో వృద్ధ న్యాయవాదులు సుప్రీంకోర్టుదాకా వచ్చి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కోర్టులో వాళ్లు వాదించే కేసుల విచారణను వర్చువల్ విధానంలో నిర్వహించడమే సబబు అని సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. న్యాయవాదుల సంఘంతో మాట్లాడిన తర్వాత వాళ్ల సమ్మతి మేరకు ఈ అంశంలో తుది నిర్ణయం తీసుకుంటానని ఆయన అన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, ఇతర రాష్ట్రాల్లో ఓట్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) చేపట్టాలన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదించిన సందర్భంగా ఢిల్లీలో విపరీత వాయుకాలుష్యం అంశం ప్రస్తావనకు వచ్చింది. ''మా లాంటి వృద్ధ లాయర్లకు ఇక్కడిదాకా వచ్చి వాదించాలంటే శ్వాస సంబంధ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తదుపరి విచారణను వీడియోకాన్ఫరెన్స్‌లో కొనసాగేలా చూడండి'' అని కోరారు. ''వాయు నాణ్యతా సూచీ(ఏక్యూఐ) దారుణంగా 400–500 స్థాయికి పడిపోతున్న ఈ సమయంలో ఇంతటి కాలుష్యగాలిని పీలుస్తున్నాం'' అని మరో సీనియర్‌న్యాయవాది కపిల్ సిబల్ ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో వీళ్ల అభిప్రాయంతో సీజేఐ సైతం ఏకీభవించారు. '' మీరేకాదు నేను కూడా ఇబ్బంది పడుతున్నా. నిన్న ఉదయం మార్నింగ్‌వాక్‌కు వెళ్లి గంటసేపు నడిచా. శ్వాస ఇబ్బందులు చుట్టుముట్టాయి. 60 ఏళ్లు పైబడిన లాయర్లు వర్చువల్ విచారణకు హాజరైతే సరిపోతుంది. ఇక్కడిదాకా వచ్చి ఇబ్బందులు పడాల్సిన అవసరంలేదు'' అని సీజేఐ అన్నారు.

ఎమ్మెల్యే సెంగొట్టయన్ రాజీనామా

చెన్నై: అన్నాడీఎంకే బహిష్కృత ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేఏ సెంగొట్టయన్ ఎమ్మెల్యేగా బుధవారం రాజీనామా చేశారు. అసెంబ్లీ స్పీకర్ ఎం.అప్పావును రాష్ట్ర సచివాలయంలో కలిసిన సెంగొట్టయన్ చేతితో రాసిన రాజీనామా లేఖను అందజేశారు. స్పీకర్ త్వరలో ఆమోదించే అవకాశం ఉంది. తొమ్మిదిసార్లు అన్నాడీఎంకే నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన సెంగొట్టయన్.. విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం(టీవీకే)లో చేరుతారని జోరుగా ప్రచారం సాగుతోంది. స్పీకర్‌తో సమావేశానికి ముందు టీవీకేలో చేరుతున్నారా? అని మీడియా ప్రశ్నించగా.. 'దయచేసి ఒకరోజు వేచి ఉండండి'అని సమాధానమిచ్చారు. మరోవైపు డీఎంకే సైతం ఆయనను తమ పార్టీలో చేర్చుకోవాలని భావిస్తోంది. ఆయన రాజీనామా సమర్పించిన కొద్ది సేపటికే మంత్రి శేఖర్ బాబు సెంగొట్టయన్‌తో చర్చలు జరిపారు. సెంగొట్టయన్ ఈరోడ్ జిల్లాలోని గోబిచెట్టిపాళ్యం సమీపంలోని కుల్లంపాళ్యం నుంచి వచ్చారు. 1977లో సత్యమంగళం నుంచి ఆయన తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. గోబిచెట్టిపాళ్యం నుంచి మరో 8సార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1996లో క్కసారి మాత్రమే ఓడిపోయారు. తమిళనాడులో ఎక్కువ కాలం పనిచేసిన శాసనసభ్యుల్లో ఒకరు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో సెంగొట్టయన్ అటవీ, రవాణా, వ్యవసాయం, పాఠశాల విద్య, రెవిన్యూ వంటి కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు.

యాంటీ-షిప్ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన పాక్

కరాచీ: నౌక నుంచి ప్రయోగించే యాంటీ–షిప్ బాలిస్టిక్ క్షిపణిని పాకిస్తానీ నేవీ విజయవంతంగా పరీక్షించింది. పరీక్షను నావల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ నవీద్ అష్రఫ్, సీనియర్ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లతో కలిసి నిర్వహించారు. దీనిని పాక్ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ క్షిపణి దేశ రక్షణ సామర్థ్యానిన పెచుతుందని, సముద్ర, భూమి లక్ష్యాలను ఖచ్చితత్వంతో ఛేదించగలదని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్ష సక్సెస్ కావడం పెరుగుతున్న దేశ సాంకేతిక నైపుణ్యానికి ప్రతీకని పాక్ నేవీ ప్రతినిధి తెలిపారు. ఈ విజయంలో పాల్గొన్న అన్ని యూనిట్లు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్ జనరల్ సాహిర్ మీర్జా, సర్వీసెస్ చీఫ్‌లు అభినందనలు తెలిపారు. మేలో భారత్‌తో ఘర్షణల తరువాత పాక్ తన రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించింది. పాక్ సైన్యం కొత్తగా అభివృద్ధి చేసిన ఫతాహ్–4 శిక్షణ ప్రయోగాన్ని సెప్టెంబర్‌లో నిర్వహించింది. ఇది 750 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాన్ని ఛేదించగల, భూమి నుంచి ప్రయోగించే క్షిపణి.

పారిపోయిన వాళ్లను పట్టుకొచ్చే హక్కు ప్రభుత్వానికి ఉంది

రెడ్‌కార్నర్ నోటీస్ జారీని సమర్థించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: డజన్లకొద్దీ నేరాలను దర్జాచేసి విదేశాలకు పారిపోయిన వ్యక్తులను పట్టుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి సర్వాధికారం ఉందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. గుజరాత్‌కు చెందిన విజయ్ మురళీధర్ ఉద్వానీ తనపై నమోదైన 153 కేసులకు సంబంధించి జారీ అయిన రెడ్‌కార్నర్ నోటీస్ సంబంధ హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ దాఖలుచేసిన పిటిషన్‌ను విచారణకు తిరస్కరిస్తున్న ట్లు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ప్రకటించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు పలు వ్యాఖ్యలుచేసింది. 2022 జులైలోనే దుబాయ్‌కు పారిపోయిన మీపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ సరైందేనంటూ గతంలో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాల్‌చేస్తూ ఉద్వానీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌నుద్దేశిస్తూ సుప్రీంకోర్టు.. ''మీపై ఎన్నో ఆరోపణలు, 153 కేసు లు ఉన్నాయి. ముందు భారత్ రావాల్సిందే. వస్తే ఎర్రతివాచీ పరిచి స్వాగతం పలుకుతారని అనుకో వద్దు'' అని వ్యాఖ్యానించింది. తన పిటిషన్‌దారుకు తనపై 38 కేసుల వివరాలు కూడా తెలీదని అతని న్యాయవాది చెప్పారు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ''వివరాలు తెలీదంటే ఎలా? ట్ర యల్ కోర్టుకువెళ్లి సర్టిఫైడ్ కాపీల కోసం దరఖా స్తుచేస్తే వాళ్లే ఇస్తారు. ఇదేం రాకెట్ తయారీ శాస్త్రం కాదు. అతడిపై అరెస్ట్‌వారెంట్ జారీ అయింది'' అని అన్నారు. ఎఫ్ఐఆర్‌లలోని వివరాలను అధికా రులు చెప్పడంలేదని లాయర్ వాదించగా ధర్మా సనం మళ్లీ ఆగ్రహం వ్యక్తంచేసింది. '' ఎఫ్ఐఆర్ వివరాలు మీకు దుబాయ్‌లో పళ్లెంలో పెట్టి అందించాలా? ముందు భారత్‌కు రండి. వచ్చాక అధికారులు అన్ని వివరాలు అందిస్తారు'' అని అన్నారు. '' అతని వద్ద ప్రస్తుతం పాస్‌పోర్ట్ లేదు. ఎలామరి?'' అని ప్రశ్నించగా.. '' అంత కష్టపడకండి. అధికారులు అక్కడ అరెస్ట్‌చేసి తీసుకొస్తారులే'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. '' అతని తోటి నిందితుడు భారత్‌లో పోలీస్‌కస్టడీలో చనిపో యాడు. అందుకే నా పిటిషనర్ భారత్‌కు వచ్చాక సీసీటీవీ నిఘా ఉన్న గదిలోనే ఉంచాలి'' అని లాయర్ కోరగా.. ''ఇంక ఈ పిటిషన్‌ను విచారించలేం'' అని ధర్మాసనం కోప్పడటంతో లాయర్ ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

ఇండోనేషియాలోని సుమత్రా ద్వీపంలో ఆకస్మిక వరదలు

కొండ చరియలు విరిగిపడి 17 మంది మృతి, ఆరుగురి గల్లంతు

మెదాన్: ఇండోనేషియాలోని సుమత్రా ప్రావిన్స్‌లో ఆకస్మిక వరదలు, కొండ చరియలు విరిగి పడటంతో 17 మంది మరణించారు. ఆరుగురు గల్లంతయ్యారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రధాన వంతెనలు ధ్వంసమయ్యాయి. పలు జిల్లాల్లో వేలాది ఇళ్లు ప్రభావితమయ్యాయి. బురద, శిథిలాల కారణంగా ప్రధాన రహదారులు మూసుకుపోయాయి. ప్రజలు ఇళ్ల నుంచి పరుగులు తీస్తుండగా, పైకప్పుల నుంచి నీరు ప్రవహిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నా3యి. కొండ చరియలు విరిగిపడి, బురద, రాళ్లు పేరుకుపోవడంతోపాటు చెట్లు కూలిపోవడంతో సహాయకచర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం నాటికి సిబోల్గానగరంలో ఐదు మృతదేహాలను సహాయక సిబ్బంది వెలికి తీసింది. గాయపడిన మరో ముగ్గురిని కాపాడింది. గల్లంతైన మరో నలుగురి కోసం అన్వేషణ కొనసాగుతోంది. పక్కనే ఉన్న తపనులి జిల్లాలో కొండ చరియలు విరిగిపడటంతో ఒక కుటుంబంలోని నలుగురు మరణించారు. వరదల దాటికి 2వేల ఇళ్లు ప్రభావితమయ్యాయి. ఇదే జిల్లాలో మరో ఎనిమిది మంది మృతదేహాలను వెలికి తీశారు. 2,800 మందికి పైగా పునరావాస కేంద్రాలకు తరలించారు. తాత్కాలిక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, అధిక ప్రమాద మండలాల్లో ఉన్న ప్రజలు వెంటనే ఖాళీ చేయాలని సిబోల్గా పోలీస్ చీఫ్ సూచించారు. మరిన్ని కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అంతకుముందు భారీ వర్షాల కారణంగా ఇండోనేషియాలోని మరో ద్వీపం జావాలోనూ పది రోజులపాటు సహాయక చర్యలు కొనసాగాయి. కొండచరియలు విరిగిపడి 38 మంది మరణించారు. వారిలో 13 మంది ఆచూకీ తెలియలేదు. ఇది కొనసాగుతుండగానే మంగళవారం సిబోల్గా, తపనులితోపాటు పలు జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. అక్టోబర్ నుంచి మార్చి వరకు కురిసే భారీ వర్షాల వల్ల ఇండోనేషియాలో వరదలు, కొండ చరియలు విరిగిపడటం జరుఉగతుంది. ఇది 17వేల ద్వీపసమూహం. ఇక్కడ లక్షలాది మంది ప్రజలు పర్వత ప్రాంతాల్లో నివసిస్తుంటారు.

రాజ్యాంగంపై నిరంతరం దాడి

- రాజ్యాంగం ఔన్నత్యాన్ని దెబ్బతీయడానికి కుట్రలు
- బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై మలికార్జున ఖర్గే ఆగ్రహం

న్యూఢిల్లీ: భారత రాజ్యాంగంపై బీజేపీ-ఆర్ఎస్ఎస్ నిరంతరం దాడి చేస్తూ దాని ఔన్నత్యాన్ని దెబ్బతీయడానికి కుట్రలు సాగిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. రాజ్యాంగ విలువలు, సూత్రాలను ఒక పద్ధతి ప్రకారం కాలరాస్తున్నాయని, సమాఖ్య స్ఫూర్తిని ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగం రూపకల్పనలో బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లకు ఎలాంటి పాత్ర లేదని ఖర్గే బుధవారం 'ఎక్స్'లో తేల్చిచెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, రాజ్యాంగాన్ని అవమానిస్తోందని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని అణచివేసే బాధ్యతను ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు ముందుకు తీసుకెళ్తున్నారని ఆక్షేపించారు. మరోవైపు అగ్రనేత రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. రాజ్యాంగం అనేది పేదలకు ఒక రక్షణ కవచమని పేర్కొన్నారు. రాజ్యాంగంపై దాడిని సహించబోమంటూ ప్రతిజ్ఞ చేయాలని ప్రజలను కోరారు. ఈ దాడిని ఎదుర్కోవడానికి తాను ఎల్లప్పుడూ ముందంజలో ఉంటానని స్పష్టంచేశారు. రాజ్యాంగం అంటే ఒక పుస్తకం కాదని, అది ప్రజలకు ఇచ్చిన పవిత్రమైన హామీ అని ఉద్ఘాటించారు. ప్రజలందరికీ ఎలాంటి వివక్ష లేకుండా సమానత్వం, గౌరవం, న్యాయం చేకూర్చడమే రాజ్యాంగం ఇస్తున్న హామీ అని వెల్లడించారు. మరోవైపు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటకలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, సిద్ధరామయ్య పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని తేల్చిచెప్పారు.

దేశభక్తి నినాదాలపై నిషేధమా?

బెంగాల్ సీఎం అధినేత మమతా బెనర్జీ ఆందోళన

కోల్‌కతా: పార్లమెంట్ లోపల ఎంపీలు జైహింద్, వందేమాతరం అనే నినాదాలు చేయొద్దని ప్రభుత్వం ఆంక్షలు విధిస్తున్నట్లు వచ్చిన వార్తలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇందులో నిజం ఎంతవరకు ఉందో తనకు తెలియదని, ఎంపీలతో మాట్లాడి అసలేం జరిగిందో తెలుసుకుంటానని చెప్పారు. బుధవారం కోల్‌కతాలో రాజ్యాంగ దినోత్సవంలో మమతా బెనర్జీ పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపించిన నినాదాలను నిషేధిస్తే మన గుర్తింపును మనమే నాశనం చేసుకున్నట్లు అవుతుందని వెల్లడించారు. వందేమాతరం మన జాతీయ గీతమని గుర్తుచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం నినాదం అందరినోట మార్మోగిందని, ఈ విషయం మర్చిపోవద్దని కోరారు. పార్లమెంట్ లోపల జైహింద్, వందేమాతరం నినాదాలను అడ్డుకోవాలన్న ఆలోచన సరైంది కాదని సూచించారు. బెంగాల్‌కు చెందిన సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్‌ని బీజేపీ నాయకులు కించపరుస్తున్నారని మమతా బెనర్జీ మండిపడ్డారు. బెంగాల్ గడ్డను అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. బెంగాల్ కూడా భారతదేశంలో భాగమేనని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామని స్పష్టంచేశారు.

భారత్ ఎప్పటికీ ఐక్యంగానే..

ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ వెల్లడి

న్యూఢిల్లీ: 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు ప్రజలంతా కలిసికట్టుగా కృషి చేయాలని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. భారత్ ఐక్యంగా ఉందని, ఎప్పటికీ ఐక్యంగానే ఉంటుందని, రాజ్యాంగ ఆత్మ నిరూపించిన విషయం ఇదేనని పేర్కొన్నారు. బుధవారం పార్లమెంట్ పాత భవనం సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ దినోత్సవంలో ఉప రాష్ట్రపతి మాట్లాడారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలపై చట్టసభల్లో నిర్మాణాత్మక చర్చలు, అర్థవంతమైన సంవాదాలు జరపాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. కేవలం ప్రజాప్రతినిధులే కాకుండా ప్రజల సంపూర్ణ సహకారం ఉంటేనే ఏ దేశమైన గొప్ప దేశంగా మారుతుందని తెలిపారు. మన విధులు మనం సక్రమంగా నిర్వర్తించాలని చెప్పారు. రాజ్యాంగ విలువులకు అనుగుణంగా జీవిస్తామని మనమంతా ప్రతిజ్ఞ చేయాలని, రాజ్యాంగానికి మనం ఇచ్చే అసలైన గౌరవం అదేనని సీపీ రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, భౌగోళిక రాజకీయ ముఖచిత్రం వేగంగా మారిపోతున్న నేటి తరుణంలో ఎన్నికలు, న్యాయ, ఆర్థిక సంస్కరణలు తీసుకురావడం అత్యంత కీలమని స్పష్టంచేశారు. రాజ్యాంగంలోని ప్రతి పేజీలోనూ మన దేశ ఆత్మ కనిపించేలా రాజ్యాంగ రూపకర్తలు జాగ్రత్తలు తీసుకున్నారని ఉప రాష్ట్రపతి కొనియాడారు.

2047 నాటికి వికసిత్ భారత్: ఓం బిర్లా

న్యూఢిల్లీ: రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేస్తే మనదేశం 2047 నాటికి పూర్తిగా అభివృద్ధి చెందిన భారత్‌గా అవతరిస్తుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 'వికసిత్ భారత్' సంకల్పం సాకారం కావాలంటే రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి, న్యాయం, ఐక్యత, స్నేహం, మానవత్వానికి మన దేశాన్ని గొప్ప ఉదాహరణగా నిలపాలని అన్నారు. మనం తీసుకొనే ప్రతి నిర్ణయం దేశ ప్రయోజనాలను నెరవేర్చేలా ఉండాలని తెలిపారు. మన విధులను, బాధ్యతలను చిత్తశుద్ధి, అంకితభావంతో నిర్వర్తిస్తే దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని స్పష్టంచేశారు. రాజ్యాంగం అంటే ఒక సజీవ పత్రమని, ప్రతి పౌరుడి సంక్షేమాన్ని కాంక్షిస్తుందని ఓం బిర్లా వివరించారు. రాజ్యాంగ సూత్రాలను ఆచరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టంచేశారు.

సాక్షి ప్లస్
గురువారం । 27-11-2025

ద్విసభా పద్ధతి అమల్లో ఉన్న రాష్ట్రాలేవి?

కేంద్ర స్థాయిలో లోక్‌సభ, రాజ్యసభల మాదిరిగానే రాష్ట్రస్థాయిలో శాసన సభ, శాసన మండలిని ఏర్పాటు చేశారు. శాసన మండలినే విధాన పరిషత్ అంటారు. రాష్ట్రస్థాయిలో ద్విసభా విధాన ఏర్పాటు ఐచ్ఛికాంశం కావడం వల్ల అన్ని రాష్ట్రాలూ విధాన పరిషత్‌ను ఏర్పాటు చేసుకోలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 1985లో విధాన పరిషత్‌ను రద్దు చేశారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వ చొరవతో తిరిగి 2007లో మండలి మనుగడలోకి వచ్చింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

రాష్ట్ర శాసనసభ

(విధాన సభ - విధాన పరిషత్)

మనదేశంలో కేంద్ర స్థాయిలో ద్విసభా విధానాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయిలో ద్విసభా విధానాన్ని ఐచ్ఛిక అంశంగా నిర్ణయించారు. దేశంలో తొలిసారిగా రాష్ట్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని 1935లో ప్రవేశపెట్టారు.

రాజ్యాంగంలోని ఆరో భాగంలో 168 నుంచి 212 వరకు ఉన్న ప్రకరణల్లో రాష్ట్ర శాసన సభ నిర్మాణం, అర్హతలు, ఎన్నిక పద్ధతి, అధికార విధులు తదితర అంశాల గురించి పేర్కొన్నారు.

రాష్ట్ర శాసన సభ నిర్మాణం: 168వ ప్రకరణ రాష్ట్ర శాసనసభ నిర్మాణం గురించి తెలుపుతుంది. శాసనసభలో రాష్ట్ర గవర్నర్, ఎగువ సభ, దిగువ సభలుంటాయి. రాష్ట్ర గవర్నర్ శాసన సభలో సభ్యుడు కానప్పటికీ, శాసన సభలో అంతర్భాగమే.

రాష్ట్ర ఎగువసభ (విధాన పరిషత్)

విధాన పరిషత్ ఏర్పాటు, రద్దు ప్రక్రియ గురించి ప్రకరణ 169(1) తెలుపుతుంది. దీని ప్రకారం రాష్ట్ర దిగువ సభ (విధాన సభ) 2/3వ వంతు మెజారిటీతో ఒక ప్రత్యేక తీర్మానం చేయాలి. ఆ తీర్మానాన్ని పార్లమెంటు ధ్రువీకరిస్తే రాష్ట్రపతి ఎగువ సభను ఏర్పాటు చేయవచ్చు లేదా రద్దు చేయవచ్చు.

ద్విసభా పద్ధతి అమల్లో ఉన్న రాష్ట్రాలు

- ఉత్తరప్రదేశ్
- ఆంధ్రప్రదేశ్
- మహారాష్ట్ర
- తెలంగాణ
- బిహార్
- కర్ణాటక

వివరణ:

- ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 1957లో విధాన పరిషత్ ఏర్పాటైంది. 1985లో దీన్ని రద్దు చేశారు. తిరిగి 2005లో వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం శాసనమండలిని పునరుద్ధరించింది. 2007 నుంచి అమల్లోకి వచ్చింది.
- 1956లో ఏడో రాజ్యాంగ సవరణ ద్వారా మధ్యప్రదేశ్‌లో ఎగువ సభను ఏర్పాటు చేస్తూ చట్టం చేశారు. కానీ, అది ఇంతవరకు అమల్లోకి రాలేదు. 1986లో తమిళనాడు, 1969లో పంజాబ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు ఎగువ సభను రద్దు చేశాయి.
- మరోసారి ఎగువ సభ ఏర్పాటుకు తమిళనాడు ప్రభుత్వం 2010లో తీర్మానం చేసింది. ఆ సమయంలో డీఎంకే అధికారంలో ఉంది. విధాన పరిషత్ ఏర్పాటు వాస్తవరూపం దాల్చేలోపు 2011లో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జయలలిత ప్రభుత్వం దాన్ని రద్దు చేస్తూ మరో తీర్మానం చేసింది.

రాష్ట్ర ఎగువ సభ నిర్మాణం: ప్రకరణ 171లో రాష్ట్ర విధాన పరిషత్ నిర్మాణం గురించి పేర్కొన్నారు. ఎగువ సభలో ఉండాల్సిన కనిష్ఠ సభ్యుల సంఖ్య 40. అలాగే రాష్ట్ర విధానసభలో మూడో వంతు కంటే మించకూడదు.

ఎన్నిక పద్ధతి: విధాన పరిషత్ సభ్యులను ప్రత్యక్ష, పరోక్ష ఓటర్లు ఎన్నుకుంటారు. విధాన పరిషత్ సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఓటు బదలాయింపు ప్రక్రియ ద్వారా ఎన్నికవుతారు.

- ప్రకరణ 171(3)(ఎ) ప్రకారం 1/3వ వంతు సభ్యులను స్థానిక సంస్థల ప్రతినిధులు ఎన్నుకుంటారు.
- ప్రకరణ 171(3)(బి) ప్రకారం 1/12వ వంతు సభ్యులను పట్టభద్రులు ఎన్నుకుంటారు.
- ప్రకరణ 171(3)(సి) ప్రకారం 1/12వ వంతు సభ్యులు ప్రభుత్వ ఉపాధ్యాయులచేత ఎన్నికవుతారు.
- ప్రకరణ 171(3)(డి) ప్రకారం మొత్తం సభ్యుల్లో 1/3వ వంతు సభ్యులను ఆ రాష్ట్ర విధానసభ సభ్యులు ఎన్నుకుంటారు.
- ప్రకరణ 171(3)(ఈ), 171(5) ప్రకారం మిగతా 1/6వ వంతు సభ్యులను గవర్నర్ నామినేట్ చేస్తారు. వీరు కళలు, సాహిత్యం, సంఘ సేవ, సహకార, శాస్త్ర సాంకేతిక రంగాల్లో నిష్ణాతులై ఉండాలి.

వివరణ: పైన తెలిపిన నిర్మాణం తాత్కాలికమైందే. పార్లమెంటు ఒక చట్టం ద్వారా మార్పులు చేయవచ్చు. అలాగే ఎవరికి ఓటు హక్కు కల్పించాలనే అంశం పై రాష్ట్ర శాసన సభ చట్టాలు చేయవచ్చు.

ఉదా: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో స్థానిక సంస్థల సభ్యులచేత ఎన్నికయ్యే ఎమ్మెల్సీల ఎన్నికల్లో గ్రామ సర్పంచ్, పంచాయతీ వార్డు సభ్యులకు ఓటు హక్కు లేదు. కానీ కర్ణాటకలో ఓటు హక్కు ఉంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం కాలానుగుణంగా వీటికి మార్పులు చేయవచ్చు. పైన ప్రస్తావించిన అర్హతలు, పరిమితులు తాత్కాలికమైనవే.

ఎగువ సభ ఏర్పాటు, రద్దుకు సంబంధించి జాతీయ విధానాన్ని అనుసరించాలని మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది.

పదవీ కాలం: విధాన పరిషత్ శాశ్వత సభ. రద్దు చేయడం కుదరదు. కానీ అబాలిష్ చేయవచ్చు విధానపరిషత్ సభ్యులు ఆరేళ్ల కాలవ్యవధికి ఎన్నికవుతారు. రెండేళ్లకోసారి 1/3వ వంతు సభ్యులు పదవీ విరమణ చేస్తారు.

అర్హతలు: ప్రకరణ 173 ప్రకారం, విధాన పరిషత్‌కు పోటీచేసే అభ్యర్థికి ఉండాల్సిన అర్హతలు...

- భారతీయ పౌరుడై ఉండాలి
- 30 ఏళ్ల పైబడిన వయసు ఉండాలి.
- ఆదాయం పొందే ప్రభుత్వ పదవిలో ఉండరాదు.
- నేరారోపణ రుజువై ఉండరాదు.
- పార్లమెంటు నిర్ణయించిన ఇతర అర్హతలు ఉండాలి.

గమనిక: శాసనమండలి ఎన్నికల్లో ఎలాంటి రిజర్వేషన్లు వర్తించవు.

రాష్ట్ర విధానసభ

ప్రకరణ 170(1) ప్రకారం రాష్ట్ర విధానసభలో కనిష్ఠంగా 60 మంది సభ్యులు ఉండాలి. గరిష్ఠంగా 500కి మించకూడదు.

వివరణ: రాష్ట్ర విధాన సభలో ఆంగ్లో ఇండియన్లకు తగిన ప్రాధాన్యం లేదని గవర్నర్ భావిస్తే ప్రకరణ 333 ప్రకారం ఆ వర్గానికి చెందిన ఒకరిని విధాన సభకు నామినేట్ చేయవచ్చు. మౌలిక రాజ్యాంగంలో గవర్నర్ నిర్ణయించిన సంఖ్యలో ఆంగ్లో ఇండియన్లను నామినేట్ చేస్తారనే పదం ఉండేది. 1969లో 23వ రాజ్యాంగ సవరణ ద్వారా ఒక ఆంగ్లో ఇండియన్‌ను నామినేట్ చేసేలా దాన్ని మార్పు చేశారు.

- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఆంగ్లో–ఇండియన్లకు ప్రాతినిధ్య కల్పిస్తున్నారు.
- రాజ్యాంగంలో నిర్ణయించిన కనిష్ఠ సభ్యుల సంఖ్య 60 కంటే తక్కువగా ఉన్న రాష్ట్రాలు.. సిక్కిం–32, మిజోరాం–40, గోవా – 40.
- కేంద్రపాలిత ప్రాంతాల్లో ఢిల్లీ(70), పుదుచ్చేరి (30)ల్లో మాత్రమే విధానసభ అమల్లో ఉంది.

వివరణ:

- ఆంధ్రప్రదేశ్ శాసనసభలో షెడ్యూల్డ్ కులాలకు 29 స్థానాలను రిజర్వ్ చేశారు. షెడ్యూల్డ్ తెగలకు 7 స్థానాలు కేటాయించారు.
- తెలంగాణ శాసనసభలో షెడ్యూల్డ్ కులాలకు 19 స్థానాలను రిజర్వ్ చేశారు. షెడ్యూల్డ్ తెగలకు 12 స్థానాలు కేటాయించారు.

ఎన్నిక: ప్రకరణ 170(1) ప్రకారం రాష్ట్ర విధానసభ సభ్యులు ప్రాదేశిక నియోజక వర్గాల ప్రతిపాదికన సార్వజనీన వయోజన ఓటు హక్కు ద్వారా ప్రత్యక్షంగా ఎన్నికవుతారు. దీన్నే మెజార్టీ ఓటు అంటారు. దీన్నే సాంకేతికంగా ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ పద్ధతి అంటారు. (లోక్‌సభ సభ్యులను కూడా ఈ విధానంలోనే ఎన్నుకుంటారు.) ఇందుకోసం రాష్ట్రాన్ని జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాలుగా విభజిస్తారు.

పదవీకాలం: విధానసభ సభ్యుల పదవీకాలం ఐదేళ్లు. శాసనసభ సాధారణ పదవీకాలం కూడా ఐదేళ్లే. ప్రకరణ 172 ప్రకారం ఐదేళ్ల కంటే ముందే ముఖ్యమంత్రి సలహా మేరకు గవర్నర్ శాసనసభను రద్దు చేయవచ్చు. జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు విధానసభ పదవీ కాలాన్ని ఒక ఏడాది వరకు పొడిగించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. అయితే అత్యవసర పరిస్థితి ఎత్తేసిన తర్వాత ఆరు నెలల కంటే ఎక్కువగా పొడిగించడానికి వీల్లేదు.

అర్హతలు: ప్రకరణ 173 ప్రకారం విధానసభకు పోటీ చేయాలంటే ఉండాల్సిన అర్హతలు..

- భారత పౌరుడై ఉండాలి.
- 25 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉండరాదు.
- ఆదాయాన్ని పొందే ప్రభుత్వ పదవుల్లో ఉండరాదు.
- నేరారోపణ రుజువై ఉండరాదు.
- పార్లమెంట్ నిర్ణయించిన ఇతర అర్హతలు కూడా ఉండాలి.

సమావేశాలు: ప్రకరణ 174 ప్రకారం రాష్ట్ర శాసనసభ ఏడాదిలో కనీసం రెండుసార్లు సమావేశం కావాలి. అయితే ఒక సమావేశానికి మరో సమావేశానికి మధ్య వ్యవధి ఆరు నెలల కంటే మించరాదు. సమావేశాల సంఖ్యపై గరిష్ఠ పరిమితి లేదు. ప్రస్తుతం శాసన సభ ఏడాదికి మూడు పర్యాయాలు సమావేశమవుతోంది. **అవి:**

1. బడ్జెటు సమావేశం: ఫిబ్రవరి–ఏప్రిల్
2. వర్షాకాల సమావేశం: జులై–ఆగస్టు
3. శీతాకాల సమావేశం: నవంబర్ – డిసెంబర్

పై మూడు సందర్భాలు కలిపి, గరిష్ఠంగా 50 నుంచి 60 రోజులపాటు సమావేశాలు జరుగుతాయి. ముఖ్యమంత్రి, మంత్రి మండలి సలహా మేరకు రాష్ట్ర గవర్నర్ శాసన సమావేశాలు ఏర్పాటు చేస్తారు. అలాగే శాసన సభ సమావేశాలను దీర్ఘకాలం పాటు వాయిదా వేస్తారు, రద్దు చేస్తారు.

కోరమ్: ప్రకరణ 189(3) ప్రకారం, రాష్ట్రశాసన సభలో సమావేశాలకు హాజరు కావాల్సిన కనిష్ఠ సభ్యుల సంఖ్య మొత్తం సభ్యుల్లో 1/10 వ వంతు లేదా 10. వీటిలో ఏది ఎక్కువైతే దాన్ని తీసుకుంటారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కింది వాటిలో శాసనమండలి లేని రాష్ట్రం ఏది?
   ఎ) మహారాష్ట్ర బి) రాజస్థాన్
   సి) కర్ణాటక డి) బిహార్
2. రాష్ట్ర శాసనసభలో ఏ రాజకీయ పక్షానికీ మెజార్టీ రానప్పుడు ముఖ్యమంత్రి ఎన్నికకు గవర్నర్ ప్రధానంగా పరిశీలించవలసిన విషయం?
   ఎ) స్థిరమైన మెజార్టీ పొందే అవకాశమున్న యోగ్యుడైన వ్యక్తిని వెతకడం
   బి) రాష్ట్ర శాసన సభలో అతి పెద్ద రాజకీయ పార్టీ
   సి) పార్టీలతో ఏర్పడ్డ అతిపెద్ద కూటమి
   డి) పార్టీ కార్యక్రమానికి దాని సభ్యుల విధేయత
3. భారతదేశంలోని రాష్ట్రాల్లో ఆగంతుక నిధి ఎవరి నియంత్రణలో ఉంటుంది?
   ఎ) గవర్నర్
   బి) రాష్ట్ర ఆర్థిక మంత్రి
   సి) ముఖ్యమంత్రి
   డి) మంత్రిమండలి
4. రాష్ట్ర శాసనాలు రద్దుచేసే అధికారం ఎవరికి ఉంది?
   ఎ) ముఖ్యమంత్రి
   బి) రాష్ట్ర అసెంబ్లీలో మెజారిటీ సభ్యుల ఆమోదం, పార్లమెంటు ఆమోదం
   సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) ఎ; 4) బి.

మాదిరి ప్రశ్నలు

1. రాష్ట్ర ఎగువ సభకు, దిగువ సభకు ఈ కింది ఏ అంశంలో పోలికలు ఉన్నాయి?
   ఎ) నిర్మాణం బి) పదవీ కాలం
   సి) అధికారాలు డి) పైవేవీ కాదు
2. రాష్ట్ర ఎగువ సభ సభ్యులు ఎన్నికయ్యేది?
   ఎ) ప్రత్యక్షంగా బి) పరోక్షంగా
   సి) ప్రత్యక్షం, పరోక్షం
   డి) అందరూ నామినేట్ అవుతారు
3. ఈ కింది ఏ సభలకు కనిష్ఠ, గరిష్ఠ సభ్యుల సంఖ్య పరిమితి ఉంది?
   ఎ) విధాన సభ బి) విధాన పరిషత్
   సి) లోక్‌సభ డి) పైవన్నీ
4. ఈ కింది ఏ సభ రద్దు విషయంలో ఆ సభకు ప్రమేయం ఉండదు?
   ఎ) విధాన పరిషత్ బి) రాజ్య సభ
   సి) లోక్‌సభ డి) ఎ, బి
5. ఈ కింది ఎన్ని రాష్ట్రాల విధాన సభ సభ్యుల సంఖ్య సమానంగా ఉంది?
   ఎ) 5 బి) 6 సి) 7 డి) 8

సమాధానాలు

1) డి 2) సి 3) డి 4) ఎ 5) డి

సమాచార ప్రసారానికి తోడ్పడే వాతావరణ పొర ఏది?

టీజీపీఎస్సీ ప్రవేశపెట్టిన జనరల్ స్టడీస్ పేపర్‌లో పర్యావరణ అంశాలను చేర్చారు. పర్యావరణ విభాగాలు, జీవావరణ శాస్త్రం, పర్యావరణ కాలుష్యం, జీవ వైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణ, ఘన వ్యర్థ పదార్థాలు – నిర్వహణ, శీతోష్ణస్థితి మార్పు, అంతర్జాతీయ, జాతీయ పర్యావరణ ఒప్పందాలు, చట్టాలు... పర్యావరణ అంశాల పరిధిలోకి వస్తాయి.

పర్యావరణం

భూమిపై ఉన్న ఘన, ద్రవ, వాయు, జీవ సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు. జీవుల మనుగడకు అవసరమైన గాలి, నీరు, ఆహారం పూర్తిగా కలుషితమవుతున్నాయి. సహజ వనరులు తరిగిపోతుండటంతో డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా వాటి దుర్వినియోగం కూడా అధికమై పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిగతులపై పర్యావరణ నష్ట ప్రభావం తీవ్రంగా ఉంది. వంట చెరకు లభ్యత, పశుగ్రాసం, భూగర్భ, ఉపరితల వనరులు తగ్గి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. ఒక ప్రాంత సుస్థిరాభివృద్ధి పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉంటుంది.

పర్యావరణ విభాగాలు

పర్యావరణాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు.

అవి..

1. వాతావరణం(అట్మాస్పియర్)
2. శిలావరణం(లిథోస్పియర్)
3. జలావరణం(హైడ్రోస్పియర్)
4. జీవావరణం(బయోస్పియర్)

వాతావరణం (అట్మాస్పియర్)

భూమి ఉపరితలంపై ఉన్న వాయు పొరల నిర్మాణమే వాతావరణం లేదా అట్మాస్పియర్. గురుత్వాకర్షణ శక్తి వల్ల ఇది భూమిపై ఉంటుంది. ఇందులో ట్రోపోస్పియర్, స్ట్రాటోస్పియర్, మీసోస్పియర్, థర్మోస్పియర్ అనే నాలుగు విభాగాలున్నాయి. రెండు పొరల మధ్య హద్దుగా ఉండే ప్రాంతాన్ని 'పాజ్' అంటారు. ఉదాహరణకు.. స్ట్రాటోస్పియర్, మీసోస్పియర్ మధ్యనున్న ప్రాంతాన్ని స్ట్రాటోపాజ్ అంటారు.

ట్రోపోస్పియర్

ఇది భూమి ఉపరితలానికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర. ఈ పొర ధ్రువాల వద్ద 6–8 కి.మీ. ఎత్తు వరకు, భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. పైకి వెళ్లేకొద్దీ ప్రతి కిలోమీటరుకు ఉష్ణోగ్రత ఆరు డిగ్రీల చొప్పున తగ్గుతుంది. సుమారు 12 కి.మీ. ఎత్తు వద్ద ట్రోపోపాస్ అనే పరివర్తన ప్రాంతం మొదలవుతుంది. ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతాయి.

స్ట్రాటోస్పియర్

వాతావరణంలోని రెండో పొర అయిన స్ట్రాటోస్పియర్, ట్రోపోపాజ్ నుంచి మొదలై 50 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ 60 డిగ్రీలుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో గంటకు 320 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. స్ట్రాటోస్పియర్‌లో ఓజోన్ అధిక మోతాదులో ఉండటం వల్ల దీన్ని ఓజోనోస్పియర్ అని కూడా అంటారు. హానికర అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరకుండా ఈ పొర అడ్డుకుంటుంది.

మీసోస్పియర్

స్ట్రాటోపాజ్ నుంచి దాదాపు 80 కి.మీ. ఎత్తు వరకు ఈ ప్రాంతం విస్తరించి ఉంటుంది. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతాయి. మీసోస్పియర్ పైనున్న ప్రాంతం వాతావరణంలోని అన్ని భాగాల కంటే అత్యంత శీతలంగా ఉంటుంది. ఉల్కాపాతం భూమిని చేరకపోవడానికి మీసోస్పియరే కారణం.

థర్మోస్పియర్

ఇది మీసోపాజ్ నుంచి మొదలవుతుంది. థర్మోస్పియర్‌ను ఐనోస్పియర్, ఎక్సోస్పియర్‌లుగా విభజిస్తారు. కింది భాగమైన ఐనోస్పియర్ భూవాతావరణంలో 100–120 కి.మీ. ఎత్తు నుంచి 550 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఐనోస్పియర్‌లో నత్రజని, ఆక్సిజన్ లాంటి మూలకాల పరమాణువులు సౌర వికిరణాన్ని గ్రహించి అయానీకరణం చెందుతాయి. భూ ఉపరితలం నుంచి వచ్చే రేడియో తరంగాలను పరావర్తనం చేసి సమాచార ప్రసారానికి ఐనోస్పియర్ తోడ్పడుతోంది. బలమైన సౌరగాలులు వీచినప్పుడు ఐనోస్పియర్ సంఘటనం మారే ప్రమాదం ఉంది. ఫలితంగా సమాచార వ్యవస్థలు దెబ్బతింటాయి.

శిలావరణం

భూమిపై ఉన్న ఖండాలన్నింటినీ కలిపి శిలావరణం అంటారు. భూమి ఉపరితలం మొత్తం కొన్ని ప్రత్యేక ఫలకాలపై అమరి ఉంటుంది. ఈ ఫలకాల నిర్మాణం, వాటి కదలికలను ప్లేట్ టెక్టానిక్స్ సిద్ధాంతం వివరిస్తుంది. 200 మిలియన్ సంవత్సరాల కిందట భూభాగం మొత్తం ఒకే చోట కలిసి ఉండేది. దీన్ని పాంజియా అని పిలుస్తారు. 50 మిలియన్ ఏళ్ల క్రితం ఇది రెండు భాగాలుగా చీలింది. ఉత్తరంగా ఉన్న భాగాన్ని లారెన్షియా అని, దక్షిణ దిశగా విడిపోయిన ప్రాంతాన్ని గోండ్వానా అని పిలుస్తారు. ఇవి మరింత దూరం కదిలి ప్రస్తుత ఖండాలు ఏర్పడ్డాయి. ఖండ చలన సిద్ధాంతం.. ఖండాల నిర్మాణం, వాటి కదలికలను వివరిస్తుంది.

భూమి ఉపరితలం నుంచి లోపలి వైపు మూడు భాగాలుంటాయి. భూపటలం(క్రస్ట్), భూప్రావారం (మాంటెల్), భూకేంద్రం(కోర్). భూపటలం ఉపరితలం నుంచి సుమారు 100 కి.మీ. లోతు వరకు ఉంటుంది. భూపటల ఉపరితలంపై వదులుగా ఉండే పొరలను మృత్తిక లేదా నేల అంటారు. 100 కి.మీ. లోతు నుంచి 2900 కి.మీ. లోతు వరకు భూప్రావారం(మాంటెల్) అనే పొర ఉంటుంది. దీని తర్వాత మధ్యభాగం భూకేంద్రం(కోర్). దీనిలో బాహ్యకేంద్రం, అంతర కేంద్రం అనే రెండు భాగాలు ఉంటాయి. బాహ్యకేంద్రం 2900 కి.మీ. నుంచి 5100 కి.మీ. వరకు ఉంటుంది. అంతర కేంద్రం 5100 కి.మీ. నుంచి సుమారు 6378 కి.మీ. వరకు ఉంటుంది.

జలావరణం

భూమిపై వివిధ రూపాల్లో ఉన్న మొత్తం నీటిని జలావరణం లేదా హైడ్రోస్పియర్ అంటారు. పూర్వం సముద్ర జలమంతా పూర్తిగా సాదుజలంగా ఉండేది. కొన్ని మిలియన్ సంవత్సరాల నుంచి నేల క్రమక్షయం జరిగి ఖనిజాలు సముద్రంలోకి చేరడంతో లవణీయత పెరిగింది. భూమి ఉపరితలం 75 శాతం నీటితో నిండి ఉంది. భూమిపై ఉన్న మొత్తం నీటిలో 97.5 శాతం సముద్రాల్లోనే ఉంది. మిగతా 2.5 శాతం నీరు సాదుజలం లేదా మంచి నీరు. మంచి నీటిలో 0.3 శాతం నదులు, సరస్సుల్లో ఉంది. భూగర్భ జలంగా 30.8 శాతం, హిమనీనదాల రూపంలో 68.9 శాతం ఉంది.

భూమిపై నీటి విస్తరణను జల వలయం నిర్ధారిస్తుంది. నీరు ఆవిరై మేఘాల రూపంలోకి సాంద్రీకరణం చెంది ఆ తర్వాత మంచు, వర్షం రూపంలో భూమిని చేరుతుంది. ఇలా చేరిన నీటిలో కొద్ది మొత్తం భూగర్భంలోకి ఇంకుతుంది. మిగతాది నదులు, సముద్రాల్లోకి చేరుతుంది. ధ్రువ ప్రాంతాల్లో శీతాకాలంలో ఈ నీరు గడ్డకట్టి వేసవిలో కరుగుతుంది. ఈ రకమైన నిరంతర నీటి ఆవిరి కదలికలను జలవలయం అంటారు.

జీవావరణం

భూమిపై ఉన్న జీవులు, జీవం విస్తరించిన ప్రాంతాలన్నింటినీ కలిపి బయోస్పియర్ అంటారు. భూమిపై సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల క్రితం జీవం ఆవిర్భవించింది. అనేక సిద్ధాంతాలు భూమిపై జీవం ఆవిర్భవించే విధానాన్ని వివరిస్తున్నాయి.

వీటిలో ముఖ్యమైనవి...

1. **ప్రత్యేక సృష్టి సిద్ధాంతం:** దీని ప్రకారం భూమిపై జీవులను దేవుడు సృష్టించాడు. ఈ సిద్ధాంతానికి తగిన నిదర్శనాలు లేని కారణంగా దీన్ని నమ్మకంగానే భావిస్తారు.
2. **పాన్‌స్పెర్మియ సిద్ధాంతం:** దీని ప్రకారం భూమిపై జీవులు ఆవిర్భవించలేదు. భూమి ఆవల నుంచి గ్రహశకలాలు లేదా గ్రహాంతర వాసుల ద్వారా భూమిపైకి చేరి ఆ తర్వాత పరిణామ క్రమంలో మార్పు చెందాయి.
3. **జీవ ఆవిర్భావ సిద్ధాంతం:** అలెగ్జాండర్ ఇవనోవిచ్ ఒపారిన్, జె.బి.ఎస్. హాల్డెన్ అనే శాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం భూమిపై జీవ ఆవిర్భావానికి ముందు జీవ రసాయనాలు ఆవిర్భవించాయి. ఈ జీవ రసాయనాల చర్యల ద్వారా భూమిపై పూర్వ జీవకణాలు ఏర్పడ్డాయి. తర్వాత వాటి నుంచి సంపూర్ణ జీవకణాలు ఆవిర్భవించాయి. భూమిపై ఆవిర్భవించిన తొలి తరం జీవులన్నీ అవాయు జీవులు. ఇలాంటి కొన్ని అవాయు జీవులు నీటి అణువులను విచ్ఛిన్నం చేయడంతో గాల్లోకి క్రమంగా ఆక్సిజన్ విడుదలైంది. తొలుత కేంద్రక పూర్వ జీవులు ఏర్పడి ఆ తర్వాత నిజ కేంద్రక జీవులు ఆవిర్భవించాయి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆవరణ వ్యవస్థలో గతిశీల భాగం? (గ్రూప్–2, 2008)
   ఎ) ఆహార గొలుసు బి) ఇకలాజికల్ నిచే
   సి) ఎకోటోన్ డి) ఏదీకాదు
2. పాన్‌స్పెర్మియ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది? (2004 గ్రూప్–1)
   ఎ) అర్హీనియస్ బి) ఒపారిన్
   సి) స్వారెజ్ డి) ఎవరూ కాదు
3. తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకునే జీవులను ఏమంటారు? (గ్రూప్–1 2010 రీ ఎగ్జామ్)
   ఎ) స్టెనోథర్మల్ బి) సైక్రోఫైల్స్
   సి) యూరిథర్మల్ డి) పైకిలో థర్మల్
4. భారతదేశంలోని విశిష్టమైన స్త్రీ పర్యావరణ వేత్త (ఎన్విరాన్‌మెంటలిస్ట్) ఎవరు? (గ్రూప్–1, 1999)
   ఎ) మేధాపాట్కర్ బి) మమతా బెనర్జీ
   సి) సరోజిని మహర్షి డి) మార్గరెట్ ఆల్వా
5. కింది వాటిలో ఫ్లోటింగ్ నేషనల్ పార్కు ఏది? (సివిల్స్ ప్రిలిమ్స్–2015)
   ఎ) కజిరంగ జాతీయ పార్కు
   బి) కైబుల్ లామ్జావు జాతీయ పార్కు
   సి) కార్బెట్ జాతీయ పార్కు
   డి) ఏదీకాదు

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) బి.

మాదిరి ప్రశ్నలు

1. ఓజోన్ పొర సంరక్షణకు ఏర్పాటైన అంతర్జాతీయ ఒప్పందం?
   ఎ) క్యోటో ఒప్పందం
   బి) మాంట్రియాల్ ఒప్పందం
   సి) స్టాక్‌హోమ్ ఒప్పందం
   డి) రామ్సార్ ఒప్పందం
2. కింది వాటిలో ఓజోన్ పొరను దెబ్బతీసేది?
   ఎ) క్లోరోఫ్లోరో కార్బన్లు
   బి) హాలోన్లు సి) మిథైల్ బ్రోమైడ్
   డి) పైవన్నీ
3. చిప్కో ఉద్యమం ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   ఎ) ఉత్తరాంచల్ బి) కర్ణాటక
   సి) బిహార్ డి) మధ్యప్రదేశ్
4. చిప్కో ఉద్యమంలో పాల్గొన్నవారు?
   ఎ) సుందర్‌లాల్ బహుగుణ
   బి) చండీ ప్రసాద్ భట్
   సి) సుదేశాదేవి డి) పైవారందరూ
5. సైలెంట్ స్ప్రింగ్ అనే గ్రంథాన్ని రచించి అమెరికాలో డి.డి.టి.కి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించింది ఎవరు?
   ఎ) జాన్ ముయర్
   బి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
   సి) రాచెల్ కార్సన్
   డి) ఎవరూ కాదు
6. 'ఎ శాండ్ కౌంటీ ఆల్మనాక్' గ్రంథ రచయిత ఎవరు?
   ఎ) డేవిడ్ హెన్రీ బి) ఆల్డో లియోపోల్డ్
   సి) జాన్ ముయర్
   డి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
7. అటవీ హక్కు చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
   ఎ) 2006 బి) 2007
   సి) 2008 డి) 2009
8. 1986లో అమల్లోకి వచ్చిన చట్టం?
   ఎ) జల కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   బి) వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   సి) పర్యావరణ పరిరక్షణ చట్టం
   డి) జల కాలుష్య సుంకం చట్టం
9. జీవవైవిధ్య చట్టాన్ని అమలు చేసే నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై, తమిళనాడు
   బి) బెంగళూరు, కర్ణాటక
   సి) హైదరాబాద్, తెలంగాణ
   డి) తిరువనంతపురం, కేరళ
10. భూమిపై ఆవిర్భవించిన మొదటి పూర్వకణానికి ఒపారిన్ ఇచ్చిన పేరు?
    ఎ) ప్రోటినాయిడ్ బి) సింబయాంట్
    సి) కొయసెర్వేట్ డి) ప్రోక్యారియోట్

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) డి; 5) సి; 6) బి; 7) ఎ; 8) సి; 9) ఎ; 10) సి.

ఖనిజాల ఖజానా... ఖమ్మం జిల్లా!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ జాగ్రఫీ

తెలంగాణ రాష్ట్ర ఖనిజ వనరులు

భూపటలం నుంచి వెలికితీసే రెండు లేదా అంతకంటే ఎక్కువ రసాయనిక మూలకాలతో ఏర్పడే ముడి పదార్థాన్ని 'ఖనిజం' అంటారు. ఖనిజాలు సహజ సిద్ధంగా ఏర్పడతాయి. ఇవి పునరుద్ధరించలేని వనరులు. అందువల్ల వీటిని వివిధ ప్రణాళికా పద్ధతుల ద్వారా అభిలషణీయ రీతిలో వినియోగించుకోవాలి. ఖనిజాలను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**

లోహ ఖనిజాలు: తమ ద్వారా విద్యుత్‌ను ప్రసరింపజేసే ఖనిజాలను 'లోహ ఖనిజాలు' అంటారు.

ఉదా: ఇనుము, రాగి, వెండి, బంగారం, మాంగనీస్, జింక్, సీసం.

అలోహ ఖనిజాలు: తమ ద్వారా విద్యుత్‌ను ప్రసరింపజేయని ఖనిజాలను 'అలోహ ఖనిజాలు' అంటారు.

ఉదా: బెరైటీస్, జిప్సం, సున్నపురాయి, ఆస్‌బెస్టాస్, డోలమైట్, మైకా.

ఇంధన ఖనిజాలు: ఇంధనాలుగా ఉపయోగించే ఖనిజాలను 'ఇంధన ఖనిజాలు' అంటారు. వీటిలో శిలాజ ఇంధనాలు, అణు ఇంధనాలు అనే రెండు రకాల ఖనిజాలు ఉంటాయి.

1. శిలాజ ఇంధనాలు: మండించినప్పుడు శక్తిని విడుదల చేసే వాటిని 'శిలాజ ఇంధనాలు' అంటారు.

ఉదా: బొగ్గు, పెట్రోల్, డీజిల్.

2. అణు ఇంధనాలు: భార, అస్థిర కేంద్రకాలను కలిగి ఉండి, న్యూట్రాన్‌తో తాడనం చెందించినప్పుడు సమాన భారాలున్న రెండు కేంద్రకాలుగా విడిపోయి అత్యధిక శక్తిని విడుదల చేసే ఖనిజాలను 'అణు ఇంధనాలు' అంటారు.

ఉదా: థోరియం, యురేనియం.

➡ దక్షిణ భారతదేశంలో బొగ్గు నిక్షేపాలు ఉన్న ఏకైక రాష్ట్రం – తెలంగాణ.

➡ రంగారెడ్డి జిల్లాలోని తాండూర్‌లో నీలి సున్నపురాయి బండలు లభిస్తున్నాయి. వీటినే 'షాబాద్ బండలు'గా వ్యవహరిస్తారు. వీటిని దక్షిణ భారతదేశంలో అత్యధికంగా గచ్చు కోసం ఉపయోగిస్తున్నారు.

➡ కరీంనగర్ జిల్లాలో ప్రత్యేకత ఉన్న 'టాన్ బ్రౌన్ గ్రానైట్' నిల్వలు ఉన్నాయి. వీటిని ప్రైవేట్ రంగంలో పెద్ద మొత్తంలో ఎగుమతి చేస్తున్నారు.

ప్రధాన ఖనిజాలు

బొగ్గు (కోల్)

250 మిలియన్ ఏళ్ల కిందట జరిగిన ప్రకృతి ఉత్పాతాల వల్ల 'గోండ్వానా బొగ్గు' ఏర్పడింది. ఈ బొగ్గు తెలంగాణతో పాటు జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. గోండ్వానా బొగ్గు అత్యంత నాణ్యమైన ద్వితీయ శ్రేణి బొగ్గు. ఇది 'బిట్యూమినస్' రకానికి చెందింది.

- తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు నిల్వలు ప్రధానంగా 'ప్రాణహిత – గోదావరి' లోయ ప్రాంతంలో అధికంగా ఉన్నాయి.
- తెలంగాణలో బొగ్గు నిక్షేపాలు విస్తరించి ఉన్న జిల్లాలు – ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్.
- బొగ్గు నిల్వలు అధికంగా ఉన్న జిల్లా – ఆదిలాబాద్ కాగా, బొగ్గును అధికంగా ఉత్పత్తి చేస్తున్న జిల్లా ఖమ్మం.
- దేశం మొత్తం మీద ఉన్న బొగ్గు నిల్వల్లో 20 శాతం మన రాష్ట్రంలోనే ఉన్నాయి.
- 2013–14లో సింగరేణి సంస్థ ద్వారా ఉత్పత్తి చేసిన మొత్తం బొగ్గు 50.5 మిలియన్ టన్నులు. బొగ్గు ఆధారంగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో ఇనుము – ఉక్కు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, సిమెంట్, రైల్వేస్, గృహ సంబంధ ఇంధన పరిశ్రమలు ముఖ్యమైనవి.

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్: తెలంగాణ రాష్ట్రంలో విస్తరించి ఉన్న బొగ్గును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) వెలికి తీస్తుంది. దీన్ని మొదట 1886లో ఒక ప్రైవేట్ బ్రిటిష్ కంపెనీ నెలకొల్పింది. 1920లో దీన్ని హైదరాబాద్ నిజాం కొనుగోలు చేశాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం దీన్ని జాతీయం చేసింది. ఈ సంస్థ భారత, తెలంగాణ ప్రభుత్వాల ఉమ్మడి కంపెనీ. తెలంగాణ రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ఈ కంపెనీ ప్రస్తుతం 15 ఓపెన్ కాస్ట్ గనుల్లో, 35 భూగర్భ గనుల్లో తవ్వకాలు చేపడుతోంది. ఈ కంపెనీలో సుమారు 65,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. దీని ప్రధాన కార్యాలయం ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెంలో ఉంది.

ఇనుము (ఐరన్)

నాణ్యత ఆధారంగా ఇనుప ఖనిజాన్ని నాలుగు రకాలుగా విభజించవచ్చు.

అవి: మాగ్నటైట్, హెమటైట్, లియోనైట్, సిడరైట్.

రాష్ట్రంలో ఇనుము అధిక మొత్తంలో హెమటైట్ రూపంలో, తక్కువ మొత్తంలో మాగ్నటైట్ రూపంలో లభిస్తోంది.

- తెలంగాణలో ఇనుము విస్తరించి ఉన్న జిల్లాలు – ఖమ్మం (బయ్యారం, చెరువుపురం, నావపాడు, కొత్తగూడెం), ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్.
- ఆదిలాబాద్ జిల్లాలోని బీత్వాల్, కల్లాడ, రస్తూరాబాద్, రోబాన్‌పల్లి, లక్సెట్టిపేట్ మొదలైన ప్రాంతాల్లో 'మాగ్నటైట్' రకానికి చెందిన ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నాయి.

ఇనుము ఆధారిత పరిశ్రమలు: ఉక్కు, స్పాంజ్ ఐరన్, పిగ్ ఐరన్ మొదలైనవి.

ఒక దేశ లేదా రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధి అనేది అక్కడ లభ్యమయ్యే ఖనిజ వనరులపై ఆధారపడి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం భిన్నమైన శిలలు, ఖనిజాలకు ప్రసిద్ధి చెందింది. అందువల్ల మన రాష్ట్రాన్ని 'రత్నగర్భ'గా వ్యవహరిస్తారు. దేశంలో అత్యంత అరుదైన ఖనిజం 'ఇంథనైట్'ను మొదటిసారిగా మన రాష్ట్రంలోనే గుర్తించారు.

బెరైటీస్ (ముగ్గురాయి)

తెలంగాణ రాష్ట్రంలో బెరైటీస్ (ముగ్గురాయి) ప్రధానంగా ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విస్తరించి ఉంది. బెరైటీస్‌ను అధికంగా ఉత్పత్తి చేస్తున్న జిల్లా – ఖమ్మం.

- **ఖమ్మం జిల్లాలో బెరైటీస్ గనులు విస్తరించి ఉన్న ప్రాంతాలు:** రుద్రంకోట, వెంకటాయపాలెం, గోపాల్‌పూర్, బాలాపేట్, కోడంపూర్, చెరువుపురం.
- **మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తరించి ఉన్న ప్రాంతాలు:** బొల్లారం, వీరభద్ర దుర్గం.
- **ముగ్గురాయి ఆధారిత పరిశ్రమలు:** పెట్రోలియం వెలికితీత, రంగులు, టైర్లు, రబ్బరు వస్తువులు, పేపర్స్, రసాయనాల పరిశ్రమలు.

మాంగనీస్

- ఇది ప్రధానంగా ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉంది. ఈ జిల్లాలోని భీమసరి, అంతంపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి ప్రాంతాల్లో విస్తరించి ఉంది.
- **మాంగనీస్ ఆధారిత పరిశ్రమలు:** సిమెంట్, కార్బైడ్, ఇనుము – ఉక్కు, సోడాయాష్, రసాయనాలు, చక్కెర, పేపర్, ఎరువులు, గాజు మొదలైనవి.

సున్నపురాయి

రాష్ట్రంలో బొగ్గు నిల్వల తర్వాత అధిక విస్తీర్ణంలో ఉన్న ఖనిజం సున్నపురాయి. ఇది ప్రధానంగా నల్లగొండ, రంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో విస్తరించి ఉంది. దీన్ని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న జిల్లా నల్లగొండ.

- సున్నపురాయిని సిమెంట్ పరిశ్రమలో ముడి ఖనిజంగా ఉపయోగిస్తారు.
- తెలంగాణ రాష్ట్ర ఖనిజ వనరుల అభివృద్ధి సంస్థ ఆదిలాబాద్ జిల్లాలోని దేవపూర్ మైన్‌లో 210 హెక్టార్ల విస్తీర్ణంలో సున్నపురాయి నిల్వలను వెలికితీసింది.

గ్రానైట్

తెలంగాణ రాష్ట్రంలో వరంగల్, ఖమ్మం, కరీంనగర్, రంగారెడ్డి, నల్లగొండ, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో గ్రానైట్ నిక్షేపాలు విస్తరించి ఉన్నాయి.

- **గ్రానైట్ ఆధారిత పరిశ్రమలు:** కటింగ్ అండ్ పాలిషింగ్ ఇండస్ట్రీస్, గృహాలంకరణ, స్మారక నిర్మాణాలు, ఫ్లోరింగ్ పరిశ్రమలు.

అమెథిస్ట్ క్వార్ట్జ్:

తెలంగాణ రాష్ట్రంలో మెదక్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో అమెథిస్ట్ క్వార్ట్జ్ నిక్షేపాలు విస్తరించి ఉన్నాయి. ఈ రకం రాళ్లను ఆభరణాల తయారీ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు.

బంకమట్టి (జంబాలాలు)

సూక్ష్మ రేణుయుతంగా ఉండే మెత్తని మట్టిని సాధారణంగా బంకమట్టి (జంబాలాలు) అంటారు. జంబాలాలు అనేవి అవక్షేప నిక్షేపాలు. కయొలిన్ (చైనా జంబాలం), అగ్ని సహన జంబాలం, బాల్ జంబాలం వీటిలో ముఖ్యమైన రకాలు. దీన్ని ప్రధానంగా పింగాణి సామగ్రి తయారీలో వాడతారు. దీంతోపాటు ఇటుకలు, పెంకులు, డ్రైనేజీ గొట్టాలు, సిమెంట్ తయారీలోనూ ఉపయోగిస్తారు.

- **బంకమట్టి (జంబాలాలు) విస్తరించి ఉన్న జిల్లాలు:** ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్.

యురేనియం

నల్లగొండ జిల్లాలోని లంబపూర్, పెద్దగట్టు, బిట్రియాల్, కుప్పనూర్, ఆర్.వి. తండ మొదలైన ప్రాంతాల్లో సుమారు 1600 టన్నుల యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు అంచనా వేశారు. వీటి వెలికితీత కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- అత్యంత అరుదైన రేడియోధార్మిక ఖనిజమైన 'ఇంథనైట్'ను దేశంలోనే తొలిసారిగా మహబూబ్‌నగర్ జిల్లాలోని 'అక్కారం' ప్రాంతంలో గుర్తించారు.
- **ఖమ్మం జిల్లాలో లభించే రేడియో ధార్మిక ఖనిజ మూలకాలు:** కోరండం, గార్నెట్, గెలీనా, జిర్కోన్, కయోనైట్.

మార్బుల్

మార్బుల్ నిక్షేపాలు ఎక్కువగా ఖమ్మం జిల్లాలో విస్తరించి ఉన్నాయి. వీటిని గృహాలంకరణ వస్తువుల తయారీలో, ఫ్లోరింగ్‌లో ఉపయోగిస్తారు. ప్రానెల్స్‌గానూ వాడతారు.

బంగారం

రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని కిన్నెరసాని, గోదావరి నదుల సంగమ ప్రాంతం; వరంగల్ జిల్లాలోని మంగపేట; మహబూబ్‌నగర్ జిల్లాలోని అత్మూర్, గద్వాల్ ప్రాంతాల్లో బంగారం నిల్వలు ఉన్నాయి.

వజ్రాలు

మహబూబ్‌నగర్ జిల్లాలోని బొల్లారం, అమర్‌గిరి, సోమశిల, మద్దె మడుగు ప్రాంతాల్లో డైమండ్ గనులు విస్తరించి ఉన్నాయి.

ఫెల్‌స్పార్

నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో ఈ నిక్షేపాలు ఉన్నాయి.

- నల్లగొండ జిల్లాలో అత్యంత నాణ్యమైన ఫెల్‌స్పార్ ముడి ఖనిజం లభిస్తోంది.
- **ఫెల్‌స్పార్ ఆధారిత పరిశ్రమలు:** సిరామిక్స్, గాజు, అబ్రాసిక్, ఎనామిల్, ఎలక్ట్రికల్, కొలిములు మొదలైనవి.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణ రాష్ట్రంలో అధిక మొత్తంలో ఉన్న ఇనుప ఖనిజం ఏది?
   1) మాగ్నటైట్ 2) హెమటైట్
   3) సిడరైట్ 4) లియోనైట్
2. బయ్యారం ఇనుప గనులు ఏ జిల్లాలో ఉన్నాయి?
   1) మెదక్ 2) నల్గొండ
   3) వరంగల్ 4) ఖమ్మం
3. దేశంలో అత్యంత అరుదైన ఖనిజం 'ఇంథనైట్'ను మొదటిసారిగా ఎక్కడ గుర్తించారు?
   1) చెరువుపురం (ఖమ్మం)
   2) రస్తూరాబాద్ (ఆదిలాబాద్)
   3) అక్కారం (మహబూబ్‌నగర్)
   4) మంగపేట (వరంగల్)
4. తెలంగాణ రాష్ట్రంలో 'సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్' ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) రామగుండం 2) బెల్లంపల్లి
   3) భూపాలపల్లి 4) కొత్తగూడెం
5. బెరైటీస్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న తెలంగాణ జిల్లా ఏది?
   1) ఖమ్మం 2) ఆదిలాబాద్
   3) రంగారెడ్డి 4) మెదక్
6. కిందివాటిలో తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు నిల్వలు లేని జిల్లా ఏది?
   1) కరీంనగర్
   2) ఖమ్మం 3) నల్లగొండ
   4) ఆదిలాబాద్
7. తెలంగాణలో అత్యంత నాణ్యమైన ఫెల్‌స్పార్ ముడిఖనిజం ఏ జిల్లాలో లభిస్తోంది?
   1) రంగారెడ్డి 2) నిజామాబాద్
   3) కరీంనగర్ 4) నల్లగొండ
8. బెల్లంపల్లి దేనికి ప్రసిద్ధి చెందింది?
   (టీఎస్‌పీఎస్సీ సీబీఆర్‌టీ ఏఈఈ మెకానికల్, 18 అక్టోబర్ 2015)
   1) చక్కెర పరిశ్రమ
   2) కాగితం పరిశ్రమ
   3) ముడి ఇనుము పరిశ్రమ
   4) బొగ్గు పరిశ్రమ

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3;
4) 4; 5) 1; 6) 3;
7) 4; 8) 4.

To emphasise a subject...

BANK EXAMS

GENERAL ENGLISH

PRONOUNS

Pronouns stand in for nouns in a sentence. Pronouns follow the same agreement rules as nouns, so when using a pronoun, it is important to be clear about what noun it is replacing.

The following tips are noteworthy, pay attention:

- We should use the personal pronouns in the order of second person, third person and first person. The order first person, second person and third person is possible when we admit guilt.
- A pronoun in the nominative form should be compared with the same form of the pronoun.
- When two singular nouns are joined by and refer to the same person the pronoun used in their place should be singular in form.
- A singular pronoun should be used when two singular nouns are joined by *either or, neither nor.*
- A pronoun in the plural form should be used when two nouns of different members are joined by *'or'* or *'nor'.*
- The distributive pronouns *'either, neither, none, any, no one'* are used with singular verbs.
- The indefinite pronoun *"one"* should be used as *"one's"* for its possessive case.
- The verbs such as *cheat, introduce, present, absent, satisfy, prepare, enjoy, hurt, avail of* are followed by either an object or a reflexive pronoun.
- The word *'who'* as a relative pronoun in the nominative case takes a verb.
- If a pronoun is to be placed after *'to be',* the pronoun in the subjective case is used.

Relative Pronouns

Which, that and *who* are relative pronouns. A relative pronoun must refer to the word immediately preceding it. If the meaning of the sentence is unclear, the pronoun is in the wrong position. *Which* introduces non-essential clauses; *that* introduces essential clauses. *Who* refers to an individual; that refers to a group of persons, class, type or species.

Examples: This is the doctor who treated me for typhoid.
Scientists have found a gene that may be linked to heart attacks.
My parents live in Patna, which is the capital of Bihar.

Impersonal Pronouns

It, you, one and *they* are impersonal pronouns. Impersonal pronouns serve as a noun without a specific identity.

Examples: It is going to be chilly tomorrow.
How do you get to the theatre from here?
One should always find time to enjoy life.

They say the time it takes to restore normalcy after the calamity depends on many factors.

Possessive pronouns

Possessive pronouns are used in place of nouns to indicate the meaning of belonging or possession. The group includes *mine, ours, yours, his, hers* and *theirs.*

Reflexive pronouns

Reflexive pronouns are used when the subject and the object of a verb (or preposition) both refer to the same person, animal, place or thing. The group consists of *myself, ourselves, yourself, yourselves, himself, herself, itself* and *themselves.*

Examples: I saw myself in the mirror.
Sarala cut herself while chopping vegetables.

Reflexive pronouns are also often used to emphasize a subject noun or pronoun they represent.

Example: Sireesha painted the house herself. (On her own)

Do not use reflexive pronouns to emphasize any word that is not a noun or a pronoun.

Example: She will send you the form now itself. (Incorrect)
She will send you the form now. (Correct)

Demonstrative pronouns

Demonstrative pronouns, *this, that, these* and *those* (by themselves, without a following noun), are used to point to someone or something close to the speaker in space or time.

Examples: Sumalatha wrote this.
Those are Ravi Verma's paintings.

Indefinite pronouns

Indefinite pronouns are also used in place of nouns when we do not know or do not want to specify the identity and number of the person or thing we are referring to. The group consists of the words *some, any, others, another, someone, somebody, something, everyone, everybody, everything, anyone, anybody, anything, one, no one, nobody* and *nothing.*

Examples: She writes short stories.
Some are very good.
He saw two peacocks in the park, but I didn't see any.
No one (nobody) knows where the keys are.
Everyone (everybody) says that Chandigarh is a planned city.

Note:

- The words in the pairs some one... somebody, anyone... anybody and no one ... nobody mean the same and that you can use them interchangeably.
- All the compounds above except no one are written as one word.
- Pronouns of number and quantity and numbers, one, two, three, etc., can also be used as pronouns in place of nouns.
- Other pronouns that can be used to refer to number as well as quantity are *all, many, several, much, none, more, most, both, few, a few, little* and *a little.*

The hotel has twenty rooms; all face the park. (Meaning the rooms)

Many are not happy with the way the company is being run. (Meaning many people, employees, etc.)

Distributive pronouns

Distributive pronouns, *each, either* and *neither* are also used in place of nouns that are referred to individually, not as a group or a collection.

Examples: There were ten dancers on the stage. Each was dressed in brightly coloured costumes. (Meaning each of the dancers)
Would you like to have tea or coffee? Either will do, thanks. (Meaning either one)
David has two pens, but neither writes. (Meaning neither pen)

Reciprocal pronouns

Reciprocal pronouns, *each other* and *one another,* are used on their own in place of nouns that are two or more in number, these pronouns show a reciprocal relationship among the members of a group.

Examples: Shabana and her sister-in-law hugged each other.
The players congratulated one another on winning the football tournament.

Interrogative pronouns

Interrogative pronouns, *who, whom, whose, which* and *what* are used in questions to refer to people or things.

Examples: Who is your chemistry teacher?
Which is your torch?
What are you reading?

Note: The pronouns *who, whom* and *whose* are used only to refer to people, which is used for both people and things, and *what* is used only when referring to things.

PRACTICE TEST

Directions (Q. No. 1-10): Each question below has a blank/ two blanks, indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for the blank that best fits the meaning of the sentence as a whole.

1. We all told the manager that we wanted to have ____ salaries paid in advance but she just ignored ____.
   1) ours; it 2) his; we
   3) their; our 4) we; his
   5) our; us
2. When Harish asked me how I had got ____ address, I told him that I was given it by a relative of ____.
   1) my; me 2) his; his
   3) mine; his 4) his; him
   5) him; him
3. Although ____ in the room seemed to follow ____ said by the speaker, he never intended to simplify his language.
   1) no one; anything
   2) anybody; anything
   3) nobody; nothing
   4) anyone; nothing
   5) someone; something
4. I hope you will enjoy ____ at the birthday party this weekend because I won't be able to be there ____.
   1) You; myself
   2) yourself; mine
   3) yours; oneself
   4) yourself; myself 5) you; me
5. We decided to do all the cooking ____ instead of hiring a catering company for the party.
   1) of our own 2) oneself
   3) by ourselves 4) ours
   5) each other
6. Hundreds of children nowadays prefer doing ____ homework with a background of music to doing ____ in a quiet room.
   1) theirs; them 2) his; its
   3) them; it's 4) they; them
   5) their; it
7. You and ____ sister need to take time to prepare ____ for the long journey which will start next month.
   1) his; yourself
   2) yours; ourselves
   3) their; you
   4) your; yourselves
   5) her; by themselves
8. The students watched each gesture of ____ as if their teacher were a stranger.
   1) them 2) hers 3) him
   4) her 5) himself
9. Trademarks enable a company to distinguish ____ products from ____ of another company.
   1) their; it 2) it; that
   3) our; this 4) it's; those
   5) my; these
10. ____ cannot see through translucent materials, but light can pass through ____.
    1) we; it 2) Anything; their
    3) One; them 4) No one; its
    5) Everyone; their

Key:

1) 5 2) 2 3) 1 4) 4
5) 3 6) 5 7) 4 8) 2
9) 4 10) 3